సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 298
గురువారం 11-7-2024
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



మళ్లీ మనదే విజయం
మూడో టి20లో జింబాబ్వేపై 23 పరుగుల తేడాతో భారత్ గెలుపు - 12లో



మార్కెట్లో లాభాల స్వీకరణ
క్యూ1 ఆర్థిక ఫలితాల ముందు అప్రమత్తత.. 80,000 దిగువకు సెన్సెక్స్ - 13లో



యుద్ధాలకు సమయం కాదిది
ప్రపంచం ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో ఇది యుద్ధాలకు సమయం కాదని ప్రధాని మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸



యూపీలో ఘోరం
ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. 19 మంది గాయపడ్డారు.
వివరాలు 6లో ▸



108 కిలోల బంగారం స్వాధీనం
భారత్–చైనా సరిహద్దులో అక్రమంగా తరలిస్తున్న 108 కిలోల బంగారాన్ని ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
వివరాలు 6లో ▸



మన అంతరిక్ష కేంద్రం
భారత అంతరిక్ష స్టేషన్‌ను భూ స్థిర కక్ష్యలో ఐఎస్ఎస్‌తో దాదాపు సమానంగా ఏర్పాటు చేయాలని ఇస్రో నిర్ణయించింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

టీడీపీ నేతల నిర్వాకానికి తల్లి, కూతురు బలి

టీడీపీ నేతల కక్ష సాధింపులకు తల్లి, కుమార్తె బలయ్యారు. తన భర్తపై అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బనాయించడంతో ఆందోళనకు గురైన గొల్ల మమత.. తన 8 నెలల కుమార్తెను చంపి తానూ ఆత్మహత్య చేసుకుంది.
వివరాలు 3లో ▸

తీవ్ర గాయాలతో జడ్జి ముందుకు..

తనపై నలుగురు వ్యక్తులు దాడి చేశారని.. పోలీసులు వద్ద న్యాయం జరగడం లేదంటూ కాకినాడలోని రేచర్లపేటకు చెందిన ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో కాకినాడ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.ప్రసన్నలక్ష్మి ఎదుటకు వచ్చాడు.
వివరాలు 5లో ▸

చిన్నారిపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.40 వేల జరిమానా విధిస్తూ విశాఖ పోక్సో కోర్టు తీర్పు ప్రకటించింది. జరిమానాను బాలికకు ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం పరిహారంగా రూ.3.5 లక్షలివ్వాలని ఆదేశించింది.
వివరాలు 3లో ▸

కిడ్నీ రాకెట్ నిందితుల కోసం గాలింపు

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బెజవాడ కిడ్నీ రాకెట్ కేసు దర్యాప్తును గుంటూరు పోలీసులు వేగవంతం చేశారు. ఐదుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుల కోసం మూడు ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు చేపట్టారు.
వివరాలు 3లో ▸

ఇదండీ సంగతి


మీరలా ఉంటే అస్సలు పని చేయలేర్సార్! వెళ్లండీ!

రాగానే మింగేశారు..
ఇసుక బకాసురులు

70కిపైగా స్టాక్ యార్డుల్లో 40 లక్షల టన్నులు మాయం

- వర్షాకాలంలో కొరత లేకుండా 80 లక్షల టన్నులు నిల్వ చేసిన గత ప్రభుత్వం
- 5 వారాల్లోనే సగానికిపైగా విక్రయించేసిన పచ్చ ముఠాలు
- ట్రక్కులు, ట్రాక్టర్లలో నింపి భారీగా వసూళ్లు
- సామాన్యుల పేర్లతో బయట ప్రాంతాలకు తరలింపు
- కొత్త పథకం రాకముందే తాత్కాలికంలోనే భారీగా లూటీ


కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామంలో ఇసుక స్టాక్ పాయింట్‌ను ఖాళీ చేస్తున్న టీడీపీ నేతలు

సాక్షి, అమరావతి, సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో అధికార కూటమి నేతలు ఇసుకను భోంచేస్తున్నారు.. అది మామూలు భోజనం కాదు.. ఇసుక భోజనం.. ఇసుకనెలా తింటారు.. దానిని ఎలా అరిగించుకుంటారా.. అని ఆశ్చర్యపోకండి. ఏకంగా 40 లక్షల టన్నుల ఇసుకను ఆరగించారు. ఇసుకను భోంచేయడం అంటే.. ఎక్కడికక్కడ డిమాండ్‌ను బట్టి అడ్డంగా అమ్మేసుకోవడం అన్నమాట.. ఆ డబ్బులతో వారి సొంత ఖజానా నింపుకున్నారు. వర్షాకాలంలో ఇసుక కొరత తలెత్తకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 170 స్టాక్ యార్డుల్లో 80 లక్షల టన్నుల ఇసుకను నిల్వ చేసింది. అధికారంలోకి వచ్చిన 5 వారాల్లోనే టీడీపీ నేతలు దాదాపు 40 లక్షల టన్నుల ఇసుకను మింగేశారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడైన వెంటనే ఎక్కడికక్కడ టీడీపీ నేతలు ఇసుక నిల్వలపై పడ్డారు. స్టాక్ యార్డుల వద్దకెళ్లి ఇసుక కాంట్రాక్టు సంస్థల సిబ్బందిని బెదిరించి తరిమేశారు. ఇసుక కాంట్రాక్టు సంస్థలైన జేసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రా ప్రతినిధులను వెళ్లగొట్టి అప్పటికప్పుడు స్టాక్ యార్డులను స్వాధీనం చేసుకున్నారు. టీడీపీ నేతలు ఆ నిల్వలపై పడి ఇసుకను రాత్రింబవళ్లు తరలించేశారు. 5 వారాల తర్వాత తాపీగా ఉచిత ఇసుక పథకాన్ని మిగతా 2వ పేజీలో ▶



కేజ్రీవాల్‌కు ప్రత్యక్ష ప్రమేయం ఉంది

ఢిల్లీ మద్యం కేసులో ఈడీ చార్జ్‌షీట్

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో రూ.100 కోట్ల ముడుపుల ఉదంతంలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రత్యక్ష పాత్ర పోషించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అనుబంధ చార్జ్‌షీట్‌లో పేర్కొంది. దర్యాప్తు సంస్థను తప్పుదోవ పట్టించేందుకు కేజ్రీవాల్ ప్రయత్నించారంటూ.. ఆయన పేరును 37వ నిందితుడిగా చేర్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ పేరును 38వ నిందితుడి కింద నమోదు చేసింది. ఈ చార్జ్‌షీట్‌ను పరిశీలనకు స్వీకరించిన ఢిల్లీ కోర్టు కేజ్రీవాల్‌ను 12న తమ ముందు హాజరుపరచాలని ఆదేశించింది. 6లో

'విశాఖ స్టీల్' అమ్మేద్దాం!

ప్రైవేటీకరణ అనివార్యం అంటూ ఆంగ్ల మీడియాకు టీడీపీ లీకులు

- అమ్మకాన్ని అడ్డుకుంటామని ఎన్నికల ముందు ప్రగల్భాలు.. అధికారంలోకి వచ్చాక అమ్మకానికి మద్దతుగా వ్యాఖ్యలు
- ఒంటరిగా పోటీ చేసి ఉంటే విశాఖ ఉక్కును కాపాడేవాళ్లం
- కూటమి ప్రభుత్వం కాబట్టి ఇప్పుడు ఇబ్బందులున్నాయి: విశాఖ ఎంపీ భరత్
- ఏటా భారీ నష్టాలు.. ప్రైవేటీకరణ తప్పదు: కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ
- గతంలో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అడ్డుకోలేకపోతున్నానన్న పవన్ కళ్యాణ్
- ఇప్పుడు ఉప ముఖ్యమంత్రిగా ఉన్నా నోరు విప్పని వైనం
- ఇప్పటికే ఆస్తుల విక్రయానికి టెండర్లను ఆహ్వానించిన ఆర్ఐఎన్ఎల్
- అధికారంలో ఉన్నప్పుడు ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం /గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): 'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు'గా సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారంపై మరోసారి నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గత ఐదేళ్ల పాటు ప్రైవేట్ పరం కాకుండా అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ పోరాటం వృథా అవుతోంది. రాష్ట్ర ప్రజలతో భావోద్వేగ సంబంధం ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారంపై అధికార టీడీపీ మరోసారి యూటర్న్ తీసుకుంది. ఎన్నికల ముందు తాము ప్రైవేటీకరణకు వ్యతిరేకమన్న ఆ పార్టీ ఇప్పుడు ప్రైవేటీకరణ అనివార్యమంటూ ఆంగ్ల మీడియాకు లీకులు ఇస్తుండటం ఇందుకు నిదర్శనం. తొలుత ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్..
మిగతా 10వ పేజీలో ▶


విశాఖలో డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై దాడి చేసి బోర్డును తగలబెడుతున్న టీడీపీ కార్యకర్తలు

డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై
టీడీపీ దాడి..

రాళ్ల వర్షం కురిపించిన తెలుగు మహిళలు

- కార్యాలయం బోర్డుకు నిప్పంటించిన టీఎన్ఎస్ఎఫ్ నాయకులు
- అద్దాలు, పూలకుండీలు ధ్వంసం
- 'స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కూటమి యూటర్న్' కథనం మీద ఆగ్రహం
- తీవ్రంగా ఖండించిన మాజీ సీఎం వైఎస్ జగన్
- దాడి అప్రజాస్వామికమన్న సీపీఐ, సీపీఎం

10లో

ముస్లిం మహిళలూ భరణానికి అర్హులే

సుప్రీంకోర్టు కీలక తీర్పు

- సీఆర్‌పీసీ సెక్షన్ 125 అందరికీ వర్తిస్తుంది.. భరణం దాతృత్వం కాదు.. మహిళల హక్కు
- ముస్లిం మహిళా యాక్ట్–1986పై సెక్యులర్ చట్టానిదే పైచేయి
- విడాకులు పొందిన తెలంగాణ ముస్లిం మహిళకు ఊరట.. రూ.10 వేలు భరణం ఇవ్వాల్సిందేనని మాజీ భర్తకు ఆదేశం

6లో



> ముస్లిం చట్టం కింద పెళ్లాడి.. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు సీఆర్‌పీసీ సెక్షన్-125తో పాటు, ముస్లిం మహిళా యాక్ట్-1986 కూడా వర్తిస్తుంది. ఊరట కోసం ఏ చట్టాన్ని ఎంచుకోవాలనేది విడాకులు పొందిన ముస్లిం మహిళ ఇష్టం. లేదా రెండింటి కిందా పరిహారం కోరవచ్చు.
>
> \- సుప్రీంకోర్టు ధర్మాసనం



ఈవీలపై రోడ్‌ట్యాక్స్ బాదుడు

- ఇప్పటివరకూ వాటికి ఆ పన్ను నుంచి మినహాయింపు
- ఈనెల 7తో ముగిసిన జీఓ కాలపరిమితి
- రవాణా శాఖకు తదుపరి ఆదేశాలివ్వని టీడీపీ సర్కారు
- దీంతో.. కొత్తగా వీటిని కొనుగోలు చేస్తే 12 శాతం పన్నుపోటు
- కాలుష్యాన్ని నివారించేందుకు వీటిని ప్రోత్సహించిన వైఎస్ జగన్ ప్రభుత్వం

14లో

వైద్య శాఖలో నియామకాలకు బ్రేక్!

నియామకాలన్నీ నిలిపివేయాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు

కొత్త వైద్య కళాశాలల్లో 380 పోస్టుల భర్తీకి ఆమోదం లేదు

- మూడు వేలకు పైగా పారా మెడికల్, ఇతర పోస్టుల భర్తీ లేనట్టే
- ఇప్పటికే 313 మంది నర్సులకు ఇచ్చిన పోస్టింగ్ ఉత్తర్వులకు బ్రేక్
- గత ప్రభుత్వం అమలు చేసిన జీరో వేకెన్సీ విధానానికి స్వస్తి
- కొత్త బోధన ఆస్పత్రుల్లో నర్సుల కొరత.. వైద్య సేవలపై ప్రభావం
- కూటమి ప్రభుత్వం చర్యలపై ఆందోళన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

5లో



ఇసుక బకాసురులు


కానూరు - పెండ్యాల ఇసుక ర్యాంపు వద్ద ఇసుక గుట్ట (ఫైల్)

▶ మొదటి పేజీ తరువాయి
ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించిన మైనింగ్ అధికారులు స్టాక్ యార్డుల వద్ద నిల్వలు మాయమైనట్లు గుర్తించి ముక్కున వేలేసుకున్నారు. ఇప్పుడు వారి లెక్కల ప్రకారం సుమారు 98 స్టాక్ యార్డుల్లో 43 లక్షల టన్నుల ఇసుక మాత్రమే నిల్వ ఉంది. అంటే 70కిపైగా ఇసుక యార్డుల్లో ఇసుక నిల్వలను తరలించి టీడీపీ నేతలు సొమ్ము చేసుకున్నారు.

70 స్టాక్ యార్డులు ఖాళీ

తూర్పు గోదావరి జిల్లా చిడిపి స్టాక్ యార్డుల్లో ఎన్నికలకు ముందు 1.81 లక్షల టన్నుల ఇసుక నిల్వ చేయగా ఇప్పుడు మైనింగ్ అధికారుల లెక్క ప్రకారం 35 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉంది. 1.46 లక్షల టన్నుల ఇసుక మాయమైపోయింది. నిడదవోలు నియోజకవర్గంలోని పందలపర్రు, ఊసులమర్రు, పెండ్యాల స్టాక్ యార్డుల్లోనూ లక్షన్నర టన్నుల ఇసుకను పచ్చ ముఠాలు మింగేశాయి. రాజమహేంద్రవరం రూరల్ లాలా చెరువు యార్డులో 1.40 లక్షల టన్నుల ఇసుకను మాయం చేసి నామమాత్రంగా 7,500 టన్నుల ఇసుకను అమ్మకానికి పెట్టారు. నెల్లూరు జిల్లా పల్లిపాడు స్టాక్ యార్డులో 2.20 లక్షల టన్నుల ఇసుకకుగానూ 1.25 లక్షల టన్నులు మాత్రమే మిగిలింది. కొన్ని చోట్ల అసలు ఇసుక నిల్వలే లేకుండా చేసేశారు. కృష్ణా జిల్లా అప్పారావుపేట, లంకపల్లి, తోట్లవల్లూరు స్టాక్ పాయింట్లను పూర్తిగా ఎత్తివేశారు. ఎన్నికలకు ముందు అక్కడ లక్ష టన్నులకుపైగా ఇసుక ఉండగా మొత్తం కరిగించేశారు. ఇలా సుమారు 70 స్టాక్ యార్డుల్లో ఇసుక రేణువు అనేది లేకుండాపోయింది. కృష్ణా జిల్లాలో ఇసుక రీచ్‌లు ఉన్నా స్టాక్‌యార్డులో మాత్రం ఇసుక లేకుండాపోయింది. దీంతో స్థానికులు సుదూరం ప్రాంతాలకు వెళ్లి ఇసుకను కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది.

బాలయ్య ఇలాకాలో యథేచ్ఛగా..

టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ నేతలు చిలమత్తూరు మండల పరిధిలో చిత్రావతి నది నుంచి రోజూ భారీఎత్తున ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. కర్ణాటకకు సైతం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొడికొండ, కోడూరు, మరువకొత్తపల్లి, లాలేపల్లి, దిగువపల్లి తండా సమీపంలోని చిత్రావతి నదిలో ఇసుక మేటలపైనా టీడీపీ నేతల కన్ను పడింది. నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో జేసీబీలను వినియోగించి ఇసుక తోడేస్తున్నారు. బత్తలపల్లి మండలం నల్లబోయలపల్లి వద్ద నిల్వ ఉంచిన ఇసుకను ఇటీవల అక్రమంగా తరలించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కడనూతల, నరసింహపురం, వెంకటాచలం, మర్రిపాడు, నెల్లూరుపాళెం, సంగం వద్ద ఇసుక డిపోలలో లక్షల టన్నుల ఇసుకను గతంలో నిల్వ చేయగా ప్రస్తుతం దాదాపుగా అడుగంటాయి.



ఉత్తరాంధ్రలో నిరాటంకంగా చోరీ

విజయనగరం జిల్లా బొబ్బిలి గ్రోత్ సెంటర్ సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద నుంచి భారీగా తరలించారు. విశాఖ జిల్లాలో ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ నేతలు లక్షలాది టన్నుల ఇసుకను తరలించేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో, నక్కపల్లి ఇసుక డిపో వద్ద నుంచి పెద్ద పరిమాణంలో ఇసుకను తరలించారు. బాపట్ల జిల్లాలో టీడీపీ నేతలు జువ్వలపాలెం పాయింట్ నుంచి అందినకాడికి అమ్ముకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో లక్షలాది టన్నుల ఇసుకను టీడీపీ నేతలు కరిగించేశారు. శ్రీకాకుళం జిల్లా హిరమండలం తహసీల్దారు కార్యాలయానికి కూతవేటు దూరంలో వంశధార నది నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. రాజమార్గంలో తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వంశధారలో రోజూ అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. కొద్ది రోజుల్లేనే వేలాది లారీల్లో ఇసుకను తరలించారు.


బొబ్బిలిలోని ఇసుక స్టాక్ పాయింట్

గోదావరిని గుల్ల చేసి..

రాష్ట్రంలో రీచ్‌లు ఉన్నచోటల్లా టీడీపీ, జనసేన నేతలు అక్రమంగా ఇసుకను తరలించుకుపోయారు. ఓవైపు గోదావరిలో తవ్వకాలపై నిషేధం కొనసాగుతున్నా గుల్ల చేసేశారు. నిల్వలన్నీ దాదాపుగా ఇప్పటికే ఊడ్చేశారు. తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడదవోలు తదితర ప్రాంతాల్లో భారీగా ఇసుక నిల్వలు ఉన్నాయి. వీటిని మాయం చేసి ఇసుక ర్యాంపుల్లో గుట్టుచప్పుడు కాకుండా అనధికారిక తవ్వకాలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 11 ఇసుక రీచ్‌లలో నామమాత్రంగానే ఇసుక ఉంది. మంత్రి కందుల దుర్గేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న నిడదవోలు నియోజకవర్గంలో పందలపర్రు, కానూరు, పెండ్యాల, తీపర్రు ఇసుక ర్యాంపుల వద్ద ఉన్న గుట్టలను తరలించేశారు. రాజమహేంద్రవరం రూరల్ గాయత్రి ర్యాంపులో టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అనుచరుడు, మండపేటకు చెందిన ఓ జనసేన నేత కోట్ల విలువ చేసే ఇసుక నిల్వలు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. కాతేరు ఇసుక ర్యాంపుల్లో ఎమ్మెల్యే అనుచరుడు దగ్గరుండి వ్యవహారం నడుపుతున్నాడు. కడియపులంక, వేమగిరి ర్యాంపుల్లో రాత్రిళ్లు వందల ట్రాక్టర్లు, లారీల ఇసుక తరలిపోతోంది. కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంక వద్ద అనధికారిక స్టాక్ పాయింట్ నుంచి 10 రోజుల క్రితం ఇసుకను భారీగా లారీల్లో తరలించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం పరిధిలోని రావులపాలెంలో జాతీయ రహదారిని ఆనుకుని ఏర్పాటు చేసిన రెండు స్టాక్ పాయింట్ల నుంచి భారీగా ఇసుకను తరలించారు. ఆత్రేయపురం మండలం పులిదిండిలో రాత్రి వేళల్లోనూ తవ్వకాలు సాగిస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలంలోని మాన్సాస్ ట్రస్టు భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలకు రంగం సిద్ధమైంది. కపిలేశ్వరపురం, తాతపూడిలోనూ భారీగా ఇసుకను కొల్లగొట్టారు.


తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం పందలపర్రులో ఇసుకను తరలిస్తున్న దృశ్యం


అనంతపురం జిల్లా హిందూపురం నియోజకవర్గంలో దిగువపల్లితండా వద్ద చిత్రావతి నదిలో జేసీబీ ద్వారా అక్రమంగా ఇసుక తవ్వుతున్న దృశ్యం

సీఎం రమేశ్, ఆది వర్గీయుల పోటాపోటీ..

వైఎస్సార్ జిల్లాలోని 11 స్టాకు పాయింట్లలో లక్షలాది టన్నులను టీడీపీ నేతలు అక్రమంగా తరలించేశారు. పాపాఘ్ని, పెన్నా, చెయ్యేరు నదుల నుంచి గత రెండు వారాలుగా లక్షలాది టన్నుల ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. హనుమాన్‌గుత్తి వద్ద పెన్నాలో అక్రమంగా రోడ్డు ఏర్పాటు చేసి ఎంపీ సీఎం రమేశ్ వర్గీయులు ఇసుక తరలిస్తున్నారు. మరోవైపు జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు పోటీపోటీగా పొక్లెయిన్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక టిప్పర్ల ధాటికి గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు మార్కెట్ యార్డులో నిల్వ చేసిన దాదాపు రెండు వేల టన్నుల కట్టుబడి ఇసుకను సైతం టీడీపీ నేతలు తరలించేశారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం చోడవరం స్టాక్ పాయింట్ వద్ద భారీ పరిమాణంలో ఇసుకను టీడీపీ నేతలు మాయం చేశారు. కంకిపాడు మండలం మద్దూరు వద్ద వందలాది వాహనాల్లో ఇసుకను తరలించేశారు. ఎన్టీఆర్ జిల్లా మోగులూరులోని ఇసుక నిల్వలు కూడా మాయమయ్యాయి.


ఒంగోలు మార్కెట్ యార్డ్ ఆవరణలో ఇసుక తీసుకెళ్లేందుకు వచ్చిన టిప్పర్లు, ట్రాక్టర్లు


అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పులిదిండిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

పశ్చిమ గోదావరిలో ఇసుక లారీ యజమానుల సమ్మె

బుధవారం రాత్రి నుంచి ఎక్కడి లారీలు అక్కడే
జిల్లా ఇసుక టిప్పర్, లారీ ఓనర్స్ సంఘం అధ్యక్షుడి ప్రకటన

పాలకొల్లు సెంట్రల్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇసుక లారీ యజమానులు సమ్మె బాట పట్టారు. అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తుండటం వల్లే సమ్మెకు దిగినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇసుక టిప్పర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రావూరి రాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక అంటూ ప్రకటన చేసినా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం రాత్రి నుంచి ఇసుక టిప్పర్ లారీల యజమానులు సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకూ లోడింగ్ అయిన లారీలు అన్‌లోడింగ్ చేసిన అనంతరం ఎక్కడి లారీలు అక్కడే నిలిపివేసి సమ్మెకు మద్దతు తెలపాలన్నారు. సమ్మెకు సహకరించని వారికి భవిష్యత్‌లో యూనియన్ తరపున ఎటువంటి మద్దతు ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆధార్ కార్డుతో ఇసుక లోడింగ్ జరుగుతోందని, ఇక్కడ మాత్రం ఇంటి ప్లాన్ అప్రూవల్, ప్రభుత్వ, ప్రైవేటు వర్క్ ఆర్డర్, ఆధార్ కార్డ్ ఉండాల్సిందే అంటున్నారని తెలిపారు. ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు ఇసుక రవాణా చేసుకోవచ్చని గనుల శాఖ మంత్రి చెప్పారని, ఇక్కడి అధికారులు మాత్రం ఏ జిల్లా వారికి ఆ జిల్లాలోనే లోడింగ్ చేస్తామంటున్నారని చెప్పారు. మంగళవారమే రాష్ట్ర మంత్రులను కలిసి ఈ విషయాలు వివరించామన్నారు. మంత్రుల నుంచి అధికారులకు ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో సమ్మెకు దిగినట్లు వివరించారు.


రావూరి రాజా

రూ.250 కోట్ల మఠం భూమి హాంఫట్

- తిరుపతిలో మఠం భూమిని కబ్జా చేసిన టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని గ్యాంగ్
- కబ్జాను అడ్డుకున్న మఠం అధికారులు.. మఠం సిబ్బంది బట్టలిప్పి, బంధించిన నాని గ్యాంగ్
- బూతులు తిట్టి.. గోడ కుర్చీ వేయించిన వైనం
- అమరావతి పెద్దలకు వాటా ఉందంటున్న ల్యాండ్ మాఫియా
- తిరుపతిలో ప్రకంపనలు రేపిన 'సాక్షి' కథనం


తిరుపతి రూరల్ మండలం అవిలాల పరిధిలో ఆక్రమణకు గురైన హాథీరాంజీ మఠానికి చెందిన భూమి

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆధ్యాత్మిక నగరి తిరుపతిలో చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని గ్యాంగ్ అక్రమాలు, అరాచకాలకు పాల్పడుతోంది. అధికారమే అండగా రూ.250 కోట్ల విలువ చేసే దేవుడి మాన్యాన్ని అమాంతం మింగేసింది. నాని అనుచరులు.. అభ్యంతరం చెప్పిన దేవదాయశాఖ సిబ్బంది బట్టలు విప్పి, వారిని మోకాళ్లపై కూర్చోబెట్టారు.. అధికారులతో గోడ కుర్చీ వేయించారు. నానాబూతులు తిట్టి నిర్బంధించారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నా 'డోంట్ కేర్' అంటూ వారి ఎదుటే.. దేవుడి మాన్యానికి దర్జాగా ప్రహరీ నిర్మించారు. నానీస్ గ్యాంగ్ అక్రమాలపై 'సాక్షి' బుధవారం ప్రచురించిన కథనం తిరుపతి రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లోనూ, దేవదాయ, రెవెన్యూ శాఖ అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది.

అప్పనంగా కొట్టేసి.. సొమ్ము చేసుకోవడమే లక్ష్యం..

తిరుపతి రూరల్ మండలం అవిలాల లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 145, 147/1లో సుమారు 10 ఎకరాల విలువైన దేవుడి మాన్యం భూమిని నాని గ్యాంగ్ ఆక్రమించుకుంది. ఇక్కడ అంకణం కనీసం రూ.4 లక్షల వరకూ ఉంది. మొత్తం10 ఎకరాలు బహిరంగ మార్కెట్‌లో రూ.250 కోట్లు పలుకుతోంది. నాని గ్యాంగ్ దీన్ని అప్పనంగా కొట్టేసి, అమ్మేసి సొమ్ము చేసుకునే ప్రయత్నం చేస్తోంది. రూ.250 కోట్లకు స్కెచ్ వేశారంటే అధికార పార్టీలోని ఎవరో 'ముఖ్య'నేత ప్రమేయం ఉండకుండా ఉండదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నాకు మూడు.. మీకు ఏడు

హాథీరాంజీ మఠానికి చెందిన భూమిని స్వాధీనం చేసుకోవడానికి చూస్తున్న ముగ్గురు వ్యక్తులతో టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని డీల్ కుదుర్చుకున్నారని తెలుస్తోంది. ఈ భూమికి సంబంధించి మఠం, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇబ్బంది రాకుండా తాను చూసుకుంటానని ఆయన హామీ ఇచ్చారని సమాచారం. తనకు మూడెకరాలు కేటాయించాలని.. మీరు ఏడెకరాలు తీసుకోవాలని వారితో చెప్పినట్టు తెలుస్తోంది. అంతటితో ఆగని నాని ఆ తర్వాత ఆ ఏడెకరాలను కూడా తానే కొనుగోలు చేసుకుంటానని చెప్పడంతో ఆ ముగ్గురు షాక్ అయ్యారు. 'ఆ ఏడెకరాలకు రూ.25 కోట్లు ఇస్తా.. ఆ నగదును ముగ్గురు పంచుకోండి. దీంట్లో అమరావతి పెద్దలకు కూడా వాటా ఉంది' అని స్పష్టం చేయడంతో చేసేదేమీ లేక ఆ ముగ్గురూ తెల్ల ముఖం వేశారని సమాచారం.

పనులు ప్రారంభం

ఆ పదెకరాలు చుట్టూ జూన్ 9న ఉదయం 7 గంటలకు ప్రహరీ గోడ వేయడానికి నానీస్ గ్యాంగ్ పనులు ప్రారంభించింది. ఈ సమాచారం అందుకున్న దేవదాయ శాఖ అధికారులు, మఠం సిబ్బంది అందరూ కలిసి జూన్ 10న ఆ స్థలం వద్ద కెళ్లి ప్రహరీ నిర్మించడానికి వీల్లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పటికే అక్కడ 100 మందికిపైగా నాని గూండాలు కాపుకాస్తున్నారు. 'మేమెవరో తెలియదా?, ఎంత ధైర్యం ఉంటే ఇక్కడికి వస్తారు? మూసుకుని వెళ్లండి' అంటూ బెదిరింపులకు దిగారు. అయితే మఠం అధికారులు పనులు ఆపాల్సిందేనంటూ గట్టిగా వాదించారు. దీంతో కోపోద్రిక్తులయిన టీడీపీ గూండాలు మఠం సిబ్బందిని తాత్కాలికంగా నిర్మించుకున్న గదిలోకి తీసుకెళ్లి బట్టలు ఊడదీయించారు. అధికారులతో గోడ కుర్చీ వేయించారు. నోటికొచ్చినట్లు బండ బూతులు తిట్టారు. దీంతో అధికారులు, సిబ్బంది ప్రాణ భయంతో అక్కడే బిక్కుబిక్కుమంటూ గడిపారు. చివరకు కాళ్లా వేళ్లా పడి బతుకుజీవుడా అంటూ అక్కడి నుంచి మఠం కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మఠం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై చంద్రగిరి డీఎస్పీ జూన్ 11న నాని గ్యాంగ్‌ను, దేవదాయ శాఖ అధికారులను అక్కడకు పిలిపించుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో సైతం గ్యాంగ్ ఓ దశలో అధికారులపై దాడి చేయడానికి ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో దేవదాయ అధికారులకు 'నాని గ్యాంగ్' వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎక్కడా ఈ అంశంపై నోరు మెదపవద్దని మండిపడినట్లు సమాచారం. తమకు వ్యతిరేకంగా నివేదికలు ఇవ్వడానికి లేదని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది.

ఆందోళనకు ప్రజా సంఘాలు సిద్ధం

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి ఒక ఆర్యవైశ్య వ్యాపారి రూ.రెండు కోట్లు ఇవ్వనందుకు ఇటీవల రైస్‌మిల్లు మూయించారు. అదే క్రమంలో టీడీపీ కాంట్రాక్టర్ నుంచి రెండెకరాలు రాయించుకున్నారు. ఇప్పుడు రూ.250 కోట్ల విలువైన పదెకరాల మఠం భూమిని ఆక్రమించుకుంటున్నారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

ఆ భూమి హాథీరాంజీ మఠందే..

తిరుపతి రూరల్ మండలం అవిలాల పరిధిలో ఆక్రమణకు గురైన భూమి హాథీరాంజీ మఠానిదే. మఠానికి చెందిన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దానిని అడ్డుకునేందుకు వెళ్లిన మఠం సిబ్బందిని వంద మంది గూండాలతో రూమ్‌లో బంధించి, బట్టలూడదీసి.. నానా దుర్భాషలాడుతూ అంతు చూస్తామని బెదిరించారు. ఈ మేరకు తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలకు కూడా ఫిర్యాదు ఇచ్చాం. ఈ భూకబ్జాలో ల్యాండ్ మాఫియా పాత్ర ఉంది.

– రమేష్‌నాయుడు, హాథీరాంజీ మఠం పరిపాలనాధికారి

దేవదాయ భూములను సంరక్షించాలి..

చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల పరిధిలో ఉన్న హాథీరాంజీ మఠం, పరకాల మఠం, దేవదాయ భూములను ప్రభుత్వం సంరక్షించాలి. తిరుపతి నగర నడిబొడ్డున 10 ఎకరాల భూమిని గత నెల నుంచి అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధి కొట్టేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ విషయం తెలిసి అడ్డుకున్న మఠం అధికారులను బట్టలూడదీయించి.. నానా బూతులు తిడుతూ భయకంపితులను చేశారు. ఈ భూముల కబ్జాను తక్షణం ఆపాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకి విజ్ఞప్తి చేస్తున్నా.

– కందారపు మురళి, సీపీఎం నేత

మహిళల రక్షణ ఇలాగేనా!?

- బాలిక హత్యోదంతంపై చలనంలేని హోంమంత్రి
- వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి ఫైర్


బాధిత కుటుంబాన్ని ఓదారుస్తున్న కల్యాణి, సుభద్ర

అచ్యుతాపురం: పదమూడేళ్ల బాలిక దర్శినిని దారుణంగా హత్యచేసిన నిందితుడు సురేష్‌ను వెంటనే పట్టుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లేపల్లి సుభద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారిరువురు రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలోని దర్శిని ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన లేఖను డీఎస్పీకి అందజేశారు.

పోలీసుల వైఫల్యం కాదా..

అనంతరం.. కళ్యాణి, సుభద్ర మాట్లాడుతూ.. రాష్ట్ర హోంమంత్రి అనిత సొంత జిల్లాకు చెందిన బాలికను హత్యచేసి ఐదురోజులైనా నిందితుడ్ని ఎందుకు పట్టుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. బెయిల్‌పై ఉన్న నిందితుడు సురేష్ నుంచి ప్రాణహాని ఉందని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినా బాలికను రక్షించలేకపోవడం బాధాకరమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మహిళా చట్టాలు, మహిళల రక్షణ గురించి మాట్లాడిన అనిత ఇప్పుడేం చేస్తున్నారని.. మహిళల రక్షణ ఇలాగేనా అని వారు ప్రశ్నించారు. ఇప్పటివరకూ బాలిక కుటుంబీకుల్ని పరామర్శించేందుకు హోంమంత్రి రాకపోవడం దారుణమన్నారు. దిశ యాప్, దిశ పోలీస్‌స్టేషన్లను మార్చడంలో ఉన్న శ్రద్ధ మహిళలను రక్షించడంలో ఎందుకు లేదన్నారు. మృతురాలి కుటుంబీకులకు ప్రభుత్వం రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాలిక హత్య విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసింది చంద్రబాబే

- పూనూరు గౌతమ్ రెడ్డి



సాక్షి, అమరావతి: విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసింది చంద్రబాబేనని, హైదరాబాద్ బషీర్‌బాగ్ కాల్పులే ఇందుకు నిదర్శనమని వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు పూనూరు గౌతమ్ రెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబు ఎన్ని జన్మలెత్తినా బషీర్‌బాగ్ కాల్పుల పాపం వెంటాడుతూనే ఉంటుందన్నారు. ఆయన బుధవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. విద్యుత్తుపై చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు చెప్పారని అన్నారు. విద్యుత్ రంగంలో చంద్రబాబు సంస్కరణలు నచ్చకే ప్రజలు పదవి నుంచి ఆనాడు దించేశారని, అయినా జ్ఞానం రాలేదని దుయ్యబట్టారు. బాబు పాలనలో విద్యుత్ రంగం పూర్తిగా అప్పుల పాలైందన్నారు. ప్రభుత్వ రంగంలో కాకుండా ప్రైవేట్ రంగంలో విద్యుత్ సంస్థలను ప్రోత్సహించి అప్పుల పాలు చేశారని విమర్శించారు. ఎవరు భూతమో 6 నెలల తర్వాత ప్రజలే తేలుస్తారని చెప్పారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తుంగలో తొక్కేందుకు ఇప్పటి నుంచే సాకులు వెదుకుతున్నారని చెప్పారు. హామీలు నెరవేర్చకపోతే ఎవరు ఏ విధంగా శాశ్వతంగా రాజకీయ సమాధి అవుతారో కాలమే నిర్ణయిస్తుందని అన్నారు.

‘ఉన్నత విద్యామండలి’పై హైకోర్టులో పిల్

కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో నిధుల దుర్వినియోగంపై ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. కర్నూలుకు చెందిన నాగరాజు మరొకరు దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది ఎమ్మార్కే చక్రవర్తి వాదనలు వినిపిస్తూ, ఉన్నత విద్యా మండలిలో నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించిందన్నారు. విచారణ జరిపిన కమిషన్ అక్రమాలను నిర్ధారించిందని చెప్పారు. అయితే బాధ్యులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 16కు వాయిదా వేసింది.

కిడ్నీ రాకెట్ నిందితుల కోసం ప్రత్యేక బృందాలు

ఐదుగురిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బెజవాడ కిడ్నీ రాకెట్ కేసు దర్యాప్తును గుంటూరు పోలీసులు వేగవంతం చేశారు. నిందితుల కోసం ప్రత్యేకంగా గాలింపు చేపట్టారు. ఇప్పటికే కిడ్నీ రాకెట్ వ్యవహారంలో బ్రోకర్‌గా వ్యవహరించిన వెంకట్, బాషాతోపాటు, వెంకటస్వామి, విజయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుడు శరత్ సుబ్రహ్మణ్యం పై కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించడానికి జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మూడు బృందాలను రంగంలో దించారు. పోలీసులు విచారణ మొదలు పెట్టాగానే కేసులో కీలకమైన నిందితులు పరారీలో ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని పట్టుకునేందుకు పోలీసులు తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక బృందాన్ని పంపారు. మరోవైపు కేసులో కీలకమైన నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కిడ్నీ రాకెట్ బాధితుడు హరిబాబును కిడ్నీ కావాల్సిన వ్యక్తులు, ఆధార్ కార్డులతోపాటు, మిగిలిన డాక్యుమెంట్‌లను ట్యాంపరింగ్ చేసి బంధువుగా మార్చిన వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. దీంతోపాటు కిడ్నీ మార్పిడికి అనుమతించిన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ బోర్డుకు సంబంధించిన సభ్యులను విచారించడానికి పోలీసులు సిద్ధమయ్యారు.

టీడీపీ నేతల నిర్వాకానికి తల్లి, కూతురు బలి

వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న నెపంతో అక్రమ కేసు

- భర్తపై అకారణంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుతో తీవ్ర మనస్తాపం
- కుమార్తెను చంపి తల్లి ఆత్మహత్య
- అనంతపురం జిల్లా మల్లికార్జునపల్లిలో ఘటన



మృతదేహాలను పరిశీలిస్తున్న ఉమామహేశ్వర నాయుడు, బోయ తిప్పేస్వామి



ఘటన జరిగిన ఇంటివద్ద కుటుంబ సభ్యులు, బంధువుల ఆవేదన

కళ్యాణదుర్గం: టీడీపీ నాయకుల కక్ష సాధింపులకు తల్లి, కుమార్తె బలయ్యారు. తన భర్తపై అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బనాయించడంతో తీవ్ర మనస్తాపం, ఆందోళనకు గురైన గొల్ల మమత (24).. తన 8 నెలల కుమార్తెను చంపి తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికార్జునపల్లికి చెందిన గొల్ల శాంతకుమార్ వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా పార్టీ తరఫున గ్రామంలో చురుగ్గా పనిచేశారు. ఐదు రోజుల క్రితం గ్రామంలోని ఓ కిరాణా దుకాణం వద్ద జగన్‌కు అనుకూలంగా మాట్లాడాడు. అనంతరం గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నేతలు శాంతకుమార్‌ను మందలించేందుకు కళ్యాణదుర్గం పట్టణ పోలీసు స్టేషన్‌లో పంచాయితీ పెట్టారు. శాంతకుమార్‌ను ఎలాగైనా కేసులో ఇరికించి జైలుకు పంపాలని ఎత్తుగడ వేశారు. ఈ క్రమంలోనే అదే గ్రామానికి చెందిన హనుమంతు అనే టీడీపీ కార్యకర్తను ఉసిగొల్పి శాంతకుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించారు. ఈ విషయంపై బుధవారం పోలీసులు శాంతకుమార్‌ను స్టేషన్‌కు పిలిపించారు.

భర్త జైలుకు వెళ్తాడన్న భయంతో..

తన భర్త శాంతకుమార్‌ను స్థానిక టీడీపీ నాయకులు అక్రమంగా కేసులో ఇరికిస్తున్నారని, అతన్ని జైలులో పెట్టిస్తారన్న భయంతో ఆతడి భార్య మమత తీవ్రంగా కుంగిపోయింది. ముందుగా తన 8 నెలల కుమార్తెను ఇంటి ఆవరణలోని నీటి తొట్టెలో ముంచి ప్రాణం పోయాక.. బాత్‌రూంలో ఉన్న ఇనుప కడ్డీలకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు, స్థానికులు గుర్తించేసరికే చిన్నారితో పాటు మమత మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లీకుమార్తె మృతితో మల్లికార్జునపల్లిలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి తరలివచ్చారు. తల్లీకుమార్తె మృతదేహాలపై పడి గుండెలవిసేలా రోదించారు.

ఇవి రాజకీయ హత్యలే: వైఎస్సార్‌సీపీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు గడవక ముందే వారి అధికార దాహానికి రెండు నిండు ప్రాణాలు బలయ్యాయని వైఎస్సార్‌సీపీ నేతలు మాదినేని ఉమామహేశ్వర నాయుడు, బోయ తిప్పేస్వామి అన్నారు. కుమార్తెను చంపి తల్లి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసి మాదినేని ఉమా మహేశ్వర నాయుడు, బోయ తిప్పేస్వామి, పార్టీ నేతలు రామచంద్ర, హనుమంతరెడ్డి, చిత్తప్ప, తలారి సత్యప్ప, కృష్ణమూర్తి, ఆంజనేయులు తదితరులతో కలిసి కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. ఇద్దరి మృతదేహాల వద్ద నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇవి అధికార పార్టీ చేసిన రాజకీయ హత్యలని వ్యాఖ్యానించారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న కారణంతో టీడీపీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆస్తులను ధ్వంసం చేయడం, అక్రమ కేసులు బనాయించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. కళ్యాణదుర్గాన్ని అభివృద్ధి చేస్తామన్న ఎమ్మెల్యే సురేంద్రబాబు ఇక్కడ విష సంస్కృతికి తెర లేపారని విమర్శించారు. తల్లీకూతురు మృతికి కారణమైన టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖరీఫ్ సాగు చేయలేం

సాగు విరామం ప్రకటించిన రైతులు



ఖరీఫ్ పంటకు విరామం తప్పదని నినదిస్తున్న రైతులు

అల్లవరం: ముంపు నీరు దిగదు.. కాలువ నుంచి నీరు పారదు.. ఇలాంటి పరిస్థితుల్లో తామంతా ఖరీఫ్‌కు సాగుకు విరామం ప్రకటిస్తున్నట్లు అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం, రెల్లుగడ్డ గ్రామాల రైతులు వెల్లడించారు. బుధవారం అల్లవరంలోని రైతు నాయకుడు బొక్కా శ్రీను నివాసంలో రైతులు సమావేశమయ్యారు. రెల్లుగడ్డ, అల్లవరం రెవెన్యూ గ్రామాల్లోని ముంపు ప్రాంతాల్లో ఖరీఫ్ పంటను వేయలేమని వారు తీర్మానించారు. లోయర్ కౌశిక డ్రైన్ 17 కిలోమీటర్ల పొడవునా ఆక్రమణకు గురికావడంతో ముంపునీరు దిగువకు వెళ్లడం లేదని రైతులు తెలిపారు. దీనికితోడు డ్రైన్ పొడవునా ఆక్వా వ్యర్థాలను యంత్రాల సహాయంతో వదిలేస్తున్నారని, పూడిక పేరుకుపోయి ముంపు నీరు స్తంభిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఆక్వా రైతులు విద్యుత్ మోటార్లు వినియోగించి మురుగునీరు దిగువకు వదిలేయడంతో వరి పొలాల్లోని ముంపునీరు కదిలే పరిస్థితి లేక ఖరీఫ్ పంట నష్టాలను మిగులుస్తోందన్నారు. లోయర్ కౌశిక, వాసాలతిప్ప, పంచనీటి కాలువలో చేపల కోసం ఏర్పాటు చేస్తున్న వలకట్లు నీటి సరఫరాకు విఘాతం కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన డ్రైన్‌లో ఏర్పాటు చేస్తున్న వలకట్లతో నీటి ప్రవాహం భారీగా తగ్గిపోయి ఎస్.రామేశ్వరంలోని మొగ మూసుకుపోవడానికి కారణం అవుతోందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అల్లవరం, రెల్లుగడ్డ గ్రామాల్లో నారుమడులు దెబ్బతిన్నాయన్నారు. మళ్లీ నారువేసే ఓపిక తమకు లేదన్నారు. అనంతరం రైతులంతా కలసి పంట విరామం ప్రకటించారు. రైతులు వాసర్ల లక్ష్మణరావు, మొల్లేటి భద్రం, కడలి అచ్యుతరావు, పెన్మత్స సత్యనారాయణ రాజు, కొంబత్తుల ఆంజనేయులు, మొల్లేటి రామ్‌కుమార్, వాసర్ల సూర్యనారాయణ, కాశే సత్యనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు

రూ.40 వేల జరిమానా
విశాఖ పోక్సో కోర్టు తీర్పు



జి.సాయికుమార్

విశాఖ లీగల్: చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది బుధవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతో పాటు రూ.40,000 జరిమానా చెల్లించాలని, ఆ మొత్తాన్ని బాలికకు ఇవ్వాలని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు. ప్రభుత్వం పరిహారం కింద రూ.3.5 లక్షలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్ కృష్ణ అందించిన వివరాలు.. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి తోటగురువు దగ్గర బీఎస్ఆర్ నగర్‌లో నివాసముంటున్న గుండెల సాయి కుమార్.. ఓ ప్రైవేట్ ల్యాబ్‌లో పనిచేస్తున్నాడు. ఆరిలోవ సెక్టార్–2 శివాజీనగర్‌లో తన ఇద్దరు మైనర్ కుమార్తెలతో తండ్రి నివాసముంటున్నాడు. గతేడాది ఏప్రిల్ 9న తన కుమార్తెలను టిఫిన్ తీసుకురమ్మని హోటల్‌కు తండ్రి పంపాడు. అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న సాయికుమార్.. ఓ బాలికను ఎత్తుకుని తన బండిపై నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు స్థానిక ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి.సోమశేఖర్.. సాయికుమార్‌పై కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. కేసును దిశ పోలీసులు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.

సీఎంతో బీపీసీఎల్ ప్రతినిధుల భేటీ

ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై చర్చ



బీపీసీఎల్ ప్రతినిధులతో చర్చిస్తున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి: పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ అత్యుత్తమ గమ్యస్థానం అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సచివాలయంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రతినిధులతో బుధవారం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై బీపీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణకుమార్, సంస్థ ప్రతినిధులతో చర్చించారు. ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు 4 వేల నుంచి 5 వేల ఎకరాల భూమి అవసరం ఉంటుందని కంపెనీ ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అవసరమైన భూములు కేటాయిస్తామని.. 90 రోజుల్లో ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన పూర్తి ప్రణాళికతో రావాలని కంపెనీ ప్రతినిధులను ముఖ్యమంత్రి కోరారు.

విన్ ఫాస్ట్ ప్రతినిధులతోనూ..

ఈవీల తయారీలో వియత్నాంలో పేరున్న విన్ ఫాస్ట్ కంపెనీ ప్రతినిధులతోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈవీ, బ్యాటరీ తయారీ ప్లాంట్‌ను ఏపీలో నెలకొల్పాలని చంద్రబాబు సంస్థ సీఈవో పామ్ సాన్ చౌ, సంస్థ ప్రతినిధులను కోరారు. ప్లాంట్‌కు అవసరమైన భూమి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం తెలిపారు. అంతకుముందు బీపీసీఎల్, విన్ ఫాస్ట్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి విందు ఇచ్చారు.

నేడు సీఎం చంద్రబాబు ఉత్తరాంధ్రలో పర్యటన

సాక్షి, విశాఖపట్నం: సీఎం చంద్రబాబు గురువారం విశాఖ, విజయనగరం జిల్లాల్లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అనకాపల్లి జిల్లా దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువను పరిశీలిస్తారు. అనంతరం భోగాపురం చేరుకుని మధ్యాహ్నం 1.30 వరకు భోగాపురం ఎయిర్‌పోర్టును సందర్శిస్తారు. ఎయిర్ పోర్టు పనుల తీరుపై అధికారులతో సమీక్షిస్తారు. అక్కడి నుంచి మెడ్‌టెక్ జోన్‌కు చేరుకుని పలు భవనాల్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2.30 నుంచి 04.30 వరకు వర్చువల్‌గా సీఐఐ కాన్ఫరెన్సులో పాల్గొన్న అనంతరం.. మెడ్‌టెక్ జోన్ వర్కర్లతో సమావేశమవుతారు. సాయంత్రం విశాఖ ఎయిర్ పోర్టు లాంజ్‌లో అధికారులతో సమావేశమై ఐదేళ్లలో నిలిచిన ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తారు. రాత్రి 7.45 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

రాష్ట్రంలో కొత్త జూ పార్కులు

అధికారులకు పవన్‌కళ్యాణ్ సూచన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నూతన జంతు ప్రదర్శనశాలల (జూ పార్కుల) ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తన నివాసంలో జూ పార్కు అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గవర్నింగ్ బాడీ 14వ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విశాఖపట్నం, తిరుపతిలలో ఉన్న జూ పార్కులకు ఎక్కువమంది పర్యాటకులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని ఆయన అధికారులకు సూచించారు. వీటి అభివృద్ధికి పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నిధులు సమకూర్చడం.. అరుదైన, ఆకర్షణీయంగా ఉండే జంతువులను దిగుమతి చేసుకోవడం వంటి అంశాల మీద దృష్టిసారించాలని ఆదేశించారు. పర్యాటకులను ఆకర్షించేందుకు వన్య ప్రాణులతో చక్కటి అనుభూతులు (వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పీరియన్స్) కలిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకు కార్పొరేట్లను భాగస్వాముల్ని చేయాలని, సీఎస్ఆర్ నిధులతో జూ పార్కులకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే, పారిశ్రామికవేత్తలు వ్యక్తిగతంగా జంతువులను దత్తత తీసుకోవడం, అభివృద్ధికి దాతల సహకారం తీసుకోవడం వంటి కార్యాచరణ కూడా రూపొందించాలని పవన్ సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రమోట్ చేసేందుకు తిరుపతి, విశాఖ పర్యటనల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేయాలన్నారు. అవసరమైతే పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులను జంతు ప్రదర్శనశాలల అభివృద్ధిలో పాలుపంచుకునేలా చేసేందుకు ‘టీ విత్ డిప్యూటీ సీఎం’ అనే కార్యక్రమాన్ని రూపొందించాలని చెప్పారు. సమావేశంలో అటవీశాఖ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి, పర్యాటక శాఖ కమిషనర్ కె. కన్నబాబు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థపై కూటమి విధానం ఏమిటి!

- ఇప్పటివరకు విద్యా క్యాలెండర్ ఎందుకు ప్రకటించలేదు
- ప్రాథమిక పాఠశాలలను కాపాడండి
- రాష్ట్ర యూటీఎఫ్ నేతల డిమాండ్

సాక్షి, అమరావతి: విద్యా వ్యవస్థపై కూటమి ప్రభుత్వ విధానం ఏమిటో చెప్పాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ప్రశ్నించారు. బుధవారం విజయవాడ యూటీఎఫ్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వ విద్యావ్యవస్థపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచినా విద్యాశాఖ ఇప్పటివరకు అకడమిక్ క్యాలెండర్‌ను ఎందుకు ప్రకటించలేదని నిలదీశారు. టెన్త్ పరీక్షలు ఇంగ్లిష్ మీడియంలో రాయాలా లేక ఇచ్చిన హామీ ప్రకారం తెలుగు మీడియంలో కూడా రాసే అవకాశం కల్పిస్తారా అన్నది కూడా ప్రభుత్వం తేల్చలేదన్నారు. సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా ఒక్క విద్యార్థి కూడా 10వ తరగతిలో చేరే అవకాశం లేదన్నారు. గత ఏడాది 9వ తరగతి చదివిన విద్యార్థులు సీబీఎస్ఈ సిలబస్ చదవలేక వేరే స్కూళ్లకు తరలిపోతున్నారని, సీబీఎస్ఈ సిలబస్ కొనసాగించే విషయాన్ని పునరాలోచించాలన్నారు. రాష్ట్రమంతా ఒకే విద్య, ఒకే సిలబస్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఎక్కువయ్యాయని, దీంతో ఉపాధ్యాయుల్లో అసంతృప్తి పెరిగిపోతోందని వారు పేర్కొన్నారు. మెరుగైన బోధన పేరుతో గతంలో 3–5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేశారని, దీంతో 4,457 ప్రాథమిక పాఠశాలలు ఒకటి, రెండు తరగతులకే పరిమితమయ్యాయన్నారు. ఈ సంవత్సరం 20 వేల పాఠశాలల్లో 10, 15 మంది విద్యార్థులు కూడా లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ఏడాది నుంచి పిల్లలందరికీ ‘తల్లికి వందనం’ పేరుతో ఏటా రూ.15 వేలు ఇస్తామని ఇచ్చిన హామీని అడ్డుపెట్టుకుని గుర్తింపు లేని పాఠశాలలు సైతం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల నుంచి తరలించుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మునిసిపల్ టీచర్ల సర్వీస్ పాఠశాల విద్యాశాఖలోకి వచ్చినా వారి సమస్యలు పరిష్కరించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని కోరారు. గిరిజన సంక్షేమశాఖ పాఠశాలల్లో 17 ఏళ్లుగా సీఆర్టీలుగా పనిచేస్తున్న వారి సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కేజీబీవీల్లో ‘ప్లస్ టూ’ స్థాయిలో తొలగించిన బాషా పండితులను కోర్టు ఉత్తర్వుల ప్రకారం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కారవాన్ టూరిజంపై నాడే నిర్ణయం

- హార్సిలీహిల్స్‌పై ఏర్పాటుకు కసరత్తు
- కొత్త ప్రభుత్వ ఘనతగా కలరింగ్
- దీనిపై 2022లోనే ప్రతిపాదనలు



2022 జూన్ 26న హార్సిలీహిల్స్‌పై టూరిజం ఎండీ కన్నబాబు (ఫైల్)

బి.కొత్తకోట: ‘హార్సిలీహిల్స్‌పై పర్యాటకులకు విలాసవంతమైన సౌకర్యాలతో కారవాన్ సౌకర్యం అందుబాటులోకి వస్తోంది. త్వరలోనే దీన్ని అమలు చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేట్టింది’ అంటూ పర్యాటక శాఖ హడావుడి చేస్తోంది. వాస్తవానికి... అన్నమయ్య జిల్లా, బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై విలాసవంతమైన సౌకర్యాలతో కూడిన కారవాన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2022లోనే టూరిజం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం జరిపారు. 2022 జూన్ 26న అప్పటి, ప్రస్తుత టూరిజం శాఖ ఎండీ కన్నబాబు హార్సిలీహిల్స్‌పై పర్యాటకశాఖ ఉన్నతాధికారులతో పర్యటించారు. ఆదాయ వనరుల పెంపు, అభివృద్ధికి సంబంధించిన చర్యలు, పర్యాటకులను ఎలా ఆకర్షించాలి అనే విషయాలపై సమీక్షించారు. అనంతరం హార్సిలీహిల్స్‌పై పర్యాటకులకు కారవాన్ సౌకర్యం అందుబాటులో తీసుకొస్తామని ప్రకటించారు. అనంతరం ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టే కారవాన్ సౌకర్యం కోసం దీన్ని కొండపై నిలిపేందుకు భద్రత, మౌలిక సదుపాయాలు, విద్యుత్, వంటి సౌకర్యాలు కల్పించడమే కాకుండా కారవాన్‌కు వర్తక, అగ్నిమాపక ఎన్‌ఓసీల మంజూరుకు ప్రభుత్వం సహకారం ఉంటుందని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. అయితే ఈ చర్యలన్నీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనే తీసుకున్నట్లుగా పర్యాటకశాఖ హడావుడి చేయడం గమనార్హం.

పైన వంకాయలు.. కింద ఎర్ర చందనం!

ట్రక్ ఆటోలో 27 దుంగలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



తడ (తిరుపతి జిల్లా): పైన వంకాల లోడు.. కింద ఎర్రచందనం దుంగలతో చెన్నై వెళుతున్న ట్రక్ ఆటోను తడ పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన కత్తి వెంకటసుబ్బయ్యకు చెందిన ట్రక్ ఆటోను చెన్నైకి వంకాయలు తరలించేందుకు ఓ వ్యక్తి కిరాయి మాట్లాడుకున్నాడు. చెన్నైలో ఫలానా చోటుకి వెళితే అక్కడ మరో వ్యక్తి వచ్చి సరుకు తీసుకుని డబ్బులు ఇస్తాడని చెప్పి 30 వేలు కిరాయి చేతిలో పెట్టాడు. దీంతో ఆటోని తీసుకుని బయలు దేరిన సుబ్బయ్య చెన్నై వెళ్లాక అక్కడ ఎవరూ తారసపడకపోవడంతో ఆటోతో సహా తిరిగి స్వస్థలానికి బయలుదేరాడు. ఆటో బీవీపాళెం చెక్‌పోస్టు వద్దకు వచ్చే సరికి చెన్నై నుంచి ఫోన్ రావడంతో మళ్లీ చెన్నై వెళ్లే ప్రయత్నం చేస్తుండగా.. సూళ్లూరుపేట సీఐ మధుబాబుకి అందిన సమాచారంతో తడ ఎస్ఐ నరసింహారావుకు సమాచారం ఇవ్వడంతో దాడి చేసి ఆటోను పట్టుకున్నారు. తెల్ల వంకాయల బస్తాల కింద 27 ఎర్ర చందనం దుంగలున్నట్టు గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చెన్నైలో నిఘా ఎక్కువగా ఉండడంతో స్మగ్లర్లు అప్రమత్తమై ఆటో డ్రైవర్‌కు తమ స్థావరం వివరాలు చెప్పకుండా దాచి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

బెల్టు షాపులు తెరుచుకున్నాయ్

- కృష్ణా జిల్లా కోడూరులో దళారుల దందా
- ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి బెల్టు షాపులకు సరఫరా
- అధికారుల అండదండలు పుష్కలం

కోడూరు (అవనిగడ్డ): కృష్ణా జిల్లా కోడూరులో మద్యం బెల్టు షాపులు తెరుచుకున్నాయ్. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం సీసాలను పక్కదారి పట్టించి బెల్టు షాపుల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. కోడూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపం ఎదురుగా, కేడీసీసీ బ్యాంక్ పక్కన రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల నుంచి మండలంలోని 13 పంచాయతీల్లో ఉన్న అన్ని బెల్టు షాపులకు పుష్కలంగా మద్యం సరఫరా అవుతోంది. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసేందుకు దళారులను కూడా ఏర్పాటు చేసుకున్నారు. మండలంలో సుమారు 25 బెల్టు షాపులు ఉండగా.. వీటికి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి దళారులు బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం సీసాలను సరఫరా చేస్తున్నారు.

భారీగా దండుకుంటున్నారు

ప్రభుత్వ మద్యం దుకాణంలో పని చేసే ఉద్యోగులు క్వార్టర్ బాటిల్‌పై రూ.5 అదనంగా వసూలు చేస్తూ దళారులకు మద్యం అప్పగిస్తున్నారు. అక్కడి నుంచి బెల్టు షాపులకు సరఫరా చేసే దళారులు బాటిల్‌కు రూ.25 చొప్పున బెల్టు షాపుల నిర్వాహకుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారు. తద్వారా ఉద్యోగులు, దళారులు రోజుకు రూ.30 వేల వరకు ఆర్జిస్తున్నట్టు తెలుస్తోంది. బెల్టు షాపుల్లో మద్యం సీసాపై రూ.80 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

పుష్కలంగా అధికారుల అండదండలు

ఎక్సైజ్, పోలీసు అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో దళారులు, బెల్టు షాపుల నిర్వాహకులు ఎవరినీ లెక్క చేయకుండా విక్రయాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ దుకాణాల నుంచి గోనె సంచుల్లో మద్యం సీసాలను బాహాటంగానే తీసుకువెళ్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కోడూరు మద్యం దుకాణం నుంచి గోనె సంచుల్లో తరలిస్తున్న మద్యం

ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేస్తాం

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలకు నీరు విడుదల



ప్రకాశం బ్యారేజ్ కృష్ణా పశ్చిమ డెల్టాకు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

తాడేపల్లి రూరల్/ వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసే దిశగా తమ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. బుధవారం విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలకు మంత్రి రామానాయుడు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ‘సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తున్నాం. సమర్థవంతమైన జలవనరుల నిర్వహణ ద్వారా భారీగా సంపద సృష్టించవచ్చు. తద్వారా రైతులతో పాటు ఆయా ప్రాంతాలు కూడా సుభిక్షమవుతాయి. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు కృష్ణాకు చేరి దాదాపు 13 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 నుంచి 40 లక్షల మందికి తాగునీరు అందించేందుకు వీలవుతోంది. అలాగే ఇప్పుడు కృష్ణా నీటి విడుదల ద్వారా తూర్పు డెల్టాలోని ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో 7.38 లక్షల ఎకరాలకు సాగునీరుతో పాటు 11 నియోజకవర్గాల్లోని 35 మండలాలకు తాగునీరు అందనుంది. పశ్చిమ డెల్టాలో 5.98 లక్షల ఎకరాలకు సాగునీరు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఉన్న 21 మండలాలకు తాగునీరు అందనుంది. డెల్టా కాలువలు, డ్రెయిన్లలోని గుర్రపుడెక్క తొలగింపునకు ఆదేశాలిచ్చాం’ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎమ్మెల్యేలు బొండా ఉమా, మండలి బుద్ధ ప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ సి.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

తుప్పపట్టిన... పాత సైకిళ్ల పంపిణీ!

తవణంపల్లె (చిత్తూరు జిల్లా): విద్యార్థులకు తమ ప్రభుత్వమే లబ్ధి చేకూరుస్తోందని చెప్పుకునేందుకు టీడీపీ నేతలు తహతహలాడుతున్నారు. అసలు విషయం ఏంటంటే... చిత్తూరు జిల్లా, తవణంపల్లె హైస్కూల్లోని విద్యార్థినులకు స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్, విద్యాశాఖ అధికారులు బుధవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సైకిళ్లు ఐదేళ్ల క్రితం నాటివి. వాటిని పాఠశాలలోని ఓ గదిలో మూలనపడేశారు. టైర్లకు గాలిలేదు... తుప్పు కూడా పట్టాయి. వీటిని గమనించని అధికారులు 15మంది విద్యార్థినులకు పంపిణీ చేశారు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చదువుకునే పిల్లలకు ఇలాంటి సైకిళ్లు ఇస్తున్నారా.. విద్యాశాఖ అధికారులు సైకిళ్లు ఎలాంటి స్థితిలో ఉన్నాయో చూసుకోలేదా... అంటూ స్థానికులు చర్చించుకున్నారు. తవణంపల్లె హైస్కూల్‌కు 2018–19లో దూరప్రాంతాల నుంచి నడుచుకుంటూ వచ్చే విద్యార్థినులకు పంపిణీ నిమిత్తం సుమారు 200పైగా సైకిళ్లు పాఠశాలకు వచ్చాయి. అప్పుడు స్కూలుకు సక్రమంగా హాజరుకాని విద్యార్థినులకు పంపిణీ చేయకుండా వాటిని గదిలో మూలనపడేశారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం, నూతనంగా ఎంపికైన ఎమ్మెల్యే మురళీమోహన్ విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్లు పంపిణీ కార్యక్రమానికి హాజరుకావడంతో విద్యాశాఖ అధికారులు, తవణంపల్లె హైస్కూల్ ఉపాధ్యాయులు అత్యుత్సాహంతో తుప్పు పట్టి, కనీసం టైర్లలో గాలిలేక నడవలేని సైకిళ్లను పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నారు. ఇలాంటి సైకిళ్లను పంపిణీ చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

ఆకట్టుకున్న అయోధ్యకాండ అఖండ పారాయణం



తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న శ్రీవిద్య విద్యా వల్లభ తీర్థ స్వామీజీ

తిరుమల: లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాద నీరాజనం వేదికపై బుధవారం నిర్వహించిన 12వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అయోధ్యకాండలోని 45 నుంచి 49వ సర్గ వరకు మొత్తం ఐదు సర్గల్లో 141 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 166 శ్లోకాలను ధర్మగిరి వేద పాఠశాల పండితులు రామానుజాచార్యులు, అనంత గోపాలకృష్ణ, మారుతి పారాయణం చేశారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు తేజోవతి బృందం ‘శరణు శరణు నీకు జగదేక వందిత కరుణతో మమ్ము నేలు కౌసల్య నందనం’ అనే కీర్తనను కార్యక్రమ ప్రారంభంలో, ‘హరి హరి రామ నన్నరమర జూడకు నిరతము నీ నామస్మరణ మేమరను దశరథ నందనం’ అనే సంకీర్తనను చివరిలో రసరమ్యంగా ఆలపించారు.

శ్రీవారి సేవలో ఉడిపి కన్యూర్ మఠం పీఠాధిపతి

తిరుమల శ్రీవారిని ఉడిపి కన్యూర్ మఠం పీఠాధిపతి శ్రీవిద్య విద్యా వల్లభ తీర్థ స్వామీజీ బుధవారం దర్శించుకున్నారు. తిరుమల బేడి ఆంజనేయస్వామి వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బాధాకరమైన జ్ఞాపకాలను మోసుకు తిరుగుతున్నారా? వాటిని రక్షా కవచంలాగా ధరిస్తున్నారా? వాటిని వదిలేసి సాగిపొమ్మని జీవితం చెబుతున్నప్పుడు... అలా ఎందుకు చేయడం లేదు?
– బ్రహ్మకుమారీలు

సాక్షి
గురువారం, 11 జూలై 2024

సత్వర చర్యలే రక్ష!

మంచుకొండల సీమ మళ్ళీ నెత్తురోడుతోంది. జమ్మూ– కశ్మీర్‌లోని కథువా జిల్లా మాచేడీలో భారత సైనిక గస్తీ బృందంపై సాయుధ తీవ్రవాదుల దాడి సహా 48 గంటల్లో నాలుగు ఘటనలు జరగడమే అందుకు తాజా సాక్ష్యం. కథువా ఘటనలో ఒక జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్‌తో సహా అయిదుగురు సైనిక సిబ్బంది, ఆ వెంటనే మరో ఘటనలో మరో ఇద్దరు అసువులు బాయడం పెరుగుతున్న ప్రమాదాన్ని సూచిస్తోంది. సాధారణ తీవ్రవాదులు కాక సుశిక్షితులైన సాయుధ మూక కథువా దుశ్చర్యకు పాల్పడడం సమస్య కొత్త లోతుల్ని చెబుతోంది. ఈ ఏడాది ఇంతవరకు జమ్మూలో ఇలాంటి ప్రధాన ఘటనలే అరడజనుకు పైగా సంభవించాయి. చిన్నాచితకా వాటి సంగతి సరేసరి. ఒక్క జూన్‌లోనే నాలుగు తీవ్రవాద దాడుల్లో, రెండు రోజుల్లో 9 మంది మరణించారు. ప్రభుత్వ వ్యూహాల వైఫల్యం, పాలకులు కశ్మీర్‌పై దృష్టి పెట్టి జమ్మూను తేలికగా తీసుకోవడం... ఏదైతేనేం తీవ్రవాదులు తమ కార్యాచరణను కశ్మీర్ లోయ నుంచి జమ్మూకు బదలాయించారు. అలా తీవ్రవాదానికి ఇప్పుడు రాజౌరీ – పూంఛ్ ప్రాంతం కొత్త కేంద్రమైంది. సుప్రీమ్ కోర్ట్ ఆదేశం మేరకు సెప్టెంబర్ 30లోగా రాష్ట్రంలో ఎన్నికలు జరపాల్సి ఉన్నందున తీవ్రవాదానికి ముకుతాడు వేయడం తక్షణావసరం.

పాతికేళ్ళ క్రితం తీవ్రవాదానికి అడ్డా అయినా, అనంతరం ప్రభుత్వ చర్యలు, స్థానికుల సహకారంతో గత రెండు దశాబ్దాలుగా ప్రశాంతంగా ఉన్న జమ్మూ ఇప్పుడు మళ్ళీ అగ్నిగుండం కావడం విషాదం. గమనిస్తే, ముష్కర దాడులతో జమ్మూలో బలైన సామాన్యులు, భద్రతా సిబ్బంది సంఖ్య గత ఏడాది జనవరి నుంచి ఇప్పటికి రెట్టింపయింది. తీవ్రవాద కేంద్రం మారిందడానికి ఇది స్పష్టమైన సూచిక. 2023 డిసెంబర్‌లో రాజౌరీ ఘటనలో నలుగురు సైనికులను కోల్పోయాం. తరవాత కుల్గామ్ ఎన్‌కౌంటర్‌లో మరో ఇద్దరు. ఇలా కొద్ది నెలల్లోనే సాహస జవాన్లను పలువురిని పోగొట్టుకోవడం విచారకరం. ప్రతి ప్రాణం విలువైనదే. అందులోనూ వీర సైనికుల ప్రాణత్యాగం వెల కట్టలేనిది. గత నెలలో వరుస ఘటనలతో తీవ్రవాదులు తెగబడ్డారు. జూన్ 9న పర్యాటకుల బస్సుపై దాడిలో 9మంది మరణించిన ఘటన, అది మరువక ముందే జూన్ 26న దోడాలో ఘటన... ఇవన్నీ అస్థిరతను సృష్టించాలని చూస్తున్న అదృశ్య శక్తుల విజృంభణకు సంకేతాలు. కశ్మీర్‌లో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నో ఏళ్ళ తర్వాత జనం ఉత్సాహంగా పాల్గొనడంతో, అసెంబ్లీ ఎన్నికలకు పాలకులు సన్నద్ధమవుతున్నారు. దానికి అడ్డం కొట్టడానికే తాజా ఉగ్ర దుశ్చర్యలని విశ్లేషణ.

ఢిల్లీలో మోదీ సర్కార్ మూడోసారి కొలువు తీరినరోజే తీవ్రవాదులు పేట్రేగడం యాదృచ్ఛికం కాదు. ఈ మొత్తం వ్యవహారంలో దాయాది పాకిస్తాన్ పాత్రను విస్మరించలేం. భద్రత, విదేశాంగ విధానంలో తీవ్రవాదాన్ని క్రియాశీలంగా, అదే సమయంలో దొంగచాటు సాధనంగా చేసుకోవడం ఆ దేశం ఆది నుంచీ చేస్తున్నదే. ఆర్థికంగా కష్టాల్లో పడి, అంతర్జాతీయంగా ప్రతిష్ఠ తగ్గినా సరిహద్దులో అది తన కుటిల బుద్ధిని వదులుకోవట్లేదు. స్థానికులను ముందుంచి, తాను వెనుక నుంచి కథ నడిపే వ్యూహాన్ని జమ్మూలో అనుసరిస్తోంది. నిజానికి, జమ్మూ – కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన 370వ అధికరణాన్ని రద్దు చేశాక కేంద్రం ఉక్కుపాదంతో వ్యవహరించింది. రద్దు అనంతరం సైతం అంతా సవ్యంగా ఉందని చెప్పడం, చూపడంలో మోదీ సర్కార్ బిజీగా ఉంది. దానికి తగ్గట్టే 2017 – 2022 మధ్య చొరబాటుదారుల సంఖ్య 53 నుంచి 14కి తగ్గిందనీ, దుశ్చర్యలు 228 నుంచి 125కి దిగివచ్చాయనీ హోమ్ శాఖ లెక్క. కానీ, పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. క్షేత్రస్థాయి పరిస్థితులు సజావుగా లేవనీ, వాటిని పాలకులు పట్టించుకోవట్లేదనీ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నది అందుకే. ఆ మాటకొస్తే, పెద్ద నోట్ల రద్దు మొదలు 370వ అధికరణం ఎత్తివేత దాకా తమ ప్రతి చర్యా తీవ్రవాదాన్ని తుదముట్టించేదే అని పాలకులు చెప్పినా అది వాస్తవరూపం దాల్చలేదు.

పైగా, వర్షాకాలం కావడంతో సరిహద్దు వెంట పాక్ ప్రేరేపిత తీవ్రవాదుల చొరబాట్లు సులభమవుతాయి. ప్రస్తుతం ఏటా భారీగా సాగే సంక్లిష్టమైన అమరనాథ్ యాత్రాకాలం కూడా! హిమలింగాన్ని దర్శించడానికి యాత్రికుల రద్దీ ఉండే ఈ సమయంలో మాటు వేసి కాటు వేయాలనీ, అంతర్జాతీయంగా అందరి దృష్టిని ఆకర్షించాలనీ ముష్కరులు ఎత్తుగడ వేస్తారు. ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి. మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. లేదంటే, తదుపరి పరిణామాలకు చింతించి ప్రయోజనం ఉండదు. వచ్చేవారం బడ్జెట్ సమావేశాలు సైతం ప్రారంభమవుతున్నందున ప్రభుత్వం జాగు చేయరాదు. చేపడుతున్న చర్యలపై స్వచ్ఛందంగా సవివరమైన ప్రకటన చేయాలి.

పాక్‌తో నియంత్రణ రేఖ వెంట కాల్పుల విరమణ కొనసాగుతున్నా, చైనాతో గల్వాన్ లోయ ఘర్షణల తర్వాత మన బలగాలు ఆ సరిహద్దులో వాస్తవాధీన రేఖ వెంట మోహరించాల్సి వచ్చింది. ఫలితంగా కశ్మీర్‌తో పోలిస్తే సైనిక బలగాలు తక్కువగా ఉన్న జమ్మూ తీవ్రవాదులకు వాటంగా మారింది. కశ్మీర్ లోయలో కాస్తంత ఊపిరి పీల్చుకొనే లోగా ఇక్కడకు విస్తరించిన ఈ ముప్పును ఆదిలోనే అడ్డుకోవాలి. దేశ భద్రతపై రాజకీయాల కన్నా రాజీ లేని ధోరణి ముఖ్యమని అధికార, ప్రతిపక్షాలన్నీ బాధ్యతతో ప్రవర్తించాలి. పాలకులు గత పదేళ్ళ తమ హయాంలో అంతా సుభిక్షంగా, సుదృఢంగా మారిపోయిందనే ప్రగల్భాలు మాని, కార్యాచరణకు దిగాలి. భద్రతాదళాల పెంపు ఒక్కటే సమస్యకు పరిష్కారం కాదని అర్థం చేసుకోవాలి. సమస్యను సమగ్రంగా దర్శించి, తీవ్రవాదం వైపు స్థానికులు ఆకర్షితులు కాకుండా ఉండేందుకు శుష్క వాగ్దానాలకు మించిన భరోసా కల్పించాలి. అప్పుడే ఈ భూతాన్ని అడ్డుకోగలుగుతాం. భారత్‌తో వాణిజ్యం, శాంతి కోరుతున్నట్టు చెబుతున్న పాక్ సైతం తీవ్రవాదానికి అండదండలు మానాలి. లేదంటే గుణపాఠం తప్పదు.

రాజ్యాంగ రక్షణే అత్యవసరం

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

పదవిని కాపాడుకోవడం కోసం ప్రతిపక్ష నాయకులను ఇందిరాగాంధీ అరెస్టు చేశారు. మీడియా మీద ఆంక్షలు విధించారు. అందుకే ఎమర్జెన్సీ ఎత్తివేయగానే దేశంలో ఒక పౌరహక్కుల ఉద్యమం ముందుకొచ్చింది. అన్ని రాజకీయ పార్టీలు దేశంలో పౌరహక్కులను కాపాడవలసిన అవసరముందని మాట్లాడాయి. ఆ ఒక్క దశలోనే బీజేపీ నాయకులు కూడా పౌరహక్కుల ఉద్యమాన్ని బలపర్చారు. కానీ ఎమర్జెన్సీ కంటే రాజ్యాంగపు తిరగరాత మరింత ప్రమాదకరమైనది. 2024 ఎన్నికలు దేశ ప్రజాస్వామ్యాన్ని ఒక పెద్ద ప్రమాదం నుంచి కాపాడాయి. అయితే ఈ రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం అప్పుడే పూర్తిగా తొలగిపోలేదు. దేశం మొత్తంగా ఇప్పుడున్న రాజ్యాంగాన్ని రక్షించుకునే చైతన్యం పెరగాలి.



18వ లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'అబ్ కీ బార్ 400 పార్' అని, ఈ ఎన్నికల్లో ఎన్డీఏ 400 సీట్లు గెలవాలని నినాదమిచ్చారు. దాని తరువాత ఆయన మోదీ గ్యారెంటీ నినాదమిచ్చారు. ప్రపంచ ఎన్నికల చరిత్రలో పార్టీని పక్కకు పెట్టి వ్యక్తి గ్యారెంటీ మ్యానిఫెస్టో రాయించారు. ఇది మామూలు విషయం కాదు. ఆ వెనువెంటనే ఆరెస్సెస్, బీజేపీ లీడర్లు కొంతమంది 400 సీట్లు రాగానే దేశ రాజ్యాంగాన్ని తిరగ రాస్తామని ప్రకటనలు ఇవ్వడం మొదలు పెట్టారు. అలా తిరగరాత సిద్ధాంతం ఉన్న ఆరెస్సెస్ నాయకులెవరు ఇటువంటి ప్రకటనలను ఖండించలేదు. ఆనాటికి గానీ, ఇప్పుడు గానీ ఎన్డీఏలో ఉన్న పార్టీలవారికి... అనుకున్న 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని తిరగరాసే ప్రక్రియను ఎదుర్కొనే శక్తి లేదు. వారికి అధికారం తప్ప బలమైన సిద్ధాంతం కూడా లేదు. వాళ్ళ పార్టీ అధికారం తప్ప దేశం ఎటుపోయినా ఫర్వాలేదు.

ఈ స్థితిలో ఇండియా కూటమి ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణను ప్రధాన అంశాన్ని చేసింది. ఎన్నికల తర్వాత పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ రాజ్యాంగం కాపీని, అంబేడ్కర్ బొమ్మనీ బహిరంగ సభల్లో చూపిస్తూ తిరిగారు. ఎన్నికల పోరాటమంతా రాజ్యాంగం చుట్టూ తిరిగే స్థితి మొదటిసారి వచ్చింది. ప్రపంచ పత్రికలు కూడా ఒక దేశం రాజ్యాంగ రక్షణ అంశం ఇంత పెద్దఎత్తున ఏ దేశ ఎన్నికల్లో కూడా చర్చనీయాంశం కాలేదని రాశాయి. టీవీలు, సోషల్ మీడియా మాట్లాడాయి.

ఐతే ఎన్నికల సమయంలో ఒక మోదీ తప్ప ఆరెస్సెస్ ప్రధాన నాయకుడైన మోహన్ భాగవత్ సహా రాజ్యాంగాన్ని తిరగరాసే ఆలోచన లేదని చెప్పలేదు. మోదీ మాత్రం మేమే ఈ రాజ్యాంగ రక్షకులమని కొన్ని సభల్లో మాట్లాడారు. కానీ ఆరెస్సెస్, బీజేపీ నాయకులంతా సైలెంట్‌గా ఉన్నారు. దానికి ప్రధాన కారణమేమిటంటే, ఈ రాజ్యాంగం పరిధిలో పార్లమెంట్, ఇతర సంస్థలపై సంపూర్ణ పట్టు సాధించి తరువాత ఈ రాజ్యాంగాన్ని మార్చాలనేది వారి ఆలోచన. ఈ ఆలోచన ఇప్పటిది కాదు. ఇప్పుడున్న రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుండే దాన్ని వీళ్ళు వ్యతిరేకిస్తున్నారు. దీనికి మనుధర్మ శాస్త్ర లక్షణాలు ఏ మాత్రం లేవనేది వారి ప్రధాన వాదన. వాళ్ళ అవగాహనలో భారతీయ చట్ట సంస్కృతి అంటే మనుధర్మ శాస్త్ర చట్ట సంస్కృతి. దాంట్లో ప్రధానమైన వర్ణ–కుల వ్యవస్థనీ, స్త్రీ అసమాన జీవితాన్నీ కాపాడటం. సమాజ అసమానతలు భారతీయ సంస్కృతిలో భాగం అని వారి భావన.

అదృష్టవశాత్తు బీజేపీకి 240 సీట్లు మాత్రమే రావడం, దానికి రాజ్యాంగ రక్షణ డిబేట్ దోహదపడటం జరిగింది. అయితే రాజ్యాంగ పర చర్చ ప్రజల జీవనంలోకి చొచ్చుకుని పోకుండా ఉండటానికి ఆరెస్సెస్, బీజేపీ ఒక ఎత్తుగడ వేశాయి. అది 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమస్యను ముందుకు తేవడం! ఎమర్జెన్సీలో చాలా అట్రాసిటీలు, అరాచకాలు జరిగిన మాట నిజమే కానీ అది మొత్తం రాజ్యాంగాన్ని మార్చేటటువంటి ప్రమాద ఘట్టం కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాకు తెలిసి ఎంతో మంది యువకులు ఎమర్జెన్సీలో ఎదురు కాల్పుల పేరిట చంపబడ్డారు. ఐతే రాజ్యాంగానికి వచ్చేవరకు ఆ కాలంలో చేసిన రెండు సవరణలు: ప్రియాంబుల్‌లో 'సోషలిజం' అనే పదం చేర్చడం; రెండవది ఫండమెంటల్ రైట్స్‌కు కొంత అఘాతం కలిగించే ఫండమెంటల్ డ్యూటీస్‌ని రాజ్యాంగంలో చేర్చడం. ఆరెస్సెస్, బీజేపీ సోషలిజం అనే పదాన్ని రాజ్యాంగంలో చేర్చడాన్ని వ్యతిరేకించాయి. కానీ ఫండమెంటల్ డ్యూటీస్‌ని రాజ్యాంగంలో చేర్చడాన్ని బలపర్చాయి.

బంగ్లాదేశ్‌ను పాకిస్తాన్ నుంచి విడగొట్టి, పాకిస్తాన్‌ను యుద్ధంలో ఓడించినందుకు ఇందిరాగాంధీని దుర్గాదేవిగా వర్ణించిన వారిలో ఆరెస్సెస్, బీజేపీ వారు ఉన్నారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో గరీబీ హటావో, బ్యాంకుల జాతీయాకరణ, రాజ భరణాల రద్దు వంటి ఆమె నిర్ణయాలను వ్యతిరేకించారు. ఈ మూడు సిద్ధాంతకర మార్పులు సోషలిస్టు సిద్ధాంత ప్రభావంతో ఇందిరాగాంధీ చేస్తున్నారని వాజ్‌పేయి, ఎల్‌కె అద్వానీ వంటి నాయకులు చాలా తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే గరీబీ హటావో, బ్యాంకుల జాతీయాకరణ, రాజ భరణాల రద్దు... శ్రమ జీవులకు, ఉత్పత్తి కులాలకు మేలు చేశాయి.

ఈ క్రమంలో ఆమె భూ సంస్కరణల చట్టం చెయ్యడానికి శ్రీకారం చుట్టారు. 1972లో దేశ చరిత్రలో మొట్టమొదటిసారి ఒక బలమైన భూ సంస్కరణల చట్టం వచ్చింది. ఐదుగురు సభ్యులున్న కుటుంబానికి 27 ఎకరాల తరి, 57 ఎకరాల ఖుష్కి భూమి కంటే ఎక్కువ ఉండటానికి వీలు లేదని చట్టం తెచ్చింది ఆమెనే. ఆ చట్టాన్ని ఎమర్జెన్సీలో భూస్వాములపై ఒత్తిడి తెచ్చి కొంత అమలు చేశారు. నేను 1980లో ఈ చట్టం అమలుపై ఎంఫిల్ థీసిస్ కోసం చాలా గ్రామాల్లో ల్యాండ్ రిఫామ్ ఎలా జరిగిందో పరిశీలించాను. భూస్వాములు భూములను బినామీ పేర్లమీద మార్చి చాలావరకు కాపాడుకున్నప్పటికీ ఎమర్జెన్సీలో కొంత భూమి పంచబడింది. ఆ కాలంలో తన పదవి కాపాడుకోవడం కోసం ప్రతిపక్ష నాయకులను ఇందిర అరెస్టు చేశారు. మీడియా మీద ఆంక్షలు విధించారు. నిజమే. అందుకే ఎమర్జెన్సీ ఎత్తివేయగానే దేశంలో ఒక పౌరహక్కుల ఉద్యమం ముందుకొచ్చింది. అన్ని రాజకీయ పార్టీలు దేశంలో పౌరహక్కులను కాపాడవలసిన అవసరముందని మాట్లాడాయి. ఆ ఒక్క దశలోనే బీజేపీ నాయకులు కూడా పౌరహక్కుల ఉద్యమాన్ని బలపర్చారు. తర్వాత వాళ్లు పౌరహక్కుల రక్షణ జోలికి పోలేదు.

కనుక ఎమర్జెన్సీ అనేది రెండువైపుల పదునున్న కత్తిలా పని చేసింది. కానీ ఆరెస్సెస్, బీజేపీ ఈ రాజ్యాంగాన్ని మార్చి కొత్త రాజ్యాంగాన్ని నిర్మించాలనుకున్న ఆలోచనలో శూద్రుల, దళితుల, ఆదివాసుల పక్షపాత ఆలోచనలు ఉండే అవకాశం ఏమాత్రం లేదు. వాళ్లు అనుకున్నట్టు నిజంగానే 400 సీట్లు వచ్చి ఉంటే వాళ్లు కొత్త కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీని స్థాపిస్తే దాంట్లో ఎటువంటి మేధావి వర్గం ఉండేవారు? ఆ రాజ్యాంగ పరిషత్ కుల అసమానతలను, అంటరానితనాన్ని, బీదరికాన్ని తొలగించే గట్టి ప్రతిపాదనలు చేసే అవకాశం ఉండేదా! నిజానికి బ్యాంకుల జాతీయాకరణ, రాజభరణాల రద్దుపై చర్చ జరుగుతున్నప్పుడు ఆరెస్సెస్, బీజేపీ నాయకుల వాదనలు; రాజరిక వ్యవస్థ పట్ల జమీందారీ హక్కుల పట్ల వాళ్లు ఎంత అనుకూలంగా ఉన్నారో తిరిగి చూస్తే అర్థమవుతుంది. ఇప్పుడు రాజ్యాంగంలోని ప్రియాంబుల్‌లో ఉన్న 'సోషలిజం' అనే పదాన్ని వాళ్లు తొలగించాలనుకునేది భారతీయ కష్ట జీవుల పక్షాన ఉండటానికా? పెట్టుబడిదారుల పక్షాన ఉండటానికా?

2024 ఎన్నికలు దేశ ప్రజాస్వామ్యాన్ని ఒక పెద్ద ప్రమాదం నుంచి కాపాడాయి. ఐతే ఈ రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం అప్పుడే పూర్తిగా తొలగిపోలేదు. చంద్రబాబు, నితీష్‌కుమార్ వంటి సిద్ధాంత రహిత ప్రాంతీయ నాయకులు కూడా ఈ భవిష్యత్ ప్రమాదం నుండి దేశాన్ని కాపాడలేరు. దేశం మొత్తంగా ఇప్పుడున్న రాజ్యాంగాన్ని రక్షించుకునే చైతన్యం పెరగాలి. ఓటు రాజ్యాంగ రక్షణ ఆయుధాలలో కీలకమైంది. ఐతే దాన్ని ప్రజలు, ముఖ్యంగా యువకులు నిరంతరం ఇప్పుడున్న రాజ్యాంగంతో ముడేసి చూడాలి. ఈ ఎన్నికల్లో రాజ్యాంగం పట్ల కలిగిన కొత్త చైతన్యాన్ని తగ్గించేందుకు ఆరెస్సెస్, బీజేపీలు ఎమర్జెన్సీ అంశాన్ని ముందు పెట్టి చర్చను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాయి.

జూన్ 25న వి.పి. సింగ్ జయంతి సభ ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో జరిగింది. మాట్లాడటానికి నేను ముఖ్య అతిథిగా వెళ్ళాను. అందులోనే చాలా పెద్ద హాలులో రైట్‌వింగ్ ఆలోచనాపరులు ఎమర్జెన్సీలో జె.పి. మూమెంట్‌పై మీటింగ్ పెట్టారు. ఎందుకో తెలుసా? రాజ్యాంగ మార్పు కంటే ఎమర్జెన్సీ ప్రమాదకరమని చెప్పడానికి!

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

జంక్‌కు చెక్



చక్కెర, ఉప్పు, కొవ్వు ఎంతున్నాయో పెద్ద, బోల్డ్ అక్షరాల్లో కంపెనీలు రాసేలా ఒత్తిడి తెచ్చే చక్కటి నియమాన్ని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఆమోదించింది. ఈ మార్పు వల్ల భారతీయ వినియోగదారులకు జంక్ ఫుడ్ ఏదో తెలిసిపోయి మార్కెటింగ్ గిమ్మిక్కులకు మోసపోకుండా ఉంటారు.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

సున్నితమైన వ్యవహారం



బద్రీనాథ్ హైవేలో విధ్వంసకరంగా కొండచరియలు జారిపడ్డాయి. హిమాలయాలు సున్నితమైన పర్యావరణ ప్రాంతం. మన ధార్మిక ప్రదేశాలను కాపాడుకోవాలంటే– జనావాసాలు, తవ్వకాలు, పర్యవేక్షణ లేని 'అభివృద్ధి'... అన్నింటి పట్లా చిత్తశుద్ధితో వ్యవహరించాలి.

– అద్వైత కళ, స్క్రీన్ రైటర్

దయోపదేశం



భూటానీస్ చాంద్రమాన క్యాలెండర్‌లో ఇవ్వాళ (జూలై 10) ఆరో నెల నాలుగో రోజును గౌతమ బుద్ధుడి జ్ఞానోదయం అనంతరం తొలి ఉపదేశం ఇచ్చిన రోజుగా పాటిస్తాం. తన పట్ల, సాటి జీవులన్నింటి పట్లా ప్రేమ, దయ, కరుణ పాటించాలని ఈ రోజు మనకు గుర్తుచేయునుగాక!

– షెరింగ్ తోబ్గే, భూటాన్ ప్రధాని

ప్రకృతి వైద్యం



మామిడిపళ్ల సీజన్, లిచీ పళ్ల సీజన్, తర్వాత నేరేడుపళ్ల సీజన్... ఒంట్లో చక్కెర పెరగకుండా ఎలా ఆపాలో ప్రకృతికి బాగా తెలుసు.

– ఐశ్వర్యా ముద్గిల్, న్యాయవాది

సాక్షాత్తూ గురువు



ప్రాగ్‌లోని కాఫ్కా మ్యూజియం కెఫేలో మేము ఇద్దరు బ్రెజిలియన్ మహిళల్ని కలిశాం. అందులో ఒకామె బ్రెజిల్ స్కూల్లో సోషియాలజీ బోధిస్తున్నారు. అమెరికా, ఇండియా గురించి మాట్లాడుకున్నాం. 'అమర్త్య సేన్ అని పేరున్న ఒక ఆర్థికవేత్త గురించి మీకు తెలుసా?' అని అడిగారు. నాకు తెలియడమే కాదు, ఆయన నా పీహెచ్‌డీ అడ్వైజర్ అని చెప్పగానే ఆమె ఎంత సంబరపడ్డారో!

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఇన్ బాక్స్

జనాభా లెక్కలు కీలకం

ప్రపంచ జనాభా నానాటికీ పెరిగిపోతోంది. ఈ సందర్భంగా జన గణన ఆవశ్యకత, ఒక దేశ అభివృద్ధిలో మానవ వనరుల లభ్యత ప్రయోజనాలు, కుల గణన వంటి అంశాల ప్రాముఖ్యాన్ని తెలుసుకోవడం అవసరం. ఒక దేశ జనాభాను గణించడం వల్ల జనాభా ఆర్థిక కార్యకలాపాలు, అక్షరాస్యత, విద్య, గృహ సౌకర్యాలు, పట్టణీకరణ, సంతాన ఉత్పత్తి, మరణాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, భాష, మతం, వలసలు, వైకల్యాల గురించిన అత్యంత విశ్వసనీయమైన సమాచారం అందుబాటులోకి వస్తుంది. తద్వారా దేశ పరిస్థితిని అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. అయితే 16వ జనాభా లెక్కలను భారత ప్రభుత్వం వాయిదా వేస్తూ రావడం వల్ల కొన్ని రంగాలు కొంత నిర్లక్ష్యానికి గురి అయ్యే ప్రమాదం ఏర్పడింది.

ఈ మధ్యకాలంలో దేశంలో కులగణన జరగాలనే డిమాండ్ ఊపందుకుంది. ఇప్పటికే బిహార్ రాష్ట్రంలో కులాల లెక్కలను తేల్చి తదనుగుణంగా విధాన నిర్ణయాలు తీసుకుంటున్నారు. మన తెలుగు రాష్ట్రాలలో కూడా కుల గణన చేయడానికి ప్రభుత్వాలు ఒప్పుకోవడం విశేషం. దేశంలో ఉన్నటువంటి వివిధ కులాల స్థితిగతులను తెలుసుకొని దేశ సంపదలోనూ, విద్య, ఉద్యోగ అవకాశాల్లోనూ వారి వారి జనాభా నిష్పత్తులను బట్టి వాటాలను నిర్ణయించడానికి కులాలవారీ జనాభా లెక్కల సమాచారం ఉపయోగపడుతుంది. జనాభా పెరుగుదలను దేశ అభివృద్ధికి చేటు కలిగించే అంశంగానే చూడాల్సిన అవసరం లేదు. పెరిగే జనాభాను బట్టి యువశక్తి దేశ ఉత్పాదక రంగానికి తగినంతగా అందుబాటులోకి వస్తుంది. జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలలో యువకుల సంఖ్య తగ్గి వృద్ధుల సంఖ్య పెరిగి పోవడం వల్ల ఇబ్బందులు ఎదురవ్వడం చూడవచ్చు. దీనికి కారణం అక్కడ జనాభా పెరుగుదల రేటు పడిపోవడమే. ప్రపంచంలో ఉన్న యువ జనాభాలో భారతదేశం ఐదో వంతును కలిగి ఉంది. ఈ జనాభా వల్ల భారతదేశం ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మారాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని సాధించడం సుసాధ్యమవుతుందని ఆర్థిక వేత్తలు అంటున్నారు. అయితే పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అనేది గుర్తించాలి.

డా॥ ఎ. శంకర్, హైదరాబాద్
(నేడు ప్రపంచ జనాభా దినోత్సవం)

సంకెళ్ల సంస్కృతి మళ్లీ మొదలా?

విశ్లేషణ



డా॥ మంగారి రాజేందర్

మన దేశంలో నిందితులకు బేడీలు వేయడం అతి మామూలు విషయం. ఈ విధంగా బేడీలు వేయడం చట్టబద్ధమేనా అని చాలామంది అనుకుంటూ ఉంటారు. బేడీలు వేయడానికి చట్టబద్ధత లేదా? నిందితులు తప్పించుకుంటే ఎలా అన్న ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 49 ప్రకారం అరెస్ట్ అయిన వ్యక్తి తప్పించుకోకుండా కావలసిన నిర్బంధాన్ని పోలీసులు ఉపయోగించవచ్చు. అంతేకాని నిందితులకి సాధారణంగా బేడీలు వేయకూడదు. ఈ విషయాన్ని చాలా కేసులలో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

అరెస్ట్ చేసినప్పుడు సంకెళ్ళు వేయాలని చట్టంలో ఎక్కడా చెప్పలేదు. అరెస్ట్ అంటే ఒక వ్యక్తి స్వేచ్ఛను నిలుపుదల చేయడం. అది కోర్టు ఉత్తర్వుల వల్ల కావచ్చు లేక అతని మీద ఆరోపించబడిన నేరానికి జవాబు చెప్పటం కోసం కావచ్చు. అరెస్ట్ ఉద్దేశ్యం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి అతనిపై ఉన్న క్రిమినల్ ఆరోపణలకు అతను కోర్టులో జవాబు చెప్పటానికి, రెండవది అతను ఏదైనా నేరం చేయకుండా నిరోధించటానికి. అరెస్ట్ చేసే క్రమంలో అవసరమైన బలప్రయోగాన్ని పోలీసులు ఉపయోగించవచ్చు. అయితే ఆ వ్యక్తి అరెస్టుని నిరోధించినప్పుడు మాత్రమే బలప్రయోగం చేయాల్సి ఉంటుంది. జీవిత ఖైదు కానీ మరణ శిక్ష కానీ విధించే నేరం చేసిన వ్యక్తులను అవసరమైతే చంపటానికి కూడా అవకాశం ఉంది. అంతే కానీ సంకెళ్ళు వేయాలని చట్టంలో ఎక్కడా చెప్పలేదు.



సంకెళ్ళు వేయడాన్ని చట్టం ఆమోదించదు. సంకెళ్ళు వేయడం లాంటి చర్యలు అమానుషమనీ, ముద్దాయి గౌరవానికి భంగం కలిగించడమనీ చాలా కేసుల్లో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 లకు సంకెళ్ళు వేయడం అనేది విరుద్ధం. సంకెళ్ళు, బంధనాలు శిక్షపడిన ఖైదీలకు కానీ విచారణలో ఉన్న ఖైదీలకు కానీ వేయడానికి వీలులేదు.

కోర్టు ముందు హాజరు పరిచిన ముద్దాయిలకు సంకెళ్ళు వేయాలంటే మెజిస్ట్రేట్ అనుమతి అవసరం. ఆ వ్యక్తి పారిపోడానికి ప్రయత్నం చేస్తాడని ఆధారాలు ఉన్నప్పుడు, పోలీసుల కస్టడీ నుంచి పారిపోతాడని కచ్చితంగా భావించినప్పుడు, అరుదైన కేసుల్లో, హింసాత్మకమైన ప్రవృత్తి ఉన్నప్పుడు, వాళ్ళు అపాయకరమైన వ్యక్తులు అయినప్పుడు మేజిస్ట్రేట్ ఈ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అలా నిర్ణయానికి రావడానికి మేజిస్ట్రేట్ కారణాలు కూడా రాయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు చాలా కేసుల్లో స్పష్టం చేసింది. అందులో ప్రముఖమైన కేసు ప్రేమ్ శంకర్ శుక్లా వర్సెస్ ఢిల్లీ అడ్మినిస్ట్రేషన్ (ఏఐఆర్ 1980 సుప్రీం కోర్టు 1535). ఒకవేళ పోలీసులు సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను ఉల్లంఘించి సంకెళ్ళు వేసినట్టైతే వారు కోర్టు ధిక్కార నేరం కింద శిక్షింపబడతారని సుప్రీంకోర్టు సిటిజెన్స్ డెమొక్రసీ వర్సెస్ స్టేట్ ఆఫ్ అస్సాం 1996 సుప్రీంకోర్టు కేసెస్ (క్రిమినల్) 612 లో స్పష్టం చేసింది. సంకెళ్ళు వేయకుండా ముద్దాయి తప్పించుకోకుండా ఉండడానికి సుప్రీంకోర్టు ప్రేమ్ శంకర్ శుక్లా కేసులో కొన్ని ప్రత్యామ్నాయాలను సూచించింది. అవి ఎస్కార్ట్‌లో ఉన్న పోలీసుల సంఖ్య పెంచాలి. వాళ్ళకి ఆయుధాలు ఇవ్వాలి. వారికి సరైన శిక్షణ కూడా ఇవ్వాలి.

అయితే కొత్తగా వచ్చిన 'భారతీయ నాగరిక సురక్ష సంహిత' సంకెళ్ళు వేయడం విషయంలో అనుమతి ఇచ్చింది. ఈ కొత్త చట్టం లోని సెక్షన్ 43లో అరెస్ట్ ఎలా చేయాలో చెప్పారు. అదే విధంగా సబ్ సెక్షన్ 3లో అరెస్ట్ చేసినప్పుడు సంకెళ్ళు వేయడం గురించి కూడా చెప్పారు. నేర స్వభావాన్ని నేర తీవ్రతను బట్టి అరెస్ట్ చేసిన వ్యక్తులకు సంకెళ్ళు వేయవచ్చు. అలవాటుపడిన నేరస్థులకు, మళ్ళీ మళ్ళీ నేరం చేసిన వ్యక్తులకు, కస్టడీ నుంచి తప్పించుకున్న వ్యక్తులకు, వ్యవస్థీకృత నేరం చేసిన వ్యక్తులకు, తీవ్రవాద చర్యలు పాల్పడిన వ్యక్తులకు, మాదక ద్రవ్యాల నేరాలు చేసిన వ్యక్తులకు, ఆయుధాలు, మందుగుండు సామాను అక్రమంగా కలిగిన వ్యక్తులకు; హత్య, రేప్, యాసిడ్ దాడి, నకిలీ నాణాలు, నోట్లు కలిగి ఉన్న వ్యక్తులకు, మనుషుల అక్రమ రవాణా చేసే వ్యక్తులకు, పిల్లలపై సెక్స్ నేరాలు చేసిన వ్యక్తులకు, రాజ్యంగ వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తులకు పోలీసులు సంకెళ్ళు వేయవచ్చని ఈ నిబంధన చెప్తుంది. రాజ్యానికి వ్యతిరేకంగా చేసిన నేరాలు ఏమిటి అనే విషయంలో స్పష్టత లేదు. అందుకని అందరికీ సంకెళ్ళు వేసే అవకాశం ఉంది.

మళ్ళీ నేరం చేసిన వ్యక్తులకు సంకెళ్ళు వేయవచ్చు. దీన్ని చట్టంలో నిర్వచించలేదు. అందుకని ఇది కూడా దుర్వినియోగం అయ్యే అవకాశం ఉంది. ఉదాహరణకు భార్యా భర్తల మధ్య తగువు ఏర్పడి కట్నం కోసం వేధిస్తున్నారన్న దరఖాస్తుతో బాటు మరెన్నో కేసులను పెట్టిన సందర్భాలను మనం చూస్తున్నాం. ఆ కేసులు నిజమైనవా అబద్ధమైనవా అన్న విషయం అప్పుడు తెలియదు. ఈ కేసులు భర్త మీదే కాకుండా కుటుంబ సభ్యులందరి మీదా పెడుతున్నారు. అలాంటప్పుడు వారందరికీ సంకెళ్ళు వేసే పరిస్థితి చట్టం కల్పిస్తుంది. అప్పుడు వాళ్ళు ఎంతటి అసౌకర్యానికి గురవుతారో, ఎంతటి అవమానానికి గురవుతారో ఊహించవచ్చు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇట్లా ఎన్నో కేసులను ఉదాహరించవచ్చు.

చట్టం అనుమతి ఇవ్వనప్పుడే సంకెళ్ల సంస్కృతి మన దేశంలో ఉంది. సంకెళ్ళు వేయడమే కాదు నేరారోపణలకు గురి అయిన వ్యక్తులను ఊరేగించడం మనం చూస్తున్నాం. ప్రజలు ఆవిధంగా కోరుకుంటున్నారు కాబట్టి మేము ఊరేగిస్తున్నామని పోలీసులు అంటారు. చట్టం అనుమతి ఇవ్వనప్పుడు ఆ విధంగా ఊరేగించటం ఎంతవరకు సమంజసం? ఇప్పుడు కొన్ని సందర్భాలలో సంకెళ్ళు వేయడాన్ని చట్టం అనుమతి ఇస్తుంది. ఇలాంటప్పుడు సంకెళ్ళు వేసి దుర్వినియోగం చేసే పరిస్థితి ఎక్కువ అవుతుంది. సంకెళ్ళు వేయడం రాజ్యాంగ విరుద్ధం, మానవ హక్కుల ఉల్లంఘన అని సుప్రీం కోర్టు చాలా కేసుల్లో చెప్పింది. ఆ తీర్పులన్నింటినీ ప్రక్కన పెట్టి కొత్త చట్టంలో సంకెళ్ళు వేసే వెసులుబాటును పార్లమెంటు కల్పించింది. ఈ వెసులుబాటు మరెంత దుర్వినియోగం అవుతుందో వేచి చూడాలి.


వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడెమీ డైరెక్టర్ । 9440483001

చిత్తశుద్ధే ముఖ్యం

ఆత్మే జీవాత్మ. ఇదే శాశ్వతమైనది, మిగిలినవన్నీ అశాశ్వతములే. అశాశ్వతమైన ఏ ఒక్కదానిలో కూడా నిజమైన ఆనందం (సచ్చిదానందం) ఉండదు. ఐనప్పటికీ, మానవుడు అశాశ్వతమైన వస్తువుల నుండి ఆనందాన్ని అన్వేషిస్తూ ఉంటాడు. ఆవిధంగా చేయడం వల్ల మనిషి అజ్ఞానంతో జీవిస్తూ, తనను తానే మోసగించుకొంటున్నాడు.

నీ అంతరాత్మకు నీవు లోబడి ఉన్నప్పుడే నిజమైన ఆనందాన్ని అనుభవించగలవు. కానీ ఈ విషయం మనం అనుకొన్నంత సులభం కాదు. సచ్చిదానంద స్థితికి చేరాలంటే, మానవుడు తీవ్ర ప్రయత్నం చేయాలి. ఎంతవరకు చిత్తం (మనస్సు) కల్మషంతో నిండి ఉంటుందో, అంతవరకు మానవుడు ఆత్మను అనుసరించలేడు. కాబట్టి అన్వేషకుడు (భక్తుడు) ముందుగా చిత్తశుద్ధిని పొందాలి.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

నీవు సద్గురువు సంపర్కంలోకి రాగానే ఆత్మవికాసానికై భిన్నమైన పద్ధతులు అనగా 'సేవ', 'హోమము', 'తీర్థయాత్ర', 'ధ్యానము', 'అర్చన', 'నామసంకీర్తన' వంటి వానిని ఆచరించమని ఉపదేశం లభిస్తుంది. నీవు ఎల్లప్పుడు అంకితభావంతో చిత్తశుద్ధితో సాధన చేస్తే నీపై గురువు దయావృష్టి కురుస్తుంది. ముున్ముందుగా కావలసింది ఇదే. నీ గూర్చి నీవే నడవాలి కాని నీ గూర్చి గురువు నడువడు. కానీ అతను నీకు సరియైన మార్గాన్ని చూపిస్తాడు.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం: ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** శు.పంచమి ఉ.8.21 వరకు, తదుపరి షష్ఠి; **నక్షత్రం:** పుబ్బ ప.12.19 వరకు, తదుపరి ఉత్తర; **వర్జ్యం:** రా.8.18 నుండి 10.04 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.47 వరకు; తదుపరి ప.3.07 నుండి 3.59 వరకు; **అమృత ఘడియలు:** లేవు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు; యమగండం ఉ.6.00 నుండి 7.30 వరకు; **సూర్యోదయం:** 5.36; **సూర్యాస్తమయం:** 6.35; స్కందపంచమి.

క్లుప్తంగా...

దుర్గమ్మ సేవలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి



జస్టిస్ చంద్రఘోష్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో రమేష్‌బాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, కాళేశ్వరం ప్రాజెక్టు ఎంక్వైయిరీ కమిటీ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వీరికి ఆలయ ఈవో కె.ఎస్.రామారావు సాదరంగా స్వాగతం పలికారు. పంచ హారతుల సేవలో పాల్గొన్న అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ ఏఈవో ఎన్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

నేడు ట్రిపుల్‌ఐటీ అభ్యర్థుల జాబితా విడుదల

నూజివీడు:రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలకు 2024–25 అడ్మిషన్లలో భాగంగా ఈనెల 11న ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీలోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో ఉదయం 11 గంటలకు చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి జాబితాను విడుదల చేయనున్నట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సంధ్ర అమరేంద్ర కుమార్ తెలిపారు. ట్రిపుల్‌ఐటీల్లోని సీట్ల కోసం మొత్తం 53,863 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు పరిశీలించారు. ప్రత్యేక కేటగిరీ సీట్లను మినహాయించి జనరల్ సీట్లకు సంబంధించి జాబితాను విడుదల చేయనున్నారు.

జీతాలు వెంటనే ఇవ్వండి

ఉద్యోగ భద్రత, జీతాల కోసం శాప్ అవుట్‌సోర్సింగ్ కోచ్‌ల ధర్నా



శాప్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అవుట్‌సోర్సింగ్ కోచ్‌లు

విజయవాడస్పోర్ట్స్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) అవుట్ సోర్సింగ్ కోచ్‌లు డిమాండ్ చేశారు. విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద ఏపీ శాప్ అవుట్ సోర్సింగ్ కోచ్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం వారంతా ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన 60 మంది కోచ్‌లు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ ఏడాది మార్చి నుంచి తమకు జీతాలు చెల్లించకపోవడంతో తాము అప్పులపాలై.. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

కోలుకున్న శిరీష

చైన్ స్నాచింగ్ చేస్తూ రైలు నుంచి శిరీషను కిందకు తోసేసిన నిందితుడు

జలుమూరు: విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తూ చైన్ స్నాచింగ్‌కు గురైన శ్రీకాకుళం జిల్లా పెద్ద దూగాం గ్రామానికి చెందిన కొంగరాపు శిరీష కోలుకుంటోంది. బాధితురాలి భర్త గోవిందరావు, బంధువులు తెలిపిన వివరాలు.. గోవిందరావు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతని భార్య శిరీష మంగళవారం రాత్రి విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ నుంచి స్వస్థలానికి బయలుదేరింది. అదే రైలులో ప్రయాణిస్తున్న ఒడిశాకు చెందిన బిశ్వాల్ అనే యువకుడు మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో శిరీష మెడలో బంగారు గొలుసు తెంచేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో అతను నెట్టేయడంతో శిరీష రైలు నుంచి కింద పడిపోయింది. ఈ క్రమంలో బిశ్వాల్ కూడా జారి కిందపడ్డాడు. బాధితురాలు అతికష్టమ్మీద సమీపంలోని గిరిజన తండాకు చేరుకొని స్థానికుల సాయంతో ఆస్పత్రిలో చేరింది. సమాచారం తెలుసుకున్న భర్త గోవిందరావు శిరీషను మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం శిరీష కోలుకుని బుధవారం డిశ్చార్జ్ అయ్యిందని ఆమె భర్త గోవిందరావు తెలిపాడు.

వైద్యశాఖలో నియామకాలకు బ్రేక్!



నియామకాలన్నీ నిలిపివేయాలని అధికారులకు మౌకిక ఆదేశాలు

సాక్షి, అమరావతి: అధికారంలోకి వస్తే యువతకు 20 లక్షల ఉద్యోగాలిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన టీడీపీ కూటమి.. అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలో తొక్కుతోంది. కొత్త ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేయకపోగా గత ప్రభుత్వం చేపట్టిన నియామకాల ప్రక్రియను నిలిపివేస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో మానవ వనరుల కొరత లేకుండా జీరో వేకెన్సీ (ఎప్పటి ఖాళీలను అప్పుడే భర్తీ) పాలసీని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఖాళీ పోస్టులను భర్తీ చేస్తూనే, రోగుల అవసరాలకు అనుగుణంగా కొత్త పోస్టులు మంజూరు చేస్తూ వచ్చింది. ఐదేళ్లలో ఒక్క వైద్య శాఖలోనే ఏకంగా 54 వేల పోస్టుల భర్తీని చేపట్టింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య శాఖలో జీరో వేకెన్సీ పాలసీకి తిలోదకాలు ఇవ్వనుందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే వైద్య శాఖలో ప్రస్తుతం జరుగుతున్న నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని ప్రభుత్వం మౌకిక ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొత్త వైద్య కళాశాలల్లో అవసరాల కోసం వివిధ రకాల 380 పోస్టులను డీఎంఈ పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేయగా.. ఈ పోస్టుల భర్తీకి ఈ ప్రభుత్వం ఆమోదం తెలపలేదు.

నిరుద్యోగుల ఆశలపై నీళ్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు, ఇతర ఆస్పత్రుల్లో ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ వంటి పారామెడికల్‌తో పాటు ఇతర పోస్టుల భర్తీకి జిల్లా స్థాయిల్లో నోటిఫికేషన్‌లు జారీ చేశారు. ఉమ్మడి 13 జిల్లాల్లో ఒక్కో జిల్లాకు 200 నుంచి 250 పోస్టుల చొప్పున మూడు వేలకుపైగా పోస్టుల భర్తీ చేపట్టాల్సి ఉంది. దరఖాస్తులను సైతం స్వీకరించి, వాటి పరిశీలన, మెరిట్ జాబితాలను సిద్ధం చేశారు. అభ్యర్థులను ఎంపిక చేసి, పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చేలోగా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో తాత్కాలికంగా నియామక ప్రక్రియ పూర్తయింది. ఒక్క విజయనగరం జిల్లాలో మాత్రమే కోడ్ కంటే ముందే పోస్టుల భర్తీ పూర్తి చేశారు. మిగిలిన జిల్లాల్లో మెరిట్ లిస్ట్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసి, పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉండగా, ఆ నియామకాలను కూటమి ప్రభుత్వం నిలిపివేసి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతోంది.

వైద్య సేవలపై ప్రభావం

స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీ నిలిచిపోయి ఆస్పత్రుల్లో సరిపడా నర్సులు లేక వైద్య సేవలు అస్తవ్యస్తంగా మారాయి. బోధనాస్పత్రిగా అభివృద్ధి చేసిన మదనపల్లె ఆస్పత్రిలో కేవలం 30, పాడేరు ఆస్పత్రిలో 39 మంది నర్సులు మాత్రమే ప్రస్తుతం విధుల్లో ఉన్నారు. పాడేరులో ఉన్న వారిలో ముగ్గురు ప్రసూతి సెలవులో ఉన్నారు. 200 మంది నర్సులు ఉండాల్సిన ఈ ఆస్పత్రుల్లో ఐదో వంతు కూడా లేకపోవడంతో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందడంలేదు. పారామెడికల్, ఇతర పోస్టుల భర్తీ నిలిచిపోవడంతో ఆయా ఆస్పత్రుల్లో సేవల కల్పనపై ప్రభావం పడనుంది.

టీడీపీ నేత అభ్యంతరమే కారణం!

ఉన్నట్టుండి కౌన్సెలింగ్ రద్దు చేయడానికి వైఎస్సార్ జిల్లా తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అభ్యంతరం చెప్పడమే కారణమని సమాచారం. గత ప్రభుత్వం నిర్వహించిన నియామక ప్రక్రియలో ఎంపికయ్యారనే అక్కసుతోనే ఈ ప్రజాప్రతినిధి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. కౌన్సెలింగ్ వాయిదా వేసి నెల గడిచినా పోస్టింగ్ ఉత్తర్వులపై ఎటువంటి సమాచారం లేకపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు.

కూటమి కక్ష సాధింపు

మరోవైపు ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభించాల్సిన పాడేరు, మార్కాపురం, మదనపల్లె, ఆదోని, పులివెందుల వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న బోధనాస్పత్రులకు స్టాఫ్ నర్స్ పోస్టులను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో కళాశాలలో 200 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. అయితే గతేడాది సెప్టెంబర్‌లో విడుదల చేసిన స్టాఫ్ నర్స్ నోటిఫికేషన్‌లోని మెరిట్ లిస్ట్ ఆధారంగా తొలుత పాడేరుకు 60, మార్కాపురానికి 47, ఆదోని, పులివెందుల, మదనపల్లె కళాశాలలకు కలిపి 206 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. దీనికోసం 313 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు గత నెలలో కడప, విశాఖపట్నం, గుంటూరు రీజినల్ డైరెక్టర్ (ఆర్డీ) కార్యాలయాల్లో సెలక్షన్ లిస్ట్ విడుదల చేశారు. గత నెల 6వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇస్తామని ప్రకటించింది. ఎంపికైన అభ్యర్థులందరు ఆరోజు ఆర్డీ కార్యాలయాల్లో సర్టిఫికేషన్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని ఆదేశించింది. అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరవ్వాల్సిన ముందు రోజే అర్ధంతరంగా కౌన్సెలింగ్‌ను రద్దు చేసినట్టు వైద్య శాఖ ప్రకటించింది. ఎంపిక జాబితాలు కూడా విడుదల చేసినా పోస్టింగ్‌లు ఇవ్వకుండా గత ప్రభుత్వంలో వీరు ఎంపికయ్యారనే రాజకీయ కక్షతో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఒకవేళ నియామక ప్రక్రియను నిలిపివేస్తే అభ్యర్థులు కోర్టుకు వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది.

తక్షణం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర స్థాయి చర్చావేదికలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తీర్మానం



మాట్లాడుతున్న సంఘం నేత వెంకటేశ్వర్లు

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డును తక్షణం ఏర్పాటు చేయాలని రాష్ట్ర స్థాయి చర్చా వేదిక డిమాండ్ చేసింది. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య (ఎంబీ) విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు అధ్యక్షతన 'సంక్షేమ బోర్డు ఏర్పాటు' అంశంపై చర్చా కార్యక్రమం బుధవారం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు దీనికి సంబంధించిన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కేరళలో 48 ఏళ్లుగా సంక్షేమ బోర్డు అమలు జరుపుతూ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. అదే తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన టీడీపీని ఎన్నికల్లో వ్యవసాయ కార్మికులు ఆదరించి గెలిపించారన్నారు. ఇచ్చిన హామీని చంద్రబాబు తక్షణం అమలు చేయాలని, కేరళ తరహాలో చట్టం తెచ్చి ఆ చట్ట పరిధిలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చర్చలో కేరళ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి, పీఎస్ అజయ్‌కుమార్, బీకేఎంయు రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు తెరుచుకున్నాయ్

కోడూరు (అవనిగడ్డ): కృష్ణా జిల్లా కోడూరులో మద్యం బెల్టు షాపులు తెరుచుకున్నాయ్. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం సీసాలను పక్కదారి పట్టించి బెల్టు షాపుల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. కోడూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపం ఎదురుగా, కేడీసీసీ బ్యాంక్ పక్కన రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల నుంచి మండలంలోని 13 పంచాయతీల్లో ఉన్న అన్ని బెల్టు షాపులకు పుష్కలంగా మద్యం సరఫరా అవుతోంది. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసేందుకు దళారులను కూడా ఏర్పాటు చేసుకున్నారు. మండలంలో సుమారు 25 బెల్టు షాపులు ఉండగా.. వీటికి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి దళారులు బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం సీసాలను సరఫరా చేస్తున్నారు.

భారీగా దండుకుంటున్నారు

ప్రభుత్వ మద్యం దుకాణంలో పని చేసే ఉద్యోగులు క్వార్టర్ బాటిల్‌పై రూ.5 అదనంగా వసూలు చేస్తూ దళారులకు మద్యం అప్పగిస్తున్నారు. అక్కడి నుంచి బెల్టు షాపులకు సరఫరా చేసే దళారులు బాటిల్‌కు రూ.25 చొప్పున బెల్టు షాపుల నిర్వాహకుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారు. తద్వారా ఉద్యోగులు, దళారులు రోజుకు రూ.30 వేల వరకు ఆర్జిస్తున్నట్టు తెలుస్తోంది. బెల్టు షాపుల్లో మద్యం సీసాపై రూ.80 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది.



కోడూరు మద్యం దుకాణం నుంచి గోనె సంచుల్లో తరలిస్తున్న మద్యం

రక్తమోడుతున్న గాయాలతో న్యాయమూర్తి ఎదుటకు!

- పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితుడి ఆవేదన
- వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలని న్యాయమూర్తి ఆదేశం



కోర్టు కానిస్టేబుల్ అదుపులో ప్రభుతేజ

కాకినాడ లీగల్: తనపై నలుగురు వ్యక్తులు చాకుతో దాడి చేశారని, పోలీసులు వద్ద న్యాయం జరగడం లేదని, రేచర్లపేటకు చెందిన ఓ వ్యక్తి రక్తమోడుతున్న గాయాలతో కాకినాడ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.ప్రసన్నలక్ష్మి ఎదుటకు వచ్చాడు. దీంతో వెంటనే అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లాలని ఆమె పోలీసులను ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే.. రేచర్లపేటలో ఒక స్థల విషయంలో కుంచే ప్రభుతేజకి అదే ప్రాంతానికి చెందిన వారికి మధ్య కొంతకాలంగా గొడవ జరుగుతోంది. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. కుంచే ప్రభుతేజ ఒక స్థలం విషయంలో మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించి, దాడి చేసిన కేసులో 2021లో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణలో భాగంగా బుధవారం కాకినాడ రెండో అదనపు జూనియర్ సివిల్ కోర్టుకి నిందితుడు ప్రభుతేజ హాజరు కావాలి. అయితే కోర్టుకి వస్తుంటే నలుగురు వ్యక్తులు తనపై దాడి చేశారంటూ..రక్తమోడుతున్న గాయాలతో నిందితుడు ప్రభుతేజ కోర్టుకు హాజరయ్యాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు. ఈ ఘటన అనంతరం న్యాయమూర్తి బెంచ్ దిగి చాంబర్‌లోకి వెళ్లారు.

మాజీ సీఎం జగన్‌పై తప్పుడు ప్రచారం తగదు

- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే ఆలోచనే లేదు
- ప్రత్యేక హోదా వస్తేనే రాష్ట్రం అభివృద్ధి
- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి



ఒంగోలు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్టు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. తమ పార్టీ అధినేతకు అటువంటి ఆలోచనే లేదని, అదంతా కేవలం తప్పుడు ప్రచారమేనని కొట్టిపేశారు. బుధవారం ఒంగోలులో మీడియాతో మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు సమస్యలు పరిష్కరించుకోవడానికి చర్చలు జరపడం మంచిదేనన్నారు. అయితే, రాష్ట్రంలోను, కేంద్రంలోను ఎన్డీఏ అధికారంలో ఉన్నందున ప్రత్యేక హోదా కోసం కృషి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఎవరెన్ని చెప్పినా విభజన చట్టంలోని హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఉచితంగా ఇసుక అందిస్తే మంచిదే అని, కానీ.. టన్నుకు ఇంత అని ధర ప్రకటించిన నేపథ్యంలో ఉచితంగా ఇస్తారని ఆశించలేమన్నారు. పథకం ప్రారంభించారో లేదో అప్పుడే నిర్మాణాలు అద్భుతంగా జరుగుతున్నాయని చెప్పడం సరికాదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమాలు జరిగాయని దుష్ప్రచారం మానుకుని ఉచితంగా ఇసుక పంపిణీ చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. టీడీఆర్ బాండ్ల విషయంలో తమ ప్రభుత్వంలో ఎక్కడా అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు దానిపై విచారణ చేసుకోవచ్చన్నారు.

లంచాల బాగోతంలో టీడీపీ కీలక నేత!

రైల్వే కాంట్రాక్టుల కోసం ఉన్నతాధికారులకు భారీగా ముడుపులిచ్చినట్లు సీబీఐ అనుమానం

- ఈ కేసులో ఇప్పటివరకూ 17 మందిపై ఎఫ్ఐఆర్
- డీఆర్ఎంతోపాటు నలుగురు అధికారులు, ఇద్దరు కాంట్రాక్టర్లు ఇప్పటికే అరెస్టు
- అగ్రిమెంటు నుంచి బిల్లుల చెల్లింపు వరకూ 10 శాతం లంచాలు
- 500కు పైగా అగ్రిమెంట్లు పరిశీలించిన సీబీఐ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: దేశంలోనే సంచలనం సృష్టించిన రైల్వే అధికారుల లంచాల కేసులో రోజుకో కొత్త వ్యక్తి పేరు వెలుగుచూస్తోంది. గుంతకల్లు రైల్వే డివిజనల్ అధికారులు కాంట్రాక్టు పనులు ఇచ్చేందుకు భారీగా ముడుపులు తీసుకున్నట్లు ఫిర్యాదులు అందడంతో ఇటీవల సీబీఐ అధికారులు సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో డీఆర్ఎం వినీత్‌సింగ్‌తో పాటు మరో నలుగురు అధికారులు, ఇద్దరు కాంట్రాక్టర్లను సీబీఐ ఇప్పటికే అరెస్టుచేసింది. లంచాల వ్యవహారంపై విచారణ కొనసాగుతున్న క్రమంలో కొత్తకొత్త పేర్లు బయటకొస్తున్నాయి. ఈ క్రమంలోనే తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక కాంట్రాక్టరు కూడా కీలకంగా వ్యవహరించినట్లు సీబీఐ అధికారులు అనుమానిస్తున్నారు. గుంతకల్లు నియోజకవర్గం కొట్టాల గ్రామానికి చెందిన సదరు కాంట్రాక్టరు గత పదిహేనేళ్లుగా రైల్వే కాంట్రాక్టులు చేస్తున్నారు. రైల్వే అధికారులకు ముడుపులు చెల్లించి కాంట్రాక్టు పనులు దక్కించుకోవడం, మిగతా కాంట్రాక్టర్లను దగ్గరకు కూడా రానివ్వకపోవడం వంటివి చేసేవారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో ఈ కాంట్రాక్టరు రింగు లీడర్‌గా వ్యవహరించే వారని, గడిచిన నాలుగేళ్లలో రూ.150 కోట్ల విలువైన పనులు చేసినట్లు సమాచారం.

హుటాహుటిన హైదరాబాద్‌కు..

ఈ నేపథ్యంలో.. టీడీపీకి చెందిన సదరు కాంట్రాక్టరు పేరు సీబీఐ అధికారుల పరిశీలనలో ఉండటంతో అతను హుటాహుటిన హైదరాబాద్‌కు వెళ్లినట్లు ఇక్కడి కాంట్రాక్టర్లు చెబుతున్నారు. లంచాల వ్యవహారంలో ఇప్పటివరకూ 17 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా.. అందులో తన పేరు లేకుండా చేసుకునేందుకు సదరు కాంట్రాక్టరు భారీస్థాయిలో పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇతని ఆధిపత్యాన్ని భరించలేకే కొంతమంది కాంట్రాక్టర్లు సీబీఐని ఆశ్రయించినట్లు తెలుస్తోంది. డీఆర్ఎం (డివిజనల్ రైల్వే మేనేజర్), డీఎఫ్ఎం (డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్)లకు ఇతనే భారీగా ముడుపులిచ్చి కాంట్రాక్టులు దక్కించుకున్నట్లు తెలుస్తోంది.



2014 నుంచి డాక్యుమెంట్ల పరిశీలన..

మరోవైపు.. ఈ కేసుకు సంబంధించి పాత వివరాలన్నీ సీబీఐ అధికారులు తోడుతున్నారు. 2014 నుంచి 2024 మార్చి వరకు జరిగిన కాంట్రాక్టుల అగ్రిమెంట్లన్నీ పరిశీలిస్తున్నారు. సుమారు 500 వరకూ అగ్రిమెంటు కాపీలు స్వాధీనం చేసుకున్నారు. పనులు చేయకపోయినా బిల్లులు చేసుకున్నట్లు గుర్తించారు. ఒక్కో కాంట్రాక్టు పనికి సంబంధించి అగ్రిమెంటు దశలో 1 శాతం, ఇంజినీర్లకు 2 శాతం, ఫైనాన్స్ మేనేజర్‌కు 2 శాతం.. ఇలా కాంట్రాక్టు అగ్రిమెంటు నుంచి బిల్లుల చెల్లింపు పూర్తయ్యే వరకూ 10 శాతం వరకూ లంచాలు ముట్టాయి. అంటే.. రూ.100 కోట్ల పనులు చేస్తే రూ.10 కోట్ల వరకు లంచాల రూపంలో అధికారులకే ముట్టాయి. దీంతో గడిచిన పదేళ్లలో రైల్వే డివిజన్ పరిధిలో జరిగిన అన్ని పనులను సీబీఐ అధికారులు పరిశీలిస్తున్నారు. ముడుపులు రూ.వందల కోట్లలో చెల్లించినట్లు తెలుస్తోంది.

ఈయన చేసిన కాంట్రాక్టుల వివరాలన్నీ సీబీఐ అధికారులు సేకరిస్తున్నారు.

10 యూఎల్‌బీల్లో 'ప్రత్యేక' పాలన పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 10 స్థానిక పట్టణ సంస్థ (యూఎల్‌బీ)ల్లో ప్రత్యేకాధికారుల పాలనను మరో ఆరు నెలలు పొడిగించారు. ఈమేరకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేకాధికారుల పాలన పొడిగించిన యూఎల్‌బీల్లో కందుకూరు, ఆమదాలవలస, నరసరావుపేట, పొన్నూరు, కావలి, వైఎస్సార్, తాడిగడపతో పాటు నగర పంచాయతీలైన చింతలపూడి, పాదిలి, అల్లూరు, బి.కొత్తకోట ఉన్నాయి.

నెల్లూరులో గంజాయి ముఠా అరెస్ట్



నెల్లూరులో వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైమ్) :అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముఠాను నెల్లూరులోని నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 2.200 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఏఎస్పీ సీహెచ్ సౌజన్య మీడియాకు వెల్లడించారు. కోవూరు పట్టణానికి చెందిన షేక్ ఇర్ఫాన్ అలియాస్ గోరు, నెల్లూరుకు చెందిన షేక్ నాయబ్, ఈగ వినయ్, సయ్యద్ గుల్షన్ అలియాస్ సాద్, షేక్ షాహిద్‌లు స్నేహితులు. విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి చిన్న చిన్న పొట్లాలుగా చేసి విక్రయించసాగారు. సమాచారం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం.బాబీ బుధవారం జనార్దనరెడ్డి కాలనీలోని శ్మశానం వద్ద నిందితులను అరెస్ట్ చేసి.. వారి నుంచి 2,200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.36 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.3.36 కోట్ల కానుకలను సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులు, ముడుపులను బుధవారం మహామండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 20 రోజులకు గాను ఆలయంలోని హుండీల ద్వారా భక్తులు రూ.3,36,59,796 నగదు, 436 గ్రాముల బంగారం, 6.060 కిలోల వెండి సమర్పించారని ఆలయ ఈవో కె.ఎస్.రామరావు తెలిపారు. 1,300 అమెరికా డాలర్లు, 85 యూకే పౌండ్లు, ఏడు ఆస్ట్రేలియా డాలర్లు, 80 కెనడా డాలర్లు, 100 సౌదీ రియాల్స్, 118 మలేసియా రింగిట్స్, 70 న్యూజిలాండ్ డాలర్లు, 80 థాయిలాండ్ భాట్స్ కూడా సమర్పించారని వెల్లడించారు. ఆన్‌లైన్‌లో ఈ–హుండీ ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు రూ.1,91,787 విరాళాలను సమర్పించినట్లు తెలిపారు. కానుకల లెక్కింపులో ఆలయ సిబ్బంది, సేవా సిబ్బందితో పాటు భక్తులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ఘనస్వాగతం

విమానాశ్రయం (గన్నవరం): పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తిచేసుకున్న 322 మందితో కూడిన తొలి బృందం బుధవారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)కు చేరుకుంది. వారందరూ సౌదీ అరేబియాలోని మదీనా నుంచి విమానంలో సాయంత్రం ఇక్కడికి వచ్చారు. విమానాశ్రయంలో హజ్ యాత్రికులకు రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖల మంత్రి ఎండీ ఫరూక్, మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్, హజ్ కమిటీ సీఈవో అబ్దుల్ ఖాదర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హజ్ యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. అనంతరం హజ్ యాత్రికులు తమ స్వస్థలాలకు బయలుదేరి వెళ్లారు.


నీటికోసం గ్రామ శివారు ప్రాంతాలకు వన్యప్రాణులు

- సీసీ కెమెరాలకు చిక్కుతున్న దృశ్యాలు
- అటవీ జంతువులకు హాని కలిగిస్తే కఠిన చర్యలు
- అటవీ శాఖాధికారుల హెచ్చరిక

వెల్దుర్తి: నల్లమల అటవీ ప్రాంతంలో తాగేందుకు నీరు దొరకకపోవడంతో అటవిలోని వన్యప్రాణులంతా గ్రామ శివారు ప్రాంతాల బాట పడుతున్నాయని, సమీప ప్రాంత తండాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయ పురిసౌత్ అటవీ శాఖ రేంజ్ అధికారి సత్యనారాయణరెడ్డి చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలోని దావుపల్లి, బొటుకుల పాయ, హనుమాపురం తండా, రామచంద్రాపురం తండా ప్రాంతాలలోని బేస్‌క్యాంపు ప్రాంతాల్లో అటవీ శాఖాధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇటీవల వర్షాలు పడడంతో వన్యమృగాలు నీటికోసం తండాల శివారు ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. బొటుకులపాయ, బేస్ క్యాంపు వద్ద ఏర్పాటు చేసిన సాసర్ పిట్‌లో పులి నీళ్లు తాగేందుకు రావడం సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. 10 రోజులకొకసారి సీసీ పుటేజీలను పరిశీలిస్తారు. ఆ సమయంలో సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన జంతువులను గుర్తిస్తారు. జూలై 1 నుంచి 10వ తేదీ వరకు పెద్ద పులి, చిరుత పులి, ఎలుగుబంటి, అడవి పందులు, నక్కలు, జింకలు, దుప్పిలు, నెమళ్లు తండాల ప్రాంతాలకు వచ్చినట్లు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. నీటి కోసం వచ్చే అటవీ జంతువులకు హానికలిగిస్తే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ జంతు సంరక్షణ అధికారులు హెచ్చరిస్తున్నారు.



నల్లమల అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలకు చిక్కిన పెద్దపులి



ఎలుగుబంటి



చిరుతపులి



ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో బుధవారం బద్రీనాథ్ నేషనల్ హైవే మీదుగా విరిగిపడుతున్న భారీ కొండచరియ. దాంతో ఆ మార్గంలో రాకపోకలన్నీ పూర్తిగా స్తంభించాయి.

మన అంతరిక్ష కేంద్రంపై...

ఇస్రో కీలక నిర్ణయం

51.5 డిగ్రీల ఆర్బిటల్ ఇంక్లినేషన్‌లో ఏర్పాటు ● వ్యూహాత్మకంగా సానుకూలం: సైంటిస్టులు

ఇస్రో అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భారతీయ అంతరిక్ష స్టేషన్ (బీఏఎస్)కు సంబంధించి కీలక ముందడుగు పడింది. దీన్ని భూ స్థిర కక్ష్యలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)తో దాదాపు సమానంగా 51.5 డిగ్రీల ఆర్బిటల్ ఇంక్లినేషన్ (కక్ష్య తాలూకు వంపు కోణం)లో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వ్యోమ నౌకల ప్రయోగం తదితరాల్లో ఆర్బిటల్ ఇంక్లినేషన్ (ఓఐ)ది చాలా కీలక పాత్ర. 51.5 డిగ్రీల ఓఐ వల్ల అంతరిక్షం నుంచి భూమిని సమగ్రంగా పర్యవేక్షించేందుకు అవకాశముంటుంది. ఈ కోణంలో అంతరిక్ష కేంద్రం భూమిపై దాదాపు 90 శాతానికి పైగా జనావాసాలనూ కవర్ చేస్తూ పరిభ్రమిస్తుంది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని అంతరిక్ష పరిశోధన కేంద్రాలతోనూ అనుసంధానం సులభతరం అవుతుంది. అందుకే ఇస్రో ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు.



ఐఎస్ఎస్ కక్ష్యే ఎందుకు?

ఐఎస్ఎస్ భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో స్థిర కక్ష్యకు 51.6 డిగ్రీల వంపు కోణంలో పరిభ్రమిస్తుంది. బీఏఎస్ కోసం ఇస్రో దాదాపు అదే కోణాన్ని ఎంచుకోవడం దూరదృష్టితో కూడిన నిర్ణయమని చెబుతున్నారు. ఈ కోణంలో భూమిని అత్యంత విస్తృతంగా కవర్ చేయడం సులువవుతుంది. అంతేగాక ఐఎస్ఎస్ 2030 నాటికి పూర్తిగా తెరమరుగు కానుంది. తద్వారా అంతర్జాతీయ అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధనలకు సంబంధించి ఏర్పడే శూన్యాన్ని బీఏఎస్ భర్తీ చేస్తుందని భావిస్తున్నారు. దీనికి తోడు వ్యోమనౌకలు అంతరిక్ష కేంద్రానికి సులువుగా అనుసంధానమయ్యేందుకు ఈ కోణం వీలు కల్పిస్తుందని సైంటిస్టులు చెబుతున్నారు. ''తద్వారా ఇంధన వాడకం తగ్గడమే గాక పనితీరుకు సంబంధించిన అనేకానేక సంక్లిష్టతలు తప్పుతాయి. దీనికి తోడు ఐఎస్ఎస్‌తో కమ్యూనికేషన్, ట్రాకింగ్ కోసం ఇప్పటికే అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలన్నింటినీ ఇస్రో యథాతథంగా వాడుకోగలుగుతుంది. కనుక మనకు వ్యయ ప్రయాసలు కూడా బాగా తగ్గిపోతాయి'' అని ఇస్రో మాజీ ఇంజనీర్ మనీశ్ పురోహిత్ వివరించారు. అయితే బీఏఎస్ ఏర్పాటులో కీలకమైన 51.6 డిగ్రీల ఆర్బిటల్ ఇంక్లినేషన్‌ను సాధించడం సవాలే కానుందని ఆయన అభిప్రాయపడ్డారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

బీఏఎస్ కొన్ని విశేషాలు...

- భారతీయ అంతరిక్ష స్టేషన్ అంతరిక్షంలో మన సొంత పరిశోధన కేంద్రం
- ఐఎస్ఎస్ మాదిరిగానే ఇది కూడా భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పాటు కానుంది
- బీఏఎస్ ప్రస్తుతం డిజైన్ దశలో ఉంది
- దీన్ని 2035కల్లా పూర్తిస్థాయిలో నిర్మించాలన్నది లక్ష్యం
- బీఏఎస్ నమూనాను 2029 కల్లా ప్రయోగాత్మకంగా పరీక్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడించారు



వియన్నాలో మోదీతో కలిసి సెల్ఫీ దిగుతున్న ఆస్ట్రియా చాన్స్‌లర్ కార్ల్ నెహమర్

యుద్ధాలకు సమయం కాదిది

- ఆస్ట్రియా పర్యటనలో మోదీ పునరుద్ఘాటన
- ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు భారత్ పాత్రే కీలకం
- ఆస్ట్రియా చాన్స్‌లర్ కార్ల్ నెహమర్ వ్యాఖ్యలు

వియన్నా: ప్రపంచం ఇప్పటికే అనేకానేక సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో ఇది యుద్ధాలకు సమయం కాదని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. రెండు రోజుల ఆస్ట్రియా పర్యటనలో భాగంగా ఆ దేశ చాన్స్‌లర్ కార్ల్ నెహమర్‌తో బుధవారం ఆయన భేటీ అయ్యారు. పశ్చిమాసియా సంక్షోభంతో పాటు ఉక్రెయిన్ యుద్ధం తదితరాలపై నేతలిద్దరూ లోతుగా చర్చలు జరిపారు. ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేసుకోవాలని, అందుకోసం మైలిక సదుపాయాలు, సంప్రదాయేతర ఇంధన వనరులు, ఇన్నొవేషన్లు, నీటి–వ్యర్థాల నిర్వహణ వంటి అన్ని రంగాల్లోనూ అవకాశాలనూ మరింతగా అందిపుచ్చుకోవాలని నిర్ణయించారు. ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తూ నేతలు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. శాంతియుత వాతావరణంలో చర్చలే యుద్ధాలకు ఏకైక పరిష్కారమని పేర్కొన్నారు. అందుకు అన్ని విధాలా సహకరించేందుకు ఇరు దేశాలూ సిద్ధమని ప్రకటించారు. ఐరాసతో పాటు పలు అంతర్జాతీయ సంస్థల్లో సమకాలీన అవసరాలకు తగ్గట్టుగా సంస్కరణలు అవసరమని నేతలు అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పులు మొదలుకుని ఉగ్రవాదం దాకా అన్ని అంశాలపైనా చర్చించినట్టు వివరించారు. అంతర్జాతీయ సౌర కూటమి, విపత్తుల నిర్వహణ మౌలిక సదుపాయాల కూటమి, జీవ ఇంధన కూటమి తదితరాల్లో భాగస్వామి కావాలని ఆస్ట్రియాను మోదీ ఈ సందర్భంగా ఆహ్వానించారు. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు భారత్ పాత్ర కీలకమని నెహమర్ అభిప్రాయపడ్డారు.

గార్డాఫ్ ఆనర్ భారత ప్రధాని ఆస్ట్రియాలో పర్యటించడం 41 ఏళ్ల అనంతరం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో బుధవారం మోదీకి వియన్నాలో గార్డాఫ్ ఆనర్ లభించింది. స్థానిక కళాకారులు వందేమాతరం ఆలపించారు. మోదీని నెహమర్ ఆలింగనం చేసుకున్నారు. ఆయనతో సెల్ఫీ తీసుకుంటూ సందడి చేశారు. ఆ ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'మోదీ జీ! వియన్నాకు స్వాగతం' అని పేర్కొన్నారు. అంతకుముందు నేతలిద్దరూ పలు అంశాలపై చాలాసేపు మనసు విప్పి మాట్లాడుకున్నారు.

సీఈవోలతో భేటీ భారత్‌లో ఇన్‌ఫ్రా, ఇంధన, టెక్నాలజీ తదితర రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆస్ట్రియా కంపెనీలను మోదీ ఆహ్వానించారు. స్థానిక హాఫ్‌బర్గ్ ప్యాలెస్‌లో ఆస్ట్రియా, ఇండియా సీఈఓల రౌండ్‌టేబుల్ భేటీలో మోదీ, నెహమర్ పాల్గొన్నారు. ఇరు దేశాల నడుమ 2023లో 293 కోట్ల డాలర్ల మేర వర్తకం జరిగింది.

అధ్యక్షునితో భేటీ ఆస్ట్రియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వాండెర్ బెలెన్‌తో మోదీ భేటీ అయ్యారు. పలు అంశాల్లో ద్వైపాక్షిక సహకారంపై లోతుగా చర్చించుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తమ భేటీ అద్భుతంగా జరిగిందన్నారు.

కేజ్రీవాల్‌కు ప్రత్యక్ష ప్రమేయం

ఢిల్లీ మద్యం కేసులో ఈడీ వాదన ● చార్జ్‌షీట్‌లో కేజ్రీవాల్ పేరును 37వ నిందితుడిగా చేర్చిన ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం కుంభకోణం కేసులో రూ.100 కోట్ల ముడుపుల ఉదంతంలో ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రత్యక్ష పాత్ర పోషించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 209 పేజీల తన ఏడో అనుబంధ చార్జ్‌షీట్‌లో పేర్కొంది. దర్యాప్తు సంస్థను తప్పుదోవ పట్టించేందుకు కేజ్రీవాల్ ప్రయత్నించారని పేర్కొంటూ ఆయన పేరును చార్జ్‌షీట్‌లో 37వ నిందితుడిగా చేర్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ పేరును 38వ నిందితుడిగా నమోదుచేసింది. మే 17న సమర్పించిన చార్జ్‌షీట్‌ను ఢిల్లీలోని ప్రత్యేక మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కోర్టు మంగళవారం పరిశీలనకు స్వీకరించింది. కాగా, చార్జ్‌షీట్‌లో ఈడీ ప్రస్తావించిన అంశాలు, చేసిన ఆరోపణలు బుధవారం బహిర్గతమయ్యాయి. '' రాజకీయ నేతలు, లిక్కర్ వ్యాపారుల 'సౌత్ గ్రూప్'కు లబ్ధి చేకూర్చేందుకు అనువుగా ఎక్సయిజ్‌పాలసీని రూపొందించి అమలుచేశారు. ఇలా వచ్చిన లాభాల్లో రూ.100 కోట్లను సౌత్‌గ్రూప్ నుంచి ఆప్ నేతలు అక్రమమార్గాల్లో తీసుకున్నారు. కేజ్రీవాల్, ఇతర ఆప్ నేతల వద్ద పనిచేసిన విజయ్‌నాయర్ ఈ పనిలో కీలకంగా వ్యవహరించారు. తమకు రూ.100 కోట్ల ముడుపులు రావాలంటే పాలసీ ఎలా ఉండాలి, వచ్చిన ఈ రూ.100 కోట్లను ఏఏ మార్గాల్లో తీసుకోవాలి, ఎలా ఖర్చుచేయాలి అనేదంతా కేజ్రీవాల్ మార్గదర్శకత్వంలోనే జరిగింది. ముడుపులను కేజ్రీవాల్ నగదు బదిలీలు/హవాలా చెల్లింపుల ద్వారా తన చెంతకొచ్చేలా చేసుకున్నారు. ఛారియట్ ప్రొడక్షన్స్ ఉద్యోగి ఛన్‌ప్రీత్‌సింగ్ ద్వారా ఈ 'కిక్‌బ్యాక్' ముడుపులు గోవాకు చేరుకున్నాయి. ఇందుకోసం గోవాలో ఆప్ తరఫున ప్రచారంచేసే ఫ్రీలాన్సర్‌గా ఆయనను పనిలో కుదిర్చారు. ఈయనకు ఆప్ రూ.1 లక్ష చెల్లించింది. కేసు దర్యాప్తును కేజ్రీవాల్ ఎలా తప్పుదోవ పట్టించాడనే వివరాలు మనీశ్ సిసోడియా మాజీ కార్యదర్శి సి. అర్వింద్‌తో కేజ్రీవాల్ చేసిన ఛాటింగ్ చరిత్ర చూస్తే అర్థమవుతుంది. హవాలా వ్యాపారులతో లావాదేవీ వ్యవహారాలను కేజ్రీవాల్ అప్పుడు వినోద్ చౌహాన్ చూసుకున్నాడు. గోవా ఎన్నికలకు రూ.25 కోట్లు పంపడంలో కీలకంగా వ్యవహరించిన చౌహాన్‌ను ఇప్పటికే అరెస్ట్‌చేశాం. ఢిల్లీ జల్ బోర్డ్‌లో నియామకాలు, కేజ్రీవాల్ భేటీలను చౌహాన్ చూసుకునేవాడు. సౌత్ గ్రూప్‌కు చెందిన అభిషేక్ బోయినపల్లి..అశోక్ కౌశిక్‌కు ఇచ్చిన రెండు బ్యాగుల నిండా డబ్బు చివరకు చౌహాన్‌కు చేరింది. రూ.100 కోట్లలో రూ.45 కోట్లను 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం ఆప్ ఖర్చుచేసింది. ఈ ఖర్చులను ఆప్ కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించలేదు'' అని ఈడీ తన చార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ చార్జ్‌షీట్‌ను పరిశీలనకు స్వీకరించిన ఢిల్లీ కోర్టు కేజ్రీవాల్‌ను 12వ తేదీన తమ ముందు హాజరుపరచాలని సూచించింది.

నాయర్‌తో సంబంధం లేదు: కేజ్రీవాల్

'' ఆప్ నేత దుర్గేశ్ పాఠక్ గోవా ఇన్‌చార్జ్‌గా ఉంటూ పార్టీకి నిధులు సమకూర్చే బాధ్యతలు చూసుకునేవారు. విజయ్ నాయర్‌తో నాకెలాంటి సంబంధం లేదు. అతను ఢిల్లీ మంత్రులు అతిషి మార్లేనా సింగ్, సౌరభ్ భరద్వాజ్‌ల వద్ద పనిచేసేవారు' అని కేజ్రీవాల్ ఇచ్చిన వాంగ్మూలాన్ని ఈడీ తన చార్జ్‌షీట్‌లో పొందుపరిచింది.

బుధవారం కొనసాగిన వాదనలు

జూన్ 20న ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై స్టే విధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేయాలంటూ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై బుధవారం ఢిల్లీ హైకోర్టులో వాదనలు జరిగాయి. ఉద్దేశపూర్వకంగా కేజ్రీవాల్‌ను ఈడీ ఈ కేసులో ఇరికించిందని కేజ్రీవాల్ తరఫు లాయర్ అభిషేక్ సింఘ్వీ వాదించారు. అయితే పిటిషన్‌పై కేజ్రీవాల్ ఇచ్చిన స్పందన కాపీ మంగళవారం రాత్రే అందుకున్నామని, దానిని పరిశీలించేందుకు తమకు సమయం కావాలని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు కోర్టును కోరారు. దీంతో 15వ తేదీకి కేసును కోర్టు వాయిదావేసింది.

భారత్–చైనా సరిహద్దులో ఏకంగా 108 కిలోల బంగారం స్వాధీనం

లేహ్: భారత్–చైనా సరిహద్దులో అక్రమంగా తరలిస్తున్న 108 కిలోల బంగారాన్ని ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీసు(ఐటీబీపీ) సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఒక్కోటి ఒక కిలో బరువు ఉన్న 108 బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. ఐటీబీపీ చరిత్రలో ఈ స్థాయిలో భారీగా అక్రమ బంగారం స్వాధీనం చేసుకోవడం ఇదే మొదటిసారి అని వెల్లడించారు. తదుపరి విచారణ కోసం బంగారం, ఇతర వస్తువులను కస్టమ్స్ విభాగానికి అప్పగిస్తామని పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం తూర్పు లద్దాఖ్‌లోని చాంగ్‌థాంగ్ సబ్–సెక్టార్‌లో భారత్–చైనా సరిహద్దు అయిన వాస్తవాధీన రేఖకు ఒక కిలోమీటర్ దూరంలో ఐటీబీపీ 21వ బెటాలియన్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు స్మగ్లర్లు తారసపడ్డారు. ఐటీబీపీ సిబ్బందిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. సిబ్బంది కొంతదూరం వెంటాడి వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా, బంగారం అక్రమ రవాణా వ్యవహారం బయటపడింది. తనిఖీల్లో 108 కిలోల బంగారం లభించింది. స్మగ్లర్లను లద్దాఖ్ వాసులుగా గుర్తించారు. నిందితులను అధికారులు విచారిస్తున్నారు.

ముస్లిం మహిళలూ భరణానికి అర్హులే

- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- సీఆర్‌పీసీ సెక్షన్ 125 అందరికీ వర్తిస్తుంది
- భరణం దాతృత్వం కాదు.. మహిళల హక్కు
- ముస్లిం మహిళా యాక్ట్–1986పై సెక్యులర్ చట్టానిదే పైచేయి
- విడాకులు పొందిన తెలంగాణ ముస్లిం మహిళకు ఊరట
- రూ.10 వేలు భరణం ఇవ్వాల్సిందేనని మాజీ భర్తకు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ముస్లిం మహిళల భరణానికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం ఏదైనప్పటికీ విడాకులు పొందిన భారతీయ మహిళలందరూ భరణానికి అర్హులేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 ప్రకారం విడాకులు పొందిన ముస్లిం మహిళలు భరణానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. సీఆర్‌పీసీ 125లో మతవివక్షకు తావులేనిదని, ఇది అందరికీ వర్తిస్తుందని తెలిపింది. ముస్లిం మహిళా (విడాకుల హక్కుల పరిరక్షణ) యాక్ట్- 1986పై సెక్యులర్ చట్టానిదే పైచేయి అవుతుందని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసిహ్‌ల ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. భరణం ఇవ్వడం దాతృత్వం కాదని, వివాహిత మహిళలందరి హక్కని నొక్కి చెప్పింది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 అనేది కేవలం విడాకులు పొందిన భారతీయ మహిళలకే కాదని మహిళలందరికీ వర్తిస్తుందని తెలిపింది. 'ముస్లిం చట్టం కింద పెళ్లాడి విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు సీఆర్‌పీసీ–125 సెక్షన్‌తో పాటు, ముస్లిం మహిళా యాక్ట్–1986 వర్తిస్తుంది' అని ధర్మాసనం తేల్చింది.



భార్యకు స్వతంత్ర ఆదాయ వనరు లేనప్పుడు వ్యక్తిగత అవసరాలకు ఆర్థిక వనరులు అందుబాటులో ఉంచడం ద్వారా ఆమెకు ఆర్థిక సాధికారత కల్పించాలనే వాస్తవాన్ని భారతీయ వివాహితుడు తప్పనిసరిగా తెలుసుకోవాలి. భారతీయ మహిళలకు ఆర్థిక, నివాస భద్రత రెండూ ముఖ్యమే. వారి వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం ఉమ్మడి బ్యాంకు ఖాతా లేదా ఏటీఎం కార్డు అందుబాటులో ఉంచాలి" **- జస్టిస్ బీవీ నాగరత్న**

స్త్రీల త్యాగాలను గుర్తించాలి

తన భార్యకు భరణం చెల్లించాల్సిన అవసరం లేదని తెలంగాణకు చెందిన అబ్దుల్ సమద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గృహనిర్మాతలుగా పేరుగాంచినప్పటికీ వారికి ఇంకా గౌరవం, సాధికారత కల్పించాల్సి ఉందని అభిప్రాయపడింది. ట్రయల్ కోర్టు ఆదేశాలు సవరిస్తూ నెలకు రూ.10 వేల భరణం భార్యకు చెల్లించాలంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు సవాల్ చేస్తూ సమద్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ నాగరత్న, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌ల ధర్మాసనం విచారించి ఫిబ్రవరి 19న రిజర్వు చేసిన తీర్పును బుధవారం వెలువరించింది. వేర్వేరు తీర్పుల్లోనూ ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ విడాకులు పొందిన ముస్లిం మహిళలూ భరణానికి అర్హులేనని స్పష్టం చేసింది. విడాకులు పొందిన ముస్లిం మహిళల మెయింటెనెన్స్‌తో పాటు మెహర్, డవర్, ఆస్తి తిరిగి ఇవ్వడాన్ని ముస్లిం మహిళల (విడాకుల హక్కుల పరిరక్షణ) చట్టం, 1986 సెక్షన్ 3 ప్రస్తావిస్తుందని, అందువల్ల సీఆర్‌పీసీ 125 సెక్షన్ అవసరం రాదంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది చేసిన వాదనలను తోసిపుచ్చింది. ముస్లిం మహిళల చట్టంతో పాటు సీఆర్‌పీసీ సెక్షన్ 125కు కూడా ముస్లిం మహిళలు అర్హత కలిగి ఉండాలంటూ పలు సూచనలతో అమికస్ క్యూరీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొంటున్నట్లు పేర్కొంది. ముస్లిం మహిళల చట్టం– 1986లోని నిబంధనలు సెక్యులర్ చట్టాన్ని అతిక్రమించలేవని తెలిపింది. గృహిణి అయిన భార్య మానసికంగా, ఇతరత్రా తమపై ఆధారపడుతుందని కొంతమంది భర్తలు గుర్తించరని, కుటుంబం కోసం వారి పాత్ర, త్యాగాలు పురుషులు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని తీర్పులో పేర్కొంది. మహిళల ఆర్థిక భద్రత, గృహ భద్రతను పరిరక్షించాల్సిన అవసరం ఉందని, అప్పుడే స్త్రీలు నిజమైన సాధికారికతను సాధించగలరని జస్టిస్ నాగరత్న అభిప్రాయపడ్డారు. భారతీయ కుటుంబ వ్యవస్థకు సిసలైన బలం, వెన్నుముక మహిళేనని పేర్కొన్నారు. సీఆర్‌పీసీ సెక్షన్ 125 కింద క్లెయిమ్ దాఖలు చేసుకోవడానికి ముస్లిం మహిళలకు అర్హత నిషేధమని పార్లమెంటు చేసిన చట్టంలోని నిబంధనలు సూచిస్తున్నాయన్న పిటిషనర్ వాదనను ఖండించింది. అటువంటి ఉద్దేశమే పార్లమెంటుకు ఉంటే కచ్చితమైన నిర్దిష్టమైన భాషలో స్పష్టం చేయాలని అభిప్రాయపడింది. అబ్దుల్ సమద్ తన భార్యకు రూ.10 వేలు మధ్యంతర భృతి కింద ఇవ్వాలనే తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థిస్తున్నట్లు పేర్కొంది.

కశ్మీర్ ఉగ్రవాదుల చేతికి అమెరికా తుపాకులు

న్యూఢిల్లీ: అఫ్గానిస్తాన్ నుంచి 2021లో నిష్క్రమించిన సందర్భంగా అమెరికా సేనలు అక్కడే వదిలేసిన అత్యాధునిక తుపాకులు పాకిస్తాన్ మీదుగా జమ్మూకశ్మీర్ ఉగ్రవాదుల చేతికందాయని నిపుణులు చెబుతున్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి ఘటనల్లో వీటిని విరివిరిగా వాడటంపై విశ్లేషకులు ఆందోళన వ్యక్తంచేశారు. వీటిల్లో ముఖ్యంగా ఎం4 కార్బైన్ అసాల్ట్ రైఫిల్ ప్రధానమైంది. అత్యంత తేలిగ్గా ఉంటూ, మేగజీన్‌ను సులువుగా మారుస్తూ సునాయాసంగా షూట్‌చేసే వెలుసుబాటు ఈ రైఫిల్‌లో ఉంది. దాదాపు 600 మీటర్ల దూరంలోని లక్ష్యాలనూ గురిచూసి కొట్టొచ్చు. నిమిషానికి 700–970 బుల్లెట్ల వర్షం కురిపించే సత్తా ఈ రైఫిల్ సొంతం. ఇంతటి వినాశకర రైఫిళ్లు కశ్మీర్ ముష్కరమూకల చేతికి రావడంతో దూరం నుంచే మెరుపు దాడులు చేస్తూ సునాయాసంగా తప్పించుకుంటున్నారని రక్షణ రంగ నిపుణుడు లెఫ్టినెంట్ జనరల్ సంజయ్ కులకర్ణి అసహనం వ్యక్తంచేశారు. 2017 నవంబర్‌లో జైషే మొహమ్మద్ చీఫ్ మసూద్ అజర్ బంధువు రషీద్‌ను సైన్యం మట్టుబెట్టినపుడు అక్కడ తొలిసారిగా ఎం4 రైఫిల్‌ను సైన్యం స్వాధీనంచేసుకుంది. 2018లో, 2022లో ఇలా పలు సందర్భాల్లో ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్ ఘటనాస్థలిలో ఈ రైఫిళ్లను భారత ఆర్మీ గుర్తించింది. జూలై 8వ తేదీన కథువాలో ఐదుగురు జవాన్లను పొట్టనబెట్టుకున్న ఉగ్రదాడిలోనూ ఇవే రైఫిళ్లను వాడారని తెలుస్తోంది.

యూపీలో ఘోరం

పాల ట్యాంకర్‌ను ఢీకొట్టిన బస్సు ● 18 మంది మృతి

ఉన్నావ్(యూపీ): తెల్లవారుజామున 5 గంటలు. డబుల్ డెక్కర్ స్లీపర్ బస్సు బిహార్ నుంచి ఢిల్లీకి వెళ్తోంది. ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం. కళ్లు తెరిచి ఏం జరిగిందో తెలుసుకునేలోపే కొందరు ప్రాణాలు గాల్లో కలిశాయి. కుప్పలుగా మృతదేహాలు. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదస్థలిలో కనిపించిన భీతావహ దృశ్యమిది. ఆగ్రా- లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై పాల ట్యాంకర్‌ను 60 మంది ప్రయాణికులతో ఢిల్లీకి వెళ్తున్న బస్సు వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. 19 మంది గాయపడ్డారు. బెహ్తా ముజావర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జోజికోట్ గ్రామ సమీపంలో తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున ప్రధాని కార్యాలయం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

ఆరుగురి కుటుంబసభ్యుల్ని కోల్పోయా..

' 8మంది కుటుంబసభ్యులం ప్రయాణిస్తున్నాం. ఆరుగురు కుటుంబసభ్యులను కోల్పోయా. ప్రమాదస్థలికి ముందుగా వచ్చిన వాళ్లు మమ్మల్ని రక్షించాల్సిందిపోయి వీడియోలు తీసుకున్నారు'' అని బస్సు ప్రయాణికుడు దిల్షాద్ బోరుమన్నాడు. ఘటన సమయంలో రెండు వాహనాలు అతి వేగంతో వెళ్తున్నాయని, ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించిన బస్సు.. ముందున్న ట్యాంకర్‌ను ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఉన్నావ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పందించారు. ''మరణించిన వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా''అని 'ఎక్స్'లో పోస్టు చేశారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను సీఎం యోగి ఆదేశించారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ చీఫ్ ఖర్గే సంతాపం తెలిపారు.

ఎయిర్-డిఫెన్స్ వ్యవస్థలు అందజేస్తాం

యుద్ధంలో రష్యాకు ఓటమి తథ్యం ● అమెరికా అధ్యక్షుడు జో బైడెన్

వాషింగ్టన్: ఉక్రెయిన్–రష్యా యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధంలో రష్యాకు పరాభవం తప్పదని తేల్చిచెప్పారు. ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తామని, గగనతలంలో శత్రువును మట్టికరిపించే ఎయిర్–డిఫెన్స్ వ్యవస్థలు అందజేస్తామని ప్రకటించారు. తాజాగా 'నాటో' 75వ సదస్సులో బైడెన్ ప్రసంగించారు. అమెరికాతోపాటు జర్మనీ, నెదర్లాండ్స్, రొమేనియా, ఇటలీ దేశాలు ఉక్రెయిన్‌కు అదనంగా ఐదు వ్యూహాత్మక ఎయిర్–డిఫెన్స్ వ్యవస్థలను అందజేయబోతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో పదుల సంఖ్యలో టాక్టికల్ ఎయిర్–డిఫెన్స్ వ్యవస్థలను ఉక్రెయిన్‌కు ఇవ్వబోతున్నామని వెల్లడించారు. తాము అందజేసే క్రిటికల్ ఎయిర్–డిఫెన్స్ ఇంటర్‌సెప్టర్లతో రష్యాపై యుద్ధంలో ఉక్రెయిన్ పైచేయి సాధిస్తుందని స్పష్టం చేశారు. రష్యా క్షిపణుల దాడులు, వైమానిక దాడుల నుంచి ఉక్రెయిన్ నగరాలతోపాటు ఉక్రెయిన్ సైన్యాన్ని కాపాడే ఇంటర్‌సెప్టర్లను వందల సంఖ్యలో అందిస్తామని పేర్కొన్నారు. యుద్ధంలో 3.50 లక్షల మందికి పైగా రష్యా సైనికులు మరణించడమో, గాయపడడమో జరిగిందని చెప్పారు. ఉక్రెయిన్ స్వేచ్ఛాయుతమైన, స్వతంత్రదేశంగా కొనసాగుతుందని ఉద్ఘాటించారు.

ఎన్నికల దాకా ఎదురు చూడాలా?: జెలెన్‌స్కీ

ఈ ఏడాది నవంబర్‌లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల కంటే ముందే రష్యా అధినేత పుతిన్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. నాటో సదస్సులో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల దాకా ప్రపంచం ఎదురు చూడొద్దని చెప్పారు.

ఉక్రెయిన్‌కు ఎఫ్-16 ఫైటర్ జెట్లు ఇస్తాం: నార్వే

ఉక్రెయిన్‌కు ఆరు ఎఫ్16 ఫైటర్ జెట్లు అందజేస్తామని నాటో సభ్యదేశమైన నార్వే ప్రధాని జోనాస్ ప్రకటించారు. అయితే, ఎప్పటి నుంచి ఈ యుద్ధ విమానాలు ఉక్రెయిన్‌కు అందజేస్తారన్నది ఆయన వెల్లడించలేదు.

ఆగని దారుణ దాడులు

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 20 మంది దుర్మరణం

డెయిర్ అల్ బాలాహ్: గాజా భూతలంపై ఇజ్రాయెల్ గగనతల దాడులు ఆగట్లేవు. వరసగా రెండో రోజైన బుధవారం తెల్లవారుజామున సైతం సెంట్రల్ గాజాలోని డెయిర్ అల్ బాలాహ్ పట్టణంపై ఇజ్రాయెల్ భీకర దాడులకు తెగబడింది. ఇజ్రాయెల్ స్వయంగా ప్రకటించిన 'సేఫ్ జోన్'లో తలదాచుకుంటున్న వారిపైనా దాడులు చేసింది. దీంతో ఈ దాడుల్లో ఆరుగురు చిన్నారులు, ముగ్గురు మహిళలుసహా 20 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. నుసేరాత్ శరణార్థి శిబిరంపై దాడిలో ఐదుగురు చిన్నారులుసహా 12 మంది చనిపోయారని అల్–అల్వా స్మారక ఆస్పత్రి ప్రకటించింది. డెయిర్ అల్ బాలాహ్ పట్టణంలోని మరో ఇంటిపై జరిగిన దాడిలో ఒక చిన్నారి, ముగ్గురు మహిళలు, నలుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ రెండు ఇళ్లు ఇప్పటికే ఇజ్రాయెల్ ప్రకటించిన 'మానవతా రక్షిత ప్రాంతం'లో ఉండటం గమనార్హం. దోహాలో అమెరికా, ఈజిప్ట్, ఖతార్ దేశాల మధ్యవర్తులు హమాస్–ఇజ్రాయెల్ యుద్ధం ముగింపు కోసం సంధి ప్రయత్నాలు చేస్తున్నవేళ ఈ దాడులు జరగడం గమనార్హం. గాజా సిటీని ఖాళీచేయాలంటూ బుధవారం ఇజ్రాయెల్ ఆకాశం నుంచి కరపత్రాలను వెదజల్లింది. హమాస్ మిలిటెంట్లు మళ్లీ గాజాసిటీలో ఎక్కువవడంతో వారి నిర్మూలనే లక్ష్యంగా సాధారణ ప్రజలు నగరాన్ని ఖాళీచేసి దక్షిణంవైపు తరలిపోవాలని ఆ కరపత్రాల్లో ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది.

3, 6 పుస్తకాల్లోనే మార్పులు: ఎన్‌సీఈఆర్‌టీ

సాక్షి, న్యూఢిల్లీ: మూడు, ఆరు తరగతులు మినహా పాఠ్య పుస్తకాల్లో ఎలాంటి మార్పు లేదని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) స్పష్టం చేసింది. ఆరు, తొమ్మిది, 11వ తరగతి పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాల మార్పుపై వస్తున్న వదంతులను ఖండించింది. అన్ని గ్రేడ్‌లకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను ఈ నెలలోపు అందజేస్తామని తెలిపింది.



ఐఎస్ఎస్ నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా మాట్లాడుతున్న సునీత, విల్మోర్

స్టార్ లైనర్‌లోనే సురక్షితంగా తిరిగొస్తాం

ధీమా వెలిబుచ్చిన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్

కేప్‌కనవెరాల్: బోయింగ్ అంతరిక్ష నౌక 'స్టార్ లైనర్'లో పలు సమస్యలు తలెత్తినప్పటికీ.. తాము అందులోనే భూమికి సురక్షితంగా తిరిగి వస్తామనే విశ్వాసం ఉందని అంతర్జాతీయ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లో ఉన్న వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు బుధవారం తెలిపారు. స్టార్ లైనర్ తొలి మానవసహిత రోదసీ యాత్రలో జూన్ 5న సునీత, విల్మోర్‌లు అంతరిక్షంలోకి వెళ్లారు. హీలియం వాయువు లీక్ కావడం, థ్రస్టర్ల వైఫల్యం కారణంగా అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌తో అతికష్టం మీద అనుసంధానం కాగలిగారు. ఎనిమిది రోజుల అనంతరం భూమికి తిరిగి రావాల్సిన వీరిద్దరూ రాకెట్‌లో సమస్యల వల్ల ఐఎస్ఎస్‌లోనే చిక్కుబడిపోయారు. ఐఎస్ఎస్ నుంచి బుధవారం వీరిద్దరూ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. థ్రస్టర్‌ను పరీక్షించడం పూర్తయ్యాక తిరుగు ప్రయాణమవుతామన్నారు. రోదసీలో ఎక్కువ సమయం ఉండాల్సి రావడం పట్ల తమకేమీ ఫిర్యాదులు లేవని, ఐఎస్ఎస్‌లోని ఇతర వ్యోమగాములకు సహాయపడటాన్ని ఆస్వాదిస్తున్నామని తెలిపారు. 'స్టార్ లైనర్ మమ్మల్ని భూమికి చేర్చుతుందని నా మనసు చెబుతోంది. సమస్యేమీ లేదు' అని సునీతా విలియమ్స్ విలేకరులతో అన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం : 11 : జూలై : 2024

నాన్నకు ప్రేమతో

బుధవారం బాగల్‌కోటలో కనిపించిన దృశ్యం. వర్షంలో నాన్న తడవకుండా కవర్ పట్టుకున్న చిన్నారి. కాగా, రాష్ట్రంలో కోస్తా, ఉత్తర ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయి



న్యూస్‌రీల్

గిరిజా కళ్యాణోత్సవం



మైసూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన జిల్లాలోని నంజనగూడులో వెలసిన శ్రీ కంఠేశ్వర స్వామివారి దేవాలయంలో బుధవారం గిరిజా కళ్యాణోత్సవం వేడుకలను నిర్వహించారు. గత వారం రోజుల నుంచి ఇక్కడ గిరిజా కళ్యాణ మహోత్సవం జరుగుతోంది. మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైన గిరిజా కళ్యాణం పూజలు అర్చకులు నాగచంద్ర దీక్షిత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీనంజుండేశ్వర పార్వతి సమేత ఉత్సవ మూర్తులను ఆలయంలోని కళ్యాణ మండపంలో ప్రతిష్ఠాపన చేసి కళ్యాణోత్సవం గావించారు.

కొత్త ఎస్పీ తనిఖీలు



రూరల్ పోలీసు స్టేషనులో ప్రజలతో ఎస్పీ

గౌరిబిదనూరు: ప్రజల సమస్యలకు అధికారులు స్పందించాలి, తాలూకాలో శాంతి భద్రతలు, నేరాల విషయంలో పోలీసులతో ప్రజలు సైతం సహకరించాలని చిక్కబళ్ళాపురం జిల్లా నూతన ఎస్పీ కుశాల్ చౌక్సి తెలిపారు. తాలూకాలోని మంచేనహళ్ళి, రూరల్, టౌన్ పోలీసు స్టేషన్లకు తనిఖీ చేసి ప్రజలతో మాట్లాడారు.ఆలస్యం లేకుండా ప్రజల సమస్యలను పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. త్రిబుల్ రైడ్, సిగ్నల్ జంప్, సీట్ బెల్ట్, మొబైల్ నడుపుతూ డ్రైవింగ్ చేయడం తదితరాలకు జరిమానా తప్పదని హెచ్చరించారు. పోలీసులు గస్తీని పెంచాలని, ప్రజల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

మెట్రోలో తన్నులాట



దాడి చేసుకుంటున్న దృశ్యం

బనశంకరి: బెంగళూరు మెట్రో రైళ్లలో రద్దీ పెరిగేకొద్దీ గొడవలూ జరుగుతున్నాయి. పోకిరీలు మహిళలను వేధించడం అధికమైంది. ఇక ఇద్దరు పురుషులు సహనం కోల్పోయి కొట్టుకున్నారు. తోటి ప్రయాణికులు కంగారుకు గురయ్యారు. విడిపించటానికి ప్రయత్నించినప్పటికీ తన్నులాటను ఆపలేదు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గొడవకు కచ్చితమైన కారణం తెలియరాలేదు. కానీ తోపులాటలో మాటకు మాట పెరిగి ముష్టిఘాతాలు కురిపించుకున్నట్లు ఇతర ప్రయాణికులు తెలిపారు. ఈ ఏ మార్గంలో జరిగిందో తెలియరాలేదు. మెట్రో అధికారులు వీడియోను పరిశీలించి విచారణ చేపట్టారు.

చెడ్డీ గ్యాంగ్‌పై కాల్పులు

- పంచనామా చేస్తుండగా పరారీకి యత్నం
- ఇద్దరికి గాయాలు



పోలీసుల అదుపులో దొంగలు, సీజ్ చేసిన సొత్తు

యశవంతపుర: ఇంటి కిటికీలను బద్దలుకొట్టి చోరీలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన చెడ్డీ గ్యాంగ్ ముఠాపై మంగళూరు పోలీసులు కాల్పులు జరిపారు. వివరాలు.. మూడు రోజుల కిందట మంగళూరు కాఫీకాడు సమీపంలోని కోటికణి వద్ద వృద్ధ దంపతులు విక్టర్ మెండోన్సా, ప్యాట్రిషా లను ఇంట్లో బంధించి దోచుకున్నారు. రూ.12 లక్షల నగదుతో పాటు, లక్షలాది విలువైన బంగారం, వజ్రాలు, వాచ్‌లు ఫోన్లను ఎత్తుకెళ్లారు. వారి ఇంటిలో ఉన్న కారులోనే ఉడాయించారు. కారును ముల్కి వద్ద వదిలేసి బెంగళూరుకు వెళ్లడానికి బస్సులో బయలుదేరారు. పోలీసులు గస్తీ కాసి సకలేశపురలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు మధ్యప్రదేశ్‌కు చెందిన చెడ్డీ గ్యాంగ్ దొంగలు రాజు సింగ్వానియ (24), మయూర్ (30), బాలి (22), విక్కీ (21)లు. బుధవారం ఉదయం ముల్కి వద్ద కారును వదిలేసిన చోట దొంగలను తీసుకొచ్చి పంచనామా చేస్తుండగా, ఏఎస్ఐపై ఇద్దరు దొంగలు దాడి చేసి పారిపోవడానికి యత్నించారు. దీంతో పోలీసులు వారి కాళ్లపై కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు.

ఈడీ కొరడా

- వాల్మీకి మండలి రూ.185 కోట్ల స్కాం ప్రకంపనలు
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాగేంద్ర, బసవనగౌడ ఇళ్లు, ఆఫీసుల్లో సోదాలు
- బ్యాంకు అధికారుల ఇళ్లలోనూ తనిఖీలు
- మండలి ఆఫీసులో గాలింపు
- ఎమ్మెల్యేలు, ఆప్తుల నిర్బంధం!



నాగేంద్ర



బసవనగౌడ దద్దల్

బనశంకరి: వాల్మీకి గిరిజన అభివృద్ధి మండలిలో వందల కోట్ల రూపాయల కుంభకోణం దర్యాప్తు తీవ్రరూపం దాల్చింది. కేంద్ర ఈడీ దాడులతో రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. బళ్లారి రూరల్ ఎమ్మెల్యే బీ.నాగేంద్ర , మండలి అధ్యక్షుడు, రాయచూరు రూరల్ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్‌పై ఈడీ గురి పెట్టింది. బుధవారం ఉదయం బెంగళూరు, బళ్లారి, రాయచూరులలో వారి నివాసాలు, సన్నిహితుల ఇళ్లు, ఆఫీసులకు ఈడీ అధికారులు తరలివచ్చారు. నాగేంద్ర వ్యక్తిగత సహాయకున్ని ఈడీ అదుపులోకి తీసుకుంది. సుమారు రూ.185 కోట్లకు పైగా అక్రమాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఈడీ దృష్టి సారించింది.

రహస్యంగా దాడికి ప్లాన్

రాష్ట్రవ్యాప్తంగా 80 మంది ఈడీ అధికారులు, ఆర్‌బీఐ అధికారులు ఆకస్మాత్తుగా దాడులు నిర్వహించారు. ఇందులో రిజర్వు బ్యాంకు అధికారులు కూడా ఉన్నారు. బెంగళూరులో మంగళవారం అర్ధరాత్రి దాటాక 2 గంటలకు ఈడీ ఆఫీసుకు అధికారులు చేరుకున్నారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది భద్రత మధ్య వెంటనే బయల్దేరారు. 6 గంటల నుంచి తనిఖీలను ప్రారంభించారు



రాయచూరులో దద్దల్ నివాస భవనం

దద్దల్ ఇంట్లో

వాల్మీకి మండలి అధ్యక్షుడు, రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసవనగౌడ దద్దల్‌కు చెందిన యలహంక శ్రీనివాసపుర ఇటుకల ప్యాక్టరీ వద్ద గల నివాసానికి ఈడీ అధికారులు వెళ్లారు. ఎమ్మెల్యే భవన్‌లోని కార్యాలయం నంబరు 532లో గాలింపు జరిపారు. తనిఖీల సమయంలో ఎమ్మెల్యేల కుటుంబసభ్యులను ఇళ్లలోనే కూర్చోబెట్టారు. ఎమ్మెల్యేలను ప్రశ్నలతో ముంచెత్తారు. వారి ఫోన్లు, కంప్యూటర్లను సీజ్ చేశారు. వారితో పాటు కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల లావాదేవీల సమాచారం సేకరించారు.

పరారీలో బ్యాంకు అధికారిణి

ముగ్గురు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారుల ఇళ్లు, కార్యాలయాలలోనూ ఈడీ, ఆర్‌బీఐ అధికారులు తనిఖీలుసాగించారు. రెండు ఇళ్లను సీజ్ చేశారు. విజయనగర ఎంఆర్‌సీఆర్ లేఔట్‌లోని దీపాపై సీబీఐవారు జూన్ 3వ తేదీన కేసు నమోదుచేశారు. దీపా సీబీఐ ఎఫ్ఐఆర్‌లో ఏ2గా ఉండగా కేసు విచారణకు రావాలని సీబీఐ నోటీస్ పంపింది. కానీ దీపా ఆచూకీ లేకుండా పరారయ్యారు. ఈడీ అధికారులు ఆమె నివాసానికి వెళ్లి వెనుతిరిగారు.



బెంగళూరు డాలర్స్‌కాలనీలో మాజీమంత్రి బీ.నాగేంద్ర నివాసం ఉంటున్న రామ్‌కీ అపార్టుమెంట్

నాగేంద్ర నివాసాలలో..

- బెంగళూరు డాలర్స్ కాలనీలో రామ్‌కీ ఉత్సవ అపార్టుమెంట్ మూడవ అంతస్తు ఫ్లాట్ నంబరు 302 లో నాగేంద్ర నివాసం ఉంటున్నారు.
- బుధవారం సిట్ విచారణకు హాజరుకావాల్సిన నాగేంద్ర నివాసంలోనే ఉండగా ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సమీపంలో నాగేంద్రకు చెందిన మరో ఇంటిలోనూ సోదాలు చేపట్టారు.
- ఎమ్మెల్యే భవన్‌లో ఉన్న నాగేంద్ర ఆఫీసు నంబరు 360లో ఈడీ అధికారులు క్షుణ్ణంగా సోదాలు చేశారు. బీఈఎల్ రోడ్డు, మత్తికెరె, మల్లేశ్వరంతో పాటు నగరవ్యాప్తంగా నాలుగుచోట్ల ఈడీ దాడులు జరిగాయి.
- నాగేంద్ర పీఏ కనిపించడంతో అతన్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నాగేంద్రకు డాలర్స్ కాలనీలోని ఇంటితో పాటు కొన్ని ఇళ్లస్థలాలు, ఆస్తులకు చెందిన పత్రాలను స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు.



ఇద్దరు అధికారుల ఇళ్లలో

ఎంజీ రోడ్డు యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సుచి స్మితారాల్‌కు కోరమంగల నేషనల్ గేమ్ విలేజ్‌లో నివాసం ఉండగా, సోదాలు చేపట్టారు. మరో బ్యాంకు అధికారి వీ కృష్ణమూర్తి ఇంటిపైనా దాడిచేశారు. ఎంజీ రోడ్డు బ్రాంచిలో ఆయన క్రెడిట్ అధికారిగా ఉన్నారు. వసంతనగరలోని వాల్మీకి మండలి కార్యాలయంలో ఈడీ సిబ్బంది ముమ్మరంగా సోదాలు చేశారు. అన్నిచోట్లా తనిఖీలు గురువారం కూడా కొనసాగే అవకాశం ఉంది.



ఇంటి భోజనం ఆలస్యం

- దర్శన్ అర్జీ 18కి వాయిదా



దర్శన్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టయి ప్రస్తుతం పరప్పన అగ్రహార జైల్లో ఉన్న ప్రముఖ నటుడు దర్శన్‌కు జైలు భోజనం పడడం లేదని, అనారోగ్యం పాలయ్యాడని, అందువల్ల ఇంటి భోజనం తెప్పించు కోవడానికి అనుమతి ఇవ్వాలని ఆయన న్యాయవాదులు హైకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. కానీ అప్పుడే ఉపశమనం దక్కలేదు. దీనిపై మీ వాదన తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వం, జైలు అధికారులు, కామాక్షిపాళ్య పోలీసులకు కోర్టు ఆదేశించింది. విచారణను 18వ తేదీకి వాయిదా వేసింది.

10 కేజీల బరువు తగ్గుదల

మరోవైపు జైలులో ఆహారం, పరిసరాలు సరిపడక దర్శన్ అవస్థలు పడుతున్నారు. ఫైవ్ స్టార్ విలాసవంతమైన జీవితాన్ని అనుభవించే దర్శన్‌కు కటకటాల మధ్య కాలం వెళ్లబుచ్చడం కష్టంగా మారింది. అతనికి విరేచనాలు అవుతున్నాయని, 10 కేజీల బరువు కూడా తగ్గాడని సమాచారం. దర్శన్ భార్య, కొడుకు, బంధువులు ఆయనతో ములాఖత్ అయ్యారు. వారు దర్శన్‌కు బ్రెడ్, కొన్ని తినుబండారాలను అందజేయగా జైలు సిబ్బంది అడ్డుకున్నారని తెలిసింది.

భవానికి ఊరట

అత్యాచార బాధితురాలిని కిడ్నాప్ కేసులో ప్రజ్వల్ తల్లి భవాని రేవణ్ణకు హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిలును రద్దు చేయాలని కోరుతూ సిట్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కానీ బెయిలు రద్దుకు సుప్రీం కోర్టు నిరాకరించడంతో ఆమెకు ఊరట లభించింది. బుధవారంనాడు అర్జీ మీద విచారణ సాగింది.

దొంగ అయిన ఈత కోచ్

యశవంతపుర: స్విమ్మింగ్ పూల్‌లో శిక్షకురాలిగా పనిచేసే మహిళ.. దొంగగ మారింది. వివరాలు.. బెంగళూరు తలఘట్టపుర కెంబత్తహళ్లిలోని ఓ ఈతకొలనుకు ఓ మహిళ కూతురితో కలిసి ఈత నేర్చుకోవడానికి వెళ్లారు. ఈ సమయంలో ఆమె రూ. 3 లక్షల విలువైన బంగారు తాళి చైన్, రెండు బంగారు గాజులను అక్కడి డ్రెస్సింగ్ రూం లాకర్‌లో పెట్టి ఈతకెళ్లారు. ఈత ముగించుకొని వచ్చి చూడగా నగలు లేవు. దీంతో ఆందోళనకు గురైన మహిళ తలఘట్టపుర పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ జరపగా అక్కడి మహిళా ఈత కోచ్, ఆమె స్నేహితుడు కలిసి నగలను కొట్టేసినట్లు గుర్తించారు. నగలను స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అరెస్ట్ చేశారు.

112 సహాయవాణికి మెరుగులు

- బాధితులు ఫోన్ చేస్తే కంట్రోల్ రూంలో లొకేషన్


యశవంతపుర: దేశంలోనే మొదటిసారిగా బెంగళూరులో ఆపద్బాంధవ, హొయ్సళ ట్రాకింగ్ వ్యవస్థను అమలు చేసినట్లు పోలీసు కమిషనర్ బీ దయానంద తెలిపారు. బుధవారం బెంగళూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇంతకుముందు ప్రజలు 112కు ఫోన్ చేస్తే కంట్రోల్ రూంకి సమాచారం వస్తే, సిబ్బంది స్థానిక హొయ్సళ గస్తీ వాహనానికి చెప్పేవారు. ఇప్పుడైతే ఫోన్‌చేసిన వ్యక్తి లైవ్ లొకేషన్ కూడా కంట్రోల్ రూంలో వస్తుంది. అక్కడికి వెళ్లే మార్గం, ట్రాఫిక్, ఎంతసేపు పడుతుందనేది సిబ్బందికి కనిపిస్తుంది. షాపింగ్, ఫుడ్ డెలివరీ సంస్థల యాప్‌ల తరహాలో హొయ్సళ ట్రాకింగ్ వ్యవస్థను రూపొందించినట్లు వివరించారు. ఫోన్ చేసినవారు తప్పు దారిలో ఉంటే అది కంట్రోల్ రూంలో కనిపిస్తుంది, వెంటనే అలర్ట్ చేయవచ్చని చెప్పారు.

ఆపద్బాంధవ చౌకీలు, యాప్‌లో అలర్ట్

- బెంగళూరులో 50 చోట్ల ఆపద్బాంధవ (ఎస్ఒఎస్) చౌకీలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. అందులో నుంచి బాధితులు సాయం కోసం కమాండ్ సెంటర్‌ను సంప్రదించవచ్చని, మహిళల భద్రత కోసం నిర్భయ యోజనలో భాగంగా వీటిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



- కేఎస్‌పీ యాప్‌లోనూ ఈ ఫీచర్ ఉంటుంది, బస్సులు, రవాణా వాహనాలలోనూ మహిళలు ముప్పు కలిగితే యాప్‌లోని ఈ బటన్‌ను నొక్కితే కంట్రోల్ రూంకి సమాచారం వస్తుంది, అక్కడి ఆడియో, వీడియో కూడా ప్రసారమవుతుందని తెలిపారు.
- జూన్ నెలలో 32 డ్రగ్స్ కేసులను నమోదు చేసి 45 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 117 కేజీల గంజాయి, 11 కేజీల హాఫీం, 400 గ్రాముల హషీష్ ఆయిల్, 50 గ్రాముల కొకైన్, 236 గ్రాముల ఎండిఎంఎ మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.



బెంగళూరు హెబ్బాళలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు. ఇది పూర్తయితే నాగవార, కేఆర్ పురానికి మార్గం ఏర్పడుతుంది

ఉద్యోగ కల్పన చేయాలి: మంత్రి

బనశంకరి: రాష్ట్రంలో ప్రతి ఏడాది 10 లక్షల మంది విద్యార్థులు ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేస్తున్నారు, వీరిలో 5 లక్షల మంది పీయూసీ చదువుతున్నారు. అందులో 3 లక్షల మంది మాత్రమే డిగ్రీ చదివి పీజీ లాంటి ఉన్నత విద్య వైపు చూస్తున్నారని కార్మిక మంత్రి సంతోష్‌లాడ్ తెలిపారు. వివిధ రంగాల్లో ప్రైవేటు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని విద్యార్థులకు, యువతకు ఉద్యోగాలు లభించేలా చేయాలని తెలిపారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వృత్తి నైపుణ్యత అందించాలన్నారు. ఏడాదికి కనీసం లక్షమందికి శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించి విదేశాలకు పంపించడమే తమ లక్ష్యమని ప్రైవేటు సంస్థల ప్రతినిధులు తెలిపారు.

సక్రమంగానే ఇళ్లస్థలాలు తీసుకున్నాం

- ముడా వివాదంపై సీఎం సిద్దు

మైసూరు: మైసూరు నగరంలో ముడా ఇళ్ల స్థలాల కేటాయింపులో కోట్లాది రూపాయల అక్రమాలు జరిగాయి, ఈ కేసును సీబీఐకి అప్పగించడాలని ప్రతిపక్షాలు డిమాండు చేస్తుండగా ఇందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య మాత్రం విముఖత వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మైసూరు మండకళ్లి విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. పోలీసుల విచారణతో మాకు ఎలాంటి ఇబ్బంది లేదు, అందుకే ఈ కేసును పోలీసులు తనిఖీ చేస్తారు, వారికి ఇలాంటి కేసులను ఛేదించే సమర్థత ఉందని అన్నారు. తప్పు చేసినవారికి తప్పకుండా శిక్ష పడేలా చేస్తారని అన్నారు. నేను విజయనగరలో స్థలం ఇవ్వమని అడగలేదు, అర్జీ కూడా వేయలేదు, మా భూమి అక్కడ ఉంది, దానిని స్వాధీనం చేసుకుని నియమాల ప్రకారం స్థలాలు ఇచ్చారు అని సీఎం చెప్పారు. తాము పరిహారం అడిగితే బదులుగా ఇళ్ల స్థలాలను ఇచ్చారన్నారు. చట్టపరంగా ఇచ్చారు తప్ప మేము ఎవరినీ డిమాండ్ చేసి తీసుకోలేదు, దీనిపై కొందరు వివాదం చేస్తున్నారని ఆరోపించారు. రామనగర జిల్లా పేరును మార్చడంపై మంత్రిమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామనిచెప్పారు. ఆ జిల్లా పేరు మార్చాలని నాయకులు కోరుతున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

ఈడీ దాడి.. ఇరకాటంలో సిద్దు సర్కారు

దొడ్డబళ్లాపురం: మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఇళ్లపై ఈడీ దాడి చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరకాటంలోకి పడింది. పలు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు దగ్గరపడుతుండడంతో కాంగ్రెస్ నేతల్లో ఆందోళన మొదలైంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ సమయంలో గుట్టుచప్పుడు కాకుండా అక్రమాలు చేసి కోట్ల రూపాయలు వెనకేసుకున్నవారు ఇప్పుడు వణికిపోవాల్సి వచ్చింది. ఈ స్కాం సిద్దరామయ్య ప్రభుత్వానికి తలవంపుగా మారింది. నిధుల స్వాహాపై బీజేపీ ఉధృతంగా ఆందోళన చేపట్టింది. సిట్ అధికారులు మంగళవారమే ఇద్దరు ఎమ్మెల్యేలను మామూలుగా విచారించారు. పాలక పక్షం ఎమ్మెల్యేలను అరెస్టు చేసేందుకు సిట్ సాహసించలేదు. ఇప్పుడు ఈడీ దాడితో కేసు ముఖ్యమైన మలుపు తిరిగే అవకాశం ఉంది. వారు అరెస్టయితే సీఎం, డిప్యూటీ సీఎంలకు ఇబ్బందిగా మారవచ్చు.

ఈడీ సోదాలు ఎందుకో?

- హోంమంత్రి ఆశ్చర్యం

దొడ్డబళ్లాపురం: ఈడీ దాడులు చేసినంత మాత్రాన ఎమ్మెల్యేలను అనుమానంగా చూడాల్సిన అవసం లేదని హోంమంత్రి జీ పరమేశ్వర్ అన్నారు. బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన ఎమ్మెల్యేలు నాగేంద్ర, బసవనగౌడ దద్దల్ ఇళ్లపై ఈడీ అధికారులు దాడి చేసినంత మాత్రాన వారు అవినీతికి పాల్పడినట్లు కాదన్నారు. ఈడీ ఎందుకు దాడులు చేసిందో అర్థం కావడం లేదన్నారు. ఈ కేసును ఎస్ఐటీ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, ఎమ్మెల్యేలు ఇద్దరినీ ఎస్ఐటీ అధికారులు విచారించారన్నారు.

బెంగళూరులోకి తుమకూరు

రాబోయే రోజుల్లో తుమకూరును గ్రేటర్ బెంగళూరుగా మార్చాలని సర్కారుకు ప్రతిపాదన ఇచ్చానని పరమేశ్వర్ చెప్పారు. తుమకూరుకు మెట్రో రైలు సేవలు విస్తరించాలని కూడా సీఎంను కోరానన్నారు. రెండవ ఎయిర్‌పోర్టును తుమకూరులో నిర్మించాలని గతంలోనే తాను డిమాండు చేశానన్నారు.

చాముండి గిరులపై ఆషాఢ వైభవం



బుధవారం మైసూరు పాక్‌లను సిద్ధం చేసిన దృశ్యం



మైసూరు కొండపై ఆషాఢ శోభ (ఫైల్)

- మొదటి శుక్రవారం విశేష దర్శనాలు

మైసూరు: నాడిన శక్తి దేవత, మైసూరు చాముండేశ్వరి అమ్మవారిని ఆషాఢ శుక్రవారాల్లో భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. ఇది అత్యంత శుభదాయకమని నమ్ముతారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, దర్శన ఏర్పాట్లను కొండపై చేపట్టారు.

అల్పాహారం, భోజన వితరణ

మరోవైపు మైసూరు నగరంలో నోరడి రోడ్డులోని చాముండేశ్వరి సేవా సమితి చాముండి కొండపైన జరిగే ఆషాఢ మాసం మొదటి శుక్రవారం రోజున అమ్మవారి సన్నిధికి వచ్చే భక్తులకు మైసూరు పాక్ ప్రసాదాన్ని ఇవ్వనుంది. ఇందుకోసం 25 వేల ముక్కలను సిద్ధం చేశారు. నిత్యానంద కళ్యాణ మండపంలో మిఠాయిని వండారు. జులై 12వ తేదిన మొదటి శుక్రవారం రోజున ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య భక్తులకు సేవాసమితి ద్వారా ఉచితంగా అల్పాహారం అందజేస్తారు. ఇందులో పొంగల్, ఇడ్లి, చట్నీ ఉంటాయి. ఉదయం 11 గంటల తరువాత రోటీ, కోసంబరి, చట్నీ, బిసిబిలెబాత్, అన్నసాంబార్, పెరుగు, లడ్డు, మైసూరు పాక్‌లను అందజేస్తారు.

అమ్మమ్మా సెలవిక

- ప్రభుదేవా కన్నీటి వీడ్కోలు

మైసూరు: ప్రముఖ నటుడు, ప్రసిద్ధ డ్యాన్సర్ ప్రభుదేవా అమ్మమ్మ పుట్టమ్మణి (97) కన్నుమూసింది. జిల్లాలోని నంజనగూడు తాలూకాలోని దూర గ్రామంలో ఆమె మంగళవారం వయోభారంతో మరణించింది. విషయం తెలిసి ప్రభుదేవా వెంటనే చెన్నై నుంచి విమానంలో మైసూరుకు చేరుకున్నారు. సోదరుడు నాగేంద్రతో కలిసి వచ్చారు. అంత దుఃఖంలోనూ అక్కడ అభిమానులకు ఆయన సెల్ఫీ ఫోటోలకు పోజులిచ్చారు. తరువాత కారులో దూర గ్రామానికి వెళ్లారు. ఆమె భౌతికకాయాన్ని చూసి ప్రభుదేవా కన్నీటిమయమయ్యారు. బుధవారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు పూర్తిచేశారు.



పుట్టమ్మణితో సరదాగా ప్రభుదేవా (ఫైల్)

మైసూరువాసులే

ప్రభుదేవా తండ్రి మూగూరు సుందరం, ఆయన స్వస్థలం మైసూరు జిల్లాలోని టి.నరసిపుర తాలూకాలోని మూగూరు. దూర గ్రామానికి చెందిన మహాదేవమ్మ, సుందరానికి పెద్దలు పెళ్లి చేశారు. తరువాత సుందరం సినీ నృత్య దర్శకునిగా చెన్నైకు చేరుకున్నారు. ప్రభుదేవా, ఆయన సోదరులు అప్పుడప్పుడు వచ్చి అమ్మమ్మతో గడిపేవారు.

క్లుప్తంగా

త్వరలోనే పావగడకు తుంగభద్ర జలాలు

పావగడ: 'సాంకేతిక కారణాలతో పావగడ నియోజకవర్గానికి తుంగభద్ర జలాల రాక ఆలస్యమవుతోంది. త్వరలోనే సమస్యలను అధిగమించి తుంగభద్ర జలాలను అందిస్తాం' అని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖామంత్రి ప్రియాంక్ ఖర్గే అన్నారు. ఆయన బుధవారం పావగడకు చేరుకుని తుంగభద్ర తాగునీటి ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా బెళ్లిబట్లు, కారనాగనహట్టి గ్రామాల మధ్య నిర్మించిన సుమారు 13 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న భారీ ట్యాంక్, పంప్‌హౌస్‌ను పరిశీలించారు. అలాగే తుంగభద్ర జలాశయం నుంచి నీటి సరఫరా చేయడానికి నిర్వహించిన పైప్‌లైన్ మ్యాప్ చూశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాలు తుంగభద్ర తాగు నీటి ప్రాజెక్ట్ డిజైనింగ్‌కే పరిమితమయ్యాయని విమర్శించారు. అయితే కాంగ్రెస్ సర్కార్ రెండేళ్లలోపే ప్రాజెక్ట్ పనులన్నీ పూర్తి చేసిందన్నారు. రూ.2,137 కోట్ల నిధులతో మొలకాల్మూరు, చళ్లకెరె, పావగడకు అందించే తుంగభద్ర తాగునీటి ప్రాజెక్ట్ నుంచి తాగునీటిని చిట్ట చివరి గ్రామాలకు సైతం అందేలా చర్యలు చేపట్టామన్నారు. పట్టణంలో రింగ్‌రోడ్డు, బైపాస్ రోడ్డు నిర్మాణాలకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, చళ్లకెరె ఎమ్మెల్యే రఘుమూర్తి, మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఏ శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీ కొండయ్యకు ఘన సన్మానం



పూలమాలలతో ఘనంగా సన్మానించిన ఆ పార్టీ ప్రముఖులు

బళ్లారిఅర్బన్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేసీ కొండయ్య పుట్టిన రోజు సందర్భంగా ఆయనను పలువురు కాంగ్రెస్ నేతలు, శ్రేయోభిలాషులు బుధవారం నగరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేపీసీసీ రాష్ట్ర మీడియా ప్రతినిధులు వెంకటేష్ హెగ్డే, పార్టీ నేతలు పరశురామ్, టీ.ఆనంద్, నితీష్ హెగ్డే, రాకేష్, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు అంగళ్లలో చోరీలు

హుబ్లీ: నగరంలోని టౌన్, కమరిపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు అంగళ్ల తలుపులు బద్దలుగొట్టి ఆ అంగళ్లలో ఉన్న కొన్ని వస్తువులను చోరీ చేసిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. నగరంలోని మహావీర గల్లీ బటర్ మార్కెట్‌లో ఈ చోరీలు వెలుగు చూశాయి. బటర్ మార్కెట్ అంగడిలో రూ.60 వేల చోరీపై అంగళ్ల షట్టర్స్ విరగ్గొట్టి కొన్ని వస్తువులను తీసుకెళ్లారని అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి దొంగల కోసం గాలింపు చేపట్టారు.


ధార్వాడ జైలు నుంచి ఆరుగురు ఖైదీల విడుదల

హుబ్లీ: వివిధ కేసుల్లో జీవిత ఖైదు శిక్షకు గురైన ధార్వాడ కేంద్ర కారాగృహంలో కనీసం 14 ఏళ్ల జైలు శిక్ష అనుభవించిన ఆరుగురు ఖైదీలను సత్ప్రవర్తన కారణంగా మంగళవారం బెంగళూరులో విడుదల చేశారు. 10 మంది ఖైదీల విడుదలకు జిల్లా కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేయగా వీరిలో నలుగురి విడుదల రద్దయింది. ధార్వాడ జిల్లా కలఘటిగి తాలూకా గురునాథ బసప్ప నరేంద్ర, హుబ్లీ గౌసియానగర్ జాఫర్‌సాబ్ మైనుద్దీన్ ముల్లా, మండ్య జిల్లా మళవళ్లి తాలూకా అవరేహళ్లి బొమ్మన్న బసన్న, హాసన్ జిల్లా ఆలూరు తాలూకా దేవరపుర రంగస్వామి లింగరాజ, హావేరి జిల్లా శిగ్గాంవి తాలూకా ముళకేరి ఫక్కీరప్ప శివప్ప కదనూర, దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ తాలూకా విట్లు కసబ గ్రామం రవీష్ నాయక జైలు నుంచి విడుదలయ్యారు. వీరిని జైలులో సత్ప్రవర్తన నేపథ్యంలో జిల్లా కమిటీ విడుదలకు సిఫార్సు చేసినట్లు కేంద్ర కారాగృహ అధికారులు తెలిపారు.

ఘనంగా సీతాల పండుగ



తరలివచ్చిన బంజారా సముదాయం ప్రజలు



అమ్మవారి మూలవిరాట్

బొమ్మనహళ్లి : బెంగళూరు నగరంలోని ఆరికెరె వార్డు న్యానప్పనహళ్లిలో సీతాల పండగను బుధవారం బంజారా సముదాయ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ బాగ్యలక్ష్మి మురళి దంపతులు, బంజారా ప్రజలు సంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బళ్లారిలో ఈడీ కలకలం

- మాజీ మంత్రి నాగేంద్ర ఇంట్లో సోదాలు
- బళ్లారి, బెంగళూరుల్లోని నివాసాల్లో ఏకకాలంలో దాడులు
- రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఇంట్లో కూడా..
- ఎమ్మెల్యే మెడకు బిగుసుకుంటున్న వాల్మీకి మండలి కుంభకోణం ఉచ్చు



మాజీ మంత్రి నాగేంద్ర(ఫైల్)

సాక్షి, బళ్లారి: జిల్లాలో బలమైన నేతగా ఎదిగిన రూరల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే బి.నాగేంద్రకు ఎదురుగాలి మొదలైనట్లు కనిపిస్తోంది. కంచే చేను మేసిన చందంగా వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్లు పక్కదారి పట్టిన కేసులో మంత్రి పదవిని కోల్పోయిన ఆయన సిట్ విచారణను ఎదుర్కొంటున్నారు. ఇంతలో కేంద్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా పంజా విసిరింది. దీంతో నాగేంద్రతో పాటు ఆయన అనుచరులు ఆందోళనలో పడ్డారు. బుధవారం నగరంలోని నెహ్రూకాలనీలో నాగేంద్ర ఇంటి వద్ద ఈడీ అధికారులు ఉదయం నుంచి సోదాలు చేపట్టారు. బెంగళూరు నుంచి వచ్చిన అధికారుల బృందం ఏకకాలంలో నాగేంద్రకు చెందిన బళ్లారి నివాసంలో సోదాలు జరిపింది. మండలిలో చోటు చేసుకొన్న అక్రమాలకు సంబంధించి సంబంధిత అధికారి చంద్రశేఖర్ శివమొగ్గలో ఆత్మహత్య చేసుకోవడంతో అసలు విషయం బయటపడింది. నాగేంద్ర పీఏను అరెస్టు చేసి ఆధారాలు సేకరించారు. రోజు రోజుకు మండలిలో అక్రమాలపై బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడంతో పాటు బ్యాంక్ అధికారులు అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలోకి ప్రవేశించిన సీబీఐ అధికారులు మండలిలో జరిగిన అక్రమాలపై వివరాలు సేకరిస్తున్నారు. ఈడీ సోదాలు చేపట్టడంతో నగరంలో నాగేంద్ర అభిమానులు, కార్యకర్తలు షాక్ తిన్నారు.

మైనింగ్ అక్రమాల్లో కూడా గతంలో అరెస్టు

జిల్లాలో ఇనుప ఖనిజం తవ్వకాలు, తరలింపుల్లో చోటు చేసుకొన్న అక్రమాలపై గతంలో కూడా మాజీ మంత్రి నాగేంద్రను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపిన సంగతి తెలిసిందే. 2008 నుంచి వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది జిల్లా మంత్రిగా కూడా కావడంతో రాజకీయంగా ఉన్నత స్థాయికి నాగేంద్ర చేరుకున్నారని ఆయన అభిమానులు సంతోషిస్తుండగా ఏకంగా రూ.187 కోట్ల అక్రమాల్లో నాగేంద్ర పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆయనపై ఇప్పటికే సిట్, ఈడీ అధికారులు విచారణ నిర్వహించారు. ఈడీ సోదాలు, దర్యాప్తు, విచారణ అనంతరం నాగేంద్ర మరోసారి కూడా జైలుకు వెళ్లే సూచనలున్నట్లు తెలుస్తోంది. ఈడీ అధికారులు విచారణ పూర్తి చేసిన అనంతరం అరెస్టు చేస్తారని సమాచారం. అక్రమాల్లో ఏయే కోణాల్లో నాగేంద్ర పాత్ర ఉందన్నదానిపై కూపీ లాగుతున్నారు. నాగేంద్ర, బసనగౌడ దద్దల్, యూనియన్ బ్యాంక్ అధికారులు సుచిస్మిత, క్రెడిట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, బ్రాంచ్ హెడ్ దీపా, దొడ్డబసవేశ్వరనగరలోని నాగేంద్ర పీఏ నెక్కంటి నాగరాజు, సత్యనారాయణ వర్మ తదితరుల ఇళ్లలో కూడా విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. బళ్లారి, బెంగళూరు, హైదరాబాదు, రాయచూరుల్లో ఏక కాలంలో 18 చోట్ల ఈడీ సోదాలు ముమ్మరం చేసింది.



బసనగౌడ నివాసంలో అధికారుల సోదా

రాయచూరులో కూడా..

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్ల అవినీతిపై విచారణకు మండలి అధ్యక్షుడు, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నగరంలో దాడి జరిపారు. బుధవారం నగరంలోని ఆశాపూర్ రోడ్డులోని నివాసంలో అధికారులు సోదా చేశారు. బెంగళూరులో మంగళవారం ఎస్ఐటీ అధికారులు విచారణ జరపగా రాయచూరులో ఈడీ అధికారులు ఆయన ఇంటిని సోదా చేశారు.



బళ్లారిలోని నాగేంద్ర ఇల్లు



రాయచూరులోని బసనగౌడ ఇల్లు

పథకాలకు నిధుల కొరత లేదు: సీఎం

మైసూరు: బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలు, అభివృద్ధి పనులకు ఎలాంటి నిధుల కొరత లేదని ఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన కార్యకర్తలు, పార్టీకి మద్దతు ఇచ్చిన ప్రజలకు చామరాజనగర జిల్లా క్రీడా మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సమావేశంలో సీఎం పాల్గొని మాట్లాడారు. అన్ని మతాలు, కులాల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి చేస్తున్నదన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా గ్యారంటీలను నిలిపేది లేదన్నారు. పథకాల అమలుకు నిధులు ఎక్కడినుంచి వస్తున్నాయంటూ విపక్షాలు అర్థం పర్థం లేకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు. విపక్షాల ఆరోపణలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

యువతకు నైపుణ్య శిక్షణ



భవనాన్ని పరిశీలిస్తున్న మంత్రి ప్రియాంక్ ఖర్గే

తుమకూరు : జిల్లాలో డిగ్రీ పూర్తి చేసిన వారిలో నైపుణ్యత పెంచేందుకు అవసరమైన శిక్షణ ఇస్తామని గ్రామీణ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే అన్నారు. తుమకూరులోని కేంద్ర గ్రంథాలయ భవనం మూడో అంతస్తులో శిక్షణ కేంద్రం ఏర్పాటుకు బుధవారం ఆయన గదులను పరిశీలించారు.

విద్యుత్ టవర్ పనులను అడ్డుకున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

తుమకూరు : పరిహారం ఇవ్వకుండా విద్యుత్ టవర్ పనులు చేస్తున్నారని రైతులు ఆందోళనకు దిగారు. ఈఘటన చిక్కనాయకనహళ్లి తాలూకా హందనకెరె సమీపంలోని మతిఘట్టమల్లిగెరె గ్రామంలో చోటు చేసుకుంది. హందనకెరె ఉప స్థానం నుంచి మతిఘట్ట స్థావరం వరకు 7.7 కిలో మీటర్ల మేర విద్యుత్ టవర్ పనులకు కేపీటీసీఎల్ చర్యలు చేపట్టింది. 300 మీటర్లకు ఒక్కటి చొప్పున మొత్తం 31 టవర్లు ఏర్పాటు చేయాలని సంస్థ నిర్ణయించింది. ఇందుకు అవసరమైన భూములను గుర్తించింది. అయితే తమకు పరిహారం ఇవ్వకుండానే సంస్థ టవర్ పనులు చేపట్టిందని రైతులు ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ సంస్థ పోలీసు బందోబస్తు మధ్య పనులు చేపట్టింది. ఈక్రమంలో బుధవారం రైతులు పనులను అడ్డుకున్నారు. పరిహారం ఇచ్చిన తర్వాతనే టవర్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో తాము కోర్టును ఆశ్రయిస్తామని సంస్థ ప్రతినిధులు అక్కడినుంచి వెళ్లిపోయారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కోలారు: తమ డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు చట్టాలను వెనక్కు తీసుకోవాలని, అన్ని రకాల కార్మికులను పర్మనెంట్ చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామాజిక భద్రతా చట్టాన్ని అమలు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా కోశాధికారి హెచ్‌బీ కృష్ణప్ప, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ కల్పన, సీఐటీయూ తాలూకా సంచాలకుడు ఎం భీమరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆ చట్టాలను వెనక్కు తీసుకోవాలి



మాట్లాడుతున్న బచ్చేగౌడ

శ్రీనివాసపురం: ఎన్నికల సమయంలో పార్టీ ప్రణాళికలో చెప్పిన విధంగా రైతు వ్యతిరేక 3 వ్యవసాయ చట్టాలను వెంటనే ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని రైతు సంఘం ఉపాధ్యక్షుడు బచ్చేగౌడ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల మాదిరిగా రాష్ట్రంలో ఎట్టి పరిస్థితిలోను విద్యుత్ ప్రైవేటీకరణ చేయరాదన్నారు. దీనిని శాసనసభలో నిర్ణయం చేసి కేంద్రప్రభుత్వానికి పంపాలన్నారు. రాష్ట్రంలో నీటి పారుదల పథకాలు మందకొడిగా సాగుతున్నాయి. పథకాలను తగినన్ని నిధులు విడుదల చేసి పథకాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌గౌడ మాట్లాడుతూ జిల్లా పదేపదే కరువు కాటకాలకు గురౌతోంది. జిల్లా రైతులు వ్యవసాయంతో పాటు పాడిని జీవనాధారంగా చేసుకున్నారు. ఇలాంటి సమయంలో కోచిముల్ పాల సేకరణ ధరను రూ.2 తగ్గించి పాడి రైతులకు అన్యాయం చేసిందన్నారు. పాడి రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తగ్గించిన పాల సేకరణ ధరను మళ్లీ పెంచాలన్నారు. బకాయి పాడి రైతుల ప్రోత్సాహం వెంటనే విడుదల చేయాలన్నారు. రైతు నాయకులు అబ్బణి శివప్ప, ఆనంద్, చంద్రప్ప, వెంకటస్వామి రెడ్డి, సీనప్ప, ఉమాదేవి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

పాల ధర పెంచాలని ముట్టడి



కోచిముల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

కోలారు: పాడి రైతులకు ఇస్తున్న పాల సేకరణ ధరను కోచిముల్ రూ.2 తగ్గించడాన్ని ఖండిస్తూ బీజేపీ రైతు మోర్చా కార్యకర్తలు బుధవారం నగర సమీపంలో కోచిముల్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేశారు. రాష్ట్ర బీజేపీ రైతు మోర్చా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాల ధరలను గణనీయంగా పెంచి సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ప్రస్తుతం పాల సేకరణ ధరను తగ్గించి రైతులను పాడి పరిశ్రమకు విముఖులయ్యేలా చేస్తోందని ఆరోపించారు. అవిభజిత కోలారు జిల్లాలో పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్న అధిక శాతం మంది రైతులు కోచిముల్ నిర్ణయం వల్ల పట్టణాలకు వలస వెళ్లే ప్రమాదం ఉందన్నారు. కోచిముల్ పాలక మండలి సభ్యులు విదేశీ పర్యటనల పేరుతో నిధులను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. పైగా పాలక మండలి పూర్తిగా అవినీతిమయమైందన్నారు. సిబ్బంది నియామకాల నుంచి మొదలుకుని ప్రతి విషయంలో నిధులను లూటీ చేస్తున్నారన్నారు. వీటిని అరికట్టి తగ్గించిన పాల సేకరణ ధరలను తిరిగి పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, రైతు మోర్చా జిల్లా అధ్యక్షుడు కొమ్మనహళ్లి ఆనంద్, ప్రధాన కార్యదర్శి రాజు అప్పి, యువ మోర్చా అధ్యక్షుడు తేజస్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి శివణ్ణ పాల్గొన్నారు.

రెడ్డి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తాం

- మంత్రి రామలింగారెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బళ్లారి రూరల్: బెంగళూరులో రెడ్డి సముదాయం ఆధ్వర్యంలో రెడ్డి విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించే ఉద్దేశ్యం ఉన్నట్లు రాష్ట్ర రవాణా శాఖామంత్రి రామలింగారెడ్డి తెలిపారు. నగరంలోని హేమ వేమరెడ్డి సహకార పరపతి సంఘం బ్యాంకు ప్రారంభం, బలిజ భవన్‌లో ప్రతిభావంతులకు పురస్కారాలు, విశ్రాంత ఉద్యోగులకు సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. రెడ్డిజన సంఘం స్థాపించి వందేళ్లు అయ్యింది. ఇంతవరకు సంఘటితంగా ఎన్నికలు జరగలేదు. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళలో రెడ్డి వర్గీయులు అధికంగా ఉన్నారు. బెంగళూరులో రెడ్డిజన సంఘం ఆధ్వర్యంలో మెడికల్, డెంటల్ మినహా అన్ని కోర్సుల్లో విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఇతర వర్గాల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న రెడ్డి సముదాయాన్ని ఒక గొడుగు కిందకు చేర్చే సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఐకమత్యమే బలం

మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి మాట్లాడుతూ రెడ్డి వర్గీయులు ఐకమత్యంగా ఉండాలన్నారు. రెడ్డి సముదాయంలో రామలింగారెడ్డి ఉన్నత పదవిలో ఉన్నారు. మున్ముందు రామలింగారెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కాలని ఆకాంక్షించారు. గాలి లక్ష్మీఅరుణ జనార్దనరెడ్డి మాట్లాడుతూ రెడ్డిసముదాయం ధైర్య సాహసాలు, సాయం చేసే గుణాన్ని కలిగి ఉంటారన్నారు. డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ బళ్లారిలో గాలిజనార్దనరెడ్డి హయాంలో రెడ్డిజన సంఘం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. రెడ్డిజనసంఘం ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బెంగళూరు కర్ణాటక జనసంఘం అధ్యక్షుడు ఎం.సీ. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి వర్గీయులకు ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్‌ను 3ఏ నుంచి 2ఏకు మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ యోగానందరెడ్డి, డాక్టర్ బసిరెడ్డి, డాక్టర్ అనిల్‌రెడ్డి తదితరులను సన్మానించారు. హొసళ్లి మహాయోగి వేమన సంస్థాన మఠం, రెడ్డి గురుపీఠం వేమానంద మహాస్వామి, కర్ణాటక రెడ్డిజన సంఘం అధ్యక్షుడు గణపాల ఐనాథ రెడ్డి, రెడ్డి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.నాగరాజ రెడ్డి, బాబురెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ట్రక్ టెర్మినల్‌ను వీక్షించిన మంత్రి

హొసపేటె: దేవదాయ శాఖా మంత్రి రామలింగారెడ్డి బుధవారం సాయంత్రం నగర శివార్లలో ఉన్న దేవరాజ్ అరస్ ట్రక్ టెర్మినల్ లొకేషన్‌ను వీక్షించారు. ట్రక్ టెర్మినల్ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గవియప్ప, జిల్లాధికారి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

ఏడాదిలోగా పాత్రికేయుల భవనం పూర్తి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

మాలూరు: పట్టణంలో పాత్రికేయుల నూతన కట్టడాన్ని యేడాదిలోగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. బుధవారం పట్టణంలోని టీపీ కార్యాలయంలో నిర్వహించిన తాలూకా పాత్రికేయుల పత్రికా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. పాత్రికేయుల సంఘానికి స్థలం ఇవ్వడంతో పాటు భూమి పూజను కూడా నెరవేర్చారు. ఎస్ఎల్‌వీ లే అవుట్‌లో సంఘానికి స్థలం మంజూరు చేశారన్నారు. స్థలం లభించడంలో ముఖ్యమంత్రి మీడియా సలహాదారు కేవీ ప్రభాకర్ చొరవ ఎంతో ఉందన్నారు. కోలారు జిల్లా కేంద్రంలోలా మాలూరు తాలూకా కేంద్రంలో కూడా అన్ని హంగులతో కూడా పాత్రికేయుల భవనాన్ని నిర్మిస్తామన్నారు. కట్టడ నిర్మాణానికి ఎంపీ మల్లేష్‌బాబు రూ.5 లక్షల విరాళం అందించారన్నారు. ఎమ్మెల్యే నిధి నుంచి కూడా నిధులు అందిస్తామన్నారు. ఎమ్మెల్సీ నిధి నుంచి కూడా నిధులను తీసుకుంటామన్నారు. కట్టడ నిర్మాణానికి పార్టీల కతీతంగా అందరూ సహకారం అందించాలన్నారు. పాత్రికేయుల సంఘం జిల్లా అధ్యక్షుడు బీవీ గోపినాథ్, ముఖ్యమంత్రి మాధ్యమ సలహాదారు కేవీ ప్రభాకర్, రాష్ట్ర అధ్యక్షుడు శివానంద తగడూరు, మాజీ అధ్యక్షుడు మునిరాజు, తహసీల్దార్ కె.రమేష్ పాల్గొన్నారు.

సమన్వయంతో డెంగీని అరికడదాం



మాట్లాడుతున్న తహసీల్దార్ హర్షవర్ధన్

కోలారు: తాలూకాలో డెంగీ నియంత్రణకు ప్రభుత్వ అన్ని శాఖలు సహకారం అందించాలని, ఆరోగ్య శాఖతో సమన్వయత సాధించి రోగాలను అరికట్టాలని తహసీల్దార్ హర్షవర్ధన్ పిలుపునిచ్చారు. బుధవారం తాలూకా కార్యాలయ సభాంగణంలో మంగళవారం డెంగీ నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించడానికి నిర్వహించిన తాలూకా స్థాయి అంతర శాఖ సమన్వయ సమితి సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. డెంగీ నియంత్రణకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం కూడా దీనిపై కట్టుదిట్టమైన సూచనలు చేసిందన్నారు. విద్యా శాఖ పిల్లలను జాగృతం చేయడంతో పాటు వారితో జాగృతి జాతాలను నిర్వహించాలన్నారు. జాతా నిర్వహిస్తున్న సమయంలో పోలీస్ శాఖ తగిన బందోబస్తు చేపట్టాలన్నారు. హాస్టల్‌లో స్వచ్ఛతకు ప్రాధాన్యత నివ్వాలని, వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ శాఖలు వ్యవసాయ గుంతలు, నీటి తొట్టెల్లో దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్స్యశాఖ దోమల లార్వాలను నాశనం చేయడానికి గప్పి, గంబూజియా చేపలను పెంచి ఆరోగ్య శాఖ అడిగినప్పుడు సరఫరా చేయాలన్నారు. దోమల ఉత్పత్తిని నియంత్రించినప్పుడే డెంగీ నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. నగరసభ, పురసభ అధికారులు స్వచ్ఛతకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. వారిని కోసారి లార్వా నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. సమావేశంలో తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ ఏవీ నారాయణస్వామి, టీపీ ఈఓ మునియప్ప, తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

హత్యకు దారి తీసిన గొడవ

హొసపేటె: చిన్న కారణానికి జరిగిన గొడవలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకా వరదాపుర గ్రామ శివార్లలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన కొళ్లి చెన్నప్ప, కొళ్లి రమేష్ మధ్య పశువుల కాపలా విషయంపై గొడవ మొదలై ఒకరిపై మరొకరు చేయి చేసుకున్నారు. చివరికి రమేష్ చేతిలో చెన్నప్ప(28) హతమయ్యాడు. ఘటనపై మరియమ్మనహళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.


స్నేహ క్లినిక్‌ల లబ్ధి పొందండి



మాట్లాడుతున్న గీతా

కోలారు: యుక్త వయస్కులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి గురువారం ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు తెరిచి ఉండే స్నేహ క్లినిక్ సౌకర్యాన్ని పొందవచ్చని, అవసరమైతే 104కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని క్షేత్ర ఆరోగ్య శిక్షణాధికారి గీతా తెలిపారు. బుధవారం తాలూకాలోని అరాభికొత్తనూరులో నిర్వహించిన బాల్య వివాహాల నిషేధం, యుక్త వయస్కుల సమస్యలు, డెంగీ తదితర సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలతో మానసిక, శారీరక అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. పుట్టే పిల్లలు కూడా అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలపై సమాచారాన్ని వెంటనే 1098కి ఫోన్ చేసి తెలపాలన్నారు. విద్యార్థులు అధికంగా మొబైల్ వాడకం తగ్గించాలని సలహా ఇచ్చారు. తద్వారా కళ్లు, చెవుల సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. జిల్లా బాలల రక్షణ కార్యకర్త శోభా, స్త్రీ శిశు సంక్షేమ సూపర్‌వైజర్ పవిత్ర, ఉపాధ్యాయిని సిద్దేశ్వరి, లీల, సుగుణ, ఫరీద, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, రమాదేవి పాల్గొన్నారు.

ముంగారు ఫసల్ బీమాపై శిక్షణ



మాట్లాడుతున్న వీరణ్ణ

కేజీఎఫ్: ముంగారు ఫసల్ బీమా పథకంపై తాలూకా కార్యాలయంలో అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా సంఖ్యాక డైరెక్టర్ వీరణ్ణ అధ్యక్షతన తాలూకా వ్యాప్తికి చెందిన 16 జీపీల అభివృద్ధి అధికారుల సమావేశాన్ని జరిపారు. సమావేశంలో వీరణ్ణ మాట్లాడుతూ పీడీఓలు, హార్టికల్చర్ అధికారులు పంట కోత ప్రయోగాలపై రైతులకు తగిన మార్గదర్శనం చేయాలని సూచించారు. సీసీఓ నియమాల ప్రకారం 2023–24వ సంవత్సరంలో చేపట్టిన ప్రయోగాల్లో కనిపించిన కొన్ని లోపాలను సరిచేసుకోవాలని సూచించారు. సహాయక సాంఖ్యిక అధికారి ముకుంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచితంగా నీటి సరఫరా



ట్యాంకర్‌తో నీరు అందిస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: కృష్ణరాజపురంలో ఎట్టకేలకు తాగునీటి ఎద్దడి తీరింది. కొన్ని రోజులుగా నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ విషయం తెలుసుకున్న దేవసంద్ర వార్డు కాంగ్రెస్ నాయకుడు డీ.కే.రమేష్ స్వంత ఖర్చులతో ట్యాంకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీరు అందించారు.

కెంపమ్మ దేవి జాతర



దర్శించుకున్న భక్తులు

మండ్య: మండ్య జిల్లాలోని కొప్ప దగ్గర చిక్కహొసగావి గ్రామంలో వెలసిన కెంపమ్మ దేవి ఆలయం 16వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తికి పూజలు చేసి గ్రామంలో ఊరేగించారు.

డెంగీని కట్టడి చేస్తున్నా బీజేపీ రాద్ధాంతం

- మంత్రి రామలింగారెడ్డి

శివాజీనగర: డెంగీ జ్వరాల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని, అయితే విపక్ష బీజేపీ అనవసరంగా రాద్ధాంతం చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడారు. ఏటా వర్షాకాలంలో డెంగీ జ్వరాలు ప్రబలడం సహజమేనన్నారు. జ్వరాలు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని బీబీఎంపీ కమిషనర్ వైద్య అధికారులకు సూచించారని గుర్తు చేశారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా ప్రతి వారం డ్రైడే పాటించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి దినేశ్ గుండూరావు పలుసార్లు అధికారులతో సమావేశమై డెంగీ నివారణకు అవసరమైన చర్యలు తీసుకున్నారని మంత్రి గుర్తు చేశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా అధికారులకు సూచనలు చేశారన్నారు.

దోమతెరల పంపిణీ



మండ్య: డెంగీ జ్వరం రాకుండా కట్టుదిట్టమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మన్‌మూల్ ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.రఘునందన్ అన్నారు. ట్రావెన్‌కోర్ ఫెర్టిలైజర్స్ కెమికల్స్ ద్వారా కిలార గ్రామంలో రైతులు, వారి పిల్లల కోసం ఉచితంగా దోమతెరలను పంపిణీ చేశారు. దోమలు కుట్టడం వల్ల డెంగీ వస్తుందని, కాబట్టి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఇళ్ల వద్ద మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్, చోరీ సొత్తు స్వాధీనం

యశవంతపుర: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని తలఘట్టపుర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులనుంచి రూ.3 లక్షల విలువైన ఐదు బైక్‌లు, పూజ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. తలఘట్టపుర మారుతీనగర మెయిన్ రోడ్డులోని కబ్బాళమ్మ ఆలయంలో వెండి దీపాలు, మంగళ హారతి తట్ట తదితర వస్తువులు ఇటీవల చోరీకి గురయ్యాయి. పోలీసులు గాలింపు చేపట్టి కదిరేనహళ్లి బ్రిడ్జి సర్కిల్‌లో బైకులపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో బైక్ చోరీలు, ఆలయాల్లో చోరీలు చేస్తున్నట్లు అంగీకరించారు. దీంతో వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. కోణనకుంటె, సుబ్రహ్మణ్యపుర, జేపీ నగర, సీకే అచ్చుకట్టు పోలీసుస్టేషన్ల పరిధిలో నిందితులు చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

చిక్కగాడి గ్రామంలో వైద్య శిబిరం



కంటిపరీక్షలు చేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: అనేకల్ తాలూకా చిక్కగాడి గ్రామంలో సీవైసీ సమాజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చిన్మయ సేవా సంస్థ అధ్యక్షుడు చిన్నప్ప వై. చిక్కహెగ్డే పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యులు రోగులకు కంటి, దంత, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మహేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సాహస పర్యాటకానికి సై

- రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్‌పై యువత ఆసక్తి
- రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఎత్తైన శిఖరాలు
- శిక్షణ, సాహస క్రీడలకు అవకాశం

బనశంకరి: చదువులతో కుస్తీ పట్టే యువత రిలీఫ్ కోసం సాహసక్రీడ వైపు మొగ్గు చూపుతోంది. వీకెండ్స్‌లో రివర్ రాఫ్టింగ్, కేవింగ్, డైవింగ్, రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్, విండ్‌సర్ఫింగ్ తదితర సాహస క్రీడలకు అనువుగా ఉండే ప్రాంతాలకు వెళ్లి ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్‌లో పాల్గొని మనో ఉల్లాసం పొందుతున్నారు. కొండలు, శిఖరాలను అధిరోహించి సత్తా చాటుకుంటున్నారు. ఎత్తైన కఠిన శిలలను ఎగబాకడమే రాక్ క్లైంబింగ్. ఈ క్రీడ వల్ల పట్టుదల, కఠిన శ్రమ అలవడుతాయని మానసిక నిపుణులు కూడా చెబుతుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాక్ క్లైంబింగ్‌కు అనువైన ప్రాంతాల విశేషాలు ఇవి.

యానా రాక్స్ శిలలు

పశ్చిమ కనుమల్లో సహ్యాద్రి పర్వత శిఖరంలో యానారాక్స్ ఉన్నాయి. ఉత్తర కన్నడ జిల్లా యానా గ్రామం వద్ద భైరవేశ్వర శిఖరం, మోహిని శిఖరం సమూహమే యానారాక్స్. బెంగళూరు నుంచి యానా గ్రామం 460 కిలోమీటర్లు, కార్వార నుంచి 60 కిలోమీటర్ల దూరం ఉంది. ఇక్కడ హిందువుల పుణ్యక్షేత్రమైన భైరవేశ్వర ఆలయం కూడా ఉంది. ఇక్కడ ఉన్న శివలింగంపై నిత్యం నీటిధార పడుతుంది.

రామనగర

బెంగళూరుకు 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామదేవరబెట్ట రాక్ క్లైంబర్స్‌కు స్వర్గంగా ఉంది. ఇక్కడి శిలలు చాలా తక్కువ ఎత్తులో ఉన్నప్పటికీ కొంత జారుడు స్వభావం కలిగి ఉంటాయి. దీంతో రాక్ క్లైంబర్స్‌కు ఈ శిలలు ఎప్పుడూ పరీక్ష పెడుతుంటాయి.



రామదేవరబెట్టలో ట్రెక్కర్ల సందడి



స్కందగిరిపై ట్రెక్కర్లు

హంపీ

చారిత్రాత్మకంగానే కాకుండా శిల్పకళా సంపదకు హంపీ కాణాచి అనే విషయం తెలిసిందే. ఇక్కడ ఉండే శిలలు రాక్ క్లైంబర్స్‌కు ఆహ్వానం పలుకుతాయి. బెంగళూరు నుంచి 350 కిలోమీటర్ల దూరం కలిగిన ఈ ప్రాంతం వీక్‌ఎండ్‌లో రాక్ క్లైంబింగ్‌కు అనుకూలంగా ఉంటుంది.

స్కంధగిరి

బెంగళూరు నగరానికి 62 కిలోమీటర్లు, చిక్కబళ్లాపురానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కంధగిరి రాక్ క్లైంబింగ్ క్రీడను నేర్చుకునేవారికి అనువైన ప్రాంతం. ఇక్కడ పచ్చని వాతావరణం ట్రెక్కింగ్‌కు కూడా అనుకూలంగా ఉంటుంది.

శివగంగ దుర్గం

బెంగళూరు నుంచి 54 కిలోమీటర్లు, తుమకూరు నుంచి 19 కిలోమీటర్ల దూరంలో శివగంగ దుర్గం ఉంది. 2640 అడుగుల ఎత్తు ఉంటుంది. ఇక్కడ పెద్ద పెద్ద బండరాళ్లు రాక్ క్లైంబర్స్‌ను ఏడాదిపాటు ఆహ్వానిస్తాయి. ఇది శైవ పుణ్యక్షేత్రం. ఇక్కడ ట్రెక్కింగ్‌కు అనుకూలంగా 2.3 కిలోమీటర్ల పొడవైన మార్గం ఉంది. కర్ణాటకలో అత్యంత ప్రాచుర్యం పొందిన ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్ ప్రాంతాల్లో శివగంగ దుర్గం ముందువరుసలో ఉంది.

తురహళ్లి...


బెంగళూరు శివారులో కనకపురరోడ్డులో తురహళ్లి ఉంది. ఇక్కడ చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ తీసుకోవచ్చు. దీనికి దగ్గరగా రావుగుండ్లు అనే ప్రాంతంలో కూడా రాక్ క్లైంబింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. కనకపురనుంచి చెన్నపట్టణ వెళ్లే మార్గంలో వచ్చే కబ్బాల దుర్గంలో కూడా రాక్ క్లైంబింగ్ చేయడానికి యువత ఆసక్తి చూపుతున్నారు.

బాదామి...


హంపీకి 150 కిలోమీటర్ల దూరంలోని బాదామి రాక్ క్లైంబర్స్‌కు స్వర్గధామం. ఈ క్రీడలో శిక్షణ పొందాలనుకునేవారికి సహజ పరిసర ప్రాంతాల్లో ఇక్కడ అవకాశం ఉంటుంది. బాదామి గుహలు పర్యాటకులను కనువిందు చేస్తాయనడంలో ఎలాంటి సందేహంలేదు. ఇక్కడ ప్రకృతి అందాలు నయనమనోహరంగా ఉంటాయి.



శివగంగలో నంది విగ్రహం వద్దకు వెళ్లేందుకు కొండ ఎక్కుతున్న సాహస క్రీడాకారులు



కొండను అధిరోహిస్తున్న యువతి



యానా రాక్స్

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

యశవంతపుర: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన వైట్‌ఫీల్డ్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెన్నసంద్ర వద్ద జరిగింది. బళ్లారికి చెందిన దాదావలి (28) అనగొండనహళ్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి బైక్‌పై విధులకు వెళ్తుండగా చెన్నసంద్ర వద్ద నీటి ట్యాంకర్ ఢీకొంది. తలకు బలమైన గాయాలు కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వైట్‌ఫీల్డ్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ముడా అక్రమాలపై సీబీఐతో దర్యాప్తు చేయించాలి

దొడ్డబళ్లాపురం: ముడా ఇళ్ల స్థలాల పంపిణీలో ముఖ్యమంత్రి కుటుంబంపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిద్దూ తన పదవికి రాజీనామా చేసి సీబీఐతో దర్యాప్తు చేయించాలని, లేని పక్షంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనాందోళన చేపడతామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర తెలిపారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. సిద్దరామయ్య భార్య పేరుపై ఏకంగా 14 సైట్లు మంజూరు చేశారని, దీన్ని బట్టి స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగినట్టు స్పష్టంగా తెలుస్తోందన్నారు. ముడాలో అక్రమాలు జరిగాయని చెప్పిన కలెక్టర్‌ను హుటాహుటిన బదిలీ చేశారన్నారు. ముడా భూకుంభకోణంలో ముఖ్యమంత్రి పాత్ర ఉన్నట్టు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి నిజాయితీపరుడే అయితే సీబీఐతో దర్యాప్తు చేయించాలన్నారు.

బైక్ వీలింగ్‌పై పోలీసుల చర్యలు



స్వాధీనం చేసుకున్న స్కూటీలు

యశవంతపుర: వీలింగ్‌పై పోలీసులు కొరడా ఝుళిపించారు. హలసూరు పరిధిలో బైక్ వీలింగ్ చేస్తూ వాహనదారులు, పాదచారులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. రెండు స్కూటీలను సీజ్ చేశారు.

విదేశీ చాక్లెట్లకు నకిలీ లేబుల్స్ వేసి విక్రయాలు

- గుట్టు రట్టు చేసిన సీసీబీ పోలీసులు
- రూ.కోటి విలువైన చాకెట్లు స్వాధీనం



పట్టుబడిన నరేంద్రసింగ్



విదేశీచాక్లెట్లను పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద్, చంద్రగుప్త తదితరులు

బనశంకరి: విదేశీ చాక్లెట్లను అక్రమ మార్గంలో సేకరించి భారతీయ ఆహార సురక్షిత, నాణ్యత ప్రాధికార(ఎఫ్ఎస్ఎస్ఏఐ) పేరుతో స్టిక్కర్లు అంటించి విక్రయించే వంచకుడి వ్యవహారం బట్టబయలైంది. సీసీబీ పోలీసులు వంచకుడిని అరెస్ట్ చేసి రూ.కోటి విలువైన విదేశీ చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద్ వివరాలు వెల్లడించారు. కలాసిపాళ్య పోలీస్‌స్టేషన్ సరిహద్దు సుధామనగర నారాయణస్వామి లేఔట్‌కు చెందిన నరేంద్రసింగ్ (45) విదేశాలనుంచి అక్రమంగా చాక్లెట్లు, పానీయాలు, బిస్కెట్లను దిగుమతి చేసుకొని గోదాములో నిల్వ చేశాడు. వాటికి ఎఫ్ఎస్ఎస్ఏఐ పేరుతో నకిలీ స్టిక్కర్లను అంటించి సూపర్‌మార్కెట్లు, మాల్స్‌కు సరఫరా చేసేవాడు. పక్కా సమాచారంతో సీసీబీ పోలీసులు బుధవారం గోదాముపై దాడిచేసి నరేంద్రసింగ్‌ను అరెస్ట్‌చేశారు. ఆహారశాఖ డిప్యూటీ డైరెక్టర్ బృందం వచ్చి చాక్లెట్లను పరిశీలించింది. విదేశాలనుంచి ఎలాంటి అనుమతి లేకుండా దిగుమతి చేసుకొని నకిలీ స్టిక్కర్లు అంటించారని తేల్చారు. ఆరేళ్లుగా నిందితుడు ఈ నకిలీ చాక్లెట్లను విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. విలేకరుల సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్లు సతీశ్‌కుమార్, చంద్రగుప్త తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం

- భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో రాష్ట్రంలో మరో విమానాశ్రయం నిర్మిస్తామని భారీ పరిశ్రమల శాఖా మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వంద మిలియన్ ప్రయాణికుల సామర్థ్యంతో విమానాశ్రయం నిర్మించాలనే యోచన ఉందన్నారు. కనకపుర, జిగణి, రామనగరతో పాటు నాలుగైదు చోట్ల స్థలం కోసం చూస్తున్నామన్నారు. విమానాశ్రయం ఏర్పాటుకు దాదాపు 3వేల ఎకరాలు అవసరమన్నారు. బెంగళూరుకు 150 కిలోమీటర్ల లోపల కొత్త విమానాశ్రయం నిర్మించరాదని నిబంధన ఉందన్నారు. కర్ణాటకలో రెండో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తామని ప్రకటించిన తరువాత తమిళనాడు ప్రభుత్వం కూడా మరో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్నట్లు ప్రకటించిందన్నారు.

ఎల్ఈడీ వాహనాలకు జరిమానాలు

యశవంతపుర: అధిక వెలుగునిచ్చే దీపాలను అమర్చిన వాహనాలపై బెంగళూరు పోలీసులు దాడులు కొనసాగిస్తున్నారు. మంగళవారం రాత్రి 404 వాహనాలను తనిఖీ చేసి ఎల్ఈడీ లైట్లు వినియోగిస్తున్న 191 వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేసి రూ.95 వేల జరిమానా వసూలు చేశారు. వాహన డ్రైవర్లపై చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

దర్శన్‌కు మద్దతుగా వీలింగ్

- ఆటో డ్రైవర్ అరెస్ట్

దొడ్డబళ్లాపురం: ఆటోతో వీలింగ్ చేసిన ఆరోపణపై దర్శన్ అభిమానిని నార్త్ డివిజన్ ట్రాఫిక్ పోలీసులు అరెస్టు చేశారు. హాసన్ జిల్లా హొళెనరసీపుర తాలూకా దొడ్డకాడనూరు గ్రామానికి చెందిన జగదీష్ బెంగళూరులో ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దర్శన్‌కు జైలులో కేటాయించిన నంబర్‌ను జగదీష్ తన ఆటోపై రాయించుకొని వాటాళ్ నాగరాజు రోడ్డులోని అండర్‌పాస్ వద్ద వీలింగ్ చేశాడు. ఈ దృశ్యాలను సోషల్ మీడియా ఖాతాలో అప్‌లోడ్ చేశాడు. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో కేసు నమోదు చేసుకుని ఆటోను సీజ్ చేసి జగదీష్‌ను అరెస్టు చేశారు.

రాష్ట్రంలో జపాన్, దక్షిణకొరియా పెట్టుబడులు



మాట్లాడుతున్న మంత్రి ఎంబీ.పాటిల్

బనశంకరి: రాష్ట్రంలో జపాన్, దక్షిణకొరియా కంపెనీలు రూ.6, 450 కోట్ల మేర పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయని భారీ మధ్య తరహా పరిశ్రమలు శాఖామంత్రి ఎంబీ.పాటిల్ తెలిపారు. బుధవారం ఆయన విధానసౌధలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఉన్నతస్థాయి కమిటీ జపాన్, దక్షిణకొరియాలో పర్యటించి అక్కడి బహుళజాతి కంపెనీల ప్రతినిధులతో జూన్ 24నుంచి జూలై 25వరకు చర్చలు జరిపి పెట్టుబడులపై ఒప్పందం కుదుర్చుకుందన్నారు. దీంతో రాష్ట్రంలో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

హోసూరు వార్తలు..

డ్యాం నుంచి పొలాలకు నీరు



నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు సమీపంలోని ఆవులపల్లి వద్ద ఏర్పాటు చేసిన కెలవరపల్లి రిజర్వాయర్ నుంచి బుధవారం సాగునీరు విడుదల చేశారు. కెలవరపల్లి రిజర్వాయర్ గేట్లు తుప్పు పట్టిపోవడంతో గత ఏడాదిగా చేపట్టిన మరమ్మత్తులు పూర్తయ్యాయి. ఆ మేరకు బుధవారం నుంచి గేట్లు ఎత్తి రైతులకు సాగునీరు విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ శరయు, ఎంపీ కే.గోపినాథ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 22 గ్రామాలకు చెందిన రైతులకు లబ్ధి కలుగుతుందని, 120 రోజుల పాటు సాగునీరు అందజేస్తున్నట్లు తెలిపారు.

విదేశీ నిధి అని రూ.8 లక్షలు మోసం

హోసూరు: మీ పాఠశాల అభివృద్ధికి విదేశీ నిధులు వచ్చాయని, ఇందుకోసం పన్నులు చెల్లించాలని ప్రైవేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని వద్ద రూ.8.23 లక్షలు కాజేశారు. వివరాల మేరకు.. హోసూరు తాలూకా మత్తిగిరి ప్రాంతానికి చెందిన ప్రైవేట్ పాఠశాల హెచ్ఎంకు గత నెల ఓ వ్యక్తి సెల్‌ఫోన్ ద్వారా సంప్రదించాడు. మీ పాఠశాలకు విదేశీ నిధులు వచ్చాయి, అవి అందాలంటే కొన్ని పన్నులు కట్టాలి అని చెప్పారు. నిజమేననుకున్న ఆమె వారందజేసిన బ్యాంకు ఖాతాలకు విడతలవారీగా రూ.8.23 లక్షల నగదును జమ చేసింది. తరువాత సదరు మోసగాని నంబర్ స్విచ్ఛాఫ్ అని రావడంతో మోసపోయిన ఆమె క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బైక్‌లు తరలిస్తున్న లారీ దగ్ధం



లారీలో నుంచి మంటలు వస్తున్న దృశ్యం

కెలమంగలం: బైక్‌లను తరలిస్తున్న లారీకి నిప్పంటుకొని కాలిపోయిన ఘటన బుధవారం మధ్యాహ్నం కెలమంగలం పరిధిలో చోటు చేసుకొంది. ఉద్దనపల్లి టీవీఎస్ కంపెనీకి చెందిన గిడ్డంగి నుంచి హోసూరు సమీపంలోని కొత్తగొండపల్లికి వద్దనున్న ఫ్యాక్టరీకి 40 ద్విచక్రవాహనాలను లారీలో తరలిస్తున్నారు. కెలమంగలం కూడలిరోడ్డు వద్ద లారీలో మంటలు చెలరేగాయి. స్థానికులు కెలమంగలం పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందజేశారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పారు. కానీ అంతలోపే లారీతో పాటు ద్విచక్ర వాహనాలు కూడా దగ్ధమయ్యాయి. దీంతో భారీగా ఆస్తి నష్టం చోటుచేసుకుంది. కెలమంగలం పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

బలవంతపు పెళ్లి.. బాలిక ఆత్మహత్య

కెలమంగలం: నేను బాగా చదువుకుంటాను, నాకు పెళ్లి ఇష్టం లేదని చెప్పినా పట్టించుకోకుండా బాల్య వివాహం జరిపించడంతో విరక్తి చెందిన బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన డెంకణీకోట పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో భర్తను అరెస్ట్ చేసి, మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల మేరకు.. డెంకణీకోట సమీపంలోని తట్టసంద్రం గ్రామానికి చెందిన చంద్రన్ (45), అతని భార్య మాల (40) దంపతుల కూతురు దివ్యప్రియ(17). ధర్మపురిలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతోంది. ఈమెకు మార్చి 21వ తేదీన అదే గ్రామానికి చెందిన అజిత్‌కుమార్ (26)తో బలవంతంగా వివాహం జరిపించారు. దీంతో ఆవేదనకు లోనైన దివ్యప్రియ గత 7వ తేదీ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబీకులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది. ఈ ఘటనపై డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేసుకొని బాలిక భర్త అజిత్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. బాలిక తల్లిదండ్రులు, అలాగే బంధువులను అదుపులోకి తీసుకుని విచారణ చేట్టారు.

డాక్టర్‌కు సన్మానం

హోసూరు: ఉత్తమ సేవలందజేసి తమిళనాడు ప్రభుత్వంచే ఉత్తమ డాక్టర్‌గా అవార్డు అందుకొన్న హోసూరుకు చెందిన డాక్టర్ షణ్ముగవేలును లయన్స్‌క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. రాష్ట్రమంతటా ఉత్తమ వైద్యులను గుర్తించి అవార్డులను అందజేయగా అందులో హోసూరువాసి షణ్ముగవేలు ఉన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు పద్మనాభన్, సెందిల్‌కుమార్, విజయ్‌కుమార్, ఇళంగోవన్, మణి, రవివర్మ పాల్గొన్నారు.

అడవి పంది అడ్డువచ్చి.. బైకిస్టు మృతి

కెలమంగలం: ద్విచక్రవాహనానికి అడవి పంది అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడగా తండ్రి మరణించాడు, కూతురికి తీవ్ర గాయాలయ్యాయి. తళి పరిధిలో ఈ ప్రమాదం చోటు చేసుకొంది. వివరాల మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం ఓవల్ గ్రామానికి చెందిన సారాయకుమార్ సాహు (46), కుటుంబంతో సహా తళి సమీపంలోని అగళకోట వద్ద నిర్వహిస్తున్న ప్రైవేట్ ఎస్టేట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. గత 7వ తేదీ కూతురు పాయల్ కుమారి (12)తో కలిసి బైక్‌లో తళి వైపు వెళుతున్నాడు. మారుపల్లి వద్ద ఆకస్మాత్తుగా అడవి పంది అడ్డు రావడంతో కిందపడిపోయారు. తీవ్ర గాయాలేర్పడిన ఇరువురిని స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించక సారాయకుమార్ సాహు మంగళవారం రాత్రి మృతి చెందాడు.

ఘనంగా సహకార సంఘం వార్షికోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె పట్టణం స్వామి వివేకానంద నగర్‌లో ఉన్న శ్రీవారి కళ్యాణ మండపంలో హొసకోటె ప్రాథమిక గ్రామీణ కృషి సహకార సంఘం, పట్టు సాగు రైతులు సేవా సహకార సంఘం 49వ వార్షిక సమావేశం బుధవారం జరిగింది. హొసకోటె ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ, మాజీ మంత్రి, మాజీ ఎంపీ బి.ఎన్.బచ్చేగౌడ హాజరయ్యారు. సంఘం ప్రగతిని కొనియాడారు. అనంతరం ఉత్తమ రైతులను సన్మానించారు.

అమ్మాయి అపహరణ

క్రిష్ణగిరి: ఇంటి నుంచి బయటకెళ్లిన బాలికను కిడ్నాప్ చేశాడని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. క్రిష్ణగిరి జిల్లా సామలపట్టి సమీపంలోని గంజూరు గ్రామానికి చెందిన 17 ఏళ్ల అమ్మాయి గత రెండు రోజుల నుంచి కనిపించడం లేదు. తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా జాడ తెలియలేదు. అదే ప్రాంతానికి చెందిన దేవేంద్రన్ (22) బాలికను కిడ్నాప్ చేసినట్లు తెలిసింది.

విభూతి జలపాతం అందాలను చూడలేమా!

యశవంతపుర: ఉత్తర కన్నడ జిల్లాలో ప్రసిద్ధ జలపాతాల్లో ఒకటైన అంకోలా తాలూకా అచవె గ్రామంలోని విభూతి జలపాతం వీక్షించడంపై అధికారులు ఆంక్షలు విధించారు. వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో విభూతి జలపాతం జోరు మీద ఉంది. గంటగంటకూ నీటి ఉధృతి పెరుగుతోంది. దీనికితోడు విష జంతువులు, చెట్ల కొమ్మలపై నుంచి దూకే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్తల్లో భాగంగా పర్యాటకులు రాకుండా ఆంక్షలు విధించారు.

పెళ్లి చేసుకోవాలని బాలికకు బెదిరింపులు

- నిందితుడి అరెస్ట్



నిందితుడు సచిన్

మండ్య: పెళ్లి చేసుకోవాలని మైనర్ బాలికను బెదిరించిన ఘటన మండ్య జిల్లా సాసలు కొప్పలులో జరిగింది. హాసన్ జిల్లా చెన్నరాయపట్టణం తాలూకా కే. హొసహళ్లి గ్రామానికి చెందిన సచిన్‌కు సాసలు కొప్పలుకు చెందిన మైనర్ బాలిక సోషల్ మీడియాలో పరిచయమైంది. నిన్ను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. అయితే తనకు పెళ్లి ఇష్టం లేదని బాలిక పేర్కొంది. పెళ్లి చేసుకోకపోతే నిన్ను, మీ అమ్మను కూడా హత్య చేస్తానని బెదిరించాడు. దీంతో బాలిక ఈ విషయాన్ని ఇంటిలో తెలిపింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు.

క్లుప్తంగా...

తమిళనాడుకు ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్

పాలసముద్రం (చిత్తూరు జిల్లా): అక్రమంగా ఇసుకను తమిళనాడుకు తీసుకెళ్లుతున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు పాలసముద్రం ఎస్‌ఐ భారతి తెలిపారు. బుధవారం గుండుబావి వద్ద ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఆపి తనిఖీ చేశామన్నారు. డ్రైవర్ సంజయ్ కుమార్ వద్ద టిప్పర్‌కు సంబంధించిన రికార్డులు లేవనీ, విచారిస్తే ఇసుకను తమిళనాడుకు తీసుకెళుతున్నట్లు డ్రైవర్ చెప్పాడన్నారు. ఈ ఇసుక తెల్లగుండ్లపల్లికి చెందిన కిరణ్‌ది అనీ, టిప్పర్ సీజ్ చేశామనీ, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భారతి తెలిపారు.

మంత్రి పేరిట ఇసుక అక్రమ రవాణా!

మడపాం ర్యాంపు నుంచి యథేచ్ఛగా తిరిగిన ట్రాక్టర్లు



మడపాం వద్ద వంశధార నదిలో నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లులో లోడు చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట మండలం, మడపాం ఇసుక ర్యాంపు నుంచి బుధవారం మంత్రి అచ్చెన్నాయుడు స్వగ్రామం నిమ్మాడకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలింది. మంత్రి అచ్చెన్న మనుషులమని చెప్పి ఉదయం నుంచి సాయంత్రం వరకూ 50 పైగా ట్రాక్టర్ల లోడులు తరలించారు. మొత్తం 300 మెట్రిక్ టన్నుల ఇసుక తరలించినట్లు సమాచారం. ఇంత బహిరంగంగా జాతీయ రహదారిపై ఎటువంటి రసీదులు లేకుండా ఇసుక తరలి వెళ్తున్నా అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంత్రికి ఒక రూలు.. సామాన్యుడికి ఒక రూలా అని కొందరు మండిపడుతున్నారు. మరోవైపు ఇసుక కొరత పెరుగుతుండటంతో టీడీపీ శ్రేణులు నదిలో, ప్రభుత్వ స్థలాల్లో పెద్ద ఎత్తున డంప్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నరసన్నపేట మండలం, బుచ్చిపేట వద్ద వంశధార నదికి వెళ్లే మార్గంలో వందల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేశారు. లుకలాంలో డీపీఈపీ స్కూల్ ఆవరణతో పాటు నదికి వెళ్లే మార్గాల్లో 50 పైగా మెట్రిక్ టన్నుల ఇసుకను అనధికారికంగా నిల్వ చేశారు. దీనిని రాత్రి సమయాల్లో తరలించి ట్రాక్టర్ ఇసుక రూ.4,500 నుంచి రూ.5 వేల వరకూ విక్రయిస్తున్నారు. లారీల్లో లోడు చేసి విశాఖకు తరలించి అమ్ముకుంటున్నారు.

యథేచ్ఛగా సిలికా అక్రమ తవ్వకాలు

- టీడీపీ నేతల నిర్వాకం



సిలికాను తవ్వుతున్న ప్రదేశంలో వాహనాలు

చిల్లకూరు (తిరుపతి జిల్లా): ఎన్నికలు ముగిశాయి.. అధికారంలోకి వచ్చాం.. కాంట్రాక్టర్లు చేపట్టే పనుల్లో ప్రథమభాగం తమ నాయకులకే చెందాలని నియోజకవర్గ టీడీపీ నేత అధికారులను ఆదేశించడంతో తీరప్రాంతంలోని టీడీపీ నాయకులకు సాగరమాల రోడ్డు పనులు వరంలా మారాయి. దీంతో తీర ప్రాంతంలో దొరికే సిలికాను యథేచ్ఛగా రోడ్డు పనులకు తరలించి టీడీపీ నేతలు సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ప్రభుత్వ భూమిలో సిలికా తవ్వకాలు చేస్తున్నారని తెలిసిన వెంటనే కేసులు నమోదు చేసేవారు. నేడు అధికార పార్టీ నాయకులు తమకు దగ్గరలో ఉన్న గ్రామంలోని సిలికా భూముల్లో (ప్రభుత్వ భూమి)లో ఇష్టానుసారంగా టిప్పర్లతో సాగరమాల రోడ్డుకు తరలించి పనులు చక్క బెట్టుకుంటూ సొమ్ము చేసుకుంటున్నా మాట్లాడే అధికారులే కరువయ్యారు. ముత్తుకూరు మండలం నారికేళపల్లి నుంచి కండలేరు క్రీక్ మీదుగా తూర్పుకనుపరు రహదారికి అనుసంధానంగా నాలుగు లేన్ల రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో క్రీక్ ఉండడంతో దానిని పూరించేందుకు ఎక్కువగా మట్టి కావాల్సి ఉంది. అయితే దూర నుంచి మట్టిని తరలించేందుకు సొమ్ము ఎక్కువ కావాల్సివస్తుంది. దీంతో ముత్తుకూరు సమీపంలోని పవర్ ప్రాజెక్టుల నుంచి తీసుకొచ్చిన బూడిదతో నింపుతున్నారు. దీంతోపాటు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో సిలికాను తవ్వి తరలిస్తున్నారు. ఇదే విషయమై గ్రామ వీఆర్‌ఓ మునిబాబు దృష్టికి తీసుకెళ్లగా సిలికా తవ్వకాలు జరిగే ప్రాంతం పక్కా రెవెన్యూ అయిన తమ్మినపట్నంలోకి వస్తుందని దాటవేశారు.

ఎయిడెడ్ టీచర్లకు పదోన్నతులు కల్పించండి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే సంస్కృత, తెలుగు, హిందీ పండితులు, పీఈటీలకు పదోన్నతి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేసింది. వీరు 6 నుంచి 10వ తరగతి వరకు బోధన చేస్తున్నా పదోన్నతులు లేకుండా గ్రేడ్–2 స్థాయిలోనే ఉండిపోయారని గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే పండితులకు పదోన్నతులు కల్పించి ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పత్రికా స్వేచ్ఛపై టీడీపీ దాడి

డెక్కన్ క్రానికల్ కార్యాలయం బోర్డుకు నిప్పంటించిన టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు



డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై దాడి చేస్తున్న తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు

ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు)/అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీల నాయకులపై దాడులు, దౌర్జన్యాలకు తెగబడుతున్న టీడీపీ.. ప్రజాస్వామ్యాన్ని మంటగలిపే రీతిలో పత్రికా స్వేచ్ఛపైనా దాడికి దిగింది. విశాఖ నగరంలోని డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై టీడీపీ అనుబంధ సంఘాల నేతలు దాడి జరిపిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై యూటర్న్ తీసుకుందంటూ డెక్కన్ క్రానికల్ పత్రిక బుధవారం ఓ కథనాన్ని ప్రచురించింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఇటీవల వేర్వేరు సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని కథనంలో పేర్కొంది. వారి మాటల సారాంశాన్ని వివరిస్తూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కూటమి యూటర్న్ తీసుకునే అవకాశం ఉందని అభిప్రాయపడింది. దీంతో టీడీపీ అనుబంధ సంఘాలైన టీఎన్‌ఎస్‌ఎఫ్, తెలుగునాడు మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు ఎంవీపీ కాలనీ, అప్పుఘర్‌లోని డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై మెరుపు దాడి చేశారు. కార్యాలయం గేటు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించి కార్యాలయం అద్దాలు, ఫర్నిచర్, పూల కుండీలను పగులగొట్టారు. కార్యాలయంలోని మహిళా సిబ్బందితో వాగ్వివాదానికి దిగి దుర్భాషలాడుతూ దూషించారు. కొంతమంది తెలుగు మహిళలు కార్యాలయం ఎదుట డెక్కన్ క్రానికల్ పేరుతో కూడిన పోస్టర్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టగా.. టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు కార్యాలయ ప్రహరీ గోడపైకి ఎక్కి బోర్డుపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. పత్రిక యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఉద్యోగులను బూతులు తిట్టారు. ఊహించని పరిణామంతో క్రానికల్ కార్యాలయ సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

పోలీసులకు ఫిర్యాదు

దాడి ఘటనపై విశాఖ డెక్కన్ క్రానికల్ ఉద్యోగులు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తమ కార్యాలయంపై దాడికి పాల్పడి కార్యాలయ ఆస్తులకు పెట్రోల్ పోసి నిప్పటించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటుకరాళ్లతో కార్యాలయ అద్దాలు, పూలకుండీలను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఉద్యోగులతో దురుసుగా ప్రవర్తించడంతో పాటు దుర్భాషలాడినట్లు ఫిర్యాదులో వివరించారు. దాడికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను సైతం పోలీసులకు అందజేశారు.

దాడి సరికాదు: సీపీఐ

పత్రికల్లో వచ్చిన వార్తల్లో అవాస్తవం ఉంటే ఖండించాలి కానీ పత్రికా కార్యాలయాలపై దాడికి పాల్పడటం సరైనది కాదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై టీడీపీ, జనసేన వాటి వైఖరిని స్పష్టం చేయాల్సి ఉందన్నారు.

దాడి అప్రజాస్వామికం

డీసీ కార్యాలయంపై టీడీపీ విద్యార్థి, తెలుగు మహిళా విభాగం దాడిని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం తీవ్రంగా ఖండించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై డెక్కన్ క్రానికల్‌లో ప్రచురించిన కథనాన్ని భరించలేని టీడీపీ కార్యకర్తలు దాడి చేయడం పత్రికా స్వేచ్ఛను కాలరాయడమేనన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

జాప్ ఖండన

డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై దాడిని జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సమంజసం కాదని జాప్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీవీఎస్ఆర్ పున్నంరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.యుగంధర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛపై టీడీపీ ప్రభుత్వ దాడిగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలాంటి దాడులపై కఠినంగా వ్యవహరించి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

హేయమైన చర్య: ఏపీడబ్ల్యూజేఎఫ్

డెక్కన్ క్రానికల్ పత్రిక కార్యాలయంపై టీడీపీ కార్యకర్తలు దాడి హేయమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు ఒక ప్రకటన విడుదల చేశారు. మీడియాపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాగా.. దాడిని ఏపీబీజేపీ రాష్ట్ర నాయకులు కె.మునిరాజ్, వి.శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు.

చంద్రబాబు బాధ్యత వహించాలి: వైఎస్ జగన్



డెక్కన్ క్రానికల్ పత్రిక కార్యాలయంపై టీడీపీకి చెందిన వ్యక్తులు దారుణంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొన్నారు. మీడియాను అణచివేసేందుకు టీడీపీ గుడ్డిగా చేసిన మరో ప్రయత్నం ఇది అని దుయ్యబట్టారు. కొత్త పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్య ఉల్లంఘన నిరంతరం జరుగుతోందన్నారు. దీనికి సీఎం చంద్రబాబు బాధ్యత వహించాలన్నారు.

'విశాఖ స్టీల్' అమ్మేద్దాం!

▶ మొదటి పేజీ తరువాయి

విశాఖ ఉక్కు విక్రయానికి టీడీపీ అనుకూలమని.. ఈ మేరకు ఆ పార్టీ ఉన్నతస్థాయి వర్గాలు పేర్కొన్నాయంటూ కథనాన్ని ప్రచురించింది. తాజాగా మరో ఆంగ్ల పత్రిక డెక్కన్ క్రానికల్ సైతం ఇదే తరహాలో మరో కథనాన్ని అచ్చేసింది. జాతీయ మీడియా కథనాలతో సోషల్ మీడియాలోనూ విశాఖ స్టీల్ ప్లాంట్‌పై విస్తృత స్థాయిలో చర్చ నడుస్తోంది. మూడు రోజుల క్రితం విశాఖలో టీడీపీ ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ తాము గత ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఉంటే విశాఖ ఉక్కును కాపాడేవాళ్లమని.. ఇప్పుడు కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీలతో కలిసి కూటమి ప్రభుత్వంగా ఉండటంతో చాలా ఇబ్బందులున్నాయని అసలు విషయాన్ని చెప్పేశారు. దీన్ని ప్రజలు అర్థం చేసుకుంటారంటూ ఆయన సన్నాయి నొక్కులు నొక్కడం గమనార్హం. కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని శాసించే స్థాయిలో ఉండి కూడా ప్రైవేటీకరణను అడ్డుకోకుండా ఇబ్బందులు అంటూ రాగాలు తీయడంపై స్టీల్ ప్లాంట్ కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒడిశాకు చెందిన నీలాంచల్ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌ను రూ.12,100 కోట్లకు టాటా గ్రూపు కొనుగోలు చేసి విస్తరణ చేపట్టింది. అదేవిధంగా విశాఖ స్టీల్‌ను భారీగా విస్తరించడం ద్వారా మరింత మందికి ఉపాధి కల్పించే ప్రైవేటు సంస్థకు కేంద్రం విక్రయించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీన్లో భాగంగానే కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి తాజాగా విశాఖ స్టీల్‌ను సందర్శించారు. ప్రస్తుత తరుణంలో రాష్ట్రంలో ఒక భారీ ప్రైవేటు సంస్థ పెట్టుబడి పెడితే దాని ద్వారా ఉపాధి లభిస్తుందంటూ టీడీపీ కూడా ప్రైవేటీకరణకు అంగీకారం తెలిపినట్లు కేంద్ర వర్గాలు పేర్కొంటున్నాయి.



కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామికి స్వాగతం పలుకుతున్న సీఎండీ భట్

రంగం సిద్ధం..

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడానికి దాదాపు రంగం సిద్ధమైంది. ఒకప్పుడు 10 శాతం, 20 శాతం షేర్లు డిజిన్వెస్ట్‌మెంట్ అంటూ భయపెట్టిన కేంద్ర ప్రభుత్వం ఈసారి వ్యూహాత్మక అమ్మకం (స్ట్రాటజిక్ సేల్) పేరిట ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి ఆరాటపడుతోంది. దీనికి చంద్రబాబు ప్రభుత్వం మడుగులొత్తుతోంది. రాష్ట్రంలో అధికారం మారిన వెంటనే కేంద్రం ఈ విషయంలో దూకుడుగా వ్యవహరిస్తోంది. రూ.2,859 కోట్ల నష్టాల సాకుతో కేంద్రం స్టీల్ ప్లాంట్‌లో 100 శాతం పెట్టుబడులు ఉపసంహరించడానికి, దాన్ని ప్రైవేటుపరం చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రైవేటీకరణ చేస్తే తమకెలాంటి ఇబ్బంది లేదని చంద్రబాబు చెప్పినట్లు తెలుస్తోంది. 'ప్రైవేట్ చేతికిస్తే పెట్టుబడులు పెరుగుతాయి కదా' అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటికే వివిధ నగరాల్లో ఆస్తుల విక్రయానికి రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) టెండర్లను కూడా ఆహ్వానించడం గమనార్హం.

గనుల కేటాయింపులో వివక్ష వల్లే..

దేశంలోని ప్రైవేటు ప్లాంట్లకు గనులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించడంలో వివక్షత చూపుతూ వస్తోంది. దీని వల్ల ఇతర ప్లాంట్లలో టన్నుకు 40 శాతం ముడి పదార్థాలకు వ్యయమవుతుండగా సొంత గనులు లేని విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 65 శాతం వ్యయమవుతోంది. దీనివల్ల కొన్నిసార్లు ఉత్పత్తి వ్యయం కంటే తక్కువకే ఉత్పత్తులను స్టీల్‌ప్లాంట్ అమ్ముకోవాల్సివస్తోంది. దీంతో గత నాలుగేళ్లలో మూడేళ్ల పాటు నష్టాలను చవి చూసింది. ఈ పరిస్థితుల్లో ప్లాంట్ రుణాలు రూ.20 వేల కోట్లకు మించిపోయాయి. అయితే స్టీల్‌ప్లాంట్ గత ముప్పై ఏళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ పన్నుల రూపేణా రూ. 40 వేల కోట్లు చెల్లించడం గమనార్హం.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అనివార్యం

ఇటీవల ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నుంచి బీజేపీ తరఫున ఎంపీగా గెలిచి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రిగా ఉన్న శ్రీనివాసవర్మ అయితే ప్రైవేటీకరణ అనివార్యమని మరోసారి స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు భారీ నష్టాల్లో ఉందని, ప్రజాధనం వృథా కావడాన్ని తమ ప్రభుత్వం అంగీకరించదని స్పష్టం చేశారు. 7 మిలియన్ టన్నుల కంటే అత్యల్ప స్థాయిలో ఉత్పత్తి చేస్తూ గతేడాది రూ.2,859 కోట్ల నష్టాలను మూటకట్టుకుందన్నారు. 2011–12లో రూ.13,659 కోట్ల మూలధనం కలిగిన విశాఖ స్టీల్ ఇప్పుడు రూ.391 కోట్లకు పడిపోయిందని తెలిపారు. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉందని, ఈ సమయంలో ప్రైవేటీకరణ తప్ప మరే మార్గం లేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం మంత్రుల పరిధిలో లేదని.. ప్రధాని నాయకత్వంలో కేబినెట్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. బుధవారం ఆయన విశాఖపట్నంలో మాట్లాడారు. సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనం ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయన్నారు. వాటిపై కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌లో పరిస్థితులపై అవగాహన కోసమే కేంద్రమంత్రి కుమారస్వామి విశాఖ వచ్చారని తెలిపారు. కేంద్ర మంత్రులిద్దరూ గురువారం స్టీల్ ప్లాంట్‌లోని పలు ఉత్పత్తి విభాగాలను సందర్శిస్తారు. అనంతరం ప్లాంట్ యాజమాన్యంతో సమావేశమవుతారు.

పవన్ మౌనమేల?

ఎన్నికల ముందు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు కూటమి నేతలు ప్రైవేటీకరణకు మద్దతుగా బహిరంగంగా ప్రకటనలు జారీ చేస్తున్నా మౌనంగా ఉండటంపై విశాఖ ఉక్కు కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జనసేనకు కనీసం ఒక ఎమ్మెల్యే లేదా ఒక ఎంపీ ఉన్నా ప్రైవేటీకరణను అడ్డుకునేవాడినని పవన్ గతంలో అన్నారు. ఇప్పుడు ఆయన ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన పార్టీకి పవన్‌తో కలిపి 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నా మాట్లాడకపోవడంపై కార్మికులు మండిపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న జనసేన ఎంపీలు ఈ అంశంపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు. కేంద్రం విశాఖ స్టీల్‌ను ప్రైవేటీకరణ చేయాలని 2021లోనే నిర్ణయం తీసుకున్నప్పటికీ.. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గట్టిగా వ్యతిరేకించింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశాఖ స్టీల్ పునరుద్ధరణకు చేపట్టాల్సిన అంశాలతో ప్రత్యేక రోడ్ మ్యాప్‌ను ఇవ్వడం ద్వారా ప్రైవేటీకరణను అడ్డుకున్నారు. కానీ ఇప్పుడు కేంద్రంలో చక్రం తిప్పే స్థాయిలో టీడీపీ ఉన్నప్పటికీ ప్రైవేటీకరణకు అనుకూలంగా అడుగులు వేస్తుండటం ఆందోళన కలిగిస్తోందని ఉద్యోగ సంఘాలు వాపోతున్నాయి.

జిల్లేళవారిపేటలో శిలాఫలకం మాయం



ఇక్కడ నుంచే శిలాఫలకం మాయం

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలోని జిల్లేళవారిపేటలో ముమ్మిడి వరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రారంభోత్సవం చేసిన వాటర్ ట్యాంకు శిలాఫలకాన్ని మాయం చేశారు. జిల్లేళవారిపేట ఎస్సీకాలనీకి మంచినీరు అందించాలనే లక్ష్యంతో పొన్నాడ వెంకట సతీష్ కుమార్ జలజీవన మిషన్ నిధులు రూ.54 లక్షలతో 40 వేల లీటర్ల ట్యాంకును, పైప్‌లైన్ పనులు, ఇంటింటా కుళాయిల పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎవరో మాయం చేశారు. ఇటీవల చర్చికి వెళ్లే పంచాయతీ పైపులైన్‌ను అధికార పార్టీకి చెందిన వారు కట్ చేశారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ నేతల దాడి

- రియల్ ఎస్టేట్ స్థలం చూపించాలని తీసుకెళ్లి దాడి
- పాత కక్షల నేపథ్యంలో ఘటన



చికిత్స పొందుతున్న పేజీరాజ్

వెంకటగిరి రూరల్ : రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించి స్థలం చూపించాలంటూ నమ్మకంగా కోరి అక్కడికి వెళ్లాక వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ నేతలు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు, పోలీసులు కథనం మేరకు తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత తంగా పేజీరాజ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. అదే పట్టణానికి చెందిన నరసింహులు పేజీరాజ్ వద్దకు వచ్చి విక్రయాలకు సిద్ధంగా ఉన్న స్థలాలు చూపించాలని కోరాడు. పేచీరాజ్, పట్టణానికి చెందిన కిషోర్ ఓ బైక్‌పై, నరసింహులు మరో బైక్‌పై పరశురాం కాలనీలోని విక్రయానికి ఉన్న స్థలాన్ని పరిశీలించేందుకు బుధవారం వెళ్లారు. అక్కడ స్థలం గురించి పేజీరాజ్ వివరిస్తున్న సమయంలో నరసింహులు కత్తితో పేజీరాజ్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో పేజీరాజ్‌కు తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడితో పాటు వచ్చిన కిషోర్ ఆయన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పార్టీలకు సంబంధించిన పాత కక్షల నేపథ్యంలో ఈ దాడి జరిగినట్టు వైఎస్సార్‌సీపీ నేతలు చెబుతున్నారు. దాడి ఘటనపై వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరా తీశారు. వెంకటగిరి వైఎస్సార్‌సీపీ నేతలు జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణలతో పాటు పలువురు పార్టీ నేతలు ఆస్పత్రిలో పేచీరాజ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు

తాడికొండ : గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వడ్డమానుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి రెండు రోజులుగా పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. గ్రామంలో టీడీపీకి చెందిన బ్యానర్‌ను వారే చింపుకొని వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసును బనాయించిన టీడీపీ నేతలు.. రెండు రోజులుగా వారిని ఇంటికి పంపొద్దంటూ పోలీసులకు హుకుం జారీ చేశారు. దీంతో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొట్టం వెంకటనర్సిరెడ్డి, వల్లంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిలను పోలీసులు నిర్బంధించారు. శ్రీకాంత్‌రెడ్డి అనంతపురంలో ఉద్యోగం చేసుకుంటూ భార్యను గ్రామంలో వదిలిపెట్టి వెళ్లేందుకు రాగా.. అతనిపైనా అక్రమంగా కేసు పెట్టి నిర్బంధించడం విశేషం. కేసు నమోదు చేసి 24 గంటలు దాటినా, స్టేషన్ బెయిల్ ఇచ్చే కేసు అయినప్పటికీ పోలీసులు రెండు రోజులుగా స్టేషన్‌లోనే ఉంచారని బాధితుల బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం

- దారి కాచి కట్టెలు, కొడవలితో దాడి
- అనంతపురం జిల్లాలో ఘటన



గాయపడ్డ శ్రీరాములు

యాడికి : వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ నేతల దాడులు, హత్యాయత్నాలు కొనసాగుతున్నాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం యాడికి మండలం గుడిపాడులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, గ్రామ సర్పంచ్ దండు సావిత్రి చిన్నాన్న దండు శ్రీరాములుపై టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడి చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దండు శ్రీరాములు వైఎస్సార్‌సీపీ తరఫున చురుగ్గా పని చేశారు. దీన్ని టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. శ్రీరాములు బుధవారం సాయంత్రం నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం గొర్విమాను పల్లె సమీపంలోని గనుల్లో పనిచేసి బైక్‌పై వస్తుండగా.. గొర్విమానుపల్లె సమీపంలో సుంకులమ్మ ఆలయం వద్ద గుడిపాడుకు చెందిన టీడీపీ నాయకులు బాలాంజనేయులు, సంజీవరాయుడు వర్గీయులైన రహీం, అశోక్, హరి, హిమాం, భాస్కర్ తదితరులు అడ్డుకుని కట్టెలు, కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు శ్రీరాములును తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నేతల ఎంట్రీతో ముదిరిన బుడంపాడు వివాదం

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు రూరల్: గుంటూరు మండలం బుడంపాడులోని భూ వివాదం అధికారులకు, పోలీసులకు తలనొప్పిగా మారింది. చాలాకాలంగా నడుస్తున్న ఈ వివాదంలోకి టీడీపీ నేతలు ప్రవేశించడంతో మరింత ముదిరింది. ఈ సివిల్ పంచాయితీపై పోలీసులు కేసు కట్టినా తమకు న్యాయం జరగలేదంటూ రెండు వర్గాలు ఆరోపణలు చేస్తుండటంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. పోలీసులు సివిల్ పంచాయితీలు చేస్తున్నారంటూ ఒక వర్గం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. గుంటూరు నగరంలోని అరండల్‌పేట 3వ లైన్‌కు చెందిన వింజమూరి రాఘవాచారికి తండ్రి పార్థసారథి వారసత్వంగా బుడంపాడు గ్రామంలోని సర్వే నంబర్ 420–2లో 3.87 ఎకరాల భూమి ఉంది. దీనిని గతంలో కౌలుకు ఇచ్చారు. తర్వాత కౌలుదారుడు ఈ భూమి తనదేనంటూ కోర్టును ఆశ్రయించడం, కౌలు చట్టాల ప్రకారం కోర్టు తీర్పు ఇచ్చింది. కౌలుదారుడు మృతి చెందడంతో తమకే భూమి చెందాలని భూ యజమానులు కోర్టును ఆశ్రయించారు. కౌలుదారుని కుమారుడు తనకే చెందాలంటూ పట్టుపడుతుండటంతో వివాదం ముదిరింది. ఈ క్రమంలో ఈ ఏడాది మే 20న తన భూమిని కొలిచి హద్దులు నిర్ణయించి ఇవ్వాలని గుంటూరు ఈస్ట్ తహసీల్దారు కార్యాలయానికి రాఘవాచారి అర్జీ దాఖలు చేశారు. దీంతో సర్వేయర్ పున్నంరాజు, బుడంపాడు గ్రామానికి చెందిన వీఆర్‌వో మే 28న చుట్టుపక్కల భూమి ఉన్నవారిని పిలిపించారు. రాఘవాచారి పొలానికి సరిహద్దులో ఉన్న దానబోయిన లక్ష్మీనారాయణ తదితరుల సమక్షంలో భూమికి కొలతలు వేసి నాలుగు వైపుల నాలుగు అడుగుల ఎత్తులో హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. మే 29వ తేదీన బుడంపాడు గ్రామానికి చెందిన పెద్దినేని వెంకటరామయ్య, మైనేని గోవిందరావు, సవరం లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు, మార్తాల అల్లేశ్వరరావు భూమిలో సర్వేయర్ ద్వారా కొలతలు వేయించి ఏర్పాటు చేసిన హద్దురాళ్లు పీకివేయించారు. తన భూమిని కబ్జా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారంటూ రాఘవాచారి నల్లపాడు పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు సివిల్ పంచాయితీ చేస్తున్నారంటూ అధికార పార్టీకి చెందిన నేతలు ఆరోపణలు చేయడం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో అక్కడ సీఐగా ఉన్న నరేష్ ఐదు రోజులు వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. కొత్త సీఐ కూడా ఈ వివాదానికి ముగింపు పలకలేదు. మళ్లీ పాత సీఐ బాధ్యతలు స్వీకరించడంతో ఆ వర్గం ఆరోపణలకు దిగింది. పోలీసులపై పోలీస్ కంప్లైంట్ అథారిటీని ఆశ్రయించి ఫిర్యాదు చేసింది.

బాలికపై అత్యాచారం.. ఆపై హత్య!

నాలుగు రోజులైనా లభించని ఆచూకీ

పగిడ్యాల : నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం కొత్త ముచ్చుమర్రి గ్రామంలో నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన మైనర్ బాలికను అత్యాచారం చేసి ఆపై హత్య చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ముగ్గురు మైనర్ బాలురు ఈ కిరాతకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘాతుకం ఎక్కడ బయటపడుతుందోనని మృతదేహాన్ని గోనెసంచిలో కుక్కి రాళ్లు వేసి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌లో పడేసినట్టు పోలీసులు భావిస్తున్నారు. అయితే నాలుగు రోజులైనా బాలిక ఆచూకీ లభించకపోవడం కలకలం రేపుతోంది. కొత్త ఎల్లాలకు చెందిన తొమ్మిదేళ్ల బాలిక స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. గత ఆదివారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ముగ్గురు మైనర్ బాలురు బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి అత్యాచారం, ఆపై హత్య చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెలుగు చూసినట్లు సమాచారం. నందికొట్కూరు రూరల్ సీఐ విజయ్‌భాస్కర్ దర్యాప్తును వేగవంతం చేసి గ్రామంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. బుధవారం మత్స్యకారులను అప్రమత్తం చేసి పంప్‌హౌస్ లింక్ చానెల్‌లో నిల్వ ఉన్న కృష్ణానది నీటిలో గాలింపు చేపట్టారు. ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైన గాలింపు చర్యల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో పోలీసులు ఎస్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ టీమ్ 20 మందిని మధ్యాహ్నం పిలిపించారు. అయినా ఫలితం లేకపోయింది. బాలిక ఆచూకీ లభించే వరకు ఎలాంటి వివరాలు వెల్లడించలేమని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి మీడియాతో చెప్పారు. అదేవిధంగా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పుంగనూరు టీడీపీ నేతల అరాచకాలు

- రోడ్లపై గాడులు, కాలువల తవ్వకాలు
- వైఎస్సార్‌సీపీ వర్గాల పంటల తరలింపునకు బ్రేక్
- పట్టించుకోని పోలీసులు
- మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదులు



సోమలలో రోడ్డుకు అడ్డంగా గాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్: అధికార తెలుగుదేశం పార్టీ ఆగడాలు పుంగనూరు నియోజకవర్గంలో రోజురోజుకు పెచ్చుమీరిపోతున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, ఓట్లు వేసిన ప్రజలపైన అధికార పార్టీ నేతల వేధింపులు వర్ణనాతీతంగా మారాయి. నియంత్రించాల్సిన పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటంతో వారు మరింత రెచ్చిపోయి దాడులకు తెగబడుతూ విధ్వంసం సృష్టిస్తున్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం, కందూరు పంచాయతీలోని మిట్టపల్లి కమ్మపల్లె నివాసి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ప్రసాద్‌నాయుడు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున విరివిగా ప్రచారం చేశారు. దీనిపై కక్ష గట్టిన తెలుగుదేశం పార్టీ వారు అధికారంలోకి రావడంతోనే ఆయనపై వేధింపులు ప్రారంభించారు. ప్రసాద్‌నాయుడు పొలంలో నుంచి రాకపోకలు సాగించకుండా ఉండేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు రహదారిపై జేసీబీతో ట్రెంచ్‌కొట్టి గాడులు పెట్టారు. అలాగే వేరే మార్గంలో రాకుండా కాలువలు తవ్వేసి రాకపోకలన్నింటినీ స్తంభింపచేశారు. దీని కారణంగా సాగుచేసిన పంటలను మార్కెట్‌కు తరలించేందుకు వీలులేకుండా పోయింది. బలవంతంగా మార్కెట్‌కు తరలించేందుకు ప్రయత్నించేవారిపై దాడులు చేయడం, పంటలను ధ్వంసం చేసి వైఎస్సార్‌సీపీ అభిమానులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ ఘటనలపై వైఎస్సార్‌సీపీ నేతలు రాష్ట్ర హైకోర్టు, హ్యూమన్‌రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దాడులు, ఆస్తుల నష్టంపై పోరాటానికి సిద్ధమయ్యారు.

యంగ్



పట్టణ సవాళ్ల పరిష్కారం

'మానిఫెస్టింగ్ మ్యాన్‌హోల్స్' పేరుతో పట్టణ వరదలు, సవాళ్లను పరిష్కరించడం లక్ష్యంగా ప్రాజెక్ట్‌ను ఆవిష్కరించాను. భారతీయ నగరాల్లో మౌలిక సదుపాయాల భద్రతను కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం.

– నారాయణం భవ్య



టెక్.. టూర్

'ఇంటెలినెక్సా' అనే నా ప్రాజెక్ట్ ఎకో–టూరిజంను ఏఆర్, వీఆర్, ఏఐల ద్వారా మార్చేందుకు వీలుగా ఫీచర్లను అందిస్తోంది. వైల్డ్ లైఫ్ ట్రిల్స్, వీఆర్ అడ్వెంచర్స్, ఎకో కెరీర్ గైడ్స్, ఎకో డైరీస్ ద్వారా మన ప్రాంతాల పట్ల సమాజానికి అవగాహన కల్పించడం, గ్లోబల్ ఫోరమ్‌లపై ప్రభావం చూపడమే లక్ష్యంగా దీనిని ఆవిష్కరించాను.

– మనల్ మునీర్



లక్ష్యానికి మార్గం

'అప్నా ఇంటర్వ్యూ క్రాకర్' అనే నా ప్రాజెక్ట్ మార్కెట్ ట్రెండ్‌లు, పోర్ట్‌ఫోలియో క్రియేషన్, ఎటిఎస్ రెజ్యూమ్ టెంప్లేట్‌లు, ఓపెన్ సోర్స్ కంట్రిబ్యూషన్‌లను అందించే ఒక వేదిక. దీని ద్వారా ఎంతోమంది తమ లక్ష్యాలు చేరుకోవడానికి మార్గం సుగమం అవుతుంది.

– మీత్ కుమార్ షా

ఐక్యరాజ్యసమితికి తెలుగు యువ ప్రతిభ

ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో రాబోయే డిసెంబర్‌లో జరిగే 8వ వార్షిక 1ఎమ్1బి (1మిలియన్ ఫర్ 1బిలియన్) యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనడానికి తెలంగాణలోని వివిధ కాలేజీలకు చెందిన ఐదుగురు యువ ఆవిష్కర్తలు ఎంపికయ్యారు. వీరిలో నలుగురు అమ్మాయిలు- నారాయణం భవ్య, పెమ్మసాని లిఖిత చౌదరి, సత్యవతి కోలపల్లి, మనల్ మునీర్ కాగా మరొకరు మీత్‌కుమార్ షా ఉన్నారు. వీరి ఆవిష్కరణలకు '1ఎమ్1బి గ్రీన్‌స్కిల్స్ అకాడమీ' వేదికయ్యింది. ఐదు నెలలపాటు సాగిన ఈ ప్రక్రియలో 200 మంది పాల్గొనగా ఐదుగురు తెలుగు విద్యార్థులు ఎంపికై యువ ప్రతిభకు ప్రేరణగా నిలిచారు.



విద్యార్థులకు ప్రాక్టికల్ స్కిల్స్

'టెక్.వెసాలియస్' అనే నా ప్రాజెక్ట్ లక్ష్యం అనాటమీ విద్యలో ఎఆర్/విఆర్ సాంకేతికత ద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకురావడం. విద్యార్థులందరికీ అందుబాటులో ఉండేలా, వారిలో ప్రాక్టికల్ స్కిల్స్ పెంపొందించడమే ఈ ఆవిష్కరణ లక్ష్యం.

– పెమ్మసాని లిఖిత చౌదరి



వాస్తవ అనుభూతి

నారు పోషణలో ఏఐ సాధనాలు, మెటా స్పార్క్ స్టూడియోని ఉపయోగించుకొని వాస్తవ అనుభూతిని ఎలా పొందవచ్చో నా ప్రాజెక్ట్ పరిచయం చేస్తుంది. అంతేకాదు కెమెరా ట్రాకింగ్ ద్వారా వినియోగదారులకు వారి మొక్కలను సేంద్రీయంగా, వేగంగా ఎలా పెంచాలనే దానిపై లింక్‌లు, మార్గదర్శకాలను అందిస్తుంది. మొక్కల పెంపకంపై రూపొందించిన ప్రాజెక్ట్ ఇది.

– సత్యవతి కోలపల్లి

హెల్దీ డైట్ | నట్టీ బైట్స్



– డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

కావలసినవి: ఓట్స్ – కప్పు; కర్జూరాలు – 20 (నానబెట్టి గింజలు తొలగించాలి) ; వాల్‌నట్స్ – అర కప్పు (రోస్ట్ చేయాలి); బాదం– అర కప్పు (రోస్ట్ చేయాలి) ; కోకో పౌడర్ – పావు కప్పు.

తయారీ: ● ఓట్స్, వాల్‌నట్స్, బాదం, కోకో పౌడర్, కర్జూరాలను మిక్సీలో బ్లెండ్ చేయాలి. కర్జూరాలను నానబెట్టిన నీటినే వేసుకుంటూ మెత్తగా గ్రైండ్ చేయాలి ● ఈ మిశ్రమాన్ని పెద్ద నిమ్మకాయంత తీసుకుని అర చేతిలో వేసి గోళీలాగ చేసుకోవాలి. ఇలా మొత్తాన్ని చేసుకున్న తర్వాత సిలికాన్ ట్రే తీసుకుని ఒక్కో గోళీని ఒక్కో అరలో పెట్టి వత్తాలి. ఈ ట్రేని 20 నిమిషాల పాటు ఫ్రిజ్‌లో పెడితే నట్టీ బైట్స్ రెడీ. మిశ్రమం బాగా గట్టిపడి చేత్తో పట్టుకుని తినడానికి అనువుగా ఉంటుంది.



పోషకాలు: ప్రొటీన్ – 3.7 గ్రాములు, కార్బోహైడ్రేట్‌లు– 11.2 గ్రాములు, కొవ్వులు – 2 గ్రాములు, కేలరీలు– 70-80. ఇందులో ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్‌లు, ఫైబర్, ప్రొటీన్‌లు సమృద్ధిగా ఉంటాయి. వీటిని తింటే కండరాల శక్తి పెరుగుతుంది.

చర్చ



ఉద్యోగినులకు నెలసరి సెలవు ఇవ్వాలనే డిమాండ్ ఇటీవల ఎక్కువైంది. సుప్రీంకోర్టు ఈ విషయంలో ఏ నిర్ణయమూ చెప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వాలతో, ఉపాధి సంస్థలతో చర్చించి కేంద్రం తీసుకోవాల్సిన పాలసీ నిర్ణయం అని తెలిపింది. నెలసరి సెలవును తప్పనిసరి చేస్తే సంస్థలు స్త్రీలను ఉద్యోగాల్లోకి తీసుకోకపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. మరి మహిళలు ఏమంటున్నారు?

ఉద్యోగినులకు నెలసరి సెలవు?

సుజన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. ఉదయం నుంచి పొత్తి కడుపులో నొప్పి. కూర్చోవడానికి వీలుకానంతగా నడుం నొప్పి. ప్రతి నెలా ఉండే సమస్యే ఇది. ఈ నెల మరీ ఎక్కువగా బాధిస్తోంది. ప్రాజెక్ట్ పూర్తయ్యేంత వరకు సెలవు పెట్టడానికి వీలు లేదని ఆఫీసులో ముందే హెచ్చరించిన విషయాన్ని గుర్తు తెచ్చుకుని బాధను పంటి బిగువున భరిస్తూనే ఆఫీసుకు బయల్దేరింది.

* * *

మేరీ ప్రైమరీ స్కూల్ టీచర్. పిల్లలతో కలిసిపోతూ రోజంతా యాక్టివ్‌గా ఉండాలి. నెలసరి సమయం దగ్గర పడుతుందంటేనే లోలోపల భయపడుతూ ఉంటుంది. తీవ్రమైన నొప్పితో పాటు, అధిక రక్తస్రావం సమస్యతో ప్రతీసారీ ఇబ్బందే.

* * *

కరుణ బట్టల షోరూమ్‌లో పనిచేస్తోంది. రోజంతా షాప్‌లో నిల్చొనే ఉండాలి. సేల్ సీజన్ కావడంతో సెలవులు పెట్టడానికి వీల్లేదని మేనేజర్ ముందే చెప్పారు. సెలవు అడిగితే ఉద్యోగం పోతుందేమో అని భయం. కానీ, నెలసరి సమయంలో విశ్రాంతి లేకుండా పని చేయడం అంటే మరింత అలసట కమ్ముకొచ్చేస్తుంది.

నెలసరివేళ ఇబ్బందిపడే ఉద్యోగినులకు రుతుస్రావ సెలవులపై మోడల్ పాలసీని రూపొందించాలని ఈ నెల 9న కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు సూచించింది. ఈ విషయంలో అందరికీ ఆమోదయోగ్యమైన విధానానికి రూపకల్పన చేయాలని కూడా ఆదేశించింది. నెలసరి సెలవులు తీసుకుంటే ఉద్యోగినుల ఉపాధిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందా? అసౌకర్యం వేళ సెలవు దొరుకుతుందని భావిస్తే ఎక్కువ మంది ఉద్యోగాలు చేయడానికి మొగ్గు చూపుతారా? నెలసరి అవసరం గురించి మహిళలు స్పందన.

- నిర్మలా రెడ్డి

అవసరం ఉన్నవారికే!



దాదాపు తొంభై శాతం మందిలో ఒకేలాంటి సమస్య ఉండదు. కాబట్టి అందరికీ సెలవు అవసరం లేదు. నెలసరి సమయంలోనూ సమస్యలేమీ లేకపోతే సెలవు ఎందుకు తీసుకోవాలి? పైగా పని పట్ల ఇష్టం ఉన్న నాకు లీవ్ తీసుకొని ఇంటి వద్ద ఉండటం బోర్ అనిపిస్తుంది. అందుకే సమస్య ఉన్నవారు, మెడికేషన్‌లో ఉన్నవారు డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌తో లీవ్ తీసుకోవచ్చు. స్కూల్ టైమ్‌లో నెలసరి వస్తే ఇంటికి వెళ్లే వీలు ఉండదు. స్కూల్‌లోనే కొంత సమయం విశ్రాంతి తీసుకుంటాం. సమస్య తీవ్రతను బట్టి అవసరం ఉన్నవారు లీవ్ తీసుకుంటే సరిపోతుంది.

– మృణాళిని, టీచర్

ఉపయోగకరమైనదే!



మహిళ ఇంటిని, ఆఫీస్ పనినీ బ్యాలెన్స్ చేసుకుంటూ తనని తాను నిరూపించుకుంటోంది. అయితే, పీరియడ్ సమయంలో అందరికీ అన్ని వేళలా ఆరోగ్యం సహకరించకపోవచ్చు. ఎవరికైతే అధిక రక్తస్రావం, పొత్తికడుపులో నొప్పి, మైగ్రెయిన్, వాంతులు... వంటి సమస్యలు ఉంటాయో వారికి విశ్రాంతి అవసరం అవుతుంది. భరించలేనంత నొప్పి ఉన్నప్పుడు ఎలాగూ పని మీద దృష్టి పెట్టలేరు. సమస్య ఉన్నవారికి సెలవు ఇవ్వడం మంచిదే. ఎందుకంటే నెలసరి నొప్పి భరించలేక ఉద్యోగాలు మానేసినవారూ ఉన్నారు. కొందరు ఉద్యోగినులు హెల్త్ చెకప్‌కి లీవ్ దొరకడం లేదని చెబుతుంటారు. అలాంటి వారికి ఈ లీవ్ అవకాశం ఉపయోగపడుతుంది.

– డాక్టర్ శిరీషారెడ్డి, గైనకాలజిస్ట్

విశ్రాంతి అవసరమే!



మహిళలు కూర్చుని చేసే ఉద్యోగాల్లో సాధారణంగా నడుం నొప్పి ఉంటుంది. నెలసరి సమయంలో ఆ తీవ్రత ఇంకాస్త పెరుగుతుంది. కానీ, మాకు కేటాయించిన పనిని మరొకరికి అప్పగించలేం. సెలవు పెడితే పనిభారం పెరుగుతుందని భయం. అదీ సమస్యే. పీరియడ్ లీవ్ తప్పనిసరి చేస్తే వర్క్‌లోడ్ పెరగడం, ప్రమోషన్స్‌పై ప్రభావం చూపడం జరగవచ్చు. మా ఆఫీసులో వాష్‌రూమ్‌లలో ప్యాడ్స్, విశ్రాంతి తీసుకోవడానికి ప్లేస్ ఉంటుంది. సమస్య ఉన్నప్పుడు ఈ తరహా అవకాశాలు ఉపయోగించుకొని, పనులను యథావిధిగా చేస్తుంటాం. పీరియడ్ లీవ్ అనేది అందరికీ అవసరం కాదు. సమస్య ఉన్నవారు యాజమాన్యం అనుమతితో సెలవు తీసుకోవచ్చు.

– ఎస్.కె.బాజీ, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

యోగం

గాఢనిద్రకు బిటిలాసనం

స్మార్ట్ ఫోన్, టీవీల వాడకం పెరిగిన తర్వాత రాత్రిళ్లు నిద్ర పట్టక పోవడమనే సమస్య మరింత పెరిగింది. రక్తప్రసరణ మెరుగ్గా ఉండి, ఒత్తిడి లేకుండా, నిద్ర మెరుగవడానికి గో-మార్జాల ఆసనం ఉపయోగపడుతుంది.

దీనిని బిటిల ఆసనం అని కూడా అంటారు. బిటిల అంటే ఆవు, మార్జాలం అంటే పిల్లి అని అర్థం. నాలుగు కాళ్లపై నిలబడి ఆవు ఎలా ఉంటుందో ఈ ఆసనంలో మన శరీర భంగిమ అలా ఉంటుంది. ఈ ఆసనంలో వెన్నును బాగా సాగదీస్తాం. ● చేతులు, మోకాళ్లను నేలపై ఉంచడం ద్వారా ఈ ఆసనాన్ని మొదలుపెట్టవచ్చు ● దీర్ఘంగా శ్వాస పీల్చుకొని వదులుతూ రిలాక్స్ అవ్వాలి. వెన్నును సీలింగ్ వైపు గుండ్రంగా పైకి లేపి, తర్వాత నాభి స్థానం నుంచి వెన్నును వెనకవైపు సాగదీస్తున్నట్టు చేయాలి. మెడను రిలాక్స్‌గా ఉంచుతూ, గడ్డాన్ని ఛాతీవైపుగా లాగాలి. ఈ భంగిమలో పిల్లిలా మేనును సాగదీయాలి ● మెడపైన ఎలాంటి ఒత్తిడి లేకుండా జాగ్రత్త పడుతూ తలను సీలింగ్‌వైపు చూసేలా పైకి ఎత్తాలి. మెడను పైకి ఎత్తి పైకప్పు వైపు చూడాలి. ఇది ఆవు భంగిమ



● శ్వాసను ప్రతి కదలికకు అనుసంధానిస్తూ పైకి, కిందకు ఈ భంగిమను 8-10 సార్లు రిపీట్ చేస్తుండాలి. (మెడ సంబంధిత సమస్య ఉన్నవారు నిపుణుల పర్యవేక్షణలో ఈ యోగ సాధన చేయాలి.)

ప్రయోజనాలు: ● ఆవు – పిల్లి ఆసనం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. ● ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. నిద్రపట్టడానికి, నిద్రను మెరుగు పరచడానికీ ఈ ఆసనం సాయపడుతుంది. ఈ భంగిమలో వెనక కండరాలు, పొత్తికడుపు, భుజాలు, మణికట్టు, తుంటి బలపడతాయి. రక్తప్రసరణ మెరుగవుతుంది. ● ఈ ఆసనం రోజూ సాధన చేయడం ద్వారా పొట్ట కొవ్వు తగ్గుతుంది. ● ఖాళీ కడుపుతో రోజుకు 8-10 సార్లు ఈ ఆసనాన్ని సాధన చేసి, సరైన ఫలితాలను పొందవచ్చు.



– జి. అనూషా కార్తీక్
యోగా ట్రైనర్

డిజిటల్ సృష్టి



'కల్కి' సినిమాలో 'కాంప్లెక్స్' ఉన్నట్టే ఏ.ఐకి కూడా ఒక ప్రపంచం ఉంది. అందులో ఏ.ఐ ద్వారా తయారైన అందగత్తెలు ఉన్నారు. సరే. అన్ని దేశాల ఏ.ఐ. అందగత్తెలకు పోటీ పెడితే? పెట్టారు. మొరాకో ఏ.ఐ. అందగత్తె కెంజా లైలీ 'మిస్ ఏ.ఐ'గా కిరీటం సాధించి చరిత్ర సృష్టించింది. ఇదొక నిజంలాంటి కల్పన. అందమైన డిజిటల్ సృష్టి.

భారత్ నుంచి శతావరి



ఏఐ అందాల పోటీలో మన దేశానికి చెందిన జరా శతావరి 'టాప్-10' ఫైనల్ లిస్ట్‌కు ఎంపికై 'ఎవరీ శతావరి?' అని చాలామంది ఆరా తీసేలా చేసింది. శతావరి ఫొటోలు సోషల్ మీడియాలో అందంగా సందడి చేశాయి. ఒక మొబైల్ కంపెనీ యాడ్ ఏజెన్సీకి కో-ఫౌండర్ అయిన రాహుల్ చౌదరి 'శతావరి' సృష్టికర్త. హార్మోన్ సమస్యల నుంచి కుంగుబాటు వరకు ఎన్నో అంశాలపై మహిళలకు అవగాహన కలిగిస్తోంది శతావరి. ఈ 'డిజిటల్ దివా' తన వెబ్‌సైట్‌లో హెల్త్ నుంచి లేటెస్ట్ ఫ్యాషన్ ట్రెండ్స్ వరకు ఎన్నో అంశాలపై రచనలు చేస్తుంది. స్ట్రాటెజిక్ ప్లానింగ్, కంటెంట్ డెవలప్‌మెంట్, డేటా ఎనాలసిస్... మొదలైన ఏరియాలలో అద్భుత నైపుణ్యాన్ని ప్రదర్శిస్తోంది.

ఏఐ కాంప్లెక్స్‌లో అందాల పోటీలు



సోషల్ సబ్‌స్క్రిప్షన్ ప్లాట్‌ఫామ్ 'ఫ్యాన్ వ్యూ' నిర్వహించిన 'మిస్ ఏఐ' అందాల పోటీలో రియలిజమ్, టెక్, సోషల్ క్లౌట్ అనే మూడు ముఖ్యమైన విభాగాలు ఉన్నాయి. ఈ మూడు విభాగాల్లో మిగిలిన వారితో పోల్చితే కెంజా లైలీ 'బెస్ట్' అనిపించుకుంది. న్యాయనిర్ణేతలలో ఇద్దరు ఏఐ–జనరేటెడ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు కూడా ఉన్నారు.

'యాక్టివిస్ట్ అండ్ ఇన్‌ఫ్లూయెన్సర్'గా గుర్తింపు తెచ్చుకున్న ఏ.ఐ. యువతి కెంజా లైలీకి ఇన్‌స్టాగ్రామ్‌లో రెండు లక్షల వరకు ఫాలోవర్‌లు ఉన్నారు. కెంజా ఏడు భాషల్లో మాట్లాడగలదు. ఫ్యాషన్, ఆహారం, అందం, ట్రావెల్... మొదలైన వాటికి సంబంధించి కంటెంట్ జనరేట్ చేస్తుంది. 'ఫినిక్స్ ఏఐ' సీయివో మెరియమ్ బెసా ఈ యువతి సృష్టికర్త. 'మిస్ ఏ.ఐ' కిరీటం సాధించాక కెంజా లైలీ మాట్లాడుతూ-


'కృత్రిమ మేధ సృష్టికర్తల తరపున ప్రాతినిధ్యం వహించే, కృత్రిమ మేధస్సులోని సానుకూల కోణాన్ని ఆవిష్కరించే మంచి అవకాశం నాకు వచ్చింది. ఏఐ టెక్నాలజీ అభివృద్ధిలో మరింత క్రియాశీలంగా వ్యవహరించడానికి ఈ విజయం నాకు ఉపయోగపడుతుంది. మొరాకో, మధ్యప్రాచ్యంలో మహిళా సాధికారతకు దోహదం చేయడం నా లక్ష్యం. కృత్రిమ మేధస్సుపై ఎన్నో అనుమానాలు, అపోహలు ఉన్నాయి. ఈ భయాలను తొలగించడంపై దృష్టి పెడతాను. కృత్రిమ మేధ అనేది ఒక సాధనం మాత్రమే కాదు... ఇంతకు ముందు ఎవరూ సృష్టించలేని అవకాశాలను సృష్టించగల పరివర్తన శక్తి. విద్యారంగంలో ఏఐ వల్ల జరిగిన మంచి పనులు చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఏఐ అనేది మానవ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేదే తప్ప దాన్ని భర్తీ చేయలేదు. మనుషులు, కృత్రిమ మేధ మధ్య సహకారాన్ని పెంపొందించడం నా ప్రాధాన్యతలలో ముఖ్యమైనది' అంటుంది కెంజా.

ఈ పోటీలో రన్నర్స్-అప్‌గా ఫ్రాన్స్‌కు చెందిన లలీన, పోర్చుగల్‌కు చెందిన వోలివ సి నిలిచారు.

హెల్త్ ఫ్యాక్ట్స్

గుండెపోటుకు తేనెతో చెక్!

గుండెపోటును నివారించుకునేందుకు ఒక తియ్యటి దారి ఉంది. అదేమంటే రకరకాల తీపి పదార్థాల్లో తీపినిచ్చే పదార్థాలు రకరకాలుగా ఉంటాయి. ఉదాహరణకు పిండి పదార్థాలైన బియ్యం, గోధుమలలో మాల్టోజ్, పండ్లలో ఫ్రక్టోజ్, చెరుకులో సుక్రోజ్, గ్లూకోజ్ ఇలా. అలాగే తేనెలో తీపినిచ్చే మరికొన్ని పదార్థాలతో పాటు 'టెహ్రాలోజ్' కూడా ఉంటుంది. ఇదే స్వీటెనర్ కొన్ని పుట్టగొడుగులు, ఈస్ట్, సోయాబీన్స్‌లో కూడా ఉంటుంది. తేనెలోని టెహ్రాలోజ్‌ను ఇంజెక్ట్ చేసిన ఎలుకల రక్తనాళాల్లో 'ప్లాక్' చేరక పోగా గతంలో చేరిన ప్లాక్‌లో దాదాపు 30 శాతం తగ్గుదల కనిపించింది. ఈ ప్లాక్ వల్లనే రక్తనాళాల్లో క్లాట్స్ ఏర్పడి అది గుండెపోటుకు దారితీస్తుందన్న విషయం తెలిసిందే. రక్తనాళాల్లోని ప్లాక్‌ను శుభ్రం చేసే పని చేసే ఇమ్యూన్ కణాల పుట్టుకకు టీఎఫ్ఈబీ అనే ఒక రకమైన ప్రోటీన్ ఉత్పాదనకు టెహ్రాలోజ్ తోడ్పడుతుంది. అలా గుండె పోటును నివారించ వచ్చని వాషింగ్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన శాస్త్రవేత్తలు భావిస్తూ ఆ మేరకు పరిశోధనలు చేస్తున్నారు.



జుట్టు పొడిబారకుండా..!

రకరకాల అంశాలు జుట్టు పొడిబారడానికి కారణమవుతాయి. ఉదాహరణకు... ఆహారపు అలవాట్లు, జీవనశైలి, జుట్టు కోసం వాడే వివిధ రకాల హెయిర్ ప్రోడక్ట్స్ వంటివి. రోజువారీ డైట్‌లో ప్రోటీన్లు, ఐరన్ మోతాదులు తగ్గినా, వాతావరణంలో తేమ తగ్గినా జుట్టు పొడిబారడంతో పాటు చిట్లుతుంది. జుట్టు పొడిబారుతున్నవారు ప్రోటీన్, ఐరన్ పుష్కలంగా దొరికే పదార్థాలను తీసుకోవడం, వ్యాయామం చెయ్యడం వంటి మార్పుల ద్వారా జుట్టు ఆరోగ్యకరంగా మారుతుంది. ఫలితం లేకుంటే డర్మటాలజిస్టును కలిసి, వారి సూచనల మేరకు మెడికేటెడ్ షాంపూలు, కండిషనర్లు వాడాల్సి ఉంటుంది.





జైపూర్ పేట్రియాట్స్ జట్టులో ఆకుల శ్రీజ, స్నేహిత్... ఆగస్టులో యూటీటీ లీగ్...

అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) లీగ్ ఐదో సీజన్ కోసం మొత్తం ఎనిమిది ఫ్రాంచైజీలు 48 మంది ఆటగాళ్లను ఎంపిక చేసుకున్నాయి. ఇందులో 16 మంది విదేశీ క్రీడాకారులు. భారత నంబర్‌వన్, తెలంగాణ క్రీడాకారిణి ఆకుల శ్రీజ, తెలంగాణకే చెందిన యువతార సూరావజ్జుల స్నేహిత్ జైపూర్ పేట్రియాట్స్ జట్టు తరఫున బరిలోకి దిగనున్నారు. ప్రపంచ 25వ ర్యాంకర్ శ్రీజ గత నెలలో నైజీరియాలో జరిగిన వరల్డ్ టేబుల్ టెన్నిస్ కంటెండర్ టోర్నీలో సింగిల్స్, డబుల్స్ టైటిల్స్ నెగ్గింది. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 7 వరకు చెన్నైలో జరిగే యూటీటీ లీగ్‌లో అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్, చెన్నై లయన్స్, దబంగ్ ఢిల్లీ టీటీసీ, గోవా చాలెంజర్స్, జైపూర్ పేట్రియాట్స్, పీబీజీ బెంగళూరు స్మాషర్స్, పుణేరి పల్టన్, యు ముంబా జట్లు పాల్గొంటాయి.





సెమీస్‌లో జొకోవిచ్

లండన్: రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ సాధించే దిశగా సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో అడుగు వేశాడు. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఏడుసార్లు చాంపియన్ అయిన జొకోవిచ్ కోర్టులో అడుగు పెట్టకుండానే సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో బుధవారం జొకోవిచ్‌తో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడాల్సిన ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా) తుంటి గాయంతో వైదొలిగాడు. దాంతో జొకోవిచ్‌ను విజేతగా ప్రకటించారు. మరోవైపు ఇటలీ రైజింగ్ స్టార్ లొరెంజో ముసెట్టి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్ చేరుకున్నాడు. టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)తో 3 గంటల 27 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్ ఫైనల్లో ముసెట్టి 3–6, 7–6 (7/5), 6–2, 3–6, 6–1తో గెలిచి సెమీస్‌లో జొకోవిచ్‌తో పోరుకు సిద్ధమయ్యాడు. మహిళల సింగిల్స్‌లో నాలుగో సీడ్ రిబాకినా (కజకిస్తాన్), 31వ సీడ్ బార్బరా క్రిచికోవా (చెక్ రిపబ్లిక్) సెమీఫైనల్లోకి అడుగు పెట్టారు. క్వార్టర్ ఫైనల్స్‌లో రిబాకినా 6–3, 6–2తో స్వితోలినా (ఉక్రెయిన్)పై, క్రిచికోవా 6–4, 7–6 (7/4)తో ఒస్టాపెంకో (లాత్వియా)పై గెలిచారు.

అట్కిన్సన్‌కు 7 వికెట్లు



లండన్: అరంగేట్రం టెస్టులో ఇంగ్లండ్ పేసర్ గస్ అట్కిన్సన్ 7 వికెట్లతో అదరగొట్టాడు. బుధవారం మొదలైన తొలి టెస్టులో అట్కిన్సన్ (7/45) ధాటికి వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 41.4 ఓవర్లలో 121 పరుగులకే కుప్పకూలింది. మికైల్ లూయిస్ (27; 4 ఫోర్లు, 1 సిక్స్), కావెమ్ హాడ్జ్ (24; 3 ఫోర్లు, 1 సిక్స్), అథనాజ్ (23; 3 ఫోర్లు) పర్వాలేదనిపించారు. కెరీర్‌లో చివరి టెస్టు ఆడుతున్న ఇంగ్లండ్ దిగ్గజ పేసర్ అండర్సన్‌కు ఒక వికెట్ దక్కింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 40 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 189 పరుగులు సాధించింది. 68 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. జాక్ క్రాలీ (76; 14 ఫోర్లు), ఒలీ పోప్ (57; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. జో రూట్ (15 బ్యాటింగ్), హ్యారీ బ్రూక్ (25 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

మళ్లీ మనదే గెలుపు

- మూడో టి20లో భారత్ విజయం
- 23 పరుగులతో ఓడిన జింబాబ్వే
- రాణించిన గిల్, రుతురాజ్, సుందర్
- శనివారం నాలుగో మ్యాచ్

జింబాబ్వేపై వరుసగా రెండో మ్యాచ్‌లోనూ భారత్ ఆధిపత్యం కొనసాగింది. అటు బ్యాటర్లు, ఇటు బౌలర్లు చక్కటి ప్రదర్శన చేయడంతో మరో పోరులో టీమిండియాకు సునాయాస విజయం దక్కింది. టి20 వరల్డ్ కప్‌లో ఆడిన ముగ్గురు ఆటగాళ్ల పునరాగమనంతో బ్యాటింగ్ ఆర్డర్‌లో కొంత మార్పు వచ్చినా... చివరకు భారత్‌దే పైచేయి అయింది. గత మ్యాచ్ తరహాలోనే ఈసారి కూదా పేలవ బ్యాటింగ్‌తోనే ఆతిథ్య జింబాబ్వే జట్టు ఆరంభంలోనే ఆటను అప్పగించింది. ఇక శనివారం జరిగే నాలుగో మ్యాచ్‌లో గెలిస్తే సిరీస్ మన ఖాతాలో చేరుతుంది.

హరారే: జింబాబ్వేతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భారత్ 2–1తో ముందంజలో నిలిచింది. బుధవారం జరిగిన మూడో టి20లో భారత్ 23 పరుగుల తేడాతో జింబాబ్వేపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (49 బంతుల్లో 66; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో ఫామ్‌లోకి వచ్చాడు. రుతురాజ్ గైక్వాడ్ (28 బంతుల్లో 49; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (27 బంతుల్లో 36; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం జింబాబ్వే 20 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులే చేయగలిగింది. డియాన్ మైర్స్ (49 బంతుల్లో 65 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), క్లయివ్ మదాండె (26 బంతుల్లో 37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వాషింగ్టన్ సుందర్ (3/15) ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. శనివారం ఇదే మైదానంలో నాలుగో టి20 జరుగుతుంది.

కీలక భాగస్వామ్యాలు...

భారత్ తమ ఇన్నింగ్స్‌ను జోరుగా ప్రారంభించింది. తొలి ఓవర్లో జైస్వాల్ 2 ఫోర్లు, సిక్స్ కొట్టగా, రెండో ఓవర్లో గిల్ 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 55 పరుగులు చేసింది. తొలి వికెట్‌కు గిల్‌తో 50 బంతుల్లో 67 పరుగులు జోడించిన తర్వాత జైస్వాల్ వెనుదిరిగాడు. గత మ్యాచ్ సెంచరీ హీరో అభిషేక్ శర్మ (10) ఈసారి ప్రభావం చూపలేకపోయాడు. ఈ దశలో జత కలిసిన గిల్, రుతురాజ్ మరింత ధాటిగా ఆడారు. మదెవెరె ఓవర్లో ఇద్దరూ చెరో సిక్స్ కొట్టగా... ఆ తర్వాత సికందర్ రజా ఓవర్లోనూ ఇదే పునరావృతమైంది. ఎట్టకేలకు గిల్‌ను అవుట్ చేసి ముజరబాని ఈ భాగస్వామ్యాన్ని ముగించాడు. గిల్, రుతురాజ్ మూడో వికెట్‌కు 44 బంతుల్లోనే 72 పరుగులు జత చేశారు. 36 బంతుల్లో గిల్ అర్ధసెంచరీ చేయగా... ఎన్‌గరవ ఓవర్లో వరుసగా సిక్స్, ఫోర్ కొట్టిన రుతురాజ్ అర్ధ సెంచరీ చేయకుండానే వెనుదిరిగాడు. జింబాబ్వే పేలవ ఫీల్డింగ్‌తో భారత్‌కు అదనపు అవకాశాలు కల్పించింది. గిల్, జైస్వాల్, రుతురాజ్ ఇచ్చిన క్యాచ్‌లను ఫీల్డర్లు వదిలేశారు. చివరి 4 ఓవర్లలో భారత్ 52 పరుగులు చేసింది. టి20 వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్‌లో సభ్యులైన జైస్వాల్, సామ్సన్, దూబే ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగగా... పరాగ్, సాయిసుదర్శన్, జురేల్‌లను పక్కన పెట్టారు.



గిల్

టపటపా...

భారత బౌలర్ల ధాటికి జింబాబ్వే బ్యాటర్లు నిలవలేకపోయారు. 13 బంతుల వ్యవధిలో తొలి 3 వికెట్లు కోల్పోయిన జట్టు ఆ తర్వాత ఒకే ఓవర్లో మరో 2 వికెట్లు చేజార్చుకుంది. 7 ఓవర్లు ముగిసేసరికి 39/5తో జింబాబ్వే ఓటమికి బాటలు వేసుకుంది. ఈ దశలో మైర్స్, మదాండె కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 57 బంతుల్లోనే 77 పరుగులు జోడించారు. అనంతరం 45 బంతుల్లో మైర్స్ తన కెరీర్‌లో తొలి హాఫ్ సెంచరీని అందుకున్నాడు. చివర్లో ఓవర్లో మైర్స్, మసకద్జా (10 బంతుల్లో 18 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) కలిసి 18 పరుగులు రాబట్టినా... అప్పటికే ఓటమి ఖాయమైంది.

150 అంతర్జాతీయ టి20ల్లో భారత్ సాధించిన విజయాల సంఖ్య. ఇప్పటి వరకు 230 టి20 మ్యాచ్‌లు ఆడిన టీమిండియా 150 మ్యాచ్‌ల్లో గెలిచి ఈ మైలురాయి అందుకున్న తొలి జట్టుగా నిలిచింది. పాకిస్తాన్ (142), న్యూజిలాండ్ (111), ఆస్ట్రేలియా (105), దక్షిణాఫ్రికా (104), ఇంగ్లండ్ (100) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బెన్నెట్ (బి) రజా 36; గిల్ (సి) రజా (బి) ముజరబాని 66; అభిషేక్ (సి) మరుమని (బి) రజా 10; రుతురాజ్ (సి) మదెవెరె (బి) ముజరబాని 49; సామ్సన్ (నాటౌట్) 12; రింకూ సింగ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 182. **వికెట్ల పతనం:** 1–67, 2–81, 3–153, 4–177. **బౌలింగ్:** బెన్నెట్ 1–0–15–0, ఎన్‌గరవ 4–0–39–0, చటారా 3–0–30–0, ముజరబాని 4–0–25–2, రజా 4–0–24–2, మసకద్జా 3–0–25–0, మదెవెరె 1–0–19–0.

జింబాబ్వే ఇన్నింగ్స్: మదెవెరె (సి) అభిషేక్ (బి) అవేశ్ 1; మరుమని (సి) దూబే (బి) ఖలీల్ 13; బెన్నెట్ (సి) బిష్ణోయ్ (బి) అవేశ్ 4; మైర్స్ (నాటౌట్) 65; రజా (సి) రింకూ (బి) సుందర్ 15; క్యాంప్‌బెల్ (సి) (సబ్) పరాగ్ (బి) సుందర్ 1; మదాండె (సి) రింకూ (బి) సుందర్ 37; మసకద్జా (నాటౌట్) 18; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 159. **వికెట్ల పతనం:** 1–9, 2–19, 3–19, 4–37, 5–39, 6–116. **బౌలింగ్:** ఖలీల్ 4–0–15–1, అవేశ్ 4–0–39–2, రవి బిష్ణోయ్ 4–0–37–0, వాషింగ్టన్ సుందర్ 4–0–15–3, అభిషేక్ 2–0–23–0, దూబే 2–0–27–0.

స్పెయిన్ సిక్సర్...

వరుసగా ఆరో విజయంతో 'యూరో' ఫైనల్లోకి

సెమీస్‌లో ఫ్రాన్స్‌పై గెలుపు



మ్యూనిక్: మూడుసార్లు చాంపియన్ స్పెయిన్ జట్టు యువ ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనతో యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఐదోసారి ఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో స్పెయిన్ 2–1 గోల్స్ తేడాతో ఫ్రాన్స్ జట్టుపై గెలిచింది. స్పెయిన్ తరఫున లమీన్ యమాల్ (21వ ని.లో), డానీ ఒల్మో (25వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... ఫ్రాన్స్ జట్టుకు కోలో మువాని (19వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. ఈ టోర్నీలో స్పెయిన్‌కిది వరుసగా ఆరో విజయం కావడం విశేషం. 66 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో నెగ్గి ఫైనల్ చేరిన తొలి జట్టుగా స్పెయిన్ రికార్డు నెలకొల్పింది. లీగ్ దశలో గ్రూప్ 'బి'లో స్పెయిన్ తొలి మూడు మ్యాచ్‌ల్లో క్రొయేషియాపై 3–0తో, 1–0తో ఇటలీపై, 1–0తో అల్బేనియాపై గెలిచి టాపర్‌గా నిలిచింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ 4–1తో జార్జియాపై, క్వార్టర్ ఫైనల్లో 2–1తో జర్మనీపై విజయం సాధించింది. ఫ్రాన్స్‌తో సెమీఫైనల్లో తొలి గోల్ చేసిన క్రమంలో లమీన్ యమాల్ చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. యూరో టోర్నీ చరిత్రలో గోల్ చేసిన అతి పిన్న వయస్కుడిగా (16 ఏళ్ల 362 రోజులు) యమాల్ గుర్తింపు పొందాడు. జొహాన్ వొన్లాథెన్ (స్విట్జర్లాండ్; 18 ఏళ్ల 141 రోజులు) పేరిట ఉన్న రికార్డును యమాల్ సవరించాడు. నెదర్లాండ్స్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో ఫైనల్లో స్పెయిన్ తలపడుతుంది.

అర్జెంటీనా 30వసారి...

కోపా అమెరికా కప్ ఫైనల్లో మెస్సీ బృందం



ఈస్ట్ రూథర్‌ఫోర్డ్ (అమెరికా): వందేళ్లకంటే ఎక్కువ చరిత్ర ఉన్న కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్, ప్రస్తుత వరల్డ్ చాంపియన్ అర్జెంటీనా జట్టు 30వసారి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో లయనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా 2–0 గోల్స్ తేడాతో కెనడా జట్టుపై గెలిచింది. ఆట 22వ నిమిషంలో జూలియన్ అల్వారెజ్ గోల్‌తో అర్జెంటీనా 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆట 51వ నిమిషంలో మెస్సీ గోల్‌తో అర్జెంటీనా ఆధిక్యం 2–0కు పెరిగింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్న అర్జెంటీనా విజయాన్ని ఖరారు చేసుకుంది. అర్జెంటీనా తరఫున మెస్సీకిది 109వ గోల్ కావడం విశేషం. 38 వేర్వేరు దేశాలపై మెస్సీ గోల్స్ చేశాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో జాతీయ జట్టు తరఫున క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్; 130 గోల్స్) తర్వాత అత్యధిక గోల్స్ చేసిన రెండో ప్లేయర్‌గా మెస్సీ ఘనత సాధించాడు. కొలంబియా, ఉరుగ్వే జట్ల మధ్య ఈరోజు ఉదయం జరిగే రెండో సెమీఫైనల్ విజేత జట్టుతో ఫైనల్లో అర్జెంటీనా తలపడుతుంది.



రాష్ట్రపతి భవన్‌లో బుధవారం భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్‌తో కలిసి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కాసేపు సరదాగా బ్యాడ్మింటన్ ఆడారు. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారని ఈ సందర్భంగా ఆమె ప్రశంసించారు.

సినిమా

హారర్ విరాజి



● వరుణ్ సందేశ్

వరుణ్ సందేశ్ హీరోగా ఆద్యంత్ హర్ష దర్శకత్వం వహించిన చిత్రం 'విరాజి'. మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్, టీజర్‌ను 'బేబీ' మూవీ ఫేమ్ దర్శకుడు సాయి రాజేశ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టీజర్ బాగుంది. ఆద్యంత్ హర్ష మా నెల్లూరు వాడు కావడం, మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''ఈ చిత్రం నాకెంతో ప్రత్యేకం'' అన్నారు వరుణ్ సందేశ్. ''హారర్, థ్రిల్లర్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించాం'' అన్నారు ఆద్యంత్ హర్ష. ''మా సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు మహేంద్రనాథ్.

థ్రిల్ చేసే క



● కిరణ్ అబ్బవరం

'రాజావారు రాణిగారు, ఎస్ఆర్ కళ్యాణ మండపం, వినరో భాగ్యము విష్ణుకథ' వంటి చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు హీరో కిరణ్ అబ్బవరం. తాజాగా ఆయన నటించిన చిత్రానికి 'క' టైటిల్ ప్రకటించారు. దర్శకద్వయం సుజీత్–సందీప్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్, కేఏ ప్రొడక్షన్స్‌పై చింతా గోపాల కృష్ణారెడ్డి ఈ సినిమా నిర్మించారు. ''విలేజ్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్, పీరియాడిక్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'క'. త్వరలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లోనూ ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

పొలిమేర 3 షురూ



● 'సత్యం' రాజేశ్

'సత్యం' రాజేశ్, బాలాదిత్య, కామాక్షీ భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, 'చిత్రం' శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటించనున్న చిత్రం 'పొలిమేర 3'. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని భోగేంద్ర గుప్తాతో కలిసి వంశీ నందిపాటి నిర్మించనున్నారు. ''లాక్ డౌన్ టైమ్‌లో ఓటీటీలో విడుదలైన 'మా ఊరి పొలిమేర'కి అద్భుతమైన స్పందన రావడంతో సీక్వెల్‌గా 'పొలిమేర 2' తీశాం. సీక్వెల్ కూడా హిట్‌గా నిలవడంతో 'పొలిమేర 3'కి శ్రీకారం చుట్టాం. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభించబోతున్నాం'' అన్నారు మేకర్స్.

మర్చిపోలేదు!

హాలీవుడ్ హిట్ ఫిల్మ్ 'గ్లాడియేటర్'కు సీక్వెల్‌గా 'గ్లాడియేటర్ 2' విడుదలకు సిద్ధమైంది. ఇరవైనాలుగేళ్ల తర్వాత 'గ్లాడియేటర్ 2' తెరకెక్కింది. యునైటెడ్ స్టేట్స్‌లో నవంబరు 22న విడుదల కానున్న 'గ్లాడియేటర్ 2' ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఆ రోజు నాకు ఇంకా గుర్తుంది', 'నేనూ మర్చిపోలేదు', 'చక్రవర్తిపై ఓ బానిస పగ తీర్చుకోగలిగాడు' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. తొలి భాగానికి దర్శకత్వం వహించిన రిడ్లీ స్కాట్‌యే సీక్వెల్‌నూ తెరకెక్కించారు. పాల్ మెస్కల్, పెడ్రో పాస్కల్, కోన్నీ నిల్సన్, డెంజెల్ వాషింగ్టన్ లీడ్ రోల్స్‌లో నటించారు. 'గ్లాడియేటర్'లోని మాక్సిమస్ (రసెల్ క్రో) వారసుడు లూసియాస్ (పాల్ మెస్కల్) దృష్టి కోణంలో 'గ్లాడియేటర్ 2' కథ ఉంటుందని సమాచారం.



● 'గ్లాడియేటర్ 2' పోస్టర్

ధైర్యానికి సూచిక



● విష్ణు మంచు

విష్ణు మంచు నటిస్తున్న సినిమా 'కన్నప్ప'. ఈ చిత్రంలో మోహన్‌బాబు, మోహన్‌లాల్, శరత్‌కుమార్, బ్రహ్మానందం, బ్రహ్మాజీ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ప్రభాస్, అక్షయ్‌కుమార్, కాజల్ అగర్వాల్ అతిథి పాత్రల్లో కనిపిస్తారు. ముఖేష్ కుమార్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో విష్ణు వాడిన విల్లు విశిష్టతను తెలియజేస్తూ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ''కన్నప్పకు ఐదేళ్ల వయసు ఉన్నప్పుడు ఓ సాధారణ కర్రతో పులిని ఎదర్కొని, తప్పించుకోగలిగాడు. కన్నప్ప ధైర్యసాహసాలకు మెచ్చి ఆయన తండ్రి నాధనాథుడు ఓ ప్రత్యేకమైన విల్లును తయారు చేస్తాడు. ఆ విల్లు ధైర్యానికి సూచిక. తండ్రీ కొడుకుల బంధానికి ఓ ప్రతీక. ఆ విల్లుని రెండుగా విరిస్తే యుద్ధంలో పోరాడేందుకు కత్తుల్లానూ ఉపయోగపడేలా ఉంటుంది. 'కన్నప్ప' కోసం ఈ విల్లును న్యూజిల్యాండ్‌లోని ఆర్ట్ డైరెక్టర్ క్రిస్ తయారు చేశారు. ఈ విల్లుతోనే న్యూజిల్యాండ్‌లో రెండు నెలల పాటు చిత్రీకరణ జరిపాం'' అని యూనిట్ పేర్కొంది. ''ఈ తిన్నడు విల్లు కన్నప్పలో అంతర్భాగం. అతను దాన్ని అచంచలమైన గర్వంతో ఉపయోగిస్తూ, తన తెగను, అడవిలో సమతుల్యతను కాపాడుతుంటాడు'' అని విష్ణు మంచు చెప్పుకొచ్చారు.

పట్టుచీర కట్టుకోమ్మా...



● రవితేజ, భాగ్యశ్రీ బోర్సే

'చిట్టి గువ్వలాంటి చక్కనమ్మా... బొట్టు పెట్టి పట్టుచీర కట్టుకోమ్మా...' అంటూ మొదలవుతుంది 'మిస్టర్ బచ్చన్'లోని 'సితార్' సాంగ్. రవితేజ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. పనోరమా స్టూడియోస్, టీ–సిరీస్ సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ముగింపు దశలో ఉంది. బుధవారం 'సితార్...' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. కశ్మీర్ వ్యాలీలో ఈ మెలోడీ డ్యూయెట్‌ను రవితేజ, భాగ్యశ్రీ కాంబినేషన్‌లో చిత్రీకరించారు. చిత్ర సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ స్వరపరచిన ఈ పాటకు సాహితి సాహిత్యం అందించగా సాకేత్, సమీరా భరద్వాజ్ పాడారు.

రిస్క్ చేశారు.. సక్సెస్ కావాలి

– విశ్వక్ సేన్



● విశ్వక్ సేన్, రక్షిత్, సంగీర్తన

''ఆపరేషన్ రావణ్' ట్రైలర్ అద్భుతంగా ఉంది. వెంకట సత్యగారు వాళ్ల అబ్బాయి రక్షిత్ కోసమే 'పలాస 1978' మూవీ చేసి హిట్ అందుకున్నారు. ఇప్పుడు 'ఆపరేషన్ రావణ్'తో మరోసారి రిస్క్ చేశారు... ఈ సినిమా కూడా పెద్ద సక్సెస్ కావాలి'' అన్నారు హీరో విశ్వక్ సేన్. రక్షిత్ అట్లూరి, సంగీర్తనా విపిన్ జంటగా వెంకట సత్య దర్శకత్వం వహించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 2న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో అతిథి విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''రక్షిత్‌కు నేను చెప్పే సలహా ఒక్కటే. ఇండస్ట్రీలో చివరి చాన్స్ అనేది ఏమీ ఉండదు. ఇంకో చాన్స్ ఉంటుంది. మనం నమ్మకం వదిలేసినప్పుడే అనుకోని ఫలితాలు వస్తుంటాయి. నమ్మకంతో ప్రయత్నిస్తుంటే తప్పకుండా విజయం వస్తుంది'' అన్నారు. ''మీ ఆలోచనల ప్రభావం వల్లే మీరు మంచివాళ్లా? చెడ్డ వాళ్లా? అనేది నిర్ణయిస్తారు. మీరు ఎలా ఉండాలో మీ ఆలోచనలే నిర్ణయిస్తాయి. ఆ పాయింట్‌తోనే 'ఆపరేషన్ రావణ్' రూపొందించా'' అన్నారు వెంకట సత్య. రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ– ''సెట్‌లోకి వెళితే నేను యాక్టర్... నాన్న డైరెక్టర్ అంతే. 'ఆపరేషన్ రావణ్' ప్రేక్షకులను అలరిస్తుంది. 'పలాస 2' సినిమాకు చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

ప్రతి ఇంట్లో జరిగే కథ అనిపించింది

– నవీన్ చంద్ర




● నవీన్ చంద్ర, రాజా రవీంద్ర, యశస్విని

''సారంగదరియా' చిత్రం ట్రైలర్ చూస్తే ప్రతి ఇంట్లో జరిగే కథలా అనిపించింది. దర్శకుడు మంచి సందేశం ఇచ్చేందుకు ఈ మూవీ తీశారని అర్థమవుతోంది. ఇలాంటి సినిమాని తప్పకుండా థియేటర్లోనే చూసి, ప్రోత్సహించాలి'' అన్నారు హీరో నవీన్ చంద్ర. రాజా రవీంద్ర లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి (పండు) దర్శకత్వం వహించారు. చల్లపల్లి చలపతిరావు ఆశీస్సులతో ఉమాదేవి, శరత్ చంద్ర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి నవీన్ చంద్ర అతిథిగా హాజరయ్యారు. ''ప్రస్తుత బిజీ లైఫ్‌లో తల్లిదండ్రులు, పిల్లల మధ్య రిలేషన్ సరిగ్గా ఉండటం లేదు. దీంతో పిల్లలు చెడు బాట పట్టొచ్చు. పిల్లలకు తల్లిదండ్రులు మోరల్ సపోర్ట్ ఇస్తే విజయం సాధిస్తారనే కంటెంట్‌తో ఈ మూవీ రూపొందింది'' అన్నారు రాజా రవీంద్ర. ''మా సినిమాని అందరూ చూసి ఆదరించాలి'' అన్నారు శరత్ చంద్ర చల్లపల్లి. ''సమానత్వం అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రాబోతోంది'' అన్నారు పండు.

ఇంత దూరం వస్తాననుకోలేదు!

నవాజుద్దీన్ సిద్ధిఖీ హీరోగా నటించిన తాజా హిందీ చిత్రం 'రౌతు కా రాజ్'. ఆనంద్ సుర్పూర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూన్ 28 నుంచి జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాకు వీక్షకుల నుంచి మంచి స్పందన రావడం సంతోషంగా ఉందని నవాజుద్దీన్ సిద్ధిఖీ తెలిపారు. ఇంకా 'సాక్షి'తో నవాజుద్దీన్ పంచుకున్న విశేషాలు.

● హీరో పాత్ర, అతను ఓ కేసును పరిశోధన చేసే విధానం... ఈ రెండూ 'రౌతు కా రాజ్'లో వీక్షకులకు కొత్తగా అనిపిస్తాయి. సినిమాలోని మర్డర్ మిస్టరీ, గ్రామీణ నేపథ్యం ఆసక్తికరంగా, సహజత్వంతో ఉంటుంది. ఈ సినిమాకు సక్సెస్ టాక్ వచ్చిందంటే ఈ ఫలితం నా ఒక్కడిదే కాదు... దర్శకుడు, ఇందులో భాగమైన నటీనటులు అందరి భాగస్వామ్యం వల్లే సాధ్యమైంది. ● నేను ప్రధానంగా లీడ్ రోల్స్‌లోనే నటిస్తున్నాను. ఏదైనా కథ, అందులోని పాత్ర ఎగ్జైట్ చేసినప్పుడు మాత్రం క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేస్తున్నాను. కథలోని నా పాత్రకు కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉండాలనుకుంటాను. ఆ లక్షణాలకు నా నటన తోడైనప్పుడు ప్రేక్షకులు మెచ్చుకుంటారు. ఆడియన్స్‌ను మెప్పించే క్రమంలో నా పాత్రలో నెగటివ్ షేడ్స్ ఉన్నా ఓకే. నటుడుగా నాకెలాంటి పశ్చాత్తాపం లేదు. ఇండస్ట్రీలో ఇంత దూరం వస్తానని, ఈ స్థాయికి చేరుకుంటానని ఊహించలేదు. ఇండస్ట్రీ నాకు చాలా ఇచ్చింది. ● ప్రస్తుతం కస్టమ్ ఆఫీసర్‌గా ఓ సినిమా, సెక్షన్ 108 మూవీలతో పాటు మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నాను. దక్షిణాదిలో రజనీకాంత్‌గారి 'పేట', వెంకటేశ్‌గారి 'సైంధవ్' సినిమాలో నటించాను. మళ్లీ దక్షిణాది సినిమాలు చేయాలని ఉంది. కథలు వింటున్నాను. ఇక యాక్టింగ్ కాకుండా వ్యవసాయం అంటే ఇష్టం. వీలైనప్పుడల్లా మా ఊరు వెళ్లిపోయి (ఉత్తరప్రదేశ్‌లోని బుడానా) వ్యవసాయం చేస్తుంటాను.



● నవాజుద్దీన్

ఐదుగురు స్నేహితుల కథ



● రవికృష్ణ, భరత్

రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల ముఖ్యపాత్రల్లో నటించిన చిత్రం 'ద బర్త్‌డే బాయ్'. విస్కీ దర్శకత్వంలో బొమ్మ బొరుసా పతాకంపై ఐ. భరత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదల వేడుకలో విస్కీ మాట్లాడుతూ– ''నా జీవితంలో తొమ్మిదేళ్ల క్రితం జరిగిన ఓ ఘటన స్ఫూర్తితో వాస్తవ ఘటనల ఆధారంగా ఈ చిత్రకథ రాశాను'' అన్నారు. ''ఇదొక కామెడీ డ్రామా. ఎమ్ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితులకు జరిగిన ఘటనలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ చిత్రం అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు ఐ. భరత్. ''ఈ చిత్రం అందరికీ కొత్త అనుభూతిని పంచుతుంది'' అన్నారు రవికృష్ణ.

సాక్షి బిజినెస్
గురువారం
11-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
427	109
79,925	24,324

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,609	△ 180
డోజోన్స్	39,484	△ 192
ఎఫ్‌టీఎస్ఈ 100	8,194	△ 54
డాక్స్	18,407	△ 171
షాంఘై	2,939	▽ 20
నికాయ్	41,832	▽ 252

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,616	△ 270
బంగారం (99.5 స్వచ్ఛత)	72,325	△ 269
వెండి (కిలో)	91,793	▽ 54

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.10	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.69	108.26
€	యూరో	ఎస్‌బీఐ	89.29	91.65
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.47	52.60
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.42	57.36
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.44

తెలుగు రాష్ట్రాల్లోకి రివర్ ఎలక్ట్రిక్ స్కూటర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎలక్ట్రిక్ స్కూటర్ల సంస్థ రివర్ తాజాగా తెలుగు రాష్ట్రాల్లోకి విస్తరిస్తోంది. బుధవారం హైదరాబాద్‌లో తొలి స్టోర్‌ను ప్రారంభించగా మార్చి నాటికి వైజాగ్, విజయవాడ, గుంటూరులో కూడా ఏర్పాటు చేయనుంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరునాటికి స్టోర్స్ సంఖ్యను 50కి పెంచుకోనున్నట్లు సంస్థ సీఈవో అరవింద్ మణి తెలిపారు. ప్రస్తుతం ఇండీ పేరిట స్కూటర్లు విక్రయిస్తున్నామని, 2026 నాటికి ఏటా 1,00,000 వాహన విక్రయాల లక్ష్యం సాధించాక రెండో మోడల్‌ను కూడా ప్రవేశపెడతామని ఆయన వివరించారు. యమహా మోటర్ కార్పొరేషన్, టయోటా వెంచర్స్ తదితర దిగ్గజాల నుంచి ఇప్పటివరకు రూ. 550 కోట్లు సమీకరించినట్లు చెప్పారు. ప్రస్తుతం నెలకు సుమారు 500 యూనిట్లుగా ఉన్న అమ్మకాలను వచ్చే మార్చి నాటికి 3,000కి పెంచుకోనున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో ఇండీ ఎలక్ట్రిక్ స్కూటర్ ఆన్ రోడ్ ధర రూ. 1,45,000గా ఉంటుందని, ఒకసారి చార్జింగ్‌తో 120 కి.మీ. వరకు రేంజి ఉంటుందని మణి చెప్పారు.

టాటా, మహీంద్రా ఎస్‌యూవీ రేట్లు కట్!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా ఎస్‌యూవీల ధరలను తగ్గించాయి. డిమాండ్‌ను పెంచేందుకు ఇరు సంస్థలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. టాటా మోటార్స్ హ్యారియర్‌పై రూ.50,000, సఫారిపై రూ.70,000 తగ్గించింది. అలాగే ఎంపిక చేసిన హ్యారియర్, సఫారి వేరియంట్లపై రూ.1.4 లక్షల వరకు విలువ చేసే అదనపు ప్రయోజనాలు అందించనుంది. నెక్సన్ ఈవీపై రూ.1.3 లక్షల వరకు, పంచ్ ఈవీ రూ.30,000 డిస్కౌంట్‌తో లభిస్తాయి. ఎస్‌యూవీల అమ్మకాల్లో భారత్‌లో టాటా మోటార్స్ ఇటీవలే 20 లక్షల యూనిట్ల మార్కును చేరుకుంది. ఈ నేపథ్యంలో కింగ్ ఆఫ్ ఎస్‌యూవీస్ పేరుతో ప్రమోషనల్ కార్యక్రమానికి కంపెనీ శ్రీకారం చుట్టింది. జూలై 31 వరకు ఆఫర్స్ అమలులో ఉంటాయి. ఇక మహీంద్రా ఎక్స్‌యూవీ 700 ఏఎక్స్7 శ్రేణిపై రూ.2 లక్షల పైచిలుకు డిస్కౌంట్ ప్రకటించింది. మే నెలతో పోలిస్తే ఎక్స్‌యూవీ 700 బుకింగ్స్ జూన్‌లో 23 శాతం దూసుకెళ్లాయని మహీంద్రా తెలిపింది.

ఎల్ఐసీ పెట్టుబడులపై లాభాల పంట

గతేడాది 37 శాతం ప్లస్ • రూ. 4.39 లక్షల కోట్లు • స్టాక్ మార్కెట్ల ర్యాలీ ఎఫెక్ట్
కొంతమేర పెట్టుబడుల విక్రయం • అయినప్పటికీ పెరిగిన విలువ

బీమా రంగ పీఎస్‌యూ దిగ్గజం ఎల్ఐసీ ఇండియా గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో పలు దిగ్గజ కంపెనీలలో గల వాటాలను కొంతమేర విక్రయించింది. ఇందుకు స్టాక్ మార్కెట్లు బుల్ వేవ్‌లో పరుగు తీస్తుండటం ప్రభావం చూపింది. అయినప్పటికీ గతేదాది ఎల్ఐసీ పెట్టుబడుల విలువ ఏకంగా 37 శాతంపైగా జంప్‌చేయడం విశేషం! వివరాలు చూద్దాం



స్టాక్ ఎక్స్ఛేంజీలకు దాఖలైన సమాచారం ప్రకారం ఎల్ఐసీ పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీ గ్రూప్ కంపెనీలలో అత్యధిక పెట్టుబడులను కలిగి ఉంది. ఈ బాటలో టాటా, అదానీ గ్రూప్‌లలోనూ భారీగా ఇన్వెస్ట్ చేసింది. గత వారాంతానికల్లా దిగ్గజ కంపెనీలలో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ రూ. 4.39 లక్షల కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022-23)లో నమోదైన విలువతో పోలిస్తే ఇది 37.5 శాతం అధికం. రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్‌లో పెట్టుబడులు 34 శాతం ఎగసి రూ. 1.5 లక్షల కోట్లకు చేరాయి. వీటిలో పెట్టుబడులను గతేడాది 6.37 శాతం నుంచి 6.17 శాతానికి తగ్గించుకుంది. ఇదేకాలంలో టాటా గ్రూప్ కంపెనీలలో వాటా 4.22 శాతం నుంచి 4.05 శాతానికి నీరసించింది. వీటి విలువ రూ. 1.29 లక్షల కోట్లు. ఇక అదానీ గ్రూప్‌లో ఎల్ఐసీ వాటా 4.27 శాతం నుంచి 3.76 శాతానికి దిగివచ్చింది. వీటి విలువ 49 శాతం దూసుకెళ్లి రూ. 64,414 కోట్లను తాకింది.

> ఎన్ఎస్ఈలో బుధవారం ఎల్ఐసీ షేరు 1.5% బలపడి రూ. 1,048 వద్ద ముగిసింది. ఈ ధరలో ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ. 6.62 లక్షల కోట్లను అధిగమించింది.

ప్రభుత్వం సైతం

నిజానికి పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎల్ఐసీ సైతం స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. రూ. 1,050 సమీపంలో కదులుతోంది. కంపెనీలో కేంద్ర ప్రభుత్వానికి 96.5 శాతం వాటా ఉంది. దీంతో ఎల్ఐసీలో మైనారిటీ వాటా విక్రయం ద్వారా ప్రభుత్వం భారీగా నిధులు సమకూర్చుకునేందుకు వీలుంది. వీటిని మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించుకోవచ్చని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇటీవల దేశీ స్టాక్ మార్కెట్లు రోజుకో సరికొత్త గరిష్టాన్ని అందుకుంటూ జోరు చూపుతున్నాయి. దీనికితోడు ఏడాది కాలంలో పలు ప్రభుత్వ రంగ కంపెనీల షేర్లు వేలంవెర్రిగా లాభాల పరుగు తీస్తున్నాయి. వెరసి ప్రభుత్వం వీటిలో కొంతమేర వాటాల విక్రయాన్ని చేపడితే.. సులభంగా బడ్జెట్ ప్రతిపాదిత డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాలను చేరుకోవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

స్టాక్స్‌లో ఎల్ఐసీ పెట్టుబడులు ఇలా..

బిజినెస్ గ్రూప్	2023-24 వాటా(%)	2022-23 వాటా(%)	విలువ (రూ. కోట్లలో)
ఆర్ఐఎల్	6.19	6.37	1,50,249
టాటా	4.05	4.22	1,29,622
అదానీ	3.76	4.27	64,414
భారతీ	3.72	4.11	39,241
బిర్లా ఏవీ	4.03	4.86	31,943
జేఎస్‌డబ్ల్యూ	5.35	7.31	23,891



టాటా ఎలెక్సీ లాభం రూ. 184 కోట్లు

ముంబై: ఇంజినీరింగ్ సంబంధ ఐటీ సర్వీసుల కంపెనీ టాటా ఎలెక్సీ ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. నికర లాభం ఏప్రిల్-జూన్ క్వార్టర్(క్యూ1)లో 3 శాతం క్షీణించి రూ. 184 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం మాత్రం 9% పుంజుకుని రూ. 926 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 850 కోట్ల టర్నోవర్ సాధించింది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్ఈలో 1.5 శాతం లాభపడి రూ. 7,119 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-7-2024	
విశాఖ	575-00
చిత్తూరు	573-00
విజయవాడ	555-00
హైదరాబాద్	530-00
వరంగల్	532-00

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
గేమింగ్ మార్కెట్ హవా
నియామకాలు ఆశావహం

మార్కెట్లో లాభాల స్వీకరణ

- అధిక వేల్యుయేషన్ల ఆందోళన నేపథ్యం
- 80 వేల కిందికి సెన్సెక్స్, నిఫ్టీ 109 పాయింట్లు డౌన్

ముంబై: సరికొత్త రికార్డుల నమోదు తర్వాత ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో స్టాక్ సూచీలు బుధవారం అరశాతం నష్టపోయాయి. కార్పొరేట్ కంపెనీల జూన్ త్రైమాసిక ఫలితాల ప్రారంభానికి(గురువారం) ముందు అప్రమత్తత, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుపై నెలకొన్న అనిశ్చితి పరిస్థితులు ఒత్తిడి పెంచాయి. ఉదయం సెన్సెక్స్ 130 పాయింట్లు లాభంతో జీవితకాల గరిష్టం 80,481 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. నిఫ్టీ 28 పాయింట్లు పెరిగి ఆల్‌టైం హై 24,461 వద్ద మొదలైంది. ఈక్విటీలు జీవితకాల గరిష్టాల వద్ద ట్రేడవుతున్న తరుణంలో అధిక వెల్యుయేషన్ల ఆందోళనలతో ఇన్వెస్టర్లు భారీ లాభాల స్వీకరణకు తెరతీశారు. ఒక దశలో సెన్సెక్స్ 916 పాయింట్లు క్షీణించి 79,436 వద్ద, నిఫ్టీ 291 పాయింట్లు పతనమై 24,142 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. అయితే ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో మిడ్ సెషన్ నుంచి అమ్మకాల తీవ్రత తగ్గింది. చివరికి సెన్సెక్స్ 427 పాయింట్లు నష్టపోయి 80వేల దిగువన 79,925 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 109 పాయింట్లు పడి 24,324 వద్ద నిలిచింది. ప్రపంచ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- డిమాండ్‌ను పెంచేందుకు తమ ఎస్‌యూవీ మోడళ్ల ధరలను తగ్గించడంతో మహీంద్రాఅండ్‌మహీంద్రా కంపెనీ షేరు 7% నష్టపోయి రూ.2,732 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 8 శాతం పతనమై రూ.2,698 వద్ద నిలిచింది. కంపెనీకి చెందిన రూ.24,087 కోట్ల మార్కెట్ విలువ హరించుకుపోయి రూ.3.40 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ఎంక్యూర్ లిస్టింగ్ మెరుపులు



ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్ షేరు లిస్టింగ్‌లో మెప్పించింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.1,008)తో పోలిస్తే 31% ప్రీమియంతో రూ.1,325 వద్ద లిస్టయ్యింది. తొలుత 37% పెరిగి రూ.1,384 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 35% లాభంతో రూ.1,359 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.25,696 కోట్లుగా నమోదైంది.

బన్సాల్ వైర్ భేష్



స్టీల్ వైర్ల తయారీ కంపెనీ బన్సాల్ వైర్ ఇండస్ట్రీస్ లిస్టింగ్‌కు ఆదరణ లభించింది. ఇష్యూ ధర (రూ.256)తో పోలిస్తే బీఎస్ఈలో 37.50% ప్రీమియంతో రూ.352 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ బలహీన పరిస్థితులకు తట్టుకొని షేరు తొలుత 44% లాభపడి రూ.369 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 37% లాభంతో రూ.350 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.5,484 కోట్లుగా నమోదైంది.

పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

మంగళగిరి-తాడేపల్లి కమిషనర్‌గా షేక్ అలీమ్ బాషా

సాక్షి, అమరావతి: ముగ్గురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీసీఆర్డీఏలో అదనపు కమిషనర్‌గా ఉన్న షేక్ అలీమ్ బాషాను మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించారు. ఇక్కడ కమిషనర్‌గా ఉన్న వి.నిర్మల్ కుమార్‌ను బాపట్ల మున్సిపాలిటీకి డిప్యుటేషన్‌పై వేశారు. బాపట్ల కమిషనర్‌గా ఉన్న బి.శ్రీకాంత్‌ను మంగళగిరి-తాడేపల్లి డిప్యూటీ కమిషనర్‌గాను, ఇప్పటి వరకు ఇక్కడ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న బి.శివారెడ్డిని సీడీఎంఏలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

పిన్నెల్లి బెయిల్ పిటిషన్ 18కి వాయిదా

నగరంపాలెం (గుంటూరువెస్ట్): పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్ ఈనెల 18కి వాయిదా పడింది. గుంటూరు నగరంపాలెం జిల్లా కోర్టు ఆవరణలోని 4వ అదనపు జిల్లా కోర్టులో బుధవారం పిటిషన్‌పై విచారణ చేపట్టారు. ప్రస్తుతం పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇటీవల ఆయన్ను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. గతంలో రెండుసార్లు పిన్నెల్లి బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా వేశారు.

కృష్ణానదిలో పెరుగుతున్న వరద

సాక్షి, అమరావతి: నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణానదిలో ఎగువన వరద ఉద్ధృతి క్రమేణ పెరుగుతోంది. కర్ణాటకలోని ఆల్మట్టి డ్యామ్‌లోకి బుధవారం 84,645 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 78.61 టీఎంసీలకు చేరుకుంది. ఆల్మట్టి నిండాలంటే ఇంకా 51 టీఎంసీలు అవసరం. కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. తుంగభద్ర డ్యామ్‌లోకి 27,544 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 25.17 టీఎంసీలకు చేరుకుంది. తుంగభద్ర డ్యామ్ నిండాలంటే ఇంకా 80 టీఎంసీలు అవసరం.

త్వరలో వసతి గృహాల్లో ఖాళీల భర్తీ

మంత్రి బాల వీరాంజనేయస్వామి

సాక్షి, అమరావతి: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని, బకాయిలను విడుదల చేస్తామని రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ప్రతినిధి బృందాలు వేర్వేరుగా మంత్రిని కలిసి పలు అంశాలు చర్చించాయి. సానుకూలంగా స్పందించిన ఆయన సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీల భర్తీకి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో 15 మంది అరెస్ట్

గన్నవరం: కృష్ణా జిల్లా గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో పోలీసులు 15 మందిని బుధవారం అరెస్ట్ చేశారు. గత ఏడాది ఫిబ్రవరి 20న జరిగిన ఈ ఘటనలో 44 మంది వైఎస్సార్‌సీపీ నేతలపై అప్పట్లోనే పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ఈ కేసులో మరో 27 మంది పేర్లను చేర్చారు. ఈ జాబితాలో 71వ నిందితుడిగా మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పేరు పెట్టడం గమనార్హం. రెండు రోజులుగా 15 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బుధవారం డీఎస్పీ జయసూర్య సమక్షంలో అరెస్ట్ చూపించారు. అరెస్ట్ అయిన వారిలో తిప్పనగుంట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మూల్పూరు ప్రభుకాంత్, బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్, గన్నవరం మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్కే కరిముల్లా, కొల్లి సుబ్రహ్మణ్యం(చిట్టి), బుగ్గల రాజేష్, రామినేని రవిబాబు, మల్లవల్లి సాయిరాహుల్, షేక్ రబ్బాని, పాగోలు సురేష్, బండారుపల్లి కోటేశ్వరరావు, పడమట నాగరాజు, దాసరి విజయ్, సాలి యోహాన్, అల్లాపురం సర్పంచి డొక్కు వెంకన్నబాబు, మేచినేని విజయ్‌కుమార్ ఉన్నారు. వీరందరిని స్థానిక కోర్టులో హాజరుపరిచారు.

'తల్లికి వందనం' ఒక్కరికేనా?

మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న 'తల్లికి వందనం, స్టూడెంట్ కిట్' పొందేందుకు ఆధార్‌ను ప్రామాణికం చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ బుధవారం జీవో నం.29 జారీ చేశారు. అన్ని ప్రభుత్వ పథకాలకు ఆధార్ తప్పనిసరి అయిన క్రమంలో ఈ పథకాలకు కూడా నిబంధన వర్తిస్తుందని పేర్కొన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, 75 శాతం హాజరు ఉన్న ఒకటి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. గుర్తింపునకు ఆధార్‌తో పాటు అనుబంధంగా ఫొటో ఉన్న బ్యాంక్, పోస్ట్ ఆఫీస్ పాస్ బుక్, పాన్ కార్డు, పాస్‌పోర్టు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు, ఎంజీఎన్ఆర్ఈజీఏ కార్డు, కిసాన్ ఫొటో పాస్‌బుక్, డ్రైవింగ్ లైసెన్స్, తహసీల్దార్ లేదా గెజిటెడ్ అధికారి జారీ చేసిన ఫొటో సర్టిఫికెట్‌లలో ఏదో ఒకటి జత చేయాలని పేర్కొన్నారు. కాగా, కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ అమలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ, బుధవారం జారీ చేసిన జీవో నం.29లో ఈ పథకం కింద ఒక్కో తల్లికి రూ.15 వేల చొప్పున ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌లలో భాగంగా ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం కింద దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతి తల్లికి లేదా గుర్తింపు పొందిన సంరక్షకుడికి సంవత్సరానికి రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తుందని, ఇది ఒకటి నుంచి ఇంటర్ వరకు (ప్లస్ 2) పిల్లలను పాఠశాలలు/కళాశాలలకు పంపేవారికి వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి వెళుతున్నారన్నది కాకుండా ఒక్క తల్లికి మాత్రమే రూ.15 వేలు ఇవ్వనున్నట్టు తాజాగా ప్రకటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వేట నిషేధ భృతిపై రీసర్వే చేయండి

- 2019-24లో మత్స్యశాఖ కార్యక్రమాలపై పునఃపరిశీలన
- 2014- 2019లో అమలు చేసిన పథకాలు పునరుద్ధరణ
- మత్స్యశాఖ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే పరిహారం, ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాపై రీసర్వే చేపట్టి 20 రోజుల్లో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ భృతి కింద వేటకు వెళ్లే మత్స్యకారులకు రూ.20 వేల చొప్పున భృతి అందించాల్సి ఉందని అధికారులు చెప్పారు. ఈ ఏడాది 1.30 లక్షల మంది అర్హులను గుర్తించామని వివరించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మత్స్యకారులకు వేట నిషేధిత సమయంలో ఇచ్చే భృతిని నిష్పక్షపాతంగా ఇవ్వలేదన్నారు. చాలాచోట్ల అనర్హులకు పరిహారం అందిందన్నారు. ఈ ఏడాది రూపొందించిన అర్హుల జాబితాను పునఃపరిశీలన జరిపి పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలన్నారు.

గత ప్రభుత్వ కార్యక్రమాలపై పునఃపరిశీలన

గత ప్రభుత్వ హయాంలో ఐదు హార్బర్ల నిర్మాణానికి టెండర్లు పిలిచి సొంతవారికే కట్టబెట్టారని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. రెండోసారి నాలుగు హార్బర్లను స్థానిక ప్రజాప్రతినిధులకు ఇవ్వగా.. వీటిలో రెండు హార్బర్లు పనిచేయడం లేదన్నారు. 2019-24లో మత్స్యశాఖలో అమలు చేసిన కార్యక్రమాలపై పునఃపరిశీలన చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, ఓడరేవు, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ల ప్రస్తుత స్థితిగతులపై నివేదిక సమర్పించాలని కోరారు. 2014-2019 వరకు మత్స్యశాఖ అమలు చేసిన పథకాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విజయవాడ, కలిదిండిలో ఉన్న ఆక్వా హబ్స్ మాదిరి జిల్లా కేంద్రాల్లో కూడా హబ్స్ ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేయాలని కోరారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్, హార్టీకల్చర్, ఆక్వాకల్చర్, మత్స్య శాఖల కార్యదర్శి అహ్మద్‌బాబు, మత్స్యశాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి, మత్స్యశాఖ అదనపు సంచాలకులు ఎస్.అంజలి, జాయింట్ డైరెక్టర్లు వి.వెంకటేశ్వరరావు, జి.హీరానాయక్, ఎస్కే లాల్‌మహ్మద్, డిప్యూటీ డైరెక్టర్లు పి.మాధవీలత, పీవీ సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ పీవీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ శ్వేతపత్రంలో చార్జీల ప్రస్తావన ఏదీ?

- విద్యుత్ చార్జీలు తగ్గిస్తారా? పెంచుతారా?
- స్మార్ట్ మీటర్ల విషయంలో బాబు రైతులను మోసం చేశారు
- స్టీల్ ప్లాంట్‌పై కేంద్రం నుంచి హామీ తీసుకోండి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: విద్యుత్‌పై సీఎం చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రంలో చార్జీల భారం ప్రస్తావన ఏదీ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నిలదీశారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తారో, పెంచుతారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విజయవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. చంద్రబాబు మేనిఫెస్టోలో చెప్పిన విషయాలను శ్వేతపత్రంలో ప్రస్తావించలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తారని ఎదురు చూసిన ప్రజలకు ఆశాభంగమే ఎదురైందన్నారు. ఎన్నికలకు ముందు లోకేశ్ చెప్పిన మాటలు విని రైతులు వ్యవసాయ మీటర్లను ధ్వంసం చేశారని, వారిపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారని తెలిపారు. టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్మార్ట్ మీటర్లపై కోర్టులో కేసు కూడా వేశారన్నారు. స్మార్ట్ మీటర్లను కొనసాగిస్తామని ఇప్పుడు చంద్రబాబు చెబుతున్నారని, ఇది రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు. ఈ మీటర్లతో ఉచిత విద్యుత్‌కు ఎగనామం పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడోదశ విద్యుత్ సంస్కరణలతో బాబు ప్రజలపై మరింత భారం వేస్తారని తెలిపారు. ట్రూఅప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని, ఏజెన్సీ ప్రాంతంలో అదానీకి ఇచ్చిన భూములను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించబోమని కేంద్రం నుండి టీడీపీ కూటమి ప్రభుత్వం, ఆ పార్టీల ఎంపీలు హామీ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలేవి?

బూదవాడ అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యం వల్ల ఇద్దరు మృతి చెంది, మరో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ యాజమాన్యంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఆయన బుధవారం సీపీఎం నేతలతో కలిసి సిమెంట్ ఫ్యాక్టరీ ప్రమాద బాధితుల్ని పరామర్శించారు. అనంతరం పార్టీ నేతలు సీహెచ్ బాబూరావు, డీవీ కృష్ణలతో కలిసి విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని కార్మికులు, సిబ్బంది ముందునుంచి చెబుతున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. యాజమాన్యంపై హత్యానేరం కేసు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు కార్మికులు, మహిళలపై పాశవిక దాడిచేయడం కొట్టడం దారుణమన్నారు. యాజమాన్యానికి కొమ్ముకాసిన పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు ఫ్యాక్టరీ యాజమాన్యంతోపాటు ప్రభుత్వం కూడా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'సహకార' సమస్యలు పరిష్కరించాలి

మంత్రి లోకేశ్‌కు ఏపీ పీఏసీఎస్ ఉద్యోగుల వినతి



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

తిరువూరు: గ్రామీణ ప్రాంత రైతులకు సేవలందించే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ పీఏసీఎస్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురాం అమరావతిలో మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని 2,051 పీఏసీఎస్‌లలో ఏడు వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, గతంలో నియమించిన మానవ వనరుల కమిటీ సిఫారసు మేరకు జీతభత్యాలు, ఉద్యోగ భద్రత, కారుణ్య నియామకాలు తదితర అంశాలపై ప్రభుత్వం త్వరితగతిన ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. 2014 నుంచి వేతన సవరణ జరగలేదని, కొత్త హెచ్ఆర్ పాలసీపై ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, 62 సంవత్సరాలకు పదవీ విరమణ వయసు పెంచాలని మంత్రిని కోరినట్లు రఘురాం స్థానిక విలేకరులకు తెలిపారు.

సిమెంట్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మరో కార్మికుడి మృతి



బాణావత్ స్వామి (ఫైల్)

తాడేపల్లిరూరల్/బూదవాడ(జగ్గయ్యపేట): ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడలో ఈ నెల 7వ తేదీన అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ బ్లాస్టింగ్ జరిగిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడ్డ 16 మందిలో ఎనిమిది మందిని గుంటూరు జిల్లా తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రిలో చేర్చారు. వారిలో ఆవుల వెంకటేష్(38) చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందగా.. మరో కార్మికుడు బాణావత్ స్వామి(26) బుధవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం అధికారులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. మృతదేహానికి ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా సోమశంకర్‌నాయక్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఆర్డీవో రవీంద్రరావు తదితరులున్నారు. ఇద్దరు కుమారులతో కుటుంబాన్ని ఎలా పోషించాలంటూ భార్య శైలజ కన్నీళ్లపర్యంతమైంది.

క్లుప్తంగా...

ఆర్‌ఎస్ బ్రదర్స్‌లో ఆషాఢమాసం కేజీ సేల్స్

సౌత్ ఇండియా షాపింగ్ మాల్స్‌లో ఆషాఢమాసం కిలో సేల్స్

బీసీ స్టడీ సర్కిళ్లలో ఈడబ్ల్యూఎస్ కోటా!

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిళ్లలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కేటగిరి విద్యార్థులకు పది శాతం సూపర్ న్యూమరరీ రిజర్వేషన్‌తో ప్రవేశాలు కల్పించేలా ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నట్టు బీసీ సంక్షేమ శాఖ సంచాలకులు ఎ.కృష్ణమోహన్ తెలిపారు. మంత్రి ఎస్.సవిత ఆదేశాల మేరకు ఈ ప్రతిపాదనలు చేయనున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బీసీ స్టడీ సర్కిళ్లు ఉన్నాయన్నారు. వాటి ద్వారా నిరుద్యోగ విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన కోచింగ్ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కోటా ప్రకారం ఆ స్టడీ సర్కిళ్లలో బీసీలకు 66శాతం, ఎస్సీలకు 20శాతం, ఎస్టీలకు 14శాతం రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇటీవల 103 రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఈడబ్ల్యూఎస్ కేటగిరికి చెందిన విద్యార్థులకు 10శాతం రిజర్వేషన్ కల్పించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో పది శాతం ఈడబ్ల్యూఎస్ కోటా కల్పిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. బీసీ స్టడీ సర్కిళ్లలోను ఈడబ్ల్యూఎస్ కోటా ఇవ్వాలని వినతులు రావడంతో ప్రభుత్వానికి ప్రతిపాదించాలని మంత్రి సవిత ఆదేశించారు.

ఈవీలపై రోడ్‌ట్యాక్స్ బాదుడు

కాలుష్యాన్ని నివారించేందుకు వీటిని ప్రోత్సహించిన వైఎస్ జగన్ ప్రభుత్వం

జూలై 7 నాటికి ఓలా ఎస్1 (3 కేడబ్ల్యూహెచ్) ద్విచక్ర వాహనం విశాఖలో ఆన్‌రోడ్ ధర రూ.97,448 ఉండేది. అయితే, ఆ మర్నాడు జూలై 8 నుంచి దీని ధర అమాంతంగా రూ.1,08,579కు పెరిగింది. ఇందుకు కారణం.. జూలై 7 వరకు గత ప్రభుత్వం ఎలక్ట్రికల్ వాహనాల మీద ఇచ్చిన 12 శాతం రోడ్డు ట్యాక్స్ రాయితీని ఇప్పుడు టీడీపీ సర్కారు కొనసాగించకపోవడమే. ఇక ఎలక్ట్రికల్ కార్ల ధరలపై కూడా అదనంగా 12 శాతం రోడ్డు ట్యాక్స్ బాదనుండటంతో వాటి ధరలు అమాంతంగా పెరిగిపోయాయి.



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ వీటి వినియోగం గణనీయంగా వృద్ధి చెందుతోంది. భారంగా మారిన పెట్రోల్, డీజిల్ ధరల ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు విద్యుత్ వాహనాలు కొనుగోలు చేసేందుకే ఎక్కువమంది మొగ్గు చూపుతున్నారు. ఇంధన సంరక్షణ కోసం ఈవీలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్ ట్యాక్స్, ఇతర పన్నుల మినహాయింపులు ఇస్తుండటంతో.. వాహన వినియోగం జోరందుకుంది. కానీ.. ఇప్పుడు ఏపీలో మాత్రం ఈ వాహనాలు పట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. కనిపించని భారాలను ప్రజలపై మోపి ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం.. ఈవీలను కూడా పావుగా వాడుకుంటూ రోడ్ ట్యాక్స్ బాదేస్తోంది.

ఉన్న మాఫీనీ ఎత్తివేస్తున్న వైనం..

వాస్తవానికి.. పర్యావరణహిత రవాణాని ప్రోత్సహించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికల్స్‌పై రహదారి పన్నుని పూర్తిగా మాఫీచేస్తూ.. రెండ్రోజుల క్రితం ఉత్తర్వులు జారీచేస్తే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం ఉన్న మాఫీని వారం రోజుల క్రితమే ఎత్తేసింది. పెట్రోల్, డీజిల్ వాహనాలవల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని తగ్గించడంతో పాటు హరిత వాహనాల కొనుగోలుని ప్రోత్సహించేందుకు దాదాపు అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈవీలపై రోడ్ ట్యాక్స్‌ని మినహాయింపునిస్తున్నాయి. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ కార్లు, బైక్‌ల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్ ట్యాక్స్ నుంచి ఈవీలకు మినహాయింపుని కొనసాగిస్తూ వచ్చింది. కానీ, ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం దీన్ని చెప్పాపెట్టకుండా ఎత్తేసి కొనుగోలుదారులపై అదనపు భారాన్ని మోపింది.

ఈనెల 7తో ముగిసిన కాలపరిమితి..

ప్రతియేటా.. రోడ్ ట్యాక్స్ మినహాయింపునకు సంబంధించిన ఉత్తర్వుల్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొనసాగిస్తూ వచ్చింది. గతేడాది ఇచ్చిన జీఓ కాలపరిమితి ఈనెల 7తో ముగిసింది. రాష్ట్రంలో కొనుగోలు చేసిన ప్రతి ఈవీపై ఎలాంటి రోడ్ ట్యాక్స్ ఇప్పటివరకూ విధించలేదు. కానీ, ఆ జీఓ కాలపరిమితి ముగిసిపోవడంతో.. కొత్త ప్రభుత్వం దానికి సంబంధించి ఎలాంటి కొనసాగింపు ఉత్తర్వులు జారీ చెయ్యకుండా కాలయాపన చేస్తోంది. ఫలితంగా.. ఈవీ కొనుగోలుదారులపై అదనపు భారం పడుతోంది.

12 శాతం అదనపు భారం..

ఇక ఏపీలో కొనుగోలు చేసే ప్రతి ఎలక్ట్రిక్ వాహనానికి 12 శాతం రోడ్ ట్యాక్స్ చెల్లించాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రజలపై కనిపించని భారాన్ని మోపుతూ అందినకాడికి దోచుకునేందుకు కూటమి ప్రభుత్వం కొత్త స్కెచ్ వేసింది. రోడ్ ట్యాక్స్ పేరుతో గుదిబండ మోపి.. ప్రజల డబ్బుతో ఖజానా నింపేసుకోవాలని కుయుక్తితో మినహాయింపు జీఓ జారీచేయలేదు. దీంతో.. రవాణాశాఖ 7వ తేదీ నుంచి కొనుగోలు చేసిన ప్రతి ఎలక్ట్రిక్ వాహనంపై రోడ్ ట్యాక్స్‌ని 12 శాతం విధిస్తోంది. ఫలితంగా ఎలక్ట్రికల్ టూ వీలర్స్‌పై రూ.12 వేల నుంచి కార్ల వినియోగదారులు వేరియంట్‌ను బట్టి లక్ష రూపాయల నుంచి రెండు లక్షల వరకూ అదనంగా చెల్లించాల్సి వస్తోంది.

రాయితీ కొనసాగింపుపై ఉత్తర్వుల్లేవు..

ఎలక్ట్రికల్ వాహనాలపై ఉన్న 12 శాతం రోడ్డు రాయితీ విధానం ఈనెల 7తో ముగిసిందని.. దీనిని కొనసాగిస్తూ కొత్త ప్రభుత్వం ఎటువంటి ఉత్తర్వులు జారీచేయలేదని రవాణాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆదాయార్జన అవసరమున్న నేపథ్యంలో దీనిని కొనసాగిస్తుందన్న నమ్మకం కూడా తమకు లేదని వారు అభిప్రాయపడుతున్నారు.

పన్ను రాయితీలు కొనసాగించండి..

మరోవైపు.. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ)లపై పన్ను రాయితీని కొనసాగించాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ కోరుతూ రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి బుధవారం వినతిపత్రాన్ని సమర్పించింది. కేంద్ర ప్రభుత్వ ఈవీ విధానాన్ని అనుసరిస్తూ గత ప్రభుత్వం ఈవీ వాహనాల తయారీ, అమ్మకం, కొనుగోలుపై పన్ను రాయితీలను ఈ ఏడాది జులై 7 వరకు కొనసాగించాలని ఉత్తర్వులు జారీచేసిందని గుర్తుచేసింది. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం కొత్త ఈవీ విధానాన్ని ఖరారు చేయనందున ఆ పన్ను రాయితీలను పొడిగించాలని కోరింది. రిజిస్ట్రేషన్ చార్జీలు, రోడ్ ట్యాక్స్, ఇతర పన్ను రాయితీలను కొనసాగించాలని విజ్ఞప్తి చేసింది.

కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వండి

ఆరోగ్యశ్రీ సీఈవోకు ఆరోగ్యమిత్రల వినతిపత్రం

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రజలకు సేవలు అందిస్తున్న తమకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ ప్రతినిధులు సీఈవో లక్ష్మీశాను కోరారు. మంగళగిరిలోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ప్రధాన కార్యాలయంలో సీఈవోను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత, ఈహెచ్‌ఎస్ కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ ఇవ్వాలన్నారు. సీఈవోను కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి గురవయ్య పాల్గొన్నారు.

ఇందుకూరి వ్యాజ్యం హైకోర్టు ధర్మాసనానికి నివేదన

సాక్షి, అమరావతి: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నానంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనపై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి చైర్మన్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సింగిల్ జడ్జి బుధవారం ద్విసభ్య ధర్మాసనానికి నివేదించారు. అనర్హత వేటుకు సంబంధించిన వ్యాజ్యాలను ధర్మాసనమే విచారించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకున్న సింగిల్ జడ్జి జస్టిస్ చీమలపాటి రవి ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనపరమైన నిర్ణయం తీసుకునేందుకు వీలుగా ఫైల్‌ను ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. అనర్హతపై మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి దాఖలు చేసిన వ్యాజ్యం కూడా ధర్మాసనం ముందుకే వెళ్లనుంది.

ప్రైవేటు వర్సిటీల్లో పేదింటి ప్రతిభావంతులకు కోటా

- వైఎస్ జగన్ ప్రభుత్వం తెచ్చిన విప్లవాత్మక సంస్కరణల ఫలితం
- ఎట్టకేలకు ఫీజులు ఖరారు చేసిన ప్రస్తుత ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో పేదింటి విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తోంది. ఇంజనీరింగ్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఈఏపీసెట్) ర్యాంకులతో కన్వీనర్ కోటాలో రాష్ట్రంలోని 9 ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ చేరే అవకాశాన్ని గత జగన్ ప్రభుత్వం కల్పించిన సంగతి తెలిసిందే. ఇలా ప్రవేశాలు పొందినవారికి ప్రభుత్వమే ఫీజులు కూడా చెల్లించింది. వైఎస్ జగన్ దార్శనికతతో గత రెండేళ్లలో ఏకంగా 6,961 మంది పేదింటి పిల్లలు ప్రైవేటు యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో సీట్లు పొందారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యనభ్యసించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా వైఎస్ జగన్ బాటలోనే నడుస్తోంది. పేదింటి ప్రతిభావంతులు ప్రైవేటు వర్సిటీల్లో చేరడానికి వీలుగా వాటికి బుధవారం ఫీజులను ఖరారు చేసింది. ఈఏపీసెట్–2024లో ర్యాంకులు సాధించినవారు కన్వీనర్ కోటాలో ఈ 9 ప్రైవేటు యూనివర్సిటీల్లో చేరడానికి వీలుగా కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్లకు అధికారులు అవకాశమిచ్చారు. దీంతో 2024–25 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు 7,950 సీట్లు అందుబాటులోకి వచ్చాయి.

వరుసగా మూడో ఏడాది..

ఏపీలోని ప్రైవేటు వర్సిటీల్లోని వివిధ కోర్సుల్లో 35 శాతం(గ్రీన్‌ఫీల్డ్), 70 శాతం(బ్రౌన్‌ఫీల్డ్) కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేసేలా గత ప్రభుత్వం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను తీసుకొచ్చింది. తాజాగా కూటమి ప్రభుత్వం వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్), మోహన్‌బాబు వర్సిటీల్లో రూ.1,03,000, ఎస్‌ఆర్‌ఎంలో రూ.1,02,000, అపోలో వర్సిటీలో కనిష్టంగా రూ.35 వేలు, గరిష్టంగా రూ.99,500, భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ టెక్నాలజీ టెక్ ఇన్నోవేషన్ వర్సిటీ (బెస్టీయూ)లో రూ.69,500, సెంచూరియన్ వర్సిటీలో రూ.60 వేలుగా ఫీజులను నిర్ధారించింది. వీటితో పాటు కొత్తగా వర్సిటీలుగా రూపాంతరం చెందిన గోదావరి గ్లోబల్ వర్సిటీలో రూ.60 వేలు, ఆదిత్య వర్సిటీలో కనిష్టంగా రూ.60 వేలు, గరిష్టంగా రూ.79,500, అన్నమాచార్య వర్సిటీలో రూ.60 వేలుగా నిర్ణయించింది.

గతంలో రూ.లక్షల్లో ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి..

ఏపీలోని ప్రైవేటు వర్సిటీల్లో గతంలో ఏడాదికి రూ.5 లక్షల వరకు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఉండేది. ధనవంతుల పిల్లలు మాత్రమే వీటిలో చదువుకోగలిగేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దూరదృష్టితో తీసుకున్న నిర్ణయంతో పేద మెరిట్ విద్యార్థులకు గ్రీన్‌ఫీల్డ్ వర్సిటీల్లో 35 శాతం సీట్లు, బ్రౌన్ ఫీల్డ్ వర్సిటీల్లో 70 శాతం సీట్లు లభిస్తున్నాయి. 2022–23, 2023–24 విద్యా సంవత్సరాల్లో 6,961 సీట్లను కన్వీనర్ కోటాలో పేద విద్యార్థులతో భర్తీ చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి మొత్తం 9 ప్రైవేటు వర్సిటీల్లో 7,950 సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేయనున్నారు.

210 ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజులు ఖరారు..

కాగా రాష్ట్రంలో 210 ఇంజనీరింగ్ కళాశాలలు, రెండు ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్ కళాశాలలకు మూడు రోజుల క్రితమే ప్రభుత్వం ఫీజులు ఖరారు చేసింది. బీటెక్ కోర్సులకు గరిష్టంగా రూ.1.03 లక్షల నుంచి రూ.1.05 లక్షలు, కనిష్టంగా రూ.40 వేల చొప్పున ఫీజులను నిర్ణయించింది. రూ.40 వేల ఫీజులు ఉన్న కళాశాలలు దాదాపు 114, రూ.లక్షపైన ఫీజు ఉన్న కళాశాలలు 8 వరకు ఉన్నాయి. రెండు ఆర్కిటెక్చర్ కళాశాలలకు రూ.35 వేల చొప్పున ఫీజులు నిర్ణయించింది.

ప్రభుత్వ జాప్యంతో విద్యార్థుల్లో ఆందోళన

రాష్ట్రంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ఈ నెల 1 నుంచి ప్రారంభమైంది. 8వ తేదీ నుంచి 12 వరకు విద్యార్థులకు వెబ్ ఆప్షన్ల ఎంపికకు అవకాశం కల్పించింది. అయితే వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే సమయంలో ప్రైవేటు వర్సిటీలు వెబ్‌సైట్‌లో కనిపించలేదు. అంతకుముందు రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజులు ఖరారు చేసిన ప్రభుత్వం ప్రైవేటు వర్సిటీలకు ఫీజులు నిర్ణయించడంలో తీవ్ర జాప్యం చేసింది. దీంతో విద్యార్థులు ప్రైవేటు వర్సిటీల్లో కన్వీనర్ సీట్లు ఉంటాయో, లేదోనన్న మీమాంసలో పడిపోయారు. కొందరు అందుబాటులో ఉన్న కళాశాలల్లో కోర్సులకు ఆప్షన్లు పెట్టుకోగా మరికొందరు ప్రైవేటు వర్సిటీల ఆప్షన్ల విడుదలయ్యే వరకు వేచి చూశారు. బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వం ఫీజులు ఖరారు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రైవేటు వర్సిటీల ఆప్షన్లు వెబ్‌సైట్‌లో కనిపించాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆప్షన్లు ఇచ్చేసిన విద్యార్థులు 13న ఆప్షన్ల మార్పు సమయంలో తమకు నచ్చిన ప్రైవేటు వర్సిటీని ఎంపిక చేసుకోవచ్చని ఉన్నత విద్య వర్గాలు చెబుతున్నాయి.

ముందస్తు బెయిల్ పిటిషన్ల విచారణ నేడు

- ముందస్తు బెయిల్ కోరుతూ ఆళ్ల, సజ్జల పిటిషన్లు
- ఇప్పటికే అప్పిరెడ్డి, తలశిల రఘురాం, దేవినేని అవినాష్ పిటిషన్లు
- అన్ని వ్యాజ్యాలను కలిపి నేడు విచారించనున్న హైకోర్టు



సాక్షి, అమరావతి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. హైకోర్టు వీటన్నింటినీ కలిపి గురువారం విచారించనుంది. ఇప్పటికే ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, దేవినేని అవినాష్ ముందస్తు బెయిల్ పిటిషన్లు వేయగా, తాజాగా మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కూడా పిటిషన్లు దాఖలు చేశారు. అప్పిరెడ్డి, రఘురాం, అవినాష్ వ్యాజ్యాలపై న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. మరికొందరి తరఫున కూడా ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశామని తెలిపారు. వీటిని కూడా ఇంతకు ముందు వేసిన వ్యాజ్యాలతో జత చేయాలని అభ్యర్థించారు. దీనిపై న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. అన్నింటినీ కలిపి గురువారం విచారణ జరుపుతామని తెలిపారు.

సినిమా టికెట్ ధరల పెంపుపై లోతుగా విచారణ

- ధరలు పెంచే అధికారం ప్రభుత్వానికి ఉందో లేదో తేలుస్తాం
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: భారీ బడ్జెట్ సినిమాలకు టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందో లేదో తేలుస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై లోతైన విచారణ జరుపుతామంది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది. టికెట్ ధరలపై గతంలో దాఖలైన వ్యాజ్యాన్ని తాజా వ్యాజ్యంతో జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభాస్ నటించిన కల్కి సినిమా టికెట్ ధరలను రెండు వారాలు పెంచుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ నెల్లూరుకు చెందిన రాకేష్ రెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ గతంలో మొదటి 10 రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతినిచ్చిన ప్రభుత్వం ఇప్పుడు 14 రోజులకు ఎలా అనుమతిస్తుందని ప్రశ్నించింది. అసలు టికెట్ ధరలను ఎవరు వసూలు చేస్తారని, అందులో పన్ను ఎంత అని కూడా ప్రశ్నించింది. ఈ విషయాలన్నింటిపై స్పష్టతనివ్వాలని, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

రూ.36.50 కోట్లతో సీఆర్డీఏలో పిచ్చి మొక్కల తొలగింపు

- టెండర్లు ఆహ్వానించిన అథారిటీ
- కొత్తగా 29 గ్రామాల్లో పనులకు శ్రీకారం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ (ఏపీ సీఆర్డీఏ) ప్రాంతంలో పిచ్చి మొక్కల తొలగింపు పనులకు సీఆర్డీఏ చర్యలు చేపట్టింది. మొత్తం 25 వేల ఎకరాల్లో పనులు చేపట్టనున్నారు. ఇందు కోసం రూ.36.50 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. ఈనెల 25వ తేదీ వరకు టెండర్లు వేయవచ్చని సీఆర్డీఏ అధికారులు ప్రకటించారు. కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దాదాపు 673 ఎకరాల్లో యుద్ధ ప్రాతిపదికన పిచ్చి మొక్కలను తొలగింపునకు చర్యలు చేపట్టారు. గత నెలలో రూ.67.57 లక్షలతో కరకట్ట రోడ్డు, శాసనసభ, హైకోర్టు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత అధికారుల నివాస సముదాయాల పరిసరాల్లో ఎనిమిది భాగాలుగా టెండర్లు పిలిచి పనులు పూర్తి చేశారు. ఇప్పుడు కొత్తగా 29 గ్రామాల్లోను జంగిల్ క్లియరెన్స్‌కు సీఆర్డీఏ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈసారి ల్యాండ్ పూలింగ్ కోసం భూమి ఇచ్చిన రైతులకు తిరిగి ఇచ్చే ప్లాట్లలోను ఈ పనులు చేపట్టనున్నారు.

22 నుంచి గ్రామసభలు

సాక్షి, అమరావతి: గ్రామాల్లో పూర్తి స్థాయి పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయిల ఏర్పాటు తదితర అంశాలపై క్షేత్ర స్థాయిలో గ్రామస్తుల మధ్య చర్చించేందుకు ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించుకోవాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సూచించింది. అదే మాదిరి గ్రామ సభలను అక్టోబర్ 2వ తేదీన కూడా మరోసారి నిర్వహించుకోవాలని సూచించింది. 2024 చివరి నాటికి దేశమంతటా అన్ని గ్రామాల్లో ఇంటింటికి తాగునీటి కొళాయిల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న హర్ ఘర్ జల్ కార్యక్రమం, అలాగే అన్ని గ్రామాలను నూరుశాతం పరిశుభ్రంగా ఉంచుకునేందుకు 'ఓడీఎఫ్' ప్లస్ పేరుతో కేంద్రం మరో కార్యక్రమం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు గ్రామసభలు నిర్వహించుకోవాలని సూచిస్తూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, కేంద్ర జలశక్తి శాఖ పరిధిలోని తాగునీటి సరఫరా విభాగపు కార్యదర్శి వినీ మహాజన్ ఉమ్మడిగా ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రభుత్వ కార్యదర్శులకు వారం రోజుల కిందట లేఖలు రాశారు. కాగా, రాష్ట్రంలో70.11 లక్షల ఇళ్లకు ఇప్పటికే ఇంటింటికీ తాగునీటి కొళాయిలను ప్రభుత్వం ఏర్పా టు చేసింది. అందులో 39.36 లక్షల ఇళ్లకు 2019 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం గమనార్హం.

అధికారపక్షం దౌర్జన్యాలను ఎదుర్కొందాం

- సంక్షేమం పేదల హక్కు.. కాలరాసే అధికారం ఎవ్వరికీ లేదు
- అధికార పార్టీ దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కోవాలి
- సత్వర న్యాయం పొందేందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయి
- అవగాహన పెంచుకుంటే సులువుగా న్యాయం పొందొచ్చు
- ప్రజలకు అవగాహన కల్పించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం (శ్రీ సత్యసాయి జిల్లా): ప్రభుత్వ పథకాల ద్వారా సంక్షేమం పేద ప్రజల హక్కు అని, దానిని కాలరాసే అధికారం ఎవ్వరికీ లేదని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే, ఆ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదాలు చూడకుండా పేద ప్రజలందరికీ సంతృప్తస్థాయిలో సంక్షేమం అందిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులైనప్పటికీ, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు సంక్షేమ పథకాలను తొలగిస్తున్నారన్నారు. పైగా, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులపై అధికారపక్షం నిత్యం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతోందని తెలిపారు. వీటిని ధైర్యంగా ఎదుర్కోవాలని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు వంటి చర్యల నుంచి బాధిత ప్రజలు వివిధ మార్గాల ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. అధికార పక్ష దౌర్జన్యాలను ఏ విధంగా ధైర్యంగా ఎదుర్కోవాలన్న అంశంపై ఆయన బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో సత్వర న్యాయం పొందేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, న్యాయం జరిగే విధానాలను వివరించారు.

పేద ప్రజలకు సంక్షేమ పథకాలను రాజకీయ కక్షతో తొలగించినా, అడ్డుకున్నా, ఇద్దరి మధ్య వివాదంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించినా బాధితులు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచితంగా న్యాయం పొందవచ్చని తెలిపారు. అధికార పక్షం దాడులు, దౌర్జన్యాలపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోక పోతే వారి నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని, దానికీ నిరాకరిస్తే ఎస్‌హెచ్‌వోతో పాటు జిల్లా ఎస్పీ, డీజీపీలకు రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు పంపాలని తెలిపారు. ఆ ఆధారాలతో కోర్టుకు వెళ్తే కేసు కట్టేలా న్యాయమూర్తి ఆదేశిస్తారన్నారు. దాడుల్లో గాయపడిన వారు ఆస్పత్రికి వెళ్తే మెడికల్ లీగల్ కేసు నమోదు చేస్తారని, దీని ద్వారా నాన్‌బెయిలబుల్ కింద పక్కాగా కేసు ఉంటుందన్నారు. అన్యాయం జరిగినప్పుడు ఆలస్యం చేయకుండా 24 గంటల లోపే ఫిర్యాదు ఇవ్వాలని వివరించారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమంగా అరెస్ట్ చేయాలని వచ్చినప్పుడు ఆ ఫొటోలు తీసి భద్రపరచుకోవాలని, దీనివల్ల 24 గంటలలోపే పోలీసులు కోర్టులో జడ్జి ఎదుట ప్రవేశ పెడతారని, పోలీసులు ఇబ్బంది పెట్టినా, హింసించినా రిమాండ్ సమయంలో న్యాయం జరుగుతుందని తెలిపారు. పోలీసులు ఎవరినైనా తీసుకెళ్లిపోయి, అరెస్టు చూపకపోతే హెబియస్ కార్పస్ పిటిషన్ ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. ఇవన్నీ రాజ్యాంగం, సుప్రీం కోర్టు ప్రజలకు కల్పించిన హక్కులని, వీటి ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని వివరించారు.

13న ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సమావేశం

భవానీపురం (విజయవాడ పశ్చిమ): ఆర్టీసీ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేట ఆర్టీసీ డిపో–1 వద్దనున్న స్వాతంత్య్ర సమరయోధుల భవనంలో రాష్ట్రస్థాయి పీటీడీ బీసీ ఉద్యోగుల సమావేశం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర, జోనల్, రీజినల్ డిపో కమిటీల పునఃనిర్మాణంతో పాటు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు మాతృభాషలో ఉండాలి

- తీర్పులు, న్యాయవాదుల వాదోపవాదాలు కూడా..
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- విజయ నిఘంటు చంద్రిక గ్రంథం ఆవిష్కరణ



ప్రసంగిస్తున్న వెంకయ్యనాయుడు

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): మాతృభాషలోనే ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయవాదుల వాదోపవాదాలు ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. గోకుల్ చంద్ర రాహుల్ చంద్ర మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, సహృదయ సాహితీ సంయుక్తంగా బుధవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన విజయ నిఘంటు చంద్రిక ఆవిష్కరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాతృభాష పరిరక్షణ కోల్పోతే సర్వం కోల్పోతామని దీన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇసుకలో రాసి అక్షరాలు నేర్చుకున్న నేను భారత ఉపరాష్ట్రపతి అయ్యానన్నారు. 5వ తరగతి వరకు మాతృభాషలో విద్యబోధన ఉండాలని సూచించారు. అనంతరం నిఘంటువు రూపకర్త రాణి సదాశివమూర్తి, డాక్టర్ కె. సుజన నిఘంటువులోని విశేషాలు వివరించారు. సూరపనేని విజయకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్, విజయనిర్మాణ్ ఎండీ వీరమాచనేని అజయ్‌కుమార్, బేతవోలు రామబ్రహ్మం, ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యం,శాస్త్రి, ఆచార్య కోలవెన్ను మలయవాసిని, డాక్టర్.డి.వి.సూర్యారావు పాల్గొన్నారు.

ఆక్వా అభివృద్ధికి చర్యలు

మంత్రి అచ్చెన్నాయుడు



సమీక్ష చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పెనమలూరు: రాష్ట్రంలో ఆక్వా, మత్స్యసాగు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం పోరంకిలోని మత్స్యశాఖ కమిషనరేట్‌లో మంత్రి అచ్చెన్నాయుడు ఆ శాఖ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మత్స్యసాగు, ఆక్వాతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయింపు చేస్తామని తెలిపారు. మత్స్యశాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధితో ఉపాధి కల్పనే కాకుండా రైతులకు లాభం చేకూరుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం మత్స్య సాగుకు చేయూత అందిస్తుందని వివరించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మత్స్యశాఖ కమిషనర్ సూర్యకుమారి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ఎయిమ్స్ కోసం 16న ఆందోళన



మాట్లాడుతున్న బసవరాజ కళస

రాయచూరు రూరల్: నగరంలో ఎయిమ్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఒత్తిడి చేస్తూ ఈనెల 16న ఆందోళన చేపడుతున్నట్లు ఎయిమ్స్ సాధన సమితి అధ్యక్షుడు బసవరాజ కళస పేర్కొన్నారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళ్యాణ కర్ణాటకలోని ప్రజా ప్రతినిధులు ఈ విషయంలో మౌనం దాల్చకుండా గళం విప్పి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని, తమ పోరాటానికి సహకరించాలని అన్నారు.

డెంగీని పారదోలండి

హొసపేటె: విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి, కూడ్లిగి అసెంబ్లీ నియోజకవర్గాల సంయుక్త కేడీపీ సమావేశం తాలూకా పంచాయతీలోని మహాత్మాగాంధీ హాల్‌లో నిర్వహించారు. డెంగీ జ్వరాల తీవ్రతను నివారించేందుకు ఉజ్జయిని, నింబలగెరె, తూలహళ్లి, హాలాపుర, నాగరకట్టి తదితర గ్రామ పంచాయతీలపై దృష్టి సారించి డెంగీ ప్రబలకుండా జాగ్రత్తలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత కోసం వైద్య అధికారులతో ముఖ్యంగా సంఘ సంస్థల సహకారం అవసరం అన్నారు. హాస్టల్ సంరక్షకుడు ఖలీల్ గురించి జిల్లాధికారులు తెలియజేయాలని, అవసరమైన చోట్ల విద్యార్థులకు వసతి కల్పించాలన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. సుంకదకల్లు గ్రామంలో వాంతులు, విరోచనాల కేసులో పరిశుభ్రతపై ఎందుకు నిర్లక్ష్యం వహించారని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. వివిధ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్ సేవలు అనన్యం



జ్యోతి వెలిగిస్తున్న మహిళా ప్రతినిధులు

రాయచూరు రూరల్: నగరంలో ఇన్నర్ వీల్ క్లబ్ సేవలు అనన్యమని క్లబ్ అధ్యక్షురాలు సునీతా జైన్ పేర్కొన్నారు. ఆమె మంగళవారం నగరంలో 2024–25వ సంవత్సరానికి క్లబ్ కార్యవర్గం పదగ్రహణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో 1.20 లక్షల మంది సభ్యులను కలిగిన సంస్థలో మహిళా శక్తి బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో సుష్మా పతంగి, దుర్గ, సుమిత్ర, మంజుల, మహాలక్ష్మి, అరుణ, జయశ్రీ, శోభా, మాధవి, పార్వతి, లలిత, అనిత, మాధవిలున్నారు.

కేసీ కొండయ్యకు ఘన సన్మానం




పూలమాలలతో ఘనంగా సన్మానించిన ఆ పార్టీ ప్రముఖులు

బళ్లారిఅర్బన్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేసీ కొండయ్య పుట్టిన రోజు సందర్భంగా ఆయనను పలువురు కాంగ్రెస్ నేతలు, శ్రేయోభిలాషులు బుధవారం నగరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేపీసీసీ రాష్ట్ర మీడియా ప్రతినిధులు వెంకటేష్ హెగ్డే, పార్టీ నేతలు పరశురామ్, టీ.ఆనంద్, నితీష్ హెగ్డే, రాకేష్, ఖలంధర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు అంగళ్లలో చోరీలు

హుబ్లీ: నగరంలోని టౌన్, కమరిపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు అంగళ్ల తలుపులు బద్దలుగొట్టి ఆ అంగళ్లలో ఉన్న కొన్ని వస్తువులను చోరీ చేసిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. నగరంలోని మహావీర గల్లీ బటర్ మార్కెట్‌లో ఈ చోరీలు వెలుగు చూశాయి. బటర్ మార్కెట్ అంగడిలో రూ.60 వేల చోరీపై అంగళ్ల షట్టర్స్ విరగ్గొట్టి కొన్ని వస్తువులను తీసుకెళ్లారని అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి దొంగల కోసం గాలింపు చేపట్టారు.

పథకాల పనులు చేపట్టరూ



వినతిపత్రం సమర్పిస్తున్న రైతు నేతలు

రాయచూరు రూరల్: తాలూకాలో తాగునీరు సరఫరా, రహదారి పథకాల పనులు చేపట్టాలని కర్ణాటక రైతు సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ పేర్కొన్నారు. బుధవారం జెడ్పీ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో మాట్లాడారు. సిరవార తాలూకా గాణదాళ, హొక్రాణి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. గాణదాళ రోడ్డుకు వేసిన పీస్ వర్క్ పనులు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. పూర్తి స్థాయిలో రోడ్డు పనులు చేపట్టాలని కోరుతూ ఇంజినీర్ శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు.

బళ్లారిలో ఈడీ కలకలం

- మాజీ మంత్రి నాగేంద్ర ఇంట్లో సోదాలు
- బళ్లారి, బెంగళూరుల్లోని నివాసాల్లో ఏకకాలంలో దాడులు
- రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఇంట్లో కూడా..
- ఎమ్మెల్యే మెడకు బిగుసుకుంటున్న వాల్మీకి మండలి కుంభకోణం ఉచ్చు

సాక్షి, బళ్లారి: జిల్లాలో బలమైన నేతగా ఎదిగిన రూరల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే బి.నాగేంద్రకు ఎదురుగాలి మొదలైనట్లు కనిపిస్తోంది. కంచే చేను మేసిన చందంగా వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్లు పక్కదారి పట్టిన కేసులో మంత్రి పదవిని కోల్పోయిన ఆయన సిట్ విచారణను ఎదుర్కొంటున్నారు. ఇంతలో కేంద్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా పంజా విసిరింది. దీంతో నాగేంద్రతో పాటు ఆయన అనుచరులు ఆందోళనలో పడ్డారు. బుధవారం నగరంలోని నెహ్రూ కాలనీలో నాగేంద్ర ఇంటి వద్ద ఈడీ అధికారులు ఉదయం నుంచి సోదాలు చేపట్టారు. బెంగళూరు నుంచి వచ్చిన అధికారుల బృందం ఏకకాలంలో నాగేంద్రకు చెందిన బళ్లారి నివాసంలో సోదాలు జరిపింది. మండలిలో చోటు చేసుకొన్న అక్రమాలకు సంబంధించి సంబంధిత అధికారి చంద్రశేఖర్ శివమొగ్గలో ఆత్మహత్య చేసుకోవడంతో అసలు విషయం బయటపడింది. నాగేంద్ర పీఏను అరెస్టు చేసి ఆధారాలు సేకరించారు. రోజు రోజుకు మండలిలో అక్రమాలపై బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడంతో పాటు బ్యాంక్ అధికారులు అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలోకి ప్రవేశించిన సీబీఐ అధికారులు మండలిలో జరిగిన అక్రమాలపై వివరాలు సేకరిస్తున్నారు. ఈడీ సోదాలు చేపట్టడంతో నగరంలో నాగేంద్ర అభిమానులు, కార్యకర్తలు షాక్ తిన్నారు.



మాజీ మంత్రి నాగేంద్ర(ఫైల్)

మైనింగ్ అక్రమాల్లో కూడా గతంలో అరెస్టు

జిల్లాలో ఇనుప ఖనిజం తవ్వకాలు, తరలింపుల్లో చోటు చేసుకొన్న అక్రమాలపై గతంలో కూడా మాజీ మంత్రి నాగేంద్రను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపిన సంగతి తెలిసిందే. 2008 నుంచి వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది జిల్లా మంత్రిగా కూడా కావడంతో రాజకీయంగా ఉన్నత స్థాయికి నాగేంద్ర చేరుకున్నారని ఆయన అభిమానులు సంతోషిస్తుండగా ఏకంగా రూ.187 కోట్ల అక్రమాల్లో నాగేంద్ర పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆయనపై ఇప్పటికే సిట్, ఈడీ అధికారులు విచారణ నిర్వహించారు. ఈడీ సోదాలు, దర్యాప్తు, విచారణ అనంతరం నాగేంద్ర మరోసారి కూడా జైలుకు వెళ్లే సూచనలున్నట్లు తెలుస్తోంది. ఈడీ అధికారులు విచారణ పూర్తి చేసిన అనంతరం అరెస్టు చేస్తారని సమాచారం. అక్రమాల్లో ఏయే కోణాల్లో నాగేంద్ర పాత్ర ఉందన్నదానిపై కూపీ లాగుతున్నారు. నాగేంద్ర, బసనగౌడ దద్దల్, యూనియన్ బ్యాంక్ అధికారులు సుచిస్మిత, క్రెడిట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, బ్రాంచ్ హెడ్ దీపా, దొడ్డబసవేశ్వరనగరలోని నాగేంద్ర పీఏ నెక్కంటి నాగరాజు, సత్యనారాయణ వర్మ తదితరుల ఇళ్లలో కూడా విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. బళ్లారి, బెంగళూరు, హైదరాబాదు, రాయచూరుల్లో ఏక కాలంలో 18 చోట్ల ఈడీ సోదాలు ముమ్మరం చేసింది.



రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ నివాసానికి చేరుకున్న ఈడీ అధికారులు

రాయచూరులో కూడా..

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్ల అవినీతిపై విచారణకు మండలి అధ్యక్షుడు, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నగరంలో దాడి జరిపారు. బుధవారం నగరంలోని ఆశాపూర్ రోడ్డులోని నివాసంలో అధికారులు సోదా చేశారు. బెంగళూరులో మంగళవారం ఎస్ఐటీ అధికారులు విచారణ జరపగా రాయచూరులో ఈడీ అధికారులు ఆయన ఇంటిని సోదా చేశారు.



బళ్లారిలోని నాగేంద్ర ఇల్లు



రాయచూరులోని బసనగౌడ ఇల్లు

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



ప్రమాద తీవ్రతకు బోల్తా పడిన వాహనం



నుజ్జయిన బస్సు ముందు భాగం

హొసపేటె: వేగంగా వస్తున్న ప్రైవేట్ బస్సు అదుపు తప్పి లగేజీ వాహనాన్ని ఢీకొనడంతో ఆ వాహనం డ్రైవర్‌కు తీవ్రగాయాలు కావడంతో పాటు అందులో ఉన్న ప్రయాణికులు గాయపడిన ఘటన బుధవారం తాలూకాలోని బళ్లారి రోడ్డులో వడ్డరహళ్లి గ్రామ శివారులో జరిగింది. బళ్లారి నుంచి హొసపేటె వైపునకు వస్తున్న ప్రైవేట్ బస్సు ఎదురుగా వస్తున్న లగేజీ వాహనాన్ని ఢీకొట్టింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను హొసపేటె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.

రాష్ట్రంలో విద్యుత్ కొరత లేదు

- ఆర్టీపీఎస్‌లో స్థానికులకే ఉద్యోగాలిస్తాం
- వెయ్యి మంది ఏఈఈలను భర్తీ చేస్తాం
- 2000 మంది లైన్‌మెన్లను నియమిస్తాం
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కె.జె.జార్జ్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో విద్యుత్ కొరత లేదని విద్యుత్ శాఖ మంత్రి కె.జె.జార్జ్ వెల్లడించారు. బుధవారం జిల్లాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయచూరు, బళ్లారి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి సరిపడా విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. వెయ్యి మంది ఏఈఈలు, 2000 మంది లైన్‌మెన్ల నియామకాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆర్టీపీఎస్‌లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించామన్నారు. అక్రమ సక్రమ పథకంలో రైతులకు అవకాశం కల్పించామన్నారు. 10 లక్షల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం అవుతాయన్నారు. రైతులకు ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరా చేపట్టాలన్నారు. కుసుమ నూతన పథకం కింద మిని సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సర్కార్ సబ్సిడీ ఇస్తుందన్నారు. స్వంత పొలం ఉన్న వారికి నెలకు అద్దె రూపంలో రూ.25 వేలు చెల్లిస్తామన్నారు. సర్కారీ భూముల్లో అయితే కాంట్రాక్టర్‌కు నెలకు రూ.25 వేలు చెల్లించి విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుడుతామన్నారు. థర్మల్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తికి వినియోగించే బొగ్గు కొరత కూడా లేదన్నారు.

విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టాలి

రాష్ట్రంలో విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టాలని మంత్రి కె.జె.జార్జ్ సూచించారు. బుధవారం జిల్లాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన సభ్యులు మంత్రికి జెస్కాం, కేపీటీసీఎల్ అధికారులపై ఫిర్యాదు చేయడంతో మంత్రి నేరుగా అధికారులకు క్లాస్ తీసుకున్నారు. ఏడాది నుంచి శాసన సభ్యుల ఫోన్లకు సరైన సమాధానం చెప్పక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఈ, ఈఈ, ఏఈఈ, సెక్షన్ అధికారులు ఎవరూ కనబడక పోవడాన్ని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులతో కలసి సమస్యలకు పరిష్కారం కనుగొనాలన్నారు. శాసన సభ్యులు శివరాజ్ పాటిల్, హంపయ్య నాయక్, బసన గౌడ, వజ్జల్ మానప్ప, ఎమ్మెల్సీ వసంత్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గౌరవ గుప్త, కేపీసీఎల్ ఎండీ పంకజ్ కుమార్, జిల్లాధికారి నితీష్, అదనపు జిల్లాధికారి దురుగేష్‌లున్నారు.



మాట్లాడుతున్న మంత్రి కె.జె.జార్జ్

జెస్కాం ఇంజినీర్‌పై వేటుకు డిమాండ్

గ్రామీణ జెస్కాం ఇంజినీర్ చంద్రశేఖర్ దేశాయిని సస్పెండ్ చేయాలని దళిత సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద సంచాలకులు ఈరణ్ణ నేతృత్వంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కె.జె.జార్జ్‌కి వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. తాలూకాలోని చంద్రబండ విద్యుత్ ఉప కేంద్రంలో రూ.23 కోట్ల మేర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, ఆయిల్ తదితరాలను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు విక్రయించి భారీగా సొమ్ము స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు.

గ్యారంటీలు లబ్ధిదారుల దరిచేర్చాలి

హొసపేటె: ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్యారంటీ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా జిల్లా, తాలూకా స్థాయి అధికారులు బాధ్యత వహించాలని జిల్లా గ్యారెంటీ పథకాల యోజన ప్రాధికార అధ్యక్షుడు శివమూర్తి తెలిపారు. జిల్లాధికారి కార్యాలయ సభామందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి హామీ పథకాల ప్రగతి సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 5 హామీ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అధికారులు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. జిల్లా స్థాయి హామీ పథకాల అమలు అథారిటీ, జిల్లా, తాలూకా కమిటీలకు అనువైన కార్యాలయాలు, ఫర్నిచర్ ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలపై తాలూకా, జిల్లా స్థాయిలో చర్చించి పనుల్లో నిమగ్నమై వైస్ చెర్మన్, అథారిటీ సభ్యులందరి తరఫున చేయిస్తామన్నారు. డిప్యూటీ కలెక్టర్ అనురాధ మాట్లాడుతూ హామీ పథకాల అమలుకు సంబంధించి ఇప్పటికే సంప్రదించిన అధికారులు చురుగ్గా పని చేయాలన్నారు. నిరంతరం జిల్లాధికారులతో సంప్రదింపులు జరపాలని సూచించారు. సమావేశంలో తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు శివమూర్తి

రెడ్డి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తాం

- మంత్రి రామలింగారెడ్డి

బళ్లారి రూరల్: బెంగళూరులో రెడ్డి సముదాయం ఆధ్వర్యంలో రెడ్డి విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించే ఉద్దేశ్యం ఉన్నట్లు రాష్ట్ర రవాణా శాఖామంత్రి రామలింగారెడ్డి తెలిపారు. ఆయన నగరంలోని హేమ వేమరెడ్డి సహకార పరపతి సంఘం బ్యాంకు ప్రారంభం, బలిజ భవన్‌లో ప్రతిభావంతులకు పురస్కారాలు, విశ్రాంత ఉద్యోగులకు సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రెడ్డిజన సంఘం స్థాపించి వందేళ్లయినా ఇంతవరకు సంఘటితంగా ఎన్నికలు జరగలేదు. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళలో రెడ్లు అధికంగా ఉన్నారు. బెంగళూరులో రెడ్డిజన సంఘం ఆధ్వర్యంలో మెడికల్, డెంటల్ మినహా అన్ని కోర్సుల్లో విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఇతర వర్గాల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న రెడ్డి సముదాయాన్ని ఒక గొడుగు కిందకు చేర్చేలా త్వరలో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఐకమత్యమే బలం

మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి మాట్లాడుతూ రెడ్డి వర్గీయులు ఐకమత్యంగా ఉండాలన్నారు. రెడ్డి సముదాయంలో రామలింగారెడ్డి ఉన్నత పదవిలో ఉన్నారు. ముందు రామలింగారెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కాలని ఆకాంక్షించారు. గాలి లక్ష్మీఅరుణ జనార్దనరెడ్డి మాట్లాడుతూ రెడ్డిసముదాయం ధైర్య సాహసాలు, సాయం చేసే గుణాన్ని కలిగి ఉంటారన్నారు. డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ బళ్లారిలో గాలిజనార్దనరెడ్డి హయాంలో రెడ్డిజన సంఘం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. రెడ్డిజనసంఘం ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బెంగళూరు కర్ణాటక జనసంఘం అధ్యక్షుడు ఎం.సీ. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి వర్గీయులకు ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్‌ను 3ఏ నుంచి 2ఏకు మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ యోగానందరెడ్డి, డాక్టర్ బసిరెడ్డి, డాక్టర్ అనిల్‌రెడ్డి తదితరులను సన్మానించారు. హొసల్లి మహాయోగి వేమన సంస్థాన మఠం, రెడ్డి గురుపీఠం వేమానంద మహాస్వామి, కర్ణాటక రెడ్డిజన సంఘం అధ్యక్షుడు గణపాల ఐనాథ రెడ్డి, రెడ్డి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.నాగరాజ రెడ్డి, బాబురెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ట్రక్ టెర్మినల్‌ను వీక్షించిన మంత్రి

హొసపేటె: దేవదాయ శాఖా మంత్రి రామలింగారెడ్డి బుధవారం సాయంత్రం నగర శివార్లలో ఉన్న దేవరాజ్ అరస్ ట్రక్ టెర్మినల్ లొకేషన్‌ను వీక్షించారు. ట్రక్ టెర్మినల్ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గవియప్ప, జిల్లాధికారి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

12న రాష్ట్రవ్యాప్త ఆందోళన

హుబ్లీ: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల ఇంచార్జి మంత్రుల కార్యాలయాల ఎదుట ఆందోళన చేపడతామని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) కర్ణాటక ఉత్తర ప్రాంత రాష్ట్ర కార్యదర్శి సచిన్ కుళగేరి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల అకడమిక్ వేళా జాబితాలకు అనుగుణంగా విద్యార్థులకు బస్‌పాస్‌లను పంపిణీ చేయాలన్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో ముఖ్యంగా గ్రామీణ విద్యార్థుల అనుకూలం కోసం బస్సు సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఇక విద్యార్థులకు హాస్టళ్లలోకి ప్రవేశ ప్రక్రియలో జాప్యంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. దీని వల్ల విద్యార్థులకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కనీస సదుపాయాల కల్పనకు తగినంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ క్రమంలో హాస్టల్ ప్రవేశం కోసం దరఖాస్తు చేసిన విద్యార్థుల ఎంపిక ప్రక్రియ తక్షణమే పూర్తి చేసి విద్యార్థులకు హాస్టల్ ప్రవేశం కల్పించడంతో పాటు విద్యార్థి వేతనాన్ని సంబంధిత ఖాతాలకు జమ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఏకరూప వేళా జాబితాకు సంబంధించి ఆదేశాలు వెల్లడించింది. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు ఈ ఏకరూప వేళా జాబితాను సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పెళ్లికి నిరాకరించిందనే నేహా హత్య

- లవ్ జిహాద్ కారణం కాదు
- చార్జిషీట్‌లో పేర్కొన్న సీఐడీ

హుబ్లీ: నేహా హిరేమఠ హత్యకు నిందితుడికి ఉన్న నిరాశ, నిస్పృహలే కారణమని సీఐడీ పోలీసులు కోర్టుకు సమర్పించిన చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఆ రిపోర్టులో లవ్‌జిహాద్ గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. మొత్తం 483 పేజీల చార్జిషీట్ సమర్పించారు. నేహా తల్లిదండ్రులు, సోదరుడు, సహ విద్యార్థులు, స్నేహితులు, బీవీబీ కళాశాల ఉపన్యాసకులు మొత్తం 99 మంది సాక్ష్యులను విచారించి సాక్ష్యాలను సేకరించారు. ఆ మేరకు ప్రత్యక్ష సాక్షులు, సీసీ టీవీ దృశ్యాలు, రికార్డులు, పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు ఫోరెన్సిక్ నివేదికను పొందుపరిచారు. నిందితుడు ఫయాజ్‌పై మరణదండన, జీవితఖైదు శిక్ష, తదితర సెక్షన్లను ఉదహరించారు. పెళ్లికి నిరాకరించడం వల్లే ఈ హత్య జరిగిందని తేల్చారు. 2020–21లో వీరిద్దరూ స్థానిక పీసీ జాబిన్ కళాశాలలో బీసీఏ కోర్సులో కలిసి చదువుకున్నారు. ప్రారంభంలో ఇద్దరు స్నేహితులు అయ్యారు. 2022లో క్రమేణ పరస్పరం ప్రేమించుకోవడం ప్రారంభించారు. 2024 మార్చి నెలలో ఇద్దరి మధ్య మనస్పొరలు తలెత్తాయి. దీంతో నేహా ఫయాజ్‌ను దూరం పెట్టి మాట్లాడకుండా నిర్లక్ష్యం చేసింది. ఈ నిర్లక్ష్యంతో నిరాశకు గురైన ఫయాజ్ ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ మేరకు 2024 ఏప్రిల్ 18న సాయంత్రం 4.40 గంటలకు చాకుతో ఇష్టమొచ్చిన రీతిలో పొడిచి హత్య చేశాడు.



నేహా హిరేమఠ, ఫయాజ్(ఫైల్)

ప్రేమించి మోసగించడంపై నిలదీత

హత్యకు ముందు నేహా ఎదుట ఫయాజ్ ఇన్నాళ్లు ప్రేమించి, ఇప్పుడు మోసం చేస్తావా? నన్ను పెళ్లి చేసుకోవా? అని నిలదీసి, ఇప్పుడు నిన్ను వదలను అంటూ కోపంతో ఆమెను చాకుతో పొడిచి, ఆ చాకును అక్కడే పారేసి పరారైనట్లు పేర్కొన్నారు. హత్యకు మూడు రోజుల ముందే ధార్వాడ ఆర్య సూపర్ బజార్‌లో చాకు కొన్నాడు. ఈ దృశ్యాలు సీసీ టీవీ ఫుటేజీలో నమోదయ్యాయి. అదే రోజు ధార్వాడ న్యూ సాయి గార్మెంట్‌లో రూ.130 చెల్లించి ఎర్రటోపి కొన్నాడు. హత్య చేయడానికి బీవీబీ కళాశాలకు వెళ్లగా తనను ఎవరూ గుర్తు పట్టరాదన్న ఉద్దేశంతో ఎర్రని టోపీ, ముఖానికి నల్లని మాస్క్ ధరించి వెళ్లాడు. మాస్క్‌ను ధార్వాడ శ్రీహనుమాన్ మెడికల్ షాపులో కొన్నట్లు సీసీ టీవీ దృశ్యాల్లో వెల్లడైనట్లు చార్జిషీట్‌లో నమోదు చేశారు. నేహా రక్త నమూనాలు, 15 సెంటీమీటర్ల పొడవు ఉన్న మధ్యస్థ సెయిన్‌లెస్ స్టీల్ చాకు, వైల్డ్ క్రాఫ్ట్ కంపెనీ నేహా ఎయిర్‌బ్యాగ్, ఐడీ కార్డు, పెన్ను, పెన్సిలు, మరొక్క ఎయిర్‌బ్యాగ్, 1+ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా ఫయాజ్ హత్య చేయడానికి వచ్చేటప్పుడు తెచ్చిన హోండా యాక్టివా స్కూటీ, కొన్ని పెన్‌డ్రైవ్‌లు తదితరాలను సీఐడీ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు చార్జిషీట్‌లో వివరించారు.

కన్నడ నామఫలకాలకు వినతి



మాట్లాడుతున్న వినోద్‌రెడ్డి

రాయచూరు రూరల్: నగరంలో కన్నడ భాషలో నామఫలకాలు ఏర్పాటు చేయాలని కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి దుకాణదారుడు, హోటళ్లు, ఇతర వాణిజ్య సంస్థలు కన్నడ భాషలో పేర్లు రాయించాలన్నారు. ఆంగ్లం, హిందీ, ఇతర భాషల్లో ఉన్న నామఫలకాలను తొలగించి కన్నడ భాషలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని నగరసభ కమిషనర్‌కు విన్నవించినట్లు తెలిపారు.

తరగతులను కేటాయించాలి

రాయచూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్‌కేజీ, యూకేజీలను కేటాయించాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద కార్యకర్తల నిరసనలో సంచాలకురాలు పద్మ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహించే కార్యకర్తలకు ఎల్‌కేజీ, యూకేజీ బోధనా శిక్షణ ఇచ్చారన్నారు. నెలకు రూ.26 వేల వేతనాలు చెల్లించాలని, అంగన్‌వాడీలకు కేటాయించిన పనులను, పథకాలను విద్యా శాఖకు అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఇద్దరు ఇళ్ల చోరుల అరెస్ట్

హుబ్లీ: జంట నగరాలతో పాటు బెళగావిలో వివిధ చోట్ల ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసిన గోకుల్ రోడ్డు పోలీసులు బంగారు ఆభరణాలతో పాటు రూ.19.50 లక్షల విలువ చేసే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. బెళగావి జిల్లా ఖానాపుర దీపక్ మాతంగి, గదగ్ జిల్లా రోణ శివనాగయ్య ఉమచగి మఠ అరెస్ట్ అయిన నిందితులు. వీరి నుంచి పోలీసులు 244 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.5 కేజీల వెండి ఆభరణాలు, ఓ ల్యాప్‌టాప్, స్కూటీ, రెండు వాచ్‌లు, మరో బైక్‌ను జప్తు చేశారు. గోకుల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత జూన్ 6న ఇంటికి వేసిన తాళాలను పగలగొట్టి ఈ చోరీ చేశారు. ఉత్తర ఉపవిభాగం ఏసీపీ శివప్రకాష్ నాయక్ నేతృత్వంలో ప్రవీణ్ నీలమ్మనవర బృందం కార్యాచరణ చేపట్టి వీరిని అరెస్ట్ చేసింది.

బ్యాగ్‌లు, పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు అందచేస్తున్న అతిథులు

బళ్లారిఅర్బన్: దాన ధర్మాలతో జీవితానికి సార్థకత చేకూరుతుందని కౌల్‌బజార్ ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. బుధవారం సంస్కార అనాథాశ్రమంలో జీకే ఫౌండేషన్ ఏర్పాటు చేసిన విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీకే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జీకే స్వామి మాట్లాడుతూ పేద విద్యార్థులను గుర్తించి అక్షరాస్యులను చేయడమే ధ్యేయంగా తమ సంస్కార సంస్థ కృషి చేస్తోందన్నారు. సంస్థ వ్యవస్థాపకులు బీహెచ్‌ఎం విరుపాక్షయ్య, ప్రముఖురాలు గీత విరుపాక్షయ్య, పుస్తకాలు, బ్యాగ్‌ల దాత జీకే స్వామి, వెంకటేష్ స్వామి, పవన్‌కుమార్, సంతోష్ స్వామి, జగన్నాధ, ఆనంద్ పాల్గొన్నారు.

వేతన కమిషన్ అమలు చేయరూ..

హొసపేటె: కర్ణాటక రాష్ట్ర 7వ వేతన కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్‌కు ప్రభుత్వ ఉద్యోగులు సంఘం తరపున వినతిపత్రాన్ని అందించారు. రద్దు చేసిన ఎన్‌పీఎస్‌ను యథావిధంగా కొనసాగించాలని, మూడు ముఖ్యమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఒత్తిడి చేశారు. ఈ సందర్భంగా తాలూకా స్థాయి అధికారులు, కోశాధికారులు శారద, గురుబసవరాజ్, బసవరాజ్, హైస్కూల్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డీ.సిద్దప్ప, సెక్రటరీ బాలచంద్ర, గ్రామ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు జ్యోతిబాయి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రేవణ సిద్దప్ప, ముత్తేశ్, సభ్యులు వినయ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హత్యకు దారి తీసిన గొడవ

హొసపేటె: చిన్న కారణానికి జరిగిన గొడవలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకా వరదాపుర గ్రామ శివార్లలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన కొళ్లి చెన్నప్ప, కొళ్లి రమేష్ మధ్య పశువుల కాపలా విషయంపై గొడవ మొదలై ఒకరిపై మరొకరు చేయి చేసుకున్నారు. చివరికి రమేష్ చేతిలో చెన్నప్ప(28) హతమయ్యాడు. ఘటనపై మరియమ్మనహళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ధార్వాడ జైలు నుంచి ఆరుగురు ఖైదీల విడుదల

హుబ్లీ: వివిధ కేసుల్లో జీవిత ఖైదు శిక్షకు గురైన ధార్వాడ కేంద్ర కారాగృహంలో కనీసం 14 ఏళ్ల జైలు శిక్ష అనుభవించిన ఆరుగురు ఖైదీలను సత్ప్రవర్తన కారణంగా మంగళవారం బెంగళూరులో విడుదల చేశారు. 10 మంది ఖైదీల విడుదలకు జిల్లా కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేయగా వీరిలో నలుగురి విడుదల రద్దయింది. ధార్వాడ జిల్లా కలఘటిగి తాలూకా గురునాథ బసప్ప నరేంద్ర, హుబ్లీ గౌసియానగర్ జాఫర్‌సాబ్ మైనుద్దీన్ ముల్లా, మండ్య జిల్లా మళవళ్లి తాలూకా అవరేహళ్లి బొమ్మన్న బసన్న, హాసన్ జిల్లా ఆలూరు తాలూకా దేవరపుర రంగస్వామి లింగరాజ, హావేరి జిల్లా శిగ్గాంవి తాలూకా ముకేరి ఫక్కీరప్ప శివప్ప కదనూర, దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ తాలూకా విట్లు కసబ గ్రామం రవీష్ నాయక జైలు నుంచి విడుదలయ్యారు. వీరిని జైలులో సత్ప్రవర్తన నేపథ్యంలో జిల్లా కమిటీ విడుదలకు సిఫార్సు చేసినట్లు కేంద్ర కారాగృహ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.